# సంపూర్ణ దైవ ప్రణాళిక

(రోమా పత్రిక సులభశైలిలో)



## క్రీస్తులో స్వాతంత్ర్యం

సహో॥ డా॥ బి. విమలా రెడ్డి

# సంపూర్ణ దైవప్రణాళిక

## (రోమా పత్రిక సులభశైలిలో)




సహో॥ బి. విమలారెడ్డి

# ఉపోద్ఘాతము

"క్రొత్తనిబంధన ఒక గొప్ప ధననిధి అయితే, ఆ నిధి తెరవడానికి తాళపు చెవి రోమా పత్రిక" అని మహాభక్తుడైన చార్లెస్ స్పర్జన్ గారు చెప్పిన మాటలు నన్ను చాలా ప్రభావితం చేసాయి. రోమా పత్రిక అర్థము చేసుకోవడము కష్టము అను మాటలు చాలా మంది చెప్పగా విన్నాను. ఇంత విలువైన పుస్తకమును "అర్థము కావడము లేదు" అని ప్రక్కకు పెట్టేయడము చాలా బాధాకరమైన విషయము, కాబట్టి దేవుని సహాయముతో సులభశైలిలో వ్రాస్తే అర్థము కాకపోవడమను సమస్య లేకుండా అందరూ చదివి ఆత్మీయ దీవెనలు పొందుతారను ఆశతో ఈ కార్యము తలపెట్టాను. దేవుని పక్షంగా గొప్ప కార్యములు తలపెట్టినపుడు ఆయనే విజయవంతముగా జరిగిస్తాడను విశ్వాసముతో ఈ పుస్తక రచన ప్రారంభించాను. మనము ఆయన పనిలో ఒకడుగు ముందుకు వేస్తే, పదడుగులు వేసి ఆయన మనలను బలపరచి ప్రోత్సహిస్తాడని నేను విశ్వసిస్తాను. కాబట్టి ఆయనే ఈ బృహత్కర కార్యము జరిగిస్తాడని నమ్ముచున్నాను.

రోమా పత్రికను సరిగ్గా అర్థము చేసుకొనుటలో సహాయపడి, తొలిపలుకులు వ్రాసిన ఇండియా థియోలాజికల్ సెమినరీ (ITS) వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ జోషి లీలన్ రెడ్డి గారికి, ఈ పుస్తకము ఎడిటింగ్ మరియు రూపకల్పనలో సహాయపడిన ఫిలదెల్ఫియా బైబిల్ ఇనిస్టిట్యూట్ కార్యనిర్వాహకులు పాస్టర్ T.S.R. ప్రసాదరెడ్డి గారికి, మా సంఘ కాపరి పాస్టరు దేవిడ్‌రాజు గారికి మరియు సహాయపడిన ప్రతీ ఒక్కరికీ యేసుక్రీస్తు నామమున వందనములు చెప్తూ, వారికి రావలసిన దీవెనలు ఇవ్వమని దేవునికి ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకము చదివిన ప్రతివారికి ఆత్మీయ మేలు కలగాలని ఆశిస్తూ స్పర్జన్ గారు చెప్పినట్లు క్రొత్త నిబంధన అంతా కూడా ఈ పత్రిక ద్వారా అర్థము చేసుకుంటారని నమ్ముతూ యేసుక్రీస్తు నామమున వేడుకొనుచున్నాను. ఆమేన్!

క్రీస్తు పాదసేవలో
మీ సహోదరి
**బి. విమలారెడ్డి**

# తొలిపలుకులు



**“రో**మా పత్రికను అర్థం చేసుకున్న వ్యక్తికి బైబిల్‌లో దాచబడిన ఐశ్వర్యాన్ని పొందడానికి ద్వారం తెరువబడినట్లే” అని జాన్‌కెల్విన్ మహాశయుడు రోమా పత్రికను గూర్చి చెబుతాడు. రోమా పత్రికలో దేవుని ఉగ్రత బయలుపరచబడింది, దేవుని నీతి ప్రత్యక్షత పరచబడింది. దేవుని బుద్ధి జ్ఞానముల గంభీరత వివరించబడింది, దేవుని చిత్తం తెలుపబడింది. వీటిని సహోదరి విమలారెడ్డిగారు, చక్కగా సరళమైన భాషలో వివరించడానికి చేసిన ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ గ్రంథ రచన కొరకు ఆమె పడిన శ్రమను దేవుడు దీవించును గాక!

విమలారెడ్డి గారు నా విద్యార్థిని అవడం నాకు గర్వకారణం. భవిష్యత్‌లో దేవుడు మరిన్ని పుస్తకాలను సహోదరి కలంలో నుండి ప్రవహింపచేయాలని ఆశిస్తూ తెలుగు ప్రజలందరికి రోమా పత్రికను అర్థం చేసుకోవడానికి దేవుడు సహాయం చేయాలని కోరుతూ, ప్రతి తెలుగు వ్యక్తి ఇంట్లో ఈ పుస్తకం ఉండాలని ఆకాంక్షిస్తూ, మరొకసారి ప్రియ సహోదరిని అభినందిస్తూ, దేవుడు ఈ ప్రయత్నాన్ని అనేక తెలుగు ప్రజలకు దీవెనకరంగా ఉండాలని కోరుకుంటున్నాను. “మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును, అద్వితీయ జ్ఞానవంతుడైన దేవునికి, యేసుక్రీస్తు ద్వారా, నిరంతరము మహిమ కలుగును గాక” (రోమా 16:27).

క్రీస్తు దాసుడు
**పాస్టర్ యం. జోషిలీలన్ రెడ్డి**
వ్యవస్థాపక అధ్యక్షులు
ఇండియా థియోలాజికల్ సెమినరీ (ITS)
మల్కాజ్‌గిరి – హైదరాబాద్

# ముందుమాట



క్రొత్తనిబంధనలో రోమా పత్రిక ఒక మహా శిల్పం. దాని దృశ్యం అపురూపం. కృప ఈ శిల్ప శిఖరాగ్రం. విలువకట్టలేని, లెక్కించలేని కృపను పౌలు స్వేచ్ఛగా, ధైర్యంగా వివరించారు. రోమా పత్రికలో పౌలు అపరిమితమైన దేవుని కృపను, మానవ విమోచనకు దేవుడు రచించిన ప్రణాళికను గురించి చాలా పరిపక్వంగా వ్రాసాడు.

పౌలు వ్రాసిన పత్రికలన్నింటిలోను రోమా పత్రిక బహు శ్రేష్టమైనది. దైవలేఖనాలను ఒకవేళ పర్వతాలతో పోలిస్తే, రోమా పత్రిక హిమాలయ పర్వతాలతో సమానం. సంఘ సంస్కరణోద్యమమునకు ముఖ్య భూమిక పోషించినది రోమా పత్రిక. ఈ పత్రికా సందేశాన్ని తెలుగు పాఠకులకు వివరించే పవిత్ర ప్రయత్నానికి సంకల్పించిన సహోదరి శ్రీమతి విమలారెడ్డి గారిని నేను బహుగా అభినందిస్తున్నాను. ఈ పుస్తకంలో పౌలు యొక్క అంతర్లీన దర్శనమును రచయిత్రి లోతుగా అధ్యయనం చేసి అందరికీ అర్థం అయ్యేటట్లు వివరించారు.

**"సంపూర్ణ దైవ ప్రణాళిక"** అను ఈ పుస్తకం ఆద్యంతం ఒక ప్రసంగికుడు ప్రసంగిస్తున్నట్లుగా (Preaching version) చూపించారు. సాధారణ సువార్తీకులకు ఈ గ్రంథం ఒక చేతి పుస్తకంగాను, బోధకులకు రిఫరెన్స్ బుక్‌గాను ఉపయోగపడుతుంది. బైబిల్ విద్యార్థులకు, Concept Group Study చేసేవారికి ఈ పుస్తకములో కావలసినంత సమాచారం సిద్ధపరచారు. బైబిల్ కళాశాల ఉపాధ్యాయుడిగా నేను ఈ పుస్తకమును బైబిల్ కళాశాల రిఫరెన్స్ టెక్స్ట్ బుక్‌గా ఉపయోగించుకొనవచ్చునని భావిస్తున్నాను.

శ్రీమతి విమలారెడ్డి గారిని దేవుడు విలువైన యోగ్యమైన పాత్రగా ప్రసంగ పరిచర్యలోనూ, బోధనా పరిచర్యలోనూ, రచనా పరిచర్యలోనూ సమున్నతంగా ఉపయోగించుకుంటున్నందుకు నేను దేవునికి హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను. వారి కలం నుండి, వారి గళం నుండి మరిన్ని విశిష్టమైన సందేశములు, ప్రత్యక్షతలు ప్రపంచ క్రైస్తవ సంఘ క్షేమము కొరకు దేవుని నుండి అనుగ్రహింపబడాలని మనసారా ప్రార్థిస్తున్నాను. **దైవాశీస్సులు!**

**క్రీస్తు పాదసేవలో**

**రెవ. యం. భాస్కర రెడ్డి**

డైరెక్టర్ – ఫిలదెల్ఫియా బైబిల్ ఇనిస్టిట్యూట్

కవిటం–534338, ప॥గో॥జిల్లా

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| ఎ. | రోమా పత్రిక విశిష్టత | 1 |
| | రచయిత గురించి | 5 |
| | రోమా పత్రిక పరిచయం | 7 |
| | రోమా పట్టణం | 14 |
| 1. | 1వ అధ్యాయము | 16 |
| 2. | 2వ అధ్యాయము | 45 |
| 3. | 3వ అధ్యాయము | 52 |
| 4. | 4వ అధ్యాయము | 60 |
| 5. | 5వ అధ్యాయము | 66 |
| 6. | 6వ అధ్యాయము | 76 |
| 7. | 7వ అధ్యాయము | 86 |
| 8. | 8వ అధ్యాయము | 94 |
| 9. | 9వ అధ్యాయము | 108 |
| 10. | 10వ అధ్యాయము | 115 |
| 11. | 11వ అధ్యాయము | 120 |
| 12. | 12వ అధ్యాయము | 128 |
| 13. | 13వ అధ్యాయము | 134 |
| 14. | 14వ అధ్యాయము | 138 |
| 15. | 15వ అధ్యాయము | 145 |
| 16. | 16వ అధ్యాయము | 153 |
| బి. | రోమా పత్రిక విభజన | 159 |

# రోమా పత్రిక విశిష్టత

**యే**సుక్రీస్తు ద్వారా అపొస్తలుడుగా నియమితుడైన పౌలు ఈ రోమా పత్రిక వ్రాసాడను సత్యాన్ని ఎవరూ విభేదించలేరు. పౌలు వ్రాసిన పత్రికలన్నింటిలో రోమా పత్రిక సమున్నత స్థానమును పొందుకొనడమే గాక గ్రీకు సాహిత్యంలో మంచి స్థాయిలో ఉంచబడింది. సంఘ చరిత్రలో చాలావరకు సంస్కరణలు, పునరుద్ధరణలు ఈ పత్రిక ద్వారానే జరిగాయి.

క్రీ.శ. 386 సం॥ సెప్టెంబరు మాసంలో ఉత్తర ఆఫ్రికాకు చెందిన ఇటలీ దేశములోని మిలన్ పట్టణములో చాలా కాలంగా ప్రొఫెసరుగా ఉన్న ఒకాయన తన స్నేహితుని తోటలో కూర్చుని నిష్ప్రయోజనంగా ఉన్న తన జీవితంలోని చెడును గురించి తలంచుకుంటూ ఏడుస్తున్న తరుణంలో ఒక చిన్న పాప "Tele, Lege - Tele, Lege" అని పాడుట వినిపించిందంట. లాటిన్ భాషలోని ఆ పదాలకు “తీసికొని చదువు, తీసికొని చదువు” అని అర్థము. తన ప్రక్కన చర్మపు కాగితంలో రోమా పత్రిక వ్రాయబడి ఉండుట చూసి చేతుల్లోకి తీసికున్నాడు. తన కళ్ళకు కనబడిన మొదటి వాక్యము రోమా13:13-14 వరకు ఉన్నది – “అల్లరితో కూడిన ఆటపాటలైనను, మత్తయినను లేకయు, కామ విలాసములైనను, పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను, మత్సరమైనను లేకయు, పగటి యందు నడుచుకొన్నట్లు మర్యాదగా నడుచుకొందము. మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనినవారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీర విషయమై ఆలోచన చేసికొనకుడి”. ఆ తరువాత ఆయన ఆ సందర్భమును గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు – “అంతకంటే ఎక్కువ నేను చదువలేదు. అవసరము కూడా అనిపించలేదు. ఆ వాక్యము అయిపోగానే ఒక వెలుగు నా మనసులోకి వచ్చి, అక్కడున్న అనుమానమనే చీకటిని తీసివేసింది. ఆయన ఎవరో కాదు – భక్తుడైన అగస్టీన్ (Aurelius Augustine). ఆయన ఆ చిన్న వాక్య భాగము చదివి, యేసయ్యను ప్రభువుగా రక్షకునిగా అంగీకరించి సంఘ చరిత్రలోనే ‘గొప్ప వేదాంత పండితు’నిగా, గొప్ప నాయకునిగా చిరస్థాయిగా నిలిచిపోయాడు.

ఈ సంఘటన జరిగిన దాదాపు 1000 సంవత్సరముల తర్వాత మార్టిన్ లూథర్ అనే ఒక కెథలిక్ పాస్టరు జర్మనీలోని విట్టెన్‌బర్గ్‌లో తన శిష్యులకు రోమా పత్రిక బోధిస్తుండగా, పౌలు వ్రాసిన "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" (1:17) అనే అంశము దగ్గర ఆగిపోయి దానిని గురించి లోతుగా ధ్యానించి అర్థము చేసికోగలిగాడు. ఆయన ఆ సంఘటనను గురించి వ్రాస్తూ – "దేవుని నీతి" ని గురించి పౌలు చెప్పిన విషయాలు అర్థము చేసుకోవాలని చాలా ప్రయత్నము చేశాను. దేవుడు నీతిమంతుడు కాబట్టి అవినీతిపరుల పట్ల తన నీతితో తీర్పు తీర్చి శిక్షిస్తాడు అనుకునేవాడిని. దీనిని గురించి రాత్రింబగళ్లు ఆలోచించాను. నాకు అర్థమైనదేమంటే.... కేవలము ఆయన కృప, కనికరములను బట్టి మన విశ్వాసము వలన నీతిమంతులనుగా తీర్చుటయే దేవుని నీతి అను గొప్ప సత్యాన్ని అర్థము చేసుకున్నాను. ఈ సత్యము తెలుసుకోగానే నేను తిరిగి జన్మించినట్లుగా గ్రహించి, పరలోక ద్వారాలు నా కొరకు తెరవబడ్డాయని గ్రహించాను. లేఖనాల అర్థము మారిపోయింది. ఇంతకుముందు 'దేవుని నీతి' అను మాట నాలో ద్వేషాన్ని నింపింది, కాని ఇప్పుడు ప్రేమను నింపింది. పౌలు యొక్క వాక్యము నాకు పరలోకమునకు మార్గాన్ని తెరిచింది" అన్నాడు.

200 సం॥ తర్వాత జాన్‌వెస్లీ అను అభిషేకించబడిన పాస్టరు గారు (చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ Church of England కు చెందినవాడు) కూడా సువార్త సత్యమును గురించిన అనుమానాలతో, రక్షణ అనుభవము కొరకు వెదకుచున్నప్పుడు, 1738 సం॥ మే నెల 24వ తేదీన వెస్లీ ఈ విధంగా వ్రాసాడు – "అయిష్టంగా ఒక మీటింగ్‌కు వెళ్ళినప్పుడు, అక్కడ రోమా పత్రిక గురించి మార్టిన్ లూథర్ వ్రాసిన ముందుమాట చదువుచుండగా, విశ్వాసము ద్వారా దేవుడు మన మనసులో చేయు గొప్ప కార్యములను గురించి వింటున్నప్పుడు, నా హృదయములో మార్పు వచ్చింది. క్రీస్తు ద్వారా మాత్రమే రక్షణ అను సత్యము తెలుసుకున్న నాకు రక్షణ నిశ్చయత వచ్చింది. నా పాపములు తీసివేసి పాప, మరణముల శిక్షనుండి విడుదల చేశాడనే విశ్వాసము వచ్చింది". జాన్‌వెస్లీ, ఆయన సోదరుడు చార్లెస్ వెస్లీ ఈ బోధల వల్లనే స్కాట్‌లాంట్ దేశాన్ని కదిలించారు. మెథడిస్టు సంఘమును వీరే స్థాపించారు. వీరు అన్ని పనులు క్రమబద్ధంగా (Methodical) చేస్తారు కాబట్టి వీరిని 'మెథడిస్టు వారు' అని పిలిచారు.

జాన్ కాల్విన్ అనే సంస్కర్త ఈ విధంగా అన్నాడు – “ఈ పత్రిక గురించిన అవగాహన కలిగి ఉంటే, మిగిలిన లేఖనాలలో ఉన్న, దాచబడిన గుప్త నిధులకు, దారి తెరువబడుతుంది” అన్నాడు. జాన్‌వెస్లీ కూడా రోమా పత్రికలో, ఐశ్వర్యము పొందుటకు మార్గముందని చెప్పాడు.

జార్జిముల్లర్ మన దేశానికి వస్తూ ఓడలో ప్రయాణిస్తుండగా, ఆయనకొక ఉత్తరము వచ్చింది. “నీవు ఎంతోమందిని రక్షణ మార్గంలోకి తీసుకొని రావాలనే ఉద్దేశముతో వెళ్తున్నావు. అసలు నీకు రక్షణ నిశ్చయత ఉందా?” ఇండియాలో కాలు పెట్టగానే తానే మొదటిగా రోమా పత్రిక ద్వారా పట్టబడ్డానని చెప్పాడు. మహా భక్తులకు కూడా రక్షణ నిశ్చయత అవసరమున్నది.

రోమా పత్రిక గురించి మార్టిన్ లూథర్ అన్న మాటలు – “నూతన నిబంధనలో ముఖ్యమైన భాగము మరియు సువార్తలలో పరిశుద్ధమైనది”. ఇది కూడా ఒక సువార్త అనియు, అన్నింటిలో శ్రేష్టమైనదనియు ఆయన ఉద్దేశం.

Frederick Godet అను స్విస్ వ్యాఖ్యానకర్త ఏకంగా దీనిని “క్రైస్తవ విశ్వాసమునకు ఈ గ్రంథము ఒక మందిరము” అన్నాడు..

16వ శతాబ్దమునకు చెందిన బైబిలు తర్జుమా కర్త విలియమ్ టిన్‌డేల్ (Tyndale) రోమా పత్రికకు వ్రాసిన ముందుమాటలో ఇలా వ్రాశాడు – “ఆత్మీయ సంగతులనే ధన నిధులు అనేకములు ఇందులో దాగున్నాయి. కాబట్టి త్రవ్వుతూ ఉంటే, విలువైనవి దొరుకుతాయి, నములుతూ ఉంటే ఇంకా రుచికరంగా ఉంటుంది, ధ్యానిస్తూ ఉన్న కొద్దీ సులభంగా అర్థమవుతుంది. కాబట్టి మేము చాలాసార్లు చదివాము అని ఎవరూ చెప్పలేరు”. ఆయన ఇంకొక మాట కూడా అన్నాడు. “ఇది అందరికీ వెలుగుగాను, మార్గము గాను ఉన్నది కాబట్టి అందరూ దీనిని కంఠస్థము చేయాలి”.

జాన్‌బన్యన్ అనే రచయిత (‘యాత్రికుని ప్రయాణము’, ‘పవిత్ర యుద్ధము’ అను పుస్తకముల రచయిత) రోమా పత్రిక ద్వారానే ఆత్మీయంగా ఎదిగాడు. మానవుడు, దేవునికిగల సంబంధాలను గురించి మనకున్న అనేక ప్రశ్నలకు ఈ పత్రిక సమాధానమిస్తుంది. ఆనాటి ఆదిమ సంఘములోని విశ్వాసులతో ఏ విధంగా మాట్లాడిందో,

అదే విధంగా మనతో కూడా మాట్లాడుతుంది. నైతిక, సాంఘిక, మానసిక, ఆత్మీయ, దేశీయ, అంతర్జాతీయ పరంగా అన్ని సమస్యల గురించి ఈ పత్రిక మాట్లాడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా దేవునిని మానవుని దగ్గరకు తీసికొని వస్తుంది.

19వ శతాబ్దపు బోధకులలో అతి ముఖ్యుడైన చార్లెస్ స్పర్జన్ రోమా పత్రికను గురించి ఈ విధంగా అన్నాడు – "రోమా పత్రికలో క్రీస్తు సువార్త సంపూర్ణముగా ఉన్నది. క్రైస్తవులకు ఇది చాలు" మరియు "క్రొత్త నిబంధన ఒక గొప్ప ధననిధి అయితే, ఆ నిధి తెరవడానికి తాళపు చెవి రోమా పత్రిక".

ఈ పత్రిక యొక్క ఇంకొక ప్రత్యేకత ఏమంటే ఇది పౌలుచే రచింపబడినది. పౌలుకు దేవుడే స్వయంగా బోధించాడు. పౌలు సౌలుగా ఉన్నప్పుడు క్రైస్తవుల పట్ల ఆయన చేసిన అకృత్యాలను బట్టి ఎవరూ స్వయంగా ఆయనను సమీపించి క్రీస్తు సువార్త చెప్పే సాహసం చేయలేకపోయారు (అపొస్తలులు కూడా). గలతీ పత్రికలో పౌలు తాను అరేబియాలో ఉన్న మూడు సంవత్సరాల కాలంలో యేసుప్రభువే స్వయంగా ప్రత్యక్షపరచు కున్నాడనియు, తాను చేయు బోధలన్నియు యేసయ్య స్వయంగా తనకు బోధించాడని చెప్పాడు.

రోమా పత్రికలో అబ్రాహామును గురించి నిశ్చయతతో మాట్లాడాడు. కృపకు, ధర్మశాస్త్రమునకు మరియు శరీరము, ఆత్మకు ఉన్న తేడాలు అర్థము చేసుకున్నాడు. పాత నిబంధన గ్రంథ వాక్య భాగములు చాలా సందర్భాలలో ఉపయోగించాడు. పౌలు పరిసయ్యుడు కాబట్టి అతనికి పాత నిబంధన లేఖనాలు బాగా తెలుసు.

# రచయిత గురించి

**అ**పొస్తలుడైన పౌలు ఈ పత్రిక వ్రాసాడనే విషయాన్ని అందరూ ఒప్పుకుంటారు. ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలు రాజువలె ఈయన కూడా బెన్యామీను గోత్రికుడు (ఫిలిప్పీ 3:5). సౌలు అనునది హెబ్రీ పేరు, పౌలు అనునది గ్రీకు పేరు. పౌలు యూదుడై ఉండి కూడా చాలా గౌరవించదగిన రోమా పౌరసత్వము కలవాడు (అపో.కా. 16:37, 22:25). యేసుక్రీస్తు సమకాలీనుడు, తార్సులో పుట్టాడు (అపో.కా. 9:11). ఆసియా మైనరు (ఇప్పటి టర్కీ) లోని సిలీసియా అను రోమా ప్రాంతంలో తార్సు ఒక ముఖ్య పట్టణము. గొప్ప పేరు పొందిన గమలీయేలు అను రబ్బీ యొద్ద విద్యనభ్యసించాడు (అ.కా. 22:3). యూదులలో బహు నిష్ఠగల అతి సనాతన తెగకు చెందిన పరిసయ్యుని కుమారుడు, తాను కూడా పరిసయ్యుడే (అపో.కా. 26:5, ఫిలిప్పీ 3:5).

క్రీ.శ. 33-34 సంవత్సరములలో క్రైస్తవులను బంధించుట కొరకై దమస్కు మార్గములో వెళుతున్న సమయములో ఒక అద్భుత కార్యము ద్వారా మారుమనసు పొంది, వెంటనే సువార్త ప్రకటించుట మొదలు పెట్టాడు (అపో.కా. 9:20). దమస్కులో అతనిని చంపాలని చేసే ప్రయత్నములను తృటిలో తప్పించుకొని (అపో.కా. 9:23-25, 2 కొరింథీ 11:32-33) మృత సముద్రపు ప్రాంతంలోని Nabatean Arabia లో 3 సంవత్సరములు గడిపాడు. ఆ సమయములో ప్రభువు పాదాల దగ్గర చేరి నేరుగా ప్రభువు ద్వారానే బోధింపబడి గొప్ప వేదాంత బోధకుడై అన్యజనుల మధ్య సువార్తికుడిగా ఏర్పరచబడ్డాడు (గలతీ. 1:11, 12). ఇతరులందరి కంటే ఎక్కువగా రోమా సామ్రాజ్యములో క్రైస్తవ్యము వ్యాప్తి చెందుటకు కారణమయ్యాడు.

ఒకప్పుడు నాశనము చేయాలనుకున్న సువార్తను అలసట లేకుండా మధ్యధరా ప్రాంతమంతటా ప్రకటించాడు (అపో.కా. 26:9). యెరూషలేములోని పరిశుద్ధుల సహాయార్థము పోగుచేసిన చందాలతో యెరూషలేమునకు తిరిగి వచ్చినప్పుడు కొంతమంది యూదుల ద్వారా అబద్ధనేరాలు మోపబడి (అపో.కా. 21:27-29) అల్లరి మూకతో భయంకరంగా దెబ్బలు తిని (అ.కా. 21:30, 31), రోమీయుల ద్వారా చెరపట్టబడ్డాడు. ఫెస్తు, ఫెలిక్సు, అగ్రిప్ప రాజు మొదలగు రోమా అధికారులకు అతనిలో ఏ తప్పు

కనబడకపోయినను, యూదా నాయకుల బలవంతము చేత రోమా చెరలో ఉంచబడ్డాడు. రెండు సంవత్సరముల తర్వాత తన రోమా పౌరసత్వమును బట్టి కైసరు యెదుట తనను తీర్పుకు నిలబెట్టమని కోరగా అతనిని రోమా పట్టణానికి తీసుకెళ్లారు. అపో.కా. 27, 28 అధ్యాయములలో చెప్పబడినట్లు భయంకరమైన తుఫానులో ఓడ బ్రద్దలై, కష్టపడి రోమా పట్టణము చేరాడు. కొన్ని దినముల విడుదల తర్వాత, కొంత సువార్త చేసిన తర్వాత తిరిగి అరెస్టు చేయబడి క్రీ.శ. 65-67లో హతసాక్షిగా చనిపోయాడు.

శారీరక బాహ్య సౌందర్యము లేకపోయినా (2కొరింథీ 10:10, గలతీ 4:14), పౌలుకు పరిశుద్ధాత్మ శక్తితో అంతర్య శక్తి ఉన్నదని ఫిలిప్పీ 4:13లో చూస్తున్నాము. తన ప్రతి అవసరము తీర్చుటకు దేవుని కృప చాలుననుకున్నాడు (2కొరింథీ. 12:9,10). అందువలననే తన ఆత్మీయ పందెము విజయవంతముగా ముగించుకుని క్రీస్తుకు మంచి సేవకునిగా నిరూపించుకున్నాడు (2తిమోతి 4:7) .

అపొస్తలుల కార్యములోని ఏ విషయము కూడా సిద్ధాంతాలుగా తీసుకొనకూడదు. పౌలు వ్రాసిన ఎఫెసీ, రోమా పత్రికలలో సిద్ధాంతాలు ఎక్కువగా ఉన్నాయి.

రోమా పత్రిక మొదటిగా వ్రాయకపోయినా, అది మొదటి పత్రికగా బైబిలు క్రమములో ఎందుకు ఉంచారను ప్రశ్నకు సమాధానం అపొస్తలుల కార్యములో చూడవచ్చును. అ.కా. 28:30, 31లో పౌలు రోము నగరములో ఉండి బోధించినట్లుగా చూస్తున్నాము. ఈ పత్రిక రోమా సంఘమునకు వ్రాయబడినది కాబట్టి అపొస్తలుల కార్యముల పుస్తకం తర్వాత ఉంచారని నమ్ముతారు.

పత్రికలన్నీ రెండు భాగములుగా చూస్తే పౌలు ఉత్తరాలు, పునాది సత్యాలు గల పత్రికలు అని చూడవచ్చును. పౌలు పత్రికలకు మూలము రోమా పత్రిక అయితే, మిగిలిన పత్రికలకు హెబ్రీ పత్రిక అని చెప్పవచ్చును.

రోమా పత్రిక నుండి ఫిలేమోను వరకు ఉన్న పత్రికలు అన్యుల కళ్లద్దాల నుండీ చూడాలి. హెబ్రీ నుండి యూదా పత్రిక వరకు యూదుల కళ్లద్దాల నుండి చూడాలి.

# రోమా పత్రిక పరిచయము

**రో**మా పత్రిక రోమా పట్టణములోని సంఘమునకు పౌలు వ్రాసాడను సంగతి ఏ సందేహము లేకుండా అందరూ అంగీకరిస్తారు. ఈ పత్రిక ప్రొటెస్టంట్ సంఘ స్థాపనకు కారణమయ్యింది. మార్టిన్ లూథర్ రోమా 1:17 పై ధ్యానం చేస్తున్నప్పుడు, విశ్వాసము ద్వారానే ఒక వ్యక్తి నీతిమంతుడిగా తీర్చబడును అనే సత్యాన్ని తెలుసుకున్నాడు. దాని ఫలితంగా 31 అక్టోబరు 1517లో "95 థీసెస్"లు (కాథోలిక్ సంఘ బోధకులకు వ్యతిరేకంగా) విట్టెన్‌బర్గ్‌లోని తన చర్చి తలుపుకు మేకులతో కొట్టాడు. అదే సంఘ సంస్కరణకు దారితీసింది. 200 సంవత్సరాల తరువాత జాన్‌వెస్లీ 1738లో రోమా పత్రిక ద్వారానే మారుమనస్సు పొందాడు. క్రొత్త నిబంధన ఒక ధనాగారము అయితే ఆ ధనాగారాన్ని తెరచే తాళపు చెవి రోమా పత్రిక అని ఇంతకుముందు చెప్పుకున్నాము. రోమా పత్రిక ధ్యానించాక మన జీవితాలు రూపాంతరము చెందకపోతే అది రోమా పత్రిక తప్పు కాదు గాని మనలో ఉన్న స్వనీతి.

### రోమా సంఘము స్థాపించబడుట :

పౌలు వివిధ ప్రాంతాలకు వెళ్లి సువార్త ప్రకటించినప్పుడు రక్షింపబడిన అన్యులలోని క్రైస్తవులు రోము పట్టణమునకు వెళ్లి ఈ సంఘము స్థాపించి ఉండవచ్చును. ఈ సంఘములో ఎక్కువ మంది అన్యులే ఉన్నారు, యూదులు తక్కువగా ఉన్నారు. దేవుని ఏర్పాటును బట్టి పౌలు తనను తాను అన్యజనులకు అపొస్తలుడిగా పిలుచుకున్నాడు. రోమా సంఘమును అపొస్తలులెవరూ స్థాపించలేదు.

రోమా సంఘము ఎప్పుడు స్థాపించబడిందో తెలుసుకొనుటకు ఆధారాలేవీ లేవు గాని ఎవరు స్థాపించారు అనే ప్రశ్నకు మూడు అభిప్రాయాలు ఉన్నాయి –

### 1. పేతురు స్థాపించాడను అభిప్రాయము :

సాంప్రదాయకంగా రోమన్ కథోలిక్ సంఘము రోమా వారు సంఘాన్ని పేతురు స్థాపించాడని చెప్తారు. కాని సాంప్రదాయక బైబిల్ పండితులు (Conservatives) దీనిని అంగీకరించరు. ప్రస్తుతం కథోలిక్ వారు కూడా ఈ సత్యాన్ని గుర్తిస్తున్నారు. ఈ సంఘం ప్రారంభించబడినపుడు పేతురు రోములో లేడు. పేతురు యెరూషలేములో తన పరిచర్యను కొనసాగించాడు. (కనీసం క్రీ.శ. 50 వరకు – అపొ.కా. 15:1–5, గలతీ 2:1–10).

పౌలు ఈ రోమా పత్రికలో దాదాపు 33మంది పేర్లు ప్రస్తావించాడు. ఒకవేళ పేతురు రోమా సంఘము స్థాపించి ఉంటే, అతని పేరే మొదటిగా వ్రాసి ఉండేవాడు. పౌలు "ఇతరులు వేసిన పునాది మీద కట్టను" అని రోమా 15:20లో చెప్పాడు. 1పేతురు 5:13లో పేతురు రోము పట్టణాన్ని "బబులోను" అని పిలిచాడు. అయితే అది పౌలు రోమా పత్రిక వ్రాసిన తరువాత అయిఉండవచ్చు. బహుశా పేతురు తన ఆఖరి రోజులలో వెళ్ళి ఉండవచ్చును. పేతురు రోములోనే హతసాక్షి అయ్యాడు. అయితే పౌలు చనిపోయిన తరువాతనే పేతురు మరణించాడు. చివరి దినాలలో పౌలు, పేతురు ఇద్దరూ రోములోనే ఉన్నారు కాని అప్పటికే పౌలు రోమా పత్రిక వ్రాసాడు.

**2. యూదు క్రైస్తవులు స్థాపించారను అభిప్రాయము :**

రెండవ అభిప్రాయము పెంతెకొస్తు పండుగ దినమున రక్షణ పొందిన యూదులు ఈ సంఘాన్ని స్థాపించి ఉండవచ్చును (అపొ.కా. 2:10). తరువాత ఆ యూదులు యేసు మార్గములో వెళ్లుట ద్వారా వస్తున్న శ్రమలు తప్పించుకొనుటకు చెదరిపోయి, రోమాకు వలస వెళ్లి అక్కడ సంఘాన్ని స్థాపించి ఉండవచ్చని కొందరి అభిప్రాయము. అంతియొకయలోని సంఘము ఇలా వలస వెళ్లిన యూదు విశ్వాసుల ద్వారా ఏర్పడినదని లూకా అపొ.కా. 11:19-24లో వ్రాశాడు. కాని వీరు రోమాకు వెళ్లి సంఘము స్థాపించినట్లు వ్రాయలేదు. అయితే చరిత్రకారుడైన లూకా అంతియొకయ సంఘము గురించి వ్రాసినవాడు, దీనిని గురించి కూడా నిర్లక్ష్యము చేయకుండా వ్రాసి ఉండేవాడు. ఈ అభిప్రాయము కూడా సరైనది కాదు.

**3. క్రైస్తవ వలస దారులు స్థాపించి ఉండవచ్చునన్న అభిప్రాయము :**

మూడవ అభిప్రాయము, పౌలు పరిచర్యలో ఆయా ప్రాంతాలలో రక్షింపబడినవారు (యూదులు మరియు అన్యులు) రోమాకు వలస వెళ్లి సంఘాన్ని ప్రారంభించి ఉండవచ్చును. రోమా సంఘములో ఎక్కువ మంది అన్యుల నుండి క్రైస్తవులైన వారే ఉన్నారు (1:13, 11:13, 11:28-31, 15:15-16). యూదా విశ్వాసుల శాతం తక్కువే కాని వారు కూడా ఉన్నారు (2:17-3:8, 3:21-4:1, 7:1-14, 14:1-15:12). పౌలు తనను తాను అన్యజనులకు అపొస్తలుడిగా పిలుచుకున్నాడు. యేసుప్రభువు తనను ఏర్పాటు చేసినది అన్యుల కొరకే అన్న సత్యము తాను గ్రహించాడు. పౌలు ఆ సంఘంలో చాలామందిని ఎరిగినవాడే (16వ అధ్యాయము).

రోమా సంఘాన్ని పేతురు గాని, పౌలుగాని స్థాపించలేదు గాని క్రైస్తవ వలసదారులు, ప్రధానంగా పౌలు పరిచర్యలో రక్షింపబడిన వారితో స్థాపించబడినది అను అభిప్రాయానికి మనము రావచ్చు.

పౌలు ఈ పత్రికను కొరింథులో గాయి యింటి నుండి వ్రాశాడు. కొరింథు పట్టణము సమీపంలో ఉన్న కెంక్రేయలోని సంఘస్తురాలు ఫీబేతో రోమాకు పంపినట్లుగా రోమా 16:1లో చూడగలము.

పౌలు తన మూడవ మిషనరీ ప్రయాణంలో కొరింథు పట్టణం చేరిన తరువాత క్రీ.శ. 57–58లో వ్రాసి ఉండవచ్చును.

## పత్రిక రచనా ఉద్దేశము

ఖచ్చితంగా ఫలానా ఉద్దేశము అని చెప్పలేము కాని కొన్ని ఉద్దేశాలను పత్రిక చదువుచున్నప్పుడు గమనించవచ్చును.

**1.** పౌలు కొరింథులో ఉన్నప్పుడు కెంక్రేయ వాసురాలైన ఫీబే రోమా వెళుతున్న (రోమా 16:2) సందర్భాన్ని పౌలు వినియోగించుకున్నాడు. భవిష్యత్తులో తన అవసరాల కొరకు రోమా సంఘమును సిద్ధపరచుట కొరకు (1:9–15,15:22–29,32) వ్రాశాడు. పౌలు రోమాలోని సంఘాన్ని చూడాలని చాలా ఆశపడ్డాడు.

**2.** రోమా సంఘమును అపొస్తలెవరూ కట్టలేదు. వలస వెళ్లిన క్రైస్తవులు తమంతట తామే ఒక సంఘముగ ఏర్పడ్డారు కాబట్టి వారికి అపొస్తలుల బోధల అవసరత ఉన్నది కాబట్టి వారికి సువార్త విపులంగా బోధించుట కొర్కై ఈ పత్రిక వ్రాశాడు.

**3.** రోమా సంఘములో మిశ్రమ జనాంగము ఉన్నందున అక్కడ అలజడి ఏర్పడింది. యూదా క్రైస్తవులకు, అన్యుల నుండి క్రైస్తవులైన వారికి వచ్చిన అభిప్రాయ బేధాలు తీసివేయుటకై చేసిన ప్రయత్నమిది. క్రైస్తవ్యాన్ని యూదీకరించడానికి ప్రయత్నము జరుగుచూ సున్నతి లేకుండా సంఘములో ఉండకూడదని ఒక సమస్య లేవనెత్తారు. రక్షణ విషయంలో విబేధాలు, సిద్ధాంతపరమైన విబేధాలు తలెత్తాయి. పౌలు వెళ్లిన ప్రతిచోటికి ఈ క్రైస్తవ్యాన్ని యూదీకరించేవారు వెళ్లి క్రైస్తవ స్వాతంత్రాన్ని అనుభవించే వారిని కలుషితం చేయుటకు ప్రయత్నించేవారు (గలతీ.5:1). ఇదే కాకుండా

పౌలు ఈ పత్రిక వ్రాసే సమయానికి పౌలుపై భౌతికంగా కూడా దాడి చేశారు (అపో.కా. 20:3). ఈ రెండు వర్గాలు కూడా తమ పరిధులను, తమ పట్ల దేవుని కృపను గుర్తించి సఖ్యతగా ఉండాలని బోధించుట కొరకు ఈ పత్రిక వ్రాశాడు.

**4.** పౌలు స్పెయిను దేశానికి వెళ్లాలని ఆశ కలిగి ఉన్నాడు. ఆ ప్రయాణ ఏర్పాట్ల బాధ్యత రోమా సంఘము తీసుకోవాలనే తన ఉద్దేశము వారికి తెలిపి వారిని వేడుకొనుటకు ఈ పత్రిక వ్రాసి ఉండవచ్చును.

ముఖ్యమైన ఉద్దేశము వారికి సువార్త విపులంగా బోధించి, సిద్ధాంత పరమైన విభేదాలు తొలగించి వారి మధ్య సఖ్యత కుదిరించుట అయి ఉన్నది. ఈ సంఘము ఒక మిశ్రమ సంఘముగా ఉండుటచేత అనేక రకాల విశ్వాసులున్నారు. ఒకసారి ఆలోచిస్తే ఈనాటి మన సంఘాలు కూడా ఈ విధంగానే ఉన్నాయి కాబట్టి ఈ పత్రిక అన్యులమైన (యూదేతరులమైన) మన కొరకు వ్రాసినట్లుగా అనుకొనవచ్చును. ఈ కడవరి రోజులలో ఉన్న మనము అబద్ధబోధలలో కొట్టుకొని పోకుండా ఉండుటకు పౌలు మనకొరకు వ్రాసిన పత్రిక అనుకొని ధ్యానించుకుందాము.

క్రైస్తవులమైన మనందరికీ అపొస్తలుల బోధల అవసరత ఉన్నది కాబట్టి ఈ పత్రికలోని ప్రతి బోధా మనకొరకే. ఆనాటి అభిప్రాయ బేధాలు ఈనాటి సంఘాలలో కూడా ఉన్నాయి. మార్టిన్ లూథర్‌ను మార్చి ప్రొటస్టెంటిసమ్‌ను తెచ్చిన పత్రిక, వెస్లీకి కనువిప్పు కలిగించి మెథడిస్టు సంఘాన్ని తయారు చేసిన ఈ పత్రిక మనలను సంపూర్ణముగా మారుస్తుందని నమ్ముదాం. హబక్కూకు ప్రవక్త సంస్కరణలకు తాత, పౌలు సంస్కరణలకు కుమారుడు, మార్టిన్ లూథర్ సంస్కరణలకు మనుమడు అని బైబిలు పండితులు తమాషాగా అంటారు.

## రోమా పత్రిక ముఖ్యాంశము

“నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును” అనేది ప్రధానాంశము అనుటలో పండితులకు ఎలాంటి విబేధాలు లేవు. ఈ మాట మొదటిగా హబక్కూకు ప్రవక్త ప్రవచనాత్మకంగా చెప్పాడు (హబక్కూకు 2:4). సువార్త (క్రీస్తు మరణ పునరుత్థానాలు) లో బయలు పరచబడిన దేవుని నీతి సంపూర్తిగా విశ్వాసనియమముపై ఆధారపడి ఉన్నది అనేది ఈ పత్రిక యొక్క సారాంశము.

## పత్రిక యొక్క విభజన

ఇందులో 4 ప్రధానమైన భాగాలున్నాయి. విశ్లేషకులందరూ ఈ విభజనపై ఏకాభిప్రాయము కలిగియున్నారు.

### 1. మానవుని పాపము - దేవుని ఉగ్రత - నీతి అవసరత :

రోమా1:18 నుండి 3:21 వరకు ఉన్న వాక్యభాగములో ఈ అంశము కనపడుతుంది. మానవుని పాపము గురించిన సత్యము. మానవుల పాపము వలన దేవుడు తన ఉగ్రతను లోకం మీద చూపించుటను బట్టి లోకంలో వినాశనము కనబడుతున్నది. అందువలన ఉగ్రత తప్పించు కోవాలంటే నీతి అవసరత ఉన్నది. పాపం దేవుని నుండి మానవుని దూరం చేసింది. యేసు మాత్రమే తిరిగి మానవుని దేవునితో సమాధాన పరచగలడని ఈ భాగంలో పౌలు విశదీకరిస్తున్నాడు. ఈ భాగములో ఒక ప్రాముఖ్యమైన **ప్రశ్న** – లోకమంతా నశించిందా?

పౌలు **జవాబు** : అవును, లోకమంతా నశించింది (3:19).

### 2. రక్షణ - దేవుని నీతి - విశ్వాసము యొక్క అవసరత :

ఈ భాగంలో రచయిత మొత్తం నల్లటి రంగు పులిమేశాడు (పాపమనే చీకటి చూపించుటకు) ఆ నల్లటి పేపర్ మీద తెల్లటి చిత్రాన్ని వేయడము ప్రారంభించాడు. ఈ రెండవ విభాగము రక్షణ గురించి చెప్పబడింది, రోమా3:21 నుండి 8:39 వరకు ఉన్న వాక్య భాగములో ఈ అంశము కనబడుతుంది. ఈ భాగంలో విశ్వాసము యొక్క అవసరత, దేవుని నీతి బయలుపరచబడింది. దేవుని యందు విశ్వాసముంచుట ద్వారా మానవుడు పాపం నుండి మరియు దేవుని యొక్క తీర్పు నుండి విడుదల పొందగలడు.

ఈ విభాగములో ఉన్న **ప్రశ్న** : రక్షణ ఎలా వస్తుంది?

**జవాబు :** క్రీస్తు యేసునందు విశ్వాసము వలన రక్షణ వస్తుంది.

ఈ విభాగమును విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చుట అని కూడా చెప్పవచ్చును.

### 3. శుద్ధీకరించబడుట - కృపాసంకల్పము :

ఈ విభాగము 9:1 నుండి 11:36 వరకు ఉన్న వాక్య భాగములో కనపడుతుంది. యూదులకు ఒక సమస్య కనపడుచున్నది. వారు పౌలును ఈ విధంగా అడుగుచున్నారు - "అందరూ పాపులే అంటున్నావు, కాని మేము అబ్రాహాము సంతానము కదా, ఎన్నుకోబడిన వారము గదా! మరి దేవుడు మమ్ములను ఎందుకు ప్రక్కన పెట్టాడు"? అందుకు పౌలు ఇచ్చిన **జవాబు** - "అందరినీ కనికరించుటకు" (11:32). "మీరు కొంతమందే ఉన్నారు, అన్యులు ఎక్కువమంది ఉన్నారు కదా!" దేవుని జ్ఞానము, కృపా సంకల్పము ప్రత్యక్షపరచబడుతున్నది. యూదులకు, క్రైస్తవులకు గల సంబంధము తెలుపబడింది.

### 4. దైనందిన జీవిత మార్గదర్శకాలు :

ఇక్కడ పౌలు సంఘానికి ఇచ్చే హెచ్చరికలు, దేవుని చిత్తము తెలుపుట కనపడుతుంది. ఈ విభాగము రోమా 12:1 నుండి 15:33 వరకు ఉన్నది. ధర్మశాస్త్రము లేకపోతే మనలను ఏది నడిపిస్తుంది? అను ప్రశ్నకు ఈ విభాగంలో జవాబు దొరుకుతుంది. విశ్వాసి యొక్క అనుదిన జీవితంలో దేవుని చిత్తముతో నడిపించబడుటను గురించి పౌలు విశదీకరిస్తున్నాడు.

ఇక్కడ **ప్రశ్న :** ధర్మశాస్త్రము లేకుండా ఉచితంగా నీతిమంతునిగా తీర్చబడిన క్రైస్తవుడు తన దైనందిన జీవితాన్ని ఎలా గడపాలి?

**జవాబు :** రూపాంతరము చెందుట ద్వారా.

రోమా పత్రికలో సిద్ధాంతాలు ఎక్కువగా చెప్పబడి ఉన్నవి. మనము ఇంతకు ముందు చూసిన నాలుగు విభాగాలలో నాలుగు శాస్త్రాలు కనపడుతాయి.

1. మానవుని పాపము - పాప శాస్త్రము (Hamartiology)
2. రక్షణ - రక్షణ శాస్త్రము (Soteriology)
3. కృపాసంకల్పము - భవిష్యత్ శాస్త్రము (Eschatology)
4. సంఘానికి హెచ్చరికలు - సంఘ శాస్త్రము (Ecclesiology)

వేదాంత శాస్త్రములో ఉన్న పది శాస్త్రాలలో పౌలు ఈ పత్రికలో నాలుగు శాస్త్రాలను నేర్పిస్తున్నాడు.

**రోమా పత్రికలో కనపడు దేవుని లక్షణములు :**

1. శక్తిమంతుడు –1:16,20, 9:21, 22
2. శిక్షించువాడు – 1:18, 2:5,6,8, 3:5, 6:5, 9:18, 20, 22
3. నిత్యుడు – 1:20
4. మంచివాడు – 2:4
5. అనుగ్రహైశ్వర్యము గలవాడు – 2:4,5, 3:25, 9:22
6. పక్షపాతము లేనివాడు – 2:11, 3:4,26
7. కృప గలిగినవాడు – 3:23, 6:4
8. సమాధానపరచువాడు – 5:1,10
9. సులభముగా దగ్గరకు చేర్చుకొనువాడు – 5:2
10. ప్రేమించువాడు – 5:5, 8, 8:39, 9:11–13
11. వాగ్దానం నెరవేర్చువాడు – 8:28, 11:33
12. సమకూర్చువాడు – 8:28, 11:33
13. కరుణించువాడు – 9:15, 18
14. బుద్ధి జ్ఞానము గలిగినవాడు – 11:33, 16:27

# రోమా పట్టణము

**రో**మా సామ్రాజ్యానికి రోమా పట్టణము రాజధాని. అది చాలా పురాతనమైన ముఖ్యమైన పట్టణము. క్రీ.పూ. 753వ సం॥లో స్థాపించబడినది కాని నూతన నిబంధన వరకు లేఖనాలలో ఎక్కడా దాని ప్రస్థావన లేదు. తిబారు నది (Tiber River) తీరములో నిర్మించబడి మధ్యధరా సముద్రమునకు 15 మైళ్ళ దూరంలో ఉన్నది. పౌలు కాలంలో ఆ పట్టణ జనాభా పదిలక్షల మంది. అందులో ఎక్కువ భాగము బానిసలుగా ఉండేవారు. రోమా పట్టణములో చాలా అందమైన భవంతులుండేవి కాని వాటి అందము పేదలు నివసించే గృహాల మధ్యలో కనిపించేది కాదు. రోమన్ కెథోలిక్ సంఘపీఠము రోమా పట్టణములో ఉన్నది. రోమా పట్టణము చుట్టూ ఏడు కొండలున్నవి. ఈ పట్టణమంతా ఆచారాలకు పుట్టినిల్లు.

పౌలు రోమా పట్టణానికి వెళ్లాలని చాలా ఆశపడ్డాడు, ప్రయత్నము చేశాడు గాని వీలు కాలేదు. దేవుని సార్వభౌమత్వములో పౌలు రోమా పట్టణము దర్శించ లేకపోవుట చేత ప్రపంచానికి ఒక అద్భుతమైన సువార్త సిద్ధాంతములతో కూడిన పత్రిక ఇవ్వగలిగాడు.

దైవశాస్త్ర సంబంధమైన బోధలున్నాయి కాబట్టి ఇందులో చారిత్రాత్మక సంగతులు పెద్దగా లేవు. ఉదాహరణలు పాత నిబంధన గ్రంథములో నుండి తీసుకున్నాడు. రోమా 1 నుండి 11 అధ్యాయాలలో వేదపరమైన సత్యాలను చెప్పి 12 నుండి 16 అధ్యాయాలలో వాటిని జీవితాలలో ఏ విధంగా అన్వయించుకోవాలో సంఘాలకు చెబుతూ హెచ్చరించాడు.

పౌలు దేవుని రాజ్య నీతి ననుసరించి క్రియారూపకంగా చూపించిన బోధలు చూస్తే, ఆయన దేవుని చిత్తానుసారంగా ఎలా నడిచాడో తెలుస్తుంది. బోధించినట్లు తాను నడుచుకొన్నాడు. సంఘ సభ్యులు దేవుని చిత్తానుసారమైన జీవితం ఎలా గడపాలో చెప్పాడు. అపొస్తలుడైన పౌలు రోమా నగరము వెలుపట నీరో చక్రవర్తి కాలములో హతసాక్షి గావించబడ్డాడు.

# రోమా పత్రిక యొక్క నిర్మాణము

పరిచయ పలుకులు 1:1 - 15 > పత్రిక అంశము 1:16-17

పరిచయ పలుకులు అంశములోకి దారి తీశాయి.

అన్యుడు నశించాడు 1:18-32

నీతిమంతుడు నశించాడు 2:1-10

యూదుడు నశించాడు. 2:11-3:8

సర్వలోకము నశించినది 3:9-20

మా సంగతేంటి అను వారికి సమాధానము

విశ్వాసము ద్వారా నీతి మంతులుగా తీర్చబడుట దేవుని పద్ధతి 3:21-31

పా.ని. భక్తులు కూడా విశ్వాసము ద్వారానే తీర్చబడ్డారు 4:1-25

వివరణ ఇస్తున్నాడు

విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట ద్వారా వచ్చు ఆశీర్వాదాలు 5:1-11

ఆదాములో మరణమున్నది. క్రీస్తులో జీవమున్నది. 5:12-21

ఆదాము శిరస్సు క్రింద నుండి క్రీస్తు శిరస్సు క్రిందకు వచ్చినప్పుడు మనకు జీవము

క్రీస్తుతోడి ఐక్యత పరిశుద్ధతకు ఆధారము 6:1-23
Identification With Christ

ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల ద్వారా పరిశుద్ధత దొరకదు 7:1-25

పరిశుద్ధీకరణకు సరైన పద్ధతి

పరిశుద్ధ పరచబడుటకు తప్పుమార్గము

క్రీస్తునందు భద్రత కలదు 8:1-39

క్రీస్తులో బ్రతికింపబడి ఉన్నాము

ఉచితంగా నీతిమంతులుగా తీర్చబడిన వారు రూపాంతరము చెందుట ద్వారా జీవించగలరు 12:1-15:31

Justification, Sanctification & Preservation
రక్షణ శాశ్వతము : మనకు సంబంధించిన దేనినైనా పోగొట్టుకోగలము. రక్షణ మనకు ఉచితము ఇవ్వబడినది

దేవుని యొక్క సార్వభౌమత్వము ఇశ్రాయేలీయుల ఎన్నిక ఇశ్రాయేలీయుల గతము (Past) 9:1-30 — Election ఎన్నిక

మానవుని బాధ్యత (Responsibility) దేవుని తృణీకరించుట దేవుడు తృణీకరించుట 10:1-21 ఇశ్రాయేలీయుల వర్తమానము — Reiection తృణీకరించుట

దేవుని కృపా సంకల్పము దేవుడు ఇశ్రాయేలీయులను మరల చేర్చుకొనుట; భవిష్యత్తు 11:1-36 — Reception చేర్చుకొనుట

దేవునికి స్తుతి కలుగును గాక 16వ అధ్యాయము

# 1వ అధ్యాయము

**శుభములు - పరిచయ పలుకులు** (1-17 వచనములు)

**"యే**సుక్రీస్తు దాసుడును, అపొస్తలుడుగా నుండుటకు పిలువబడిన వాడును, దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన వాడునైన పౌలు రోమాలో ఉన్న దేవుని ప్రియులకందరికి అనగా పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారికందరికి శుభమని చెప్పి వ్రాయునది. మన తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు, కృపా సమాధానములు మీకు కలుగును గాక. దేవుడు తన కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తు విషయమైన ఆ సువార్తను పరిశుద్ధ లేఖనముల యందు తన ప్రవక్తల ద్వారా ముందు వాగ్దానము చేసెను. యేసుక్రీస్తు, శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను. ఈయన నామము నిమిత్తము సమస్త జనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ఈయన ద్వారా మేము కృపను అపొస్తలత్వమును పొందితిమి. మీరును వారిలో ఉన్నవారై యేసుక్రీస్తు వారుగా ఉండుటకు పిలువబడియున్నారు".

ఈ అధ్యాయములోని మొదటి 17 వచనాలు ఉపోద్ఘాతముగా ఇవ్వబడినవి. మిగిలిన పౌలు పత్రికలలో ఇటువంటి తొలిపలుకులు లేవు. చెప్పీ చెప్పనట్లుగా తాను చెప్పబోయే అంశాన్ని గురించి చెప్తున్నాడు. రక్షణ సిద్ధాంతాన్ని గురించి చెప్పబోవు పౌలు "యేసుక్రీస్తు" అను నామములో ప్రారంభిస్తున్నాడు. అభిషిక్తుడైన రక్షకుడు అను అర్థము గల ఈ నామము అన్ని నామములకన్నా పై నామము.

ఈ వచనాలు పౌలు మనతో మాట్లాడినట్లుగా చదువుకుంటే, పరిశుద్ధాత్మ దేవుడు మనతో మాట్లాడుతాడు. అప్పుడు మన హృదయాలలో పరివర్తన వచ్చి మన గృహాలు, సంఘాలు మారిపోతాయి.

పౌలు రోమీయులకు ఈ ఉత్తరము వ్రాస్తూ ఏ హోదాతో తాను వ్రాస్తున్నాడో చెప్తున్నాడు. సౌలు పౌలుగా మారిన తర్వాత చాలా సందర్భాలలో దమస్కు మార్గ ప్రత్యక్షతను గురించి సాక్ష్యముగా చెప్తూ, తాను అన్యుల మధ్య సువార్తికునిగా ఉండుటకు ప్రభువు తనను ఏర్పాటు చేసుకున్నాడని చెబుతున్నాడు. దేవుడే స్వయంగా అననీయతో "అన్యజనుల యెదుటను, రాజుల యెదుటను, ఇశ్రాయేలీయుల యెదుటను నా నామము భరించుటకు ఇతడు నేను ఏర్పరచుకొనిన సాధనమై యున్నాడు" అని చెప్తున్నాడు (అపొ.కా. 9:15).

ఈ పరిచయ భాగంలో తనను గూర్చి తాను మూడు విషయాలు చెబుతున్నాడు:

1. యేసుక్రీస్తు దాసుడను

2. అపొస్తలుడుగా ఉండుటకు పిలువబడిన వాడను

3. దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకించబడినవాడను

ఈ మూడు విషయాలలో నాలుగు అంశాలున్నాయి

**ఎ. అతని పేరు** – పౌలు = చిన్నవాడు

సౌలు = అడగబడినవాడు (దేవునిచే)

ఆ రోజులలో ఉత్తరాలలో పేర్లు వ్రాసుకొనుట పరిపాటి. పౌలు అంతవరకూ రోమా సంఘాన్ని చూడలేదు, వారికి చాలా ప్రాముఖ్యమైన సిద్ధాంతాలతో కూడిన ఉత్తరము వ్రాస్తున్నాడు. ఏ అధికారంతో వ్రాస్తున్నాడో తెలియజేస్తున్నాడు. 'సౌలు' అను పేరు యూదులందరికీ తెలిసిన పేరు. ఇశ్రాయేలు ప్రజలకు మొదటి రాజు, బెన్యామీను గోత్రీయుడు అయిన సౌలు అంటే వారికి చాలా ఇష్టము.

మన సౌలు తార్సులోని విశ్వ విద్యాలయములో రోమా సంస్కృతిని గూర్చి నేర్చుకున్నాడు. గమలీయేలు అను గొప్ప జ్ఞాని పాదాల యొద్ద ధర్మశాస్త్రము క్షుణ్ణంగా నేర్చుకొన్నాడు. పౌలు కాలంలో హిల్లెల్, షమ్మా అను రెండు ప్రఖ్యాతి గాంచిన పాఠశాలలుండేవి. గమలీయేలు హిల్లెల్ యొక్క మనుమడు.

'సౌలు' అనునది హెబ్రీయుల పేరు, 'పౌలు' అనునది 'Paulus' అను లాటిన్ పేరు నుండి వచ్చింది. 'చిన్నవాడు' అను అర్థమిచ్చు ఈ పేరుతో తన్ను తాను తగ్గించుకొని

అన్యుల దగ్గరికి వెళ్లినప్పుడు వారితో మమేకమై 'నేను మీలో ఒకడిని' అని చెప్తున్నాడు. పౌలు తండ్రి రోమీయుడు, చాలా ధనికుడు, మంచి పేరు ప్రఖ్యాతులు గలవాడు. పౌలు అవన్నీ వదులుకొని అన్యుల మధ్యకు వెళుతున్నాడు. మొదటి మాటలోనే తగ్గింపు స్వభావము కనపడుతుంది. ఆ సంఘములో యూదులు, అన్యుల మధ్య ఉన్న అలజడి తొలగించాలంటే ఈయనే సరైన వాడు. ఎందుకంటే ఆయనలో మూడు సంస్కృతులు కలిసి ఉన్నాయి – ఆయన హెబ్రీయుడు (పరిసయ్యుడు), రోమీయుడు (గొప్ప పట్టణమైన తార్సులో పుట్టుట వలన), ఉన్నత విద్యనభ్యసించిన వాడు. ఈయనలో పరిసయ్యుని మత నిష్ఠ, గ్రీకులకున్న జ్ఞానము, రోమా సంస్కృతి కలబోసి ఉన్నాయి, కాబట్టి రోమీయులకు లేఖ వ్రాయుటకు అన్ని యోగ్యతలూ కలిగి యున్నాడు. అతనే సరైన వ్యక్తి.

**బి. తన స్థానము** – దాసుడు అని చెప్పుకుంటున్నాడు.

**సి. అతని పిలుపు** – అపొస్తలుడుగా ఉండుటకు పిలువబడినవాడు

**డి. అతని బాధ్యత** – సువార్త నిమిత్తము ప్రత్యేకించబడినవాడు.

**పౌలు దేవుని ప్రణాళికలో తానెక్కడున్నాడో బాగా అర్థము చేసుకున్నాడు.** యేసుక్రీస్తు మార్గంలో నడిచే ప్రతి ఒక్కరూ ఆయన చిత్తము తెలుసుకొని ఆయన ప్రణాళికలో ఉండాలి.

పౌలు తనను తాను పరిచయం చేసుకున్న విధానము అద్భుతము.

## 1. యేసుక్రీస్తు దాసుడు :

రోమీయులకు ఈ పదము బాగా అర్థమవుతుంది. ఎందుకంటే ఆ కాలంలో రోమా సామ్రాజ్యంలో 60లక్షల మంది బానిసలుండేవారు (దాదాపు రోమా పౌరుల జనాభా కంటే 5,6 రెట్లు ఎక్కువ). బానిసలను వస్తువులుగా చూసేవారుగాని మానవులుగా కాదు. ప్రాచీన ప్రపంచములో బానిసలకు హక్కులు లేవు. ఒక బానిస పెళ్లిగాని, కుటుంబము గాని గుర్తించబడదు. వాని మరణము గురించి కూడా ఎవరూ పట్టించుకోరు. బానిసను ఎవరైనా చంపినా న్యాయపీఠము వరకూ పోదు. దాసులుగా ఉండుట దుర్భరంగా ఉండేది. క్రొత్త నిబంధనలో 'దాసుడు' అను మాటకు మూడు గ్రీకు పదాలు వాడబడ్డాయి.

ఏ. 1 కొరింథీ 3:5 – పరిచారకులు – వాడబడిన గ్రీకు పదము DIAKONOS (డయాకొనస్) – అధికారంతో కూడిన సేవ.

బి. 1 కొరింథీ 4:1 – సేవకులు – ఇక్కడ వ్రాయబడిన గ్రీకు పదము OOPARATUS (ఊపరేటస్) = Under rowers, క్రింది భాగములో తెడ్లు వేసేవారు. రోమీయులకు పెద్ద ఓడలుండేవి. తెడ్డు వేసేవారు, రెండు అంతస్థులలో ఉండేవారు. క్రింది స్థానములో ఉండేవారిని ఊపరేటస్ అనేవారు. అంటే తక్కువస్థాయి బానిసలు అని అర్థము.

సి. గలతీ 1:10, 1తిమోతి 5:17 – క్రీస్తు దాసుడను, ప్రయాసపడువారు. ఇక్కడ వాడబడిన గ్రీకు పదము DOULOS (డ్యూలాస్) = కట్టు బానిస. పౌలు ఈ పదాన్ని ఉపయోగించాడు.

పౌలు కాలంలో రెండు రకాల బానిసలుండేవారు. హెబ్రీదాసుడు, రోమా దాసుడు. హెబ్రీ దాసులు ఇష్ట పూర్వకంగా బానిసత్వము కోరుకొనువారు (నిర్గమకాండము 21:5). రోమా దాసులు బలవంతంగా బానిసలుగా చేయబడిన వారు. పౌలు మొదటి కోవకు చెందినవాడు – ఇష్టంగా దేవునికి దాసుడైనాడు.

పౌలు "యేసుక్రీస్తు దాసుడను" అను మాట గౌరవ చిహ్నంగా వాడుచున్నాడు. తాను రోమా చక్రవర్తికి దాసుడను కాను గాని యేసుక్రీస్తుకు దాసుడను అంటున్నాడు. తనను తాను ప్రభువుకు అప్పగించుకుని, ఆయనకు బానిసగా ఉంటూ, ఆయన చిత్తప్రకారం నడుచుకోవాలనుకుంటున్నాడు. అంతకుముందు ప్రభువు మార్గంలో వెళ్లేవారిని నాశనం చేసిన దినాలలో పౌలు ధర్మశాస్త్రానికి, తన యూదా మతానికి దాసునిగా ఉన్నాడు గాని ఇప్పుడు క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించి, ఆయనకు బానిసగా తన్ను తాను అప్పగించుకొన్నాడు. తన జీవితము ఇక తనది కాదు, తన యజమానికి అప్పగించుకున్నాడు. దేవుని ప్రణాళికలో సంపూర్ణంగా ఉండుట చేత తన జీవితము ప్రభువు చేతుల్లో ఉందని తెలుసుకున్నాడు. ప్రభువు దాసునిగా ఉండుట అంటే స్వతంత్రత వచ్చినట్లే అను సత్యము గ్రహించాడు. ఈ విధమైన మార్పు సువార్త ద్వారా అతనిలో వచ్చింది.

## 2. అపొస్తలుడిగా ఉండుటకు పిలువబడిన వాడు :

Apostolos అను గ్రీకు పదము నుండి వచ్చిన ఈ పదానికి అర్థము 'పంపబడినవాడు' అని అర్థము. "నేను దేవుని చేత పంపబడినవాడను" అని పౌలు గుర్తించాడు. ఒక గమ్యంతో, అధికారంతో పంపబడినవానిని 'అపొస్తలుడు' అంటారు. పౌలు యేసుప్రభువు శిష్యులలో ఒకడు కాడు.

అపొస్తలుడిగా ఉండుటకు కావలసిన ఒక అర్హత ఏదనగా – పునరుత్థానుడైన క్రీస్తును స్వయంగా చూసిన అనుభవము ఉండాలి. 1 కొరింథీ 9:1–2 వచనాలలో తాను క్రీస్తును చూశానని, తాను అపొస్తలుడుగా ఉండుటకు అర్హత ఉందని చెప్తున్నాడు. అపొ.కా. 9:1–9 వచనములో పౌలు దమస్కు మార్గంలో క్రీస్తును చూశాడు. అప్పుడే అతనిని అన్యులకు అపొస్తలుడిగా ఉండుటకు ప్రభువు పిలిచాడు. దైవప్రత్యక్షతలు క్రీస్తునుండే స్వయంగా పొంది సంఘములకు బోధించమని ఆదేశము పొందాడు. తాను నేర్పిన సత్యాలను పునాదిగా వేసి సంఘములను కట్టేందుకు ఏర్పాటు చేయబడ్డాడు. దేవుని ప్రణాళికను ఆదేశంగా తీసికొని తన్నుతాను సంపూర్ణముగా సమర్పించుకున్నాడు. ఇది పౌలు ఇష్టపూర్వకంగా ఏర్పాటు చేసుకున్న పనికాదు గాని దేవుడు ఆదేశించాడు.

## 3. దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన వాడు :

పౌలు యూదుల రబ్బీగా ఉన్నప్పుడు, పరిసయ్యునిగా ప్రత్యేకించబడి ధర్మశాస్త్రమునకు, యూదుల ఆచారాలకు లోబడి ఉన్నాడు. కాని ఇప్పుడు క్రీస్తుకు సమర్పించుకొన్న తర్వాత, సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన వాడైనాడు. సువార్త అంటే మంచి వార్త. యేసయ్య మన పాపముల కొరకు చనిపోయి, పాతిపెట్టబడి, తిరిగి లేచి, ఇప్పుడు తనను నమ్మిన వారందరినీ రక్షిస్తున్నాడు (1కొరింథీ 15:1–4). పౌలు సువార్త యేసుప్రభువే. ఆయన పరిచర్య యేసునొద్దకు అందరిని నడిపించుటే. "నాకింక వేరే పని లేదు. సువార్త ప్రకటించుట మాత్రమే నా పని" అంటున్నాడు. ఖాళీ సమయాలలో పోషణ కొరకు గుడారాలు కుట్టాడు. సేవ ఎక్కువైన తర్వాత పోషణ కొరకు మాసిదోనియ సంఘస్తులు సహాయము చేసినప్పుడు తీసికున్నాడు. అపొస్తలుడిగా పిలువబడుటే గాక బోధించుటకు సువార్త విధానము కూడా ప్రభువే నేర్పించాడు. అతను దేవుని దర్శనము పొందిన తర్వాత గ్రుడ్డివాడై దమస్కులో ఉన్నప్పుడు అననీయ ప్రార్థన తరువాత చూపుపొందుకున్నాడు.

దేవుడు తన కొరకు ఏర్పరచిన మార్గంలో శ్రమలు ఉంటాయని తెలిసీ సంతోషంతో శ్రమల నెదుర్కొన్నాడు. అననీయతో ప్రభువు చెప్పిన మాటల్లోనే పౌలు తన నామము కొరకు శ్రమ పొందుతాడని చెప్పి, శ్రమలు భరించే శక్తి కొరకు ఆత్మతో అభిషేకించమని చెప్పాడు. పౌలు క్రీస్తు సువార్త కొరకు ప్రత్యేకించబడినవాడు, సువార్త కొరకు శ్రమలను అనుభవించాడు. యేసుప్రభువును తృణీకరించిన ఈ లోకంలో మనం కూడా ప్రత్యేకించబడిన వారముగా ఉంటూ ఆయన మహిమార్థము జీవించాలి. శ్రమలొచ్చినా సంతోషంగా ఎదుర్కోవాలి. ఎందుకంటే ఆ శ్రమలలో ప్రభువు మనతో ఉంటాడు.

రోమా పత్రిక దేవుని సువార్తతో ప్రారంభమై (1:7) దేవుని సువార్తతోనే ముగించ బడుతుంది (16:27).

"దేవుని సువార్త" అనుటలో సువార్త దేవుడిచ్చినది, మానవుడు తయారు చేయలేదు అంటున్నాడు. రోమా 1:16లో "క్రీస్తు సువార్త" అంటూ దానిని దేవుని శక్తి అంటున్నాడు. సువార్తను సువార్తగానే ప్రకటించాలను విషయము ఈ పత్రికలో చెప్పాడు. పౌలు సువార్తను ఎప్పుడూ స్వచ్ఛంగా బోధించేవాడు.

1తిమోతి 3:16లో సువార్త మర్మమును అద్భుతంగా, ఒక చక్కటి కవితలాగా చెప్పాడు.

"నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది;
ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను
ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు నొందెను
దేవదూతలకు కనపడెను
రక్షకుడని జనములలో ప్రకటింపబడెను
లోకమందు నమ్మబడెను
ఆరోహణుడై తేజోమయుడయ్యెను".

పౌలు తనను గురించి తాను పరిచయము చేసుకున్న తర్వాత రోమా సంఘములో ఉన్న వారిని గురించి వివరిస్తున్నాడు. రోమాలో ఉన్న దేవుని ప్రియులకందరికి, అనగా పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారికందరికీ శుభమని చెప్పి వ్రాయునది.

ఈ రోమా మిశ్రమ సంఘము మనవంటిదే అనుకున్నాము, కాబట్టి మనలను గురించి పౌలు చెప్పిన మాటలు చూద్దాము – రోమా 1:3–7 వచనాలలో వ్రాయబడిన మాటలలో 7 లక్షణాలున్నాయి :

1. రోమాలో ఉన్నవారు – విగ్రహారాధికుల మధ్య ఉన్నవారు
2. దేవుని ప్రియులు – ఆయన స్వరక్తమిచ్చి కొనబడినవారము కాబట్టి ఆయన మనలను ఎంతో ప్రేమిస్తున్నాడు. సంఘముగా మనము ఆయన శరీరము.
3. పరిశుద్ధులు – ఆయన రక్తముతో కడగబడిన వారము మనము
4. పిలువబడినవారు – రక్షణ కొరకు మనమంతా పిలువబడి ఉన్నాము.
5. యేసుక్రీస్తుకు చెందిన వారము – ఆయన రక్తముతో కొన్నాడు. కాబట్టి ఆయనకు చెందిన వారము.
6. విశ్వాసమునకు విధేయులైనవారు – మనము నమ్మినదాని పట్ల విధేయత కలిగి ఉన్నాము.
7. యేసుక్రీస్తు నామము నిమిత్తము జీవించువారు – క్రీస్తు కొరకు జీవించాలి. బ్రతుకు తెరువు కొరకు ఉద్యోగాలు చేసినా, జీవించేది మాత్రము ప్రభువు కొరకే.

ఈ లక్షణాలన్నీ మనలో ఉంటే మనము నిజమైన విశ్వాసులము.

ఈ వాక్యభాగములో ఉన్న మూడవ విషయము – దీవెనలు.

మొదటి భాగంగా తనను తాను పరిచయం చేసుకున్నాడు, రెండవదిగా రోమా సంఘములోని వారి గురించి చెప్పాడు, మూడవదిగా దీవిస్తున్నాడు.

తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కృప, సమాధానములు కలుగును గాక. మామూలుగా ఆచారప్రకారము చెప్పే సంతోషము, సంపదలు కాకుండా సువార్త ఇచ్చే శుభములు – కృప, సమాధానములు కలుగును గాక అంటున్నాడు.

ఈ దీవెనలలో నాలుగు అంశాలున్నాయి.

**ఎ.** ఆశీర్వాదాల మూలం – తండ్రియైన దేవుని యొద్ద నుండి

**బి.** ఆశీర్వాదాల మాధ్యమం – యేసుక్రీస్తు ద్వారా

**సి.** ఆశీర్వాదాలు లభించుటకు కారణము – దేవుని కృప

**డి.** ఆశీర్వాదాల ఫలము – సమాధానము

దేవుని కృపవలన ఆయన యొద్దనుండి క్రీస్తు ద్వారా మనకు సమాధానము వస్తుంది.

## 1:4 – దేవుని సువార్త :

"సువార్త" అనే మాట రోమీయులకు సుపరిచితమైనది. ఈ పదానికి వాడబడిన గ్రీకు పదము "Evangelion". ఆ కాలములో రోమా చక్రవర్తుల గురించి వ్రాయబడిన గ్రంథాలను వారు "Gospels of Caesars" అనే వారు. కైసరుల సువార్త ఉండేది. చక్రవర్తుల గురించి ఏ మాటైనా అది వారికి సువార్తే, అయితే పౌలు చెప్పిన సువార్త, విభిన్నమైనది.

పౌలు సువార్త విషయములో ఆరు విషయములు గమనించగలము –

**1.** ఇది దేవుని నుండి కలిగినది – దేవుని యొక్క ఆలోచన.

**2.** వాగ్దానము చేయబడినది – ఆదికాండము 3:15లో పాపము చేసిన మానవుని విమోచనార్థము దేవుడు ఇచ్చిన వాగ్దానము. బైబిలు అంతటిలో ఆ వాగ్దాన నెరవేర్పు దేవుడెలా చేశాడో చెప్పబడింది.

**3.** ప్రాచీనమైనది – ఇది క్రొత్తదేమీ కాదు. అపొ.కా. 2:23లో పేతురు "దేవుడు నిశ్చయించి అప్పగింపబడిన ఈయనను మీరు దుష్టుల చేత సిలువ వేయించి చంపితిరి" అని ఇశ్రాయేలీయులతో చెప్పాడు. సృష్టికి ముందే ఈ ప్రణాళిక ఏర్పడింది.

**4.** ప్రవక్తల ద్వారా పాత నిబంధనలో బయలు పరచబడినది. పేతురు తన మొదటి పత్రికలో 1:10–12లో ఈ విషయాన్ని వివరిస్తున్నాడు : "మీకు కలుగు ఆ కృపను గూర్చి ప్రవచించిన ప్రవక్తలు ఈ రక్షణను గూర్చి పరిశీలించుచు, తమయందున్న

క్రీస్తు ఆత్మ క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు ముందుగా సాక్ష్యమిచ్చునప్పుడు, ఆ ఆత్మ యే కాలమును ఎట్టి కాలమును సూచించుచు వచ్చెనో దానిని విచారించి పరిశోధించిరి. పరలోకము నుండి పంపబడిన పరిశుద్ధాత్మ వలన మీకు సువార్త ప్రకటించిన వారి ద్వారా మీకిప్పుడు తెలుపబడిన యీ సంగతుల విషయమై, తమ కొరకు కాదు గాని మీ కొరకే తాము పరిచర్య చేసిరను సంగతి వారికి బయలుపరచబడెను. దేవదూతలు ఈ కార్యములను తొంగిచూడ గోరుచున్నారు".

5. పరిశుద్ధ లేఖనాల ద్వారా – ఇది యూదులకు బాగా తెలుసు

6. యేసుక్రీస్తుకు చెందినది – సువార్తలో యేసుప్రభువు మాత్రమే ఉంటాడు.

పౌలు ఈ భాగములో చెప్పిన ఇంకొక ప్రధానమైన అంశము – యేసుప్రభువు దేవుని కుమారుడని చెప్పడము. దీనిలో కూడా నాలుగు అంశాలున్నాయి.

A. ఆయన నామము

B. ఆయన మానవత్వము

C. ఆయన దైవత్వము

D. ఆయన అధికారము లేక శక్తి.

ఈ నాలుగు అంశాలను శ్రద్ధగా పరిశీలిద్దాము –

**A. ఆయన నామము :**

ఆయన దేవుని కుమారుడు, దేవునితో సమానుడు, సృష్టికర్త యేసు అను నామములో రక్షకునిగా మానవులతో ఉన్న సంబంధము, క్రీస్తు – అభిషిక్తుడు – మెస్సయ్యగా యూదులతో ఉన్న సంబంధము, ప్రభువు – మన శిరస్సుగా సంఘముతో ఉన్న సంబంధము. ఆయన నామము ఎందుకు గొప్ప చేయబడిందో, అన్ని నామములకన్న పై నామముగా ఎందుకు చేయబడిందో పౌలు ఫిలిప్పీ పత్రిక 2:6–11 వరకు ఉన్న వాక్య భాగములో వివరించాడు – "ఆయన (యేసుక్రీస్తు) దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా

చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను. అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్న వారిలో గాని, ప్రతి వాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామము ఆయనకు అనుగ్రహించెను".

**B. ఆయన మానవత్వము :**

యేసుప్రభువు దావీదు యొక్క వాగ్దాన పుత్రుడు కనుక ఆయన శరీరమును బట్టి మానవుడు. హెబ్రీ 2:14లో మానవుల రక్షణార్థము "ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవిత కాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును, ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడాయెను" అని వ్రాయబడి ఉంది. మానవత్వాన్ని తనకు జోడించుకున్నాడు.

**C. ఆయన దైవత్వము :**

మృతులలో నుండి పునరుత్థానుడగుట ద్వారా ఆయన దైవత్వము ప్రత్యక్ష పరచబడింది. యోహాను 10:17,18 "నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను, ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు, నా అంతట నేనే దాని పెట్టుచున్నాను. దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు. నా తండ్రి వలన ఈ ఆజ్ఞ పొందితినననెను". యేసుప్రభువే స్వయంగా తన దైవత్వము గురించి చెప్పాడు.

పరిశుద్ధాత్మను బట్టి ఆయన దైవత్వము రుజువైంది. ఆయన పరిశుద్ధాత్మ వలన ఈ లోకంలోకి వచ్చాడు. మత్తయి 1:18లో "ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను" అని వ్రాయబడి ఉంది. మత్తయి 3:16 లో "ఇదిగో ఆకాశము తెరువబడెను, దేవుని ఆత్మ పావురము వలె దిగి తన మీదికి వచ్చుట చూచెను" అని వ్రాయబడి ఉంది. ఆయన బలియాగములో పరిశుద్ధాత్మ దేవుడు కనపడుచున్నాడు (హెబ్రీ 9:14).

**D. ఆయన అధికారము :**

యేసుప్రభువు బోధలలో ఉన్న అధికారము చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆయన ద్వారా కృప, అపొస్తలత్వము పొందితిమి అని పౌలు చెబుతున్నాడు.

ఈ మొదటి 7 వచనాలలో పౌలు ఈ పత్రిక ద్వారా చెప్పాలనుకున్న అన్ని విషయాలు ముందే పరిచయం చేస్తున్నాడు, కాబట్టి ఈ 7 వచనాలను గురించి చాలా లోతుగా పరిశీలించాము.

**రోమా 1:8-15 - ఈ భాగములో పౌలు తన వ్యక్తిగత అభిప్రాయాలు చెబుతున్నాడు -**

పౌలు రోమా సామ్రాజ్యంలో థెస్సలోనిక, కొరింథు, ఎఫెసు అను ముఖ్యమైన పట్టణాలలో సంఘాలు స్థాపించాడు గాని ముఖ్య పట్టణమైన రోము నగరంలోని సంఘము స్థాపించలేదు. రోములోని సంఘాన్ని ఆయన ఎప్పుడూ కలవకపోయినా వారి పట్ల చాలా ప్రేమ, భారము కలిగి యున్నాడు. వారి కొరకు దేవుని స్తుతిస్తున్నాడు.

రోమా 1:8 లో "మీ విశ్వాసము సర్వలోకమున ప్రచురము చేయబడుచుండుటను బట్టి, మొదట మీ యందరి నిమిత్తము యేసుక్రీస్తు ద్వారా నా దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను" అంటున్నాడు. పౌలు కృతజ్ఞతకు రెండు కారణాలు చెప్తున్నాడు-

1) వారి విశ్వాసము కొరకు

2) సర్వలోకమునకు వారి ద్వారా సువార్త ప్రచురము చేయబడుచున్నందుకు.

రోమా పత్రిక అంతా విశ్వాసము గురించే. ఆ కాలములో రోమా పట్టణము రోమా సామ్రాజ్యానికి ముఖ్య పట్టణమే కాకుండా ప్రపంచ వ్యాపార కూడలిగా ఉండేది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల వారు అక్కడికి వచ్చినప్పుడు రోమా సంఘము వారు వారి విశ్వాసమును చూపిస్తూ సువార్త ప్రకటించేవారు. అందుకే పౌలు చాలా సంతోషించి వారిని బట్టి దేవుని స్తుతిస్తున్నాడు.

రోమా 1:9,10 వచనాలలో పౌలు చేస్తున్న ప్రార్థన గురించి చెప్తున్నాడు - "ఇప్పుడేలాగైనను ఆటంకము లేకుండ మీ యొద్దకు వచ్చుటకు దేవుని చిత్తము వలన నాకు వీలు కలుగునేమో అని, నా ప్రార్థనల యందు ఎల్లప్పుడు ఆయనను

బతిమాలుకొనుచు, మిమ్మును గూర్చి యెడతెగక జ్ఞాపకము చేసికొనుచున్నాను. ఇందుకు ఆయన కుమారుని సువార్త విషయమై నేను నా ఆత్మ యందు సేవించుచున్న దేవుడే నాకు సాక్షి".

**పౌలు ప్రార్థనలో కొన్ని లక్షణాలు చూడగలము :**

a. ఎడతెగని ప్రార్థన – "ఎల్లప్పుడు ఆయనను బతిమాలుకొనుచు"

b. వ్యక్తుల కొరకు ప్రార్థన – "మిమ్మును గూర్చి – జ్ఞాపకము చేసికొనుచున్నాను"

c. నిర్దిష్టమైన ప్రార్థన – "మీ యొద్దకు వచ్చుటకు"

d. విధేయతతో కూడిన ప్రార్థన – "దేవుని చిత్తము వలన"

e. బలవంతము చేయని ప్రార్థన – "వీలు కలుగునేమో అని"

f. యథార్థత కలిగిన ప్రార్థన – "దేవుడే నాకు సాక్షి"

g. బ్రతిమిలాడే ప్రార్థన – "ఎల్లప్పుడు ఆయనను బ్రతిమాలుకొనుచు"

h. ఆధారపడిన ప్రార్థన – దేవుని మీద ఆధారపడుట కనపడుతుంది.

ఇది ఒక సేవకునిగా సంఘము కొరకు చేయవలసిన ప్రార్థన. తాను కట్టని సంఘమైనా, అది తన బాధ్యత అన్నట్లుగా తలంచుచున్నాడు. పౌలు చాలా విశాలమైన స్వభావము కలవాడు. ప్రస్తుత కాపరులలాగా Parochial interest (తమ స్వంత సంఘ పరిధిపై శ్రద్ధ) కలిగినవాడు కాడు. రోమా సంఘములో దేవుడు కార్యము చేస్తున్నాడని తెలుసుకొని సంతోషిస్తూ వారి కొరకు ప్రార్థించడమే గాకుండా వారిని ఆత్మీయంగా ఇంకా లోతైన అనుభవంలోనికి రావాలనే భారము కలిగి ఉన్నాడు. మన చుట్టూ ఉన్న కాపరులలో చూస్తున్న అభద్రతా భావము, అసూయ, పోటీ తత్వముకు విరుద్ధంగా పౌలు మాదిరి సువార్తికుడిగా ఉన్నాడు. పౌలు దృక్పధము గమనించి ప్రస్తుతకాలంలో ఉన్న సువార్తికులు మారాలని కోరుతున్నాను. చాలాసార్లు ఇతరులను తప్పుపట్టినప్పుడు అది అసూయతో కూడినదై ఉంటున్నది.

పౌలు యొక్క సేవను మనము పరిశీలిస్తే అందులో మూడు కోణాలు చూడవచ్చును.

1. **ఆత్మ సంబంధమైనది** – "నా ఆత్మయందు సేవించుచున్నాను" అంటున్నాడు. దేవుడు ఆత్మ గనుక "యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించాలి" అని యేసుప్రభువు చెప్తున్నాడు (యోహాను 4:24)

2. **భౌతికమైనది** – లోకములో సువార్త ప్రకటిస్తున్నాడు. సువార్త – కుమారుడైన దేవుని ప్రత్యక్షపరుస్తున్నది.

3. **మానసికమైనది** – "నేను నా మనసులో మిమ్ములను జ్ఞాపకము చేసుకుంటున్నాను" అని సంఘముతో చెప్తున్నాడు. ఈ కార్యము పరిశుద్ధాత్మ ద్వారా జరుగుచున్నది.

మనము కూడా సంఘములో భాగము కాబట్టి సంఘము కొరకు ప్రార్థించాలి. దేవుడు తన పని పౌలు ద్వారా చేస్తున్నను, చేయకపోయినను, పౌలు దేవుని పని జరుగుతున్నదని సంతోషిస్తున్నాడు. తాను వారి మధ్యకు వెళ్లడానికి దారి సుగమము చేయమని దేవునికి ప్రార్థిస్తున్నాడు.

**పౌలు యొక్క ఆపేక్ష (రోమా 1:11,12) :**

"మీరు స్థిరపడవలెనని, అనగా మీకును నాకును కలిగియున్న విశ్వాసము చేత, అనగా మనము ఒకరి విశ్వాసము చేత ఒకరము ఆదరణ పొందవలెనని, ఆత్మ సంబంధమైన కృపావరమేదైనను మీకిచ్చుటకు మిమ్మును చూడవలెనని మిగుల అపేక్షించుచున్నాను". ఇక్కడ పౌలు వారికి 4 అంశాలు చెబుతున్నాడు...

1. పౌలు ఆకాంక్ష రోమా సంఘము "స్థిరపడాలని", సరైన సిద్ధాంతాలు నేర్చుకొని, విశ్వాసములో స్థిరపడాలని కోరుకుంటున్నాడు.

2. తనను తాను తగ్గించుకుని వారితో మమేకమై "మనము ఒకరి విశ్వాసము చేత ఒకరు ఆదరించుకోవాలని" కోరుకొంటున్నాడు.

3. "ఆత్మ సంబంధమైన కృపావరము" ఏదైనా వారికివ్వాలనే తన కోరికలో పౌలుకు వారిపట్ల ఉన్న ప్రేమ కనపడుతున్నది.

4. "మిమ్మును చూడవలెనని మిగుల అపేక్షించుచున్నాను" అనుటలో పౌలుకున్న తీవ్రమైన కోరిక కనపడుచున్నది. ప్రతి విశ్వాసికి తోటి విశ్వాసుల పట్ల ఇటువంటి అపేక్ష కలిగి యుండుట ధన్యకరము. ప్రతి విషయములోను పౌలు విశ్వాసులకు మాదిరిగా ఉన్నాడు.

**రోమా 1:13 –** ఈ వచనములో పౌలు యొక్క ఉద్దేశము కనపడుచున్నది :

"సహోదరులారా, నేను ఇతరులైన అన్యజనులలో ఫలము పొందినట్లు మీలో కూడ ఫలమేదైనను పొందవలెనని అనేక పర్యాయములు మీ యొద్దకు రానుద్దేశించితిని గాని ఇదివరకు ఆటంకపరచబడితిని, ఇది మీకు తెలియకుండుట నాకిష్టము లేదు".

పౌలు యొక్క ముఖ్య ఉద్దేశము అన్యులకు సువార్త ప్రకటించి వారిలో ఫలము చూడాలని. ఎవరెలా ఉంటే మనకెందుకులే అనుకునేవారిలో పౌలు చేరడు. యేసుప్రభువును ఎరుగని వారు ఎక్కడుంటే, అక్కడికి వెళ్లి సువార్త ప్రకటించి, వారిని విశ్వాసములో స్థిరపరచి, వారిని మరచిపోకుండా వారిలో ఫలము చూడాలని కోరుకునేవాడు. ఆ కాలంలో చాలామంది పౌలుకు రోమా సంఘముపై ఎలాంటి భారములేదు కాబట్టి ఇంతవరకు వెళ్లలేదనే అభాండాలు వేశారు. అది తప్పు అని చెప్తున్నాడు. తాను ఎన్నోసార్లు రావాలనుకున్నాడు కాని ఆటంకాలు వచ్చాయని చెప్తున్నాడు. "ఇది మీకు తెలియకుండుట నాకిష్టము లేదు" అనే మాట నూతన సత్యాలు బోధించుటకు మునుపు అనడము పౌలుకు అలవాటు.

రోమా 11:25 లో అన్యజనులు రక్షణలోనికి ప్రవేశించుట. ఆ రక్షణకార్యము సంపూర్ణమగువరకు ఇశ్రాయేలు ప్రజలు మొండిగా ఉంటారను మర్మము తెలుపుట,

1కొరింథీ 12:1 లో 'ఆత్మ సంబంధమైన వరముల గురించి మీకు తెలియ కుండుట నాకిష్టము లేదు' అన్నాడు.

1థెస్స 4:13లో 'నిద్రించుచున్న వారి గురించి మీకు తెలియకుండుట నాకిష్టము లేదు' అన్నాడు పౌలు భక్తుడు.

యోహాను 15:16లో ప్రభువు స్వయంగా చెప్పిన మాటలు – "...మీరు వెళ్లి ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకును నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని". ఈ మాట ప్రకారము నేను మీలో ఫలము చూచుటకు రావలెనని చాలాసార్లు ప్రయత్నించాను. ఈ నిజము "మీకు తెలియకుండుట నాకిష్టము లేదు" అంటున్నాడు.

ఆత్మీయ జీవితంలో, బైబిలులో "ఫలము" అనే మాట మూడు విధాలుగా కనబడుతుంది.

**1.** ఆత్మ ఫలము – విశ్వాసిలో ఉండాల్సిన వైఖరి గలతీ 5:22లో "ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము" అని పౌలు చెప్తున్నాడు.

**2.** ఆత్మఫలము క్రియారూపకంగా కనపడాలని బైబిలు చెప్తుంది – రోమా 6:22 లో "ఇప్పుడు పాపము నుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము" అనియు, దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుట (హెబ్రీ 13:15), ఇచ్చుట (ఫిలిప్పీ 4:18) ద్వారా ఫలము కనపడుతుంది.

**3.** మూడవదిగా ఆత్మ ఫలము అంటే అధికమగుట (Addition). క్రీస్తును నమ్మినవారు ఎక్కువ అవడము, వారిలో ఆత్మీయ ఎదుగుదల కనపడడము.

రోమీయులలో పౌలు కోరుకున్న ఫలము ఈ మూడవ రకానికి చెందినది. ఈనాటి బోధకులు, సండేస్కూల్ టీచర్లు, సంఘ కాపరులు, యౌవన క్రైస్తవ నాయకులు అందరూ కూడా కోరుకునేది, కోరుకోవలసినది ఇలాంటి ఫలమే.

**రోమా 1:14లో పౌలు తన ఋణము గురించి చెప్తున్నాడు –** "గ్రీకు దేశస్థులకును, గ్రీకు దేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును, మూఢులకును నేను ఋణస్థుడను". రెండు రకాల వ్యక్తులకు తాను ఋణస్థుడని పౌలు అంటున్నాడు – హెల్లీనీయులకు, హెల్లేనీయులు కానివారికి, ఇరువురూ యూదేతరులే. ఈ ఋణమేమిటి అని ఆలోచిస్తే దేవుడు తనకిచ్చిన రక్షణ, నిత్యజీవము, సువార్త. ఈ ఋణ విముక్తుడు కావాలంటే అన్యులకు యేసుప్రభువును గూర్చిన సువార్త ప్రకటించుట ఒక్కటే మార్గము.

గ్రీసు దేశస్థులు వారికున్న జ్ఞానమును బట్టి, వారి సంస్కృతిని బట్టి అతిశయించే వారు. గ్రీసు దేశస్థులు కానివారు వారి దృష్టిలో మూఢులు. ఈ జ్ఞానులైన గ్రీకులకు, మూఢులైన అన్యులకు నేను ఋణస్థుడను అని పౌలు అంటున్నాడు.

**రోమా 1:15లో పౌలు యొక్క సిద్ధపాటు కనపడుతుంది –** "కాగా నా వలననైనంత మట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను".

దేవుడు తనను అన్యుల మధ్య సువార్త ప్రకటించుటకు ఏర్పాటు చేశాడని గుర్తించిన పౌలు, సంతోషముగా సువార్త ప్రకటించుటలో విధేయత చూపిస్తున్నాడు.

**పత్రిక యొక్క ముఖ్య ఉద్దేశ్యము :** రోమా 1:16,17 వచనాలలో కనపడుతుంది. ఈ వాక్యాలలో ఈ విధంగా చెప్తున్నాడు – "సువార్తను గూర్చి నేను సిగ్గు పడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన – నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు నీతి దానియందు బయలుపరచబడుచున్నది".

**సువార్తను గురించి పౌలుకున్న అభిప్రాయములు :**

1. సువార్త ప్రకటించుటకు నేను ఋణస్థుడను అన్నాడు (1:14)
2. సువార్త ప్రకటించుటకు నేను సిద్ధంగా ఉన్నానన్నాడు (1:15)
3. ఇక్కడ "సువార్తను గూర్చి నేను సిగ్గుపడను" అంటున్నాడు.(1:16)

సువార్తను గురించిన సత్యము స్థిరంగా తన మనసులో ఉన్నందున సువార్త తనను ఎట్టి పరిస్థితులలోను సిగ్గుపరచదు అను నిశ్చయత కలిగియున్నాడు. సువార్త ప్రకటించుటలో ఏ భయమూ లేకుండా ఉన్నాడు. సువార్త దేవుని శక్తియై యున్నదని కూడా చెప్తున్నాడు. ఉదాహరణకు పాత నిబంధనలో ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాస్యము నుండి శక్తితో బయటకు తెచ్చుట, క్రొత్త నిబంధనలో యేసు పునరుత్థానము కూడా పరిశుద్ధాత్మ శక్తితో జరిగింది. 'శక్తి' అను మాటకు వాడబడిన గ్రీకు పదము "Dunamis", ఈ పదములో నుండి రెండు అర్థాలు గోచరిస్తున్నాయి. Dynamite లో నాశనము చేసే శక్తి, Dynamo లో ఉత్పత్తి చేసే శక్తి ఉంటుంది. క్రీస్తు శక్తిలో ఈ రెండు శక్తులూ కలిసి ఉన్నవి. పౌలు 2 కొరింథీ 2:16లో "నశించువారికి మరణార్థమైన మరణపు వాసనగాను, రక్షింపబడువారికి జీవార్థమైన జీవపు వాసనగాను ఉన్నాము" అంటున్నాడు. సువార్త నమ్మినవారిని నీతిమంతునిగా చేస్తుంది.

'నీతి' అను పదానికి వాడబడిన గ్రీకు పదానికి అర్థము "సరైన దుస్తులు". ఆది 3:10, హెబ్రీ 4:13, ప్రకటన 3:17లో బైబిలు చెప్పేదేమంటే పాపులందరూ దేవుని ఎదుట దిగంబరులే. కొంతమంది ఈ విషయము గుర్తించి వారి స్వంత ఆత్మీయ

దుస్తులు (స్వనీతి) ధరిస్తారు గాని, అలాటి దుస్తులు దేవుని దృష్టిలో మురికి గుడ్డలు (యెష. 64:6). పశ్చాత్తాప పడిన పాపికి సువార్త కొత్త బట్టలిస్తుంది (2 కొరింథీ. 6:7, ఎఫెసీ 6:14, ప్రకటన 19:7,8).

నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవించాలనునది ఈ పత్రికలోని ముఖ్యాంశము, ముఖ్య సిద్ధాంతము కూడా.

"సువార్తను గురించి నేను సిగ్గుపడువాడును కాను" అని పౌలు అంటున్న కారణ మేమంటే ఆ కాలంలో క్రీస్తు సువార్త అంటే చాలా నీచభావము ఉండేది. ఒక పేద వడ్రంగివాడు (యేసుప్రభువు) అత్యంత హీనమైన స్థితిలో సిలువలో చనిపోవడము అంటే రోమీయులకు హేళనగా ఉండేది. అతి నీచమైనదిగా ఎంచబడిన సిలువలో శిక్షింపబడిన యూదునిపై మీ విశ్వాసము పెట్టడమేమిటని అడిగేవారు. రోమీయులు చాలా గర్విష్టులుగా ఉండేవారు. వారి ఆధీనంలో పట్టుబడిన ఒక చిన్నదేశమునకు ముఖ్యపట్టణమైన యెరూషలేము నుండి వచ్చినందున ఈ సువార్త వారికి ఎగతాళిగా ఉండినది.

ఆనాటి క్రైస్తవులు సమాజంలో పేదవారిగా, తక్కువ స్థాయిలో ఉండేవారు. కొందరు బానిసలుగా కూడా ఉండేవారు. రోములో చాలామంది గొప్ప తత్వవేత్తలు, తత్వశాస్త్రము ఉండగా ఒక యూదుడు మరణము నుండి లేచాడని చెప్తున్న కథను ఎందుకు నమ్మాలి? అనుకున్నారు. పైగా క్రైస్తవులు రొట్టె విరుచుట, ద్రాక్షారసము సేవించుట క్రీస్తు శరీర, రక్తములకు సాదృశ్యము అను బోధ వారికి నరమాంసభక్షకుల బోధగా భావించారు. క్రైస్తవుల మధ్య ఉన్న సహోదర ప్రేమ, శత్రువులను ప్రేమించుట లాంటి ప్రభువు బోధలు వారు ఆచరిస్తున్నా రోమీయులు వారిని వేషధారులు అన్నారు. ఒక గుడారాలు చేసేవాడు (పౌలు) ఈ సువార్తను రోమా పట్టణానికి తీసికొని వెళ్లడము వారికి హాస్యాస్పదముగా ఉండేది. అయినా పౌలు అటువంటి వారి మధ్యకు క్రీస్తు సువార్తను తీసికొని వెళ్లుటకు ఆత్రుత పడుచున్నాడు. అది తన బాధ్యత, ఋణము తీర్చుకొనుట అంటున్నాడు. అందుకు "నేను సిగ్గుపడను" అంటున్నాడు.

ఆ కాలంలో చక్రవర్తి నుండి ఏదైనా వార్త వస్తే రోమీయులు ఆసక్తిగా వినేవారు. అయితే పౌలు తీసికొని వెళుతున్న సువార్త దేవుని యొద్దనుండి, దేవుని గురించిన

సువార్త కాబట్టి దానిని గురించి, తాను సిగ్గుపడనక్కరలేదని పౌలు భావించాడు. పైగా అది 'దేవుని శక్తి' అన్నాడు. రోమీయులు తమ శక్తిని బట్టి, గ్రీకులు తమ జ్ఞానమును బట్టి అతిశయించేవారు కాని తాను రక్షణ ఇచ్చే సువార్తను బట్టి అతిశయిస్తానంటున్నాడు. సువార్తలో చెప్పబడిన విషయాలన్నీ సత్యమనే నిశ్చయత ఉంది కాబట్టి సువార్త ప్రకటించుటలో సిగ్గుపడనని చెప్పాడు.

తాను సిగ్గుపడ కుండా సువార్త ప్రకటించుటకు ఇంకా కొన్ని కారణాలు చెప్తున్నాడు. రోమా 9:33లో ఉన్న సంగతిని యెషయా ప్రవక్త ముందే ప్రవచించాడనియు, రోమా 10:11లో లేఖనాలలో వాగ్దానముందనియు, 2తిమో. 1:12 లో నమ్మిన వానిని ఎరుగుదును కనుక సిగ్గుపడననియు, 1పేతురు 4:16లో ఆ పేరును బట్టి దేవుని మహిమపరచవలెను కాబట్టి సిగ్గుపడననియు చెప్పాడు.

ఈ వచనాలలో పౌలు సువార్తను అర్థము చేసుకొనుటకు అవసరమైన నాలుగు కీలక పదాలు చూపిస్తున్నాడు – అవేవనగా శక్తి, రక్షణ, విశ్వాసము, నీతి.

**1. శక్తి** : సువార్త దేవుని శక్తి అని పౌలు చెప్పాడు. సమస్త మానవాళిని పాపము నుండి రక్షించి నిత్యజీవము నిచ్చుటకు చాలినంత శక్తి 'సర్వశక్తిమంతుడైన మన దేవునికి ఉందని సువార్త చెప్తున్నది. ప్రతి మానవునికి తానింకా బాగా ఉండాలనియు, ఎక్కువ సంపాదించుకోవాలనియు, పేరు ప్రఖ్యాతులు, అధికారం లాంటివి అభివృద్ధి చేసుకోవాలని కోరుకుంటారు. తమంతట తామే ఆత్మీయంగా కూడా ఎదిగి తమ మంచి పనుల వలన రక్షణ పొందాలని కోరుకుంటారు. కాని ఇవేవీ దేవుని శక్తిలేనిదే చేయలేరు. మత్తయి 22:29లో "లేఖనములను గాని, దేవుని శక్తిని గాని ఎరుగక మీరు పొరబడుచున్నారు" అని యేసు సద్దూకయ్యులతో అంటున్నాడు.

దేవుని శక్తి మాత్రమే మానవుని పాపపు స్థితి నుండి తప్పించి ఆత్మీయ జీవము ఇవ్వగలదు. మానవుడు తన మార్పు వలననో, మంచి కార్యముల వలననో, సంఘము, ఆచారాల వలననో, ధర్మశాస్త్రము ననుసరించుట వలననో రక్షణ పొందలేడు కాని కేవలము దేవుని కృపవలననే, సువార్త శక్తి వలననే అని బైబిలు చెబుతుంది.

రోమా 8:2లో – "ధర్మశాస్త్రము దేనిని చేయజాలకపోయెనో దానిని దేవుడు చేసెను" అని వ్రాయబడి ఉంది. వీటిని బట్టి చూస్తే మన స్వంత బలము వలనగాని,

ధర్మశాస్త్ర క్రియలను బట్టిగాని మనకు రక్షణ రాదు గాని కేవలము దేవుని శక్తి వలననే అని తెలుస్తున్నది. యూదులకు, అన్యులకు అందరికీ రక్షణ ఇచ్చేందుకు సువార్త దేవుని శక్తియై ఉన్నది. సువార్త అంటే యేసయ్య మరణ పునరుత్థానములు. ఈ సత్యము విశ్వసిస్తే అపవాది కోటలు కూలిపోతాయి, అప్పుడు వాడి అబద్ధాలు, మోసము అను చెరనుండి మనము బయటపడుతాము. సువార్త సత్యము మాత్రమే మనలను విడుదల చేస్తుంది. సువార్త మన పాపముల నుండి మనకు విడుదల ఇస్తుందను సత్యము తెలిసికొనుట అపవాదికి ఇష్టముండదు. తన అబద్ధాల ప్రపంచములో మనము ఉండాలని అపవాది కోరుకుంటాడు. మనమెప్పుడైతే సత్యమును ఒప్పుకుంటామో, అప్పుడు మన జీవితంలో అద్భుతం జరుగుతుంది. జీవితాలు, గమ్యాలు మారిపోతాయి.

పరిశుద్ధాత్మ దేవుడు మనలోకి వచ్చి రక్షణ కార్యము జరిపిస్తాడు, మనము దేవుని బిడ్డలమవుతాము. అందుకే సువార్త దేవుని శక్తి అంటున్నాడు. ఈ శక్తి ద్వారా మార్పు, స్వస్థత, రూపాంతరము చెందుట, నూతన జీవము, నిరీక్షణ వస్తుంది. ఈ శక్తి ద్వారా వచ్చిన మార్పు, ఆత్మీయ స్వస్థత అనేకులలో చూసిన పౌలుకు దీనిని గురించి బోధించుటకు సిగ్గుపడే అవసరం లేదు పైపెచ్చు గర్విస్తున్నాడు.

**2. రక్షణ** : దేవుని శక్తి మానవుని రక్షణలో కనపడుతుంది. మానవుని నైజము మార్చి తన కుమారుని ద్వారా నిత్యజీవం ఇవ్వడమే రక్షణ.

కీర్తన 106:8లో “తన మహా పరాక్రమమును ప్రసిద్ధిచేయుటకై ఆయన తన నామమును బట్టి వారిని రక్షించెను” అని వ్రాయబడి ఉంది. సువార్తలోని శక్తిపై విశ్వాసముంచితే రక్షణ, నీతి వస్తాయి.

దేవుడు మానవ రూపంలో వచ్చి తన దైవశక్తిని రోగులను స్వస్థపరచుటలోను, అంగవైకల్యము గలవారిని బాగు చేయుటలోను, తుఫాను ఆపుటలోను, చనిపోయిన వారిని కూడా లేపుటలో చూపించాడు. పౌలు “రక్షణ” అను పదము ఈ పత్రికలో చాలా సార్లు ఉపయోగించాడు. పాపము వలన వచ్చిన ఆత్మీయ మరణము ద్వారా తన నుండి దూరమైన ప్రజలను దేవుడు తన శక్తితో రక్షిస్తున్నాడు. పాపము, అపవాది శక్తి, తీర్పు, ఉగ్రత, ఆత్మీయ మరణము నుండి రక్షింపగలిగిన వాడు క్రీస్తు తప్ప ఇంకెవరూ లేరు.

'రక్షణ' అను మాట పౌలు కాలంలో ఎక్కువగా వాడబడుచుండేది. దాని అర్థము 'విడుదల' – వ్యక్తిగత విడుదల, దేశవ్యాప్త విడుదల. చక్రవర్తి, వైద్యుడు రక్షకులుగా భావించబడేవారు. సువార్త పాపపు శిక్షనుండి, పాపపు శక్తినుండి విడుదల ఇస్తుంది. ఈ విడుదల మానవాళికంతటికి అవసరమైనది. అయితే విశ్వాసము వలననే ఇది సాధ్యము.

మానవుల Pervertedness (వంకరతనాన్ని), తప్పిపోయిన స్థితి నుండి, పాపము నుండి, దేవుని ఉగ్రతనుండి, కోరి తెచ్చుకున్న ఆత్మీయ అజ్ఞానము నుండి, భిన్నమతాల నుండి విడిపించేది రక్షణ. ఇది కేవలము విశ్వాసము ద్వారా మాత్రమే లభిస్తుంది. శక్తి, రక్షణ, నీతి, విశ్వాసము అను నాలుగు పదాలకు పౌలు ఎక్కువగా ప్రాధాన్యత నిచ్చాడు.

**3. విశ్వాసము** : "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అను గొప్ప సిద్ధాంతమును పౌలు పరిశుద్ధాత్మ ప్రత్యక్షత ద్వారా తెలియజేస్తున్నాడు.

ఈ మాటలు అనుభవపూర్వకంగా తెలుసుకున్న మార్టిన్ లూథర్ లో ఉజ్జీవం వచ్చి Protestant Reformation (సంస్కరణోద్యమం) మొదలుపెట్టాడు. అంతకు ముందు సన్యాసి జీవితము జీవిస్తూ Penance (పశ్చాత్తాపము, పాపపరిహారము) చేయుట వలన రక్షణ దొరుకుతుందను కున్నాడు. కాని దేవుడు తెలిపిన సత్యము ద్వారా స్వతంత్రత పొందాడు. హబక్కూకు 2:4లో ఈ వాక్యము కనపడుతుంది. ఒక చిన్న ప్రవక్త గ్రంథములోని ఒక చిన్న ప్రకటనపై ఈ సిద్ధాంతము వెలువడింది. ఈ వాక్యమును ఆధారము చేసికొని మూడు పత్రికలు వ్రాయబడ్డాయి.

| "నీతిమంతుడు | విశ్వాసమూలముగా | జీవించును" |
|---|---|---|
| రోమా పత్రిక, | హెబ్రీ పత్రిక, | గలతీ పత్రిక |
| రోమా 1:17, | హెబ్రీ 10:38, | గలతీ 3:11 |

హబక్కూకు ప్రజల కొరకు ప్రార్థన చేస్తూ "ప్రజలంతా పాపము చేస్తుంటే నీవు పట్టనట్లున్నావేమి?" అని దేవుని అడిగినప్పుడు, దేవుడు బబులోనీయులను వీరికి విరుద్ధంగా రేపుతున్నాను, వీరిని శిక్షించుటకు కర్రను తయారు చేస్తున్నానన్నాడు. అన్యుల ద్వారా తన ప్రజలను శిక్షించడమేమిటి? అని ప్రవక్త అభ్యంతరము చెప్పినప్పుడు దేవుడు "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అని సమాధానమిచ్చాడు. నెబుకద్నెజరు చేసిన యుద్ధములో నీతిమంతులు మాత్రమే మిగిలారు.

విశ్వాసము ద్వారా పాప శిక్షనుండి విడుదల కలుగుతుంది. నమ్ము ప్రతివానికి – మొదట యూదునికి, తర్వాత అన్యునికి సువార్త వచ్చింది. బిషప్ లైట్‌ఫుట్ అనే ఆయన ఈ వాక్యము గురించి కొన్ని మాటలన్నాడు – “మోషేకు దేవుడు ధర్మశాస్త్రము అంతా 613 ఆదేశాలలో ఇచ్చాడు. 15వ సంకీర్తనలో దావీదు వాటిని 11 ఆదేశాలకు కుదించాడు, యెషయా 6కు తెచ్చాడు, మీకా 3కు తెచ్చాడు, యెషయా ఇంకొక చోట 2కు తెచ్చాడు, హబక్కూకు, పౌలు ఒకే వాక్యానికి తెచ్చారు” అన్నాడు. విశ్వాసమునకు నిర్వచనము రోమా 1:17లో ఉందని ఆయన అభిప్రాయము. విశ్వాసము “మన హృదయము యొక్క హస్తము” అని నిర్వచింపబడి ఉన్నది. అంటే ‘హృదయము నిండిన దానిని బట్టి హస్తము చేయును’ అని అర్థము చేసుకోవాలి.

**4. నీతి** – సువార్త దేవుని నీతి బయలు పరచింది. ఈ నీతి విశ్వాసము ద్వారా మనకు వస్తుంది.

**రోమా పత్రికను మూడు భాగాలుగా చూడవచ్చు :**

ఎ. దేవుడు నీతిమంతుడు

బి. ఆయన మనలో నీతిని కోరుతాడు

సి. ఆయనే మనకు నీతి ప్రదాత

‘నీతిమంతుడు’ అంటే దేవునితో సరైన సహవాసము కలిగినవాడు. ఇది ఆలోచించవలసిన విషయము. మనమందరము పాపము వలన దేవుని నుండి తొలగిపోయాము. పరిశుద్ధుడైన దేవుని దగ్గరికి పాపులమైన మనము పోలేము. అపరిశుద్ధమైనదేదీ పరలోకంలోకి పోలేదు. దేవుని దగ్గరకు పోవాలంటే నీతిమంతుల మవ్వాలి. మనంతట మనము ఎంత కష్టపడినా ఆ పరిస్థితిలోకి పోలేము. ఇది ఒక పెద్ద సమస్య. మనము పాపులముగా ఉంటే దేవుని ఉగ్రతలోకి వెళతాము. ఈ సమస్యకు పరిష్కారము సువార్తలో దొరుకుతుంది. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుతారనేది సువార్త ఇచ్చే సందేశము. ఈ నీతి మనది కాదు, దేవుని దగ్గర నుండి వచ్చింది. మనం ఎలా జీవించామో, ఎలా సేవ చేస్తున్నామో అను దానిపై ఆధారపడిలేదు. ఇది ఒక బహుమానంగా దేవుని యొద్ద నుండి మనకు వస్తుంది. ఈ నీతి విశ్వాసము

ద్వారా వస్తుందని పౌలు చెప్తున్నాడు. యేసయ్యపై విశ్వాసము ద్వారా మనలను దేవుడు నీతిమంతులుగా తీర్చిదిద్దుతాడు. ఆయన మన రక్షకుడిగా ఈ లోకంలోకి వచ్చాడని నమ్మితే మనం నీతిమంతులమవుతాము.

ఒక చిన్న దృష్టాంతము చూద్దాము : ఒక ధనవంతుడైన చిత్రకారుడుకి ఒక Mentally Retarded (మానసిక ఎదుగుదల లేని) కుమారుడు ఉండేవాడు. ఒక్కడే అయిన ఆ కుమారున్ని ఎంతో మురిపెంగా పెంచుకున్నాడు కాని కొన్నాళ్ళకు ఆ కుమారుడు చనిపోయాడు. కొంతకాలానికి ఆ చిత్రకారుడు కూడా చనిపోయాడు. ఆయన తన వీలునామా ప్రకారము తన చిత్రాలన్నీ వేలం వేయమని కోరాడు. లాయరు వచ్చి వేలం పాట మొదలుపెట్టాడు. ఆ చిత్రాలలో ఆయన కుమారుని చిత్రం కూడా ఉంది. చిత్రకారుని కోరిక ప్రకారము ఆయన కుమారుని చిత్రము మొదటిగా వేలం వేశారు. అది కొనుటకు ఎవరూ ముందుకు రాలేదు కాని చాలా సమయం దాటాక, ఒక పేద ముసలాయన తన దగ్గర ఉన్న 50 రూపాయల నోటు తీసుకెళ్లి, దానితో ఆ చిత్రము ఇస్తారేమో అని అడిగాడు. ఇంకెవరూ పోటీకి రాకపోవడము వలన అతనికి ఆ చిత్రపటము ఇచ్చారు. ఆ ముసలాయన ఆ బాబును చిన్న తనములో పెంచినవాడు. ఆ వెంటనే ఆ లాయరు వేలం కార్యక్రమం ఆపివేసి, చిత్రకారుని వీలునామా ప్రకారము ఆ బాబు చిత్రపటము కొన్నవారికే మిగిలిన చిత్రాలతో పాటు ఆయన ఆస్థి అంతా చెందుతుందని వీలునామా చదివి వినిపించాడట. తండ్రియైన దేవుడు మనతో చెప్పిన మాట కూడా ఇలాగే ఉందని అనిపిస్తుంది. 'నా కుమారుని స్వీకరించండి, రక్షణ, పరలోకము, నిత్యజీవము ఉచితము' అంటున్నాడు.

మనము ఎన్నిసార్లు మందిరానికి వెళ్తున్నాము? ఎన్నిసార్లు బైబిలు చదివి ప్రార్థిస్తున్నామని కాదుగాని, యేసయ్య సిలువపై చేసిన కార్యము మీదనే మన జీవితానికి సంబంధించినవన్నీ ఆధారపడి ఉన్నాయి.

'నీతి' అను పదము ఈ పత్రికలో 35సార్లు పౌలు ఉపయోగించాడు. విశ్వాసము వలన రక్షణ వస్తుంది, రక్షణ ద్వారా దేవుని నీతి ప్రత్యక్షపరచబడుతుంది. నమ్మినవారికి తన నీతిని దేవుడిస్తాడు.

రోమా 4:3లో విశ్వాసులకు తండ్రి అయిన అబ్రాహామును గురించి వ్రాస్తూ అబ్రాహాము దేవునిని నమ్మెను "అది అతనికి నీతిగా ఎంచబడెను" అన్నాడు.

మనంతట మనము రక్షణ గాని, నీతిని గాని సంపాదించుకోలేము. శుభవార్త ఏమంటే యేసుక్రీస్తు సిలువ ద్వారా చేసిన గొప్ప కార్యము వలన మనకు మార్గము ఏర్పాటు చేశాడు. మన పాపము వలన దేవునికి దూరమైనాము. మన పాపముల కొరకు వెల చెల్లించుట కొరకై ప్రభువు సిలువపై మరణించాడు. దేవుడు మన పాపములను క్షమించి మనతో నివసించుటకు పరిశుద్ధాత్మ దేవుని మనకిచ్చాడు. మనము చేయాల్సినదంతా మన మనసులు తెరచి దేవునిని ఆహ్వానించాలి, ఆయనిచ్చే వరాలను అంగీకరించాలి. పరిశుద్ధాత్మ దేవుడు మనలో నివసించునట్లుగా మనలను పరిశుద్ధ పరచుకోవాలి, విశ్వాసముతో జీవించాలి. మన స్వంత ప్రయత్నముతో పరలోకానికి పోలేమను సంగతి గుర్తించాలి. పౌలు ఇక్కడ చెప్పే రక్షణ, నీతి మనకు దేవుడు ఉచితంగా ఇస్తున్నాడు. క్రీస్తు ద్వారా మనకు క్షమాపణ కూడా ఉచితంగా ఇవ్వబడింది. మనలో ఉన్న పరిశుద్ధాత్మ దేవుడు మన ద్వారా అద్భుతాలు చేస్తాడు.

**రోమా 1:18-32 నుండి 3:20 : పౌలు దేవుని ఉగ్రతను గూర్చి - నీతి అవసరత గురించి చెప్తున్నాడు...**

"దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచ బడుచున్నది. ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమై యున్నది. దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతా స్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదముల యందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయమాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు, ప్రతిమా స్వరూపముగా మార్చిరి.

ఈ హేతువు చేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమాన పరచుకొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను. అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు, ఆమేన్.

అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను. వారి స్త్రీలు సయితము స్వాభావికమైన ధర్మమును విడిచి స్వాభావిక విరుద్ధమైన ధర్మమును అనుసరించిరి. అటువలే పురుషులుకూడ స్వాభావికమైన ధర్మమును విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనది చేయుచు, తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలమును పొందుచు ఒకరియెడల ఒకరు కామతప్తులైరి.

మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్య నొల్లక పోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్టమనస్సుకు వారినప్పగించెను. అట్టివారు సమస్త దుర్నీతి చేతను, దుష్టత్వము చేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమను వాటితో నిండినవారై, కొండెగాండ్రును, అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును, మాటతప్పువారును, అనురాగ రహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగా ఎరిగి యుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని, అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు".

ఈ వాక్య భాగములో పౌలు మానవుల భయంకర పాపములను విపులంగా విశదీకరించాడు. అందుకే దేవుడు తన ఉగ్రతను లోకం మీద చూపిస్తున్నాడు కాబట్టి లోకంలో వినాశనము కలుగుచున్నది. దేవుని ఉగ్రతతో ఈ భాగము మొదలవుతున్నది. రోమా పత్రికాంశము దేవుని నీతి, కాని పౌలు మానవుని దుర్నీతితో మొదలు పెడుతున్నాడు. మానవుడు తాను పాపినని తెలుసుకోకపోతే యేసుప్రభువు ద్వారా దేవుడు మనకనుగ్రహించు కృపగల రక్షణ విలువ గ్రహించలేరు. వారు తమ పాపస్థితి, నశించిపోతున్న పరిస్థితి తెలుసుకోకుంటే, తమ విడుదల గురించిన ఆపేక్ష ఉండదు.

ఆయన త్యాగము యొక్క గొప్పతనము తెలుసుకోలేరు. మనము కొద్దిగానే తెలుసుకుంటే మనము చెప్పే కృతజ్ఞతలు ఎలా ఉంటాయంటే ఒక హోటలులో భోంచేశాక వడ్డించేవాడికి ఇచ్చే 'టిప్' లాగా ఉంటుంది. బాగా తెలుసుకుంటేనే పూర్ణ హృదయంతో ఆరాధించగలము.

పౌలు బైబిలు పద్ధతి పాటించాడు. మొదట ధర్మశాస్త్రము, వినాశనము, తర్వాత కృప, రక్షణ. మొదట దేవుని ఉగ్రత, తరువాత ఆయన కృప గురించి చెప్తున్నాడు. దేవుని ఉగ్రత (Wrath) నీతియుక్తమైనది. కొన్నిసార్లు దేవుని ఉగ్రతను బట్టి తప్పిపోయిన స్థితిలో ఉన్న మానవుడు తిరిగి దేవుని దగ్గరకు రావడానికి భయపడుతున్నాడు. అందుకని చాలామంది బోధకులు క్రీస్తుయొక్క సమృద్ధి జీవము, సంతోషము, రక్షణ అనే ఆశీర్వాదము, విశ్వాసము వలన వచ్చే సమాధానము గురించి మాత్రమే చెబుతారు. ఇవన్నీ ఉన్నాయి కాని దేవుని ఉగ్రతను కూడా ప్రజలకు చెప్పకపోతే రక్షణ ప్రణాళిక పూర్తికాదు. పాపమును బట్టి దేవుడిచ్చే తీర్పు గురించి అందరికీ తెలియాలి. నీతికి, దేవుని ఉగ్రతకు మధ్య ఉన్న పరస్పర సంబంధము గమనించాలి. పరిపూర్ణ రక్షణ, ఉగ్రత భవిష్యత్తుకు సంబంధించినవి కాని ఇప్పుడు కూడా పాక్షికంగా జరుగుచున్నాయి.

పౌలు క్రీస్తునొద్దకు రావడానికి ప్రధాన కారణము వినాశనమును గురించిన భయము. చెడ్డవారితో ఆ మాటలే చెప్పాడు, తప్పించుకొనే మార్గము చెప్పకముందే దేవుని ఉగ్రతను గురించి వారికి చెప్పాడు. ఇదే సరైన విధానము. ఎందుకంటే దేవుడు మననుండి ఏమి కోరుకుంటున్నాడో తెలుసుకోకపోతే ఆయన మనపట్ల చూపుతున్న కృప అర్థముకాదు. దేవుని ఆజ్ఞలు పాటించకపోతే దేవుని ఉగ్రత మనమీదికి వస్తుందను భయము మనకు లేకపోతే దేవుని ప్రేమను పరిపూర్ణంగా అర్థము చేసుకోలేము. పాపము వలన వచ్చు శిక్షను గురించి తెలుసుకోలేకపోతే పశ్చాత్తాపము మన మనసులోకి రాదు. దేవుని ఉగ్రత మనకొచ్చే కోపము లాగా ఉప్పొంగి వెంటనే ఆరిపోయేది కాదు. అది పాపము పోయేంతవరకు స్థిరంగా ఉండి కాల్చేస్తుంది. దేవుని లక్షణాలు దైవత్వ పరిపూర్ణతలో నుండి వచ్చాయి. దేవునిలో ప్రేమ, న్యాయము సమపాళ్లలో ఉంటాయి. కీర్తనాకారుడు కీర్తన 45:7లో "నీవు నీతిని ప్రేమించి భక్తిహీనతను ద్వేషించుచున్నావు" అని అంటున్నాడు.

ఈ కాలంలో దేవుని ఉగ్రతను గురించి, పాపము వలన వచ్చు వినాశనమును గురించి బోధించకపోవుట బోధకులు చేస్తున్న తప్పు. వారు విశ్వాసులను నిజంగా

ప్రేమిస్తే తప్పక బోధించేవారు, ఈనాటి బోధలు ఆనాడు శిష్యులు చేసిన బోధలకు విరుద్ధంగా ఉన్నాయి.

దేవుని ఉగ్రత గురించి కొన్ని విషయాలను ధ్యానించుకుందాము --

★ దేవుని ఉగ్రత యొక్క నాణ్యత – ఆయన యొక్క సత్యము, నీతి, న్యాయము, సర్వజ్ఞానము మీద ఆధారపడి ఉంది

★ ఈ ఉగ్రత పరలోకమునుండి, ఆయన సార్వభౌమత్వము నుండి వచ్చింది

★ దీని పరిధి ఎంతవరకు అంటే దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యులందరి (సర్వమానవాళి) యొద్దకు వెళ్తుంది.

ఉగ్రతకు కారణాలు కూడ పౌలు చెప్తున్నాడు.

మనుష్యుడు సత్యాన్ని అణచి వేస్తున్నాడు కాబట్టి భక్తిహీనుడవుతున్నాడు. దీనివలన దుర్నీతి వస్తుంది. మానవుడు సంపూర్ణంగా విమోచింపబడువరకు దేవుని ఉగ్రత ఉంటుంది. ఈ ఉగ్రత దేవుడు అప్పుడప్పుడు బయలుపరుస్తూనే ఉంటాడు. ఉదాహరణకు:– ఆదికాండము 6వ అధ్యాయములో నోవహు కాలంలోని జలప్రళయం, నిర్గమకాండము 14:31లో ఐగుప్తు సైన్యాన్ని ఎర్రసముద్రంలో ముంచుట, ఆది 19:24–29 లో సొదొమ–గొమొఱ్ఱాలపై అగ్నిగంధకములను క్రుమ్మరించుట, సంఖ్యా 16:30–32 లో కోరహు కుటుంబమును నేల మ్రింగి వేయుట మొదలగునవి. క్రొత్త నిబంధనలో కూడా బాప్తిస్మమిచ్చు యోహాను ఇలా అంటున్నాడు – "కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును" (యోహాను 3:36).

ఈ విషయమే సిలువలో కూడా బయలుపరచబడింది. మత్త 27:46 లో "నా దేవా, నా దేవా, నన్నెందుకు చేయి విడిచితివి" అని యేసయ్య కేకవేసినపుడు దేవుని ఉగ్రత కనపడుతుంది. దేవుని ఉగ్రత మానవులు చూడకుండా దేవుడు లోకమంతా చీకటి ఆవరించేటట్లుగా చేశాడు. రోమా 8:3,4 లో ఆయన శరీరమందు మన పాపమునకు శిక్షవచ్చిందని వ్రాయబడింది. పాపముగా చేయబడిన తన స్వంత కుమారునిపై దేవుని ఉగ్రత వచ్చింది. మనము చూసుకున్న వాక్యభాగము (1:18–32)లో దేవుని ఉగ్రతకు కారణములు అనేకము చూశాము.

మానవుని పాపము వలన మాత్రమే దేవుని ఉగ్రత, తద్వారా వచ్చు నాశనము చూస్తున్నాము. దేవుని కృప, ప్రేమ, కరుణ ఎంత నిజమో దేవుని న్యాయం, ఉగ్రత, తీర్పు అంతే నిజము.

ఈనాటి సంఘాలలో చెప్పబడుచున్న తప్పుడు బోధలు అనేకము ఉన్నాయి. అందులో ఒకటి ‘ కృప వెంబడి కృప ’. దేవుడు కృపామయుడు కాబట్టి మన కొరకు, మన పాపములు నిమిత్తము చనిపోయాడు కావున ఇంక మన పాపములన్నీ క్షమించబడ్డాయి. భూత, వర్తమాన, భవిష్యత్ కాలముల పాపములన్నీ క్షమించబడ్డాయి, అందుకే ఇక ఎన్ని పాపాలైనా చేయవచ్చు అంటున్నారు. ఎంత ఘోరమైన బోధలు చేస్తున్నారో గమనించండి. మనము ప్రతిసారి పాపము చేసినపుడు మరొకసారి యేసయ్యను సిలువ వేసినట్లే అని లేఖనములు చెప్తుండగా మనము పాపము చేయుటకు ఇష్టపడుతామా? దేవుని ఉగ్రత గురించి తెలుసుకుంటే పాపము చేయగలమా? అని ఆలోచించండి.

ద్వితీయోపకాండము 28:15–68 వరకు దేవుని ఉగ్రత గురించే ఉంది.

రోమా 1:19–32 వచనాలలో అన్యుడు నశించాడని పౌలు చెప్తూ, ఏ విధంగా నశించాడో చెప్తున్నాడు. దేవుడు తనను తాను మానవునికి సృష్టి ద్వారా, ఆయన కుమారుని ద్వారా, పరిశుద్ధాత్మ ద్వారా, మనస్సాక్షి ద్వారా బయలుపరచుకున్నాడు. దేవుని గురించి మానవులకు తెలియదేమో అనుకోవడానికి వీలులేదు. అయినా వారు దేవుని యొక్క మహిమను, దైవత్వాన్ని ఎదిరించారు. దేవునితో బాంధవ్యము కోల్పోయారు. దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించలేదు. ఆరాధించలేదు. దేవుని ఆరాధించుట మానివేసి తత్వజ్ఞానులయ్యారు (Philosophers). ఈ “తత్వశాస్త్రులను గురించి Toray అనే ఆయన ఇచ్చిన నిర్వచనము : తత్వశాస్త్రము అంటే ఒక గ్రుడ్డివాడు చిమ్మచీకటిగా ఉన్న గదిలో నల్లపిల్లి కొరకు వెదుకుట. అక్కడ ఆ పిల్లి లేదు కూడా”

స్టాన్లీ జోన్స్ అను భక్తుడు చెప్పిన మాట – “తత్వశాస్త్రములో మాట మాటలుగా మారుతాయి కాని క్రీస్తులో మాట మానవుడైనాడు”. తత్వశాస్త్రజ్ఞులు తమ మాటే సత్యమనుకుంటారు. దేవుని వెలుగు లేక వారి అవివేక హృదయము అంధకారమైంది. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. ఆ అజ్ఞానంలో పడి సృష్టిని పూజించుటకు మొదలుపెట్టారు. అక్షయుడగు దేవుని వదిలిపెట్టి క్షయుడగు మనుష్యుని,

తనను తాను ఆరాధించుట మొదలుపెట్టాడు. పాపము లోకములోనికి రాకముందు వారు దేవుని స్వరూపములో ఉన్నారు కాని పాపములో పడ్డాక వారి బాహ్య స్వరూపాలలో విగ్రహములు చేసుకొని వాటిని పూజిస్తున్నారు. తర్వాత జంతువులను, పక్షులను, రాళ్లను, రప్పలను ఆరాధించుట మొదలుపెట్టారు. దేవుడు సర్వసృష్టికర్త, సార్వభౌముడు అను ప్రాథమిక సత్యాన్ని అసత్యానికి మార్చారు. మనిషి ఈ సత్యం తెలుసుకున్నప్పుడు తనను గురించి కూడా తాను తెలుసుకుంటాడు. దేవునికి, తనకు గల సంబంధము తెలుసుకుంటాడు. మానవుడు దేవునిమీద ఆధారపడి ఉన్నాడనునది సత్యం, కాని మానవుడు తన స్వరూపమందు దేవుని చేసి, ఆ విగ్రహము చేయుటలో దేవుడే మానవునిపై ఆధారపడి ఉన్నాడని రుజువు చేయుటకు ప్రయత్నించాడు. కీర్తన 106:19,20 వచనాలలో కీర్తనాకారుడు మనిషి మృగాలను ఆరాధిస్తున్నాడని చెప్తున్నాడు. ప్రకటన 13:8 లో శ్రమల కాలంలో " మృగమునకు నమస్కారము చేయుదురు" అని ప్రవచనాత్మకంగా చెప్పబడి ఉంది

వీటన్నిటి ఫలితంగా దేవుడు వారిని అపవిత్రతకు, తుచ్ఛమైన అభిలాషకు అప్పగించారు. స్వాభావికమైనవి వదిలి అస్వాభావికమైన వాటికి మరలారు. వారి పరిస్థితి రోజురోజుకు అన్యాయంగా తయారవుతూ వచ్చింది.

అపవిత్రత $\longrightarrow$ తుచ్ఛ అభిలాష $\longrightarrow$ భ్రష్టమనస్సు.

దేవుని న్యాయాన్ని ఎదిరించటము వలన చెడు లక్షణాలు ఏవేవి అలవడుతాయో పౌలు చెప్తున్నాడు. ఈ కాలంలో సమాజాన్ని పాలించేది డబ్బు. ప్రతి సంబంధము డబ్బుతో ముడిపడి ఉంది. చివరకు భార్యాభర్తలు, తల్లిదండ్రులు, అన్నదమ్ముల మధ్య సంబంధాలు కూడా డబ్బుతోనే ముడిపడి ఉన్నాయి.

ఈ పత్రిక ఆరంభము నుండి మనము పాపము గురించి చదువుచున్నాము. **ఇంతకూ పాపము అంటే ఏమిటి?**

### *1. ఇది ఒక స్థితి :*

నీతి రహితమైన మానవుని పడిపోయిన స్థితి. ఈ స్థితిలో ఉంటే ఏమవుతుంది? రోమా 3:9,19 ప్రకారము దేవుని శిక్ష వస్తుందని పౌలు చెప్తున్నాడు.

రోమా 5:12లో "ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణము లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" అని పౌలు చెప్పాడు. రోమా 3:23 లో ఈ లోకంలో అందరూ పాపులే అని చెప్పాడు. పాపము అనునది ఒక పడిపోయిన స్థితి.

**2. పాపమనునది ఒక స్వభావము :**

దేవునితో విరోధ భావము కలిగి ఉన్నందున ఏర్పడిన స్వభావము. దాని వలన కలిగే ఫలితాలు –

a. హృదయము చెడిపోయింది – యిర్మీయా 17:9,10

b. తలంపులు చెడిపోయాయి – ఆదికాండము 6:5

c. మనసు, మనస్సాక్షి చెడిపోయాయి – తీతు 1:15

d. శరీరము, ఆత్మ చెడిపోయాయి – 2 కొరింథీ. 7:1

e. కన్నులు చెడిపోయి నేత్రాశ వచ్చింది – 1 యోహాను 2:16

f. వినికిడి చెడిపోయింది – 2 తిమోతి 4:3, 2:14

g. మేలు చేయాలనే కోరిక బలహీనమైంది – రోమా 7:18

h. మాట చెడిపోయింది – రోమా 3:13,14

i. నడత పాడైపోయింది – రోమా 3:15

j. చేతులు పాడైపోయాయి – యెషయా 1:15

**3. పాపము ఒక క్రియ :**

ఆజ్ఞాతిక్రమము పాపము. వ్రాయబడిన, నైతికమైన, స్వాభావికమైన చట్టాలను అతిక్రమించుట పాపము. ఈ పాపపు క్రియల వలన ఫలితాలు భయంకరంగా ఉంటాయి. రోమా1:32 లో ఉగ్రత యొక్క ఫలితము మరణము అని పౌలు చెప్పాడు. ఈ వాక్యములో కూడా ఫలితము చెప్పి తర్వాత విషయాలు చెప్తున్నాడు. ఈ వాక్య భాగములో దేవుని ఉగ్రతకు కారణము మానవుని పాపమే అని చెప్పిన పౌలు కారణాలు, ఫలితాలు చెప్పాడు. పౌలు కొరింథు పట్టణము నుండి వ్రాస్తున్నాడు కాబట్టి ఆ పట్టణములో ఉన్న పాపపు కార్యములను వ్రాస్తున్నాడు.

# 2వ అధ్యాయము

**రో**మా 2:1 నుండి 3:8 వరకు రెండు అంశాలను పౌలు చెప్తున్నాడు. రోమా 2:1-16 వరకు నీతిమంతుడు నశించాడనియు, రోమా 2:17 నుండి 3:8 వరకూ యూదుడు కూడా నశించాడనియు చెప్తున్నాడు. మొదటి అధ్యాయములో అన్యుడు నశించుట, దేవుని ఉగ్రత వాని మీదకు వచ్చుటకు కారణములు, ఫలితములు చూశాము.

ఇక్కడ పౌలు చెబుతున్నదేమంటే తనను తాను నీతిమంతుడనని అనుకునేవాడు చేసే పాపములు, యూదుడు చేసే పాపములు కూడా ఎత్తి చూపించి, చివరకు ఏ బేధము లేదు, అందరు పాపము చేసి దేవుని మహిమ పొందలేకపోతున్నారని రుజువు చేస్తున్నాడు.

ఈ భాగంలో ప్రత్యేకంగా నీతిమంతునిగా పరిగణింపబడు ఒక వ్యక్తితో మాట్లాడుచున్నట్లుగా ఉన్నది – " కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీ వెవడవైనను సరే నిరుత్తరుడవై యున్నావు. దేని విషయములో నీవు ఎదుటి వానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు" (2:1). ఇక్కడ పౌలు మాట్లాడుచున్న వ్యక్తి ఎవరు అను విషయము గురించి చాలా వాదనలున్నాయి. కాని F.F. Bruce అనే ఆయన చెప్తున్నాడు ఈ వ్యక్తి సెనెకా (Seneca) అయిఉండవచ్చునని. సెనెకా ఒక రోమా తత్వశాస్త్రజ్ఞుడు, నీరో చక్రవర్తికి గురువు, మంత్రి కూడా. అతడు పౌలు బోధలు విన్నప్పుడు " అవును, అందరూ చెడ్డవారే. నాలాటి వారు చాలా కొద్ది మంది ఉంటారు" అన్నాడట. దానిని బట్టి అతనిని సంబోధిస్తూ పౌలు మాట్లాడి ఉంటాడని F.F. Bruce అంటున్నాడు. ఈ సెనెకా చాలా మంచి బోధలు చేసేవాడు, తప్పుచేసేవారిని, వారి తప్పులు ఎత్తి చూపించేవాడు. చాలా మంచి పేరు తెచ్చుకున్నాడు కాని నీరో తన తల్లిని చంపాలని చేసిన ప్రయత్నంలో పథకం వేసినది సెనెకా అని తెలిసినపుడు అతని మంచితనమంతా వేషధారణ అని తెలుసుకున్నారు. ఇటువంటి నీతిమంతులు కూడా ఉన్నారని పౌలు చెప్తున్నాడు. మత్తయి 7:1-5 వచనాలలో

యేసుప్రభువు 'ఇతరులను తీర్పుతీర్చకుడి' అనే అంశము మీద చాలా విషయాలు చెప్పాడు. "నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలో నున్న నలుసును చూచుటయేల" అని అంటూ, అటువంటి వానిని 'వేషధారి' అని పిలుస్తున్నాడు. ఒక వ్రేలు ఇతరుల వైపు చూపిస్తే మూడు వేళ్లు నీవైపే చూపిస్తాయి అన్నాడు. ఇక్కడ పౌలు సెనెకా వంటి నీతిపరులమని చెప్పుకునే వారికి వ్రాస్తున్నాడు 'నీవు కూడా నశించావు' అని చెప్తున్నాడు.

పౌలు కాలంలోని 'నీతిమంతులు' గా పేరు పొందినవారు అన్యులను తప్పు పట్టడము చాలా తేలిక. ఎందుకంటే వారు బాహాటంగా పాపంలో జీవిస్తూ దేవునికి విరోధంగా తిరుగుతూ ఉండేవారు. ఈ కాలంలో కూడా మనచుట్టూ ఉన్న సమాజంలో చాలా మంది పాపంలోనే జీవిస్తున్నారు కాని వారికున్న ధనబలంతో ఎవరూ వారిని తప్పు పట్టడము లేదు. టీ.వి.లలో, సినిమాలలో అవే చూపిస్తారు కాబట్టి ఎవరికీ తప్పుగా అనిపించడము లేదు.

సంఘముగా మనము వాటిని ప్రోత్సహించకూడదు కాని మన సంఘాలలో కూడా చాలా మంది వేషధారులున్నారు. మన హృదయాంతరంగాలు చూసే దేవునికి తెలుసు మనమెంత పవిత్రంగా ఉంటున్నామో. బైబిలు పట్టుకొని మందిరానికి వస్తున్న మనము ఇతరులను తప్పు పట్టకూడదు. పైకి భక్తిపరులుగా కనబడుచున్న వారితో పౌలు మాట్లాడుచున్నాడు. వారు తీర్పు తీర్చుటకు సిద్ధంగా ఉంటారు. "మీరు తీర్పు తీర్చకుడి, మీరు తీర్పు నొందెదరు" అని యేసయ్య చెప్పిన మాటలు గుర్తుచేసుకుంటే భయమేస్తుంది. కోపము వస్తే చంపినట్లే, తప్పుడు ఆలోచన వస్తే తప్పు చేసినట్లే అని చెప్పాడు. మన ఆలోచనలు మన చుట్టూ ఉన్నవారికి తెలియవు కాని ప్రభువుకు అన్నీ తెలుసు. ఒక సంఘములో విశ్వాసి కన్నీటితో ప్రార్థన చేస్తున్నపుడు ఆ వ్యక్తి బాధకు కారణమేమిటని అడిగినప్పుడు అంతకుముందు రాత్రి ఆయనకు పరాయిస్త్రీతో వ్యభిచారము చేసినట్లు కలవచ్చిందట. దాన్ని బట్టి పశ్చాత్తాపంతో దేవుని ఎదుట కన్నీరు కారుస్తున్నాడు.

అందుకే దేవుడు మన హృదయాలను పరిశుద్ధంగా ఉంచుకోమంటున్నాడు. మన హృదయాలు దేవుని ఆలయాలని లేఖనాలు చెప్తున్నాయి. పాపపు ఆలోచనలు వస్తే మన దేవాలయాలను అపవిత్రపరచిన వారమవుతాము. మనమెప్పుడైతే ఇతరులకు తీర్పు తీరుస్తామో, తండ్రి మనకు తీర్పు తీరుస్తాడని గుర్తుంచుకోవాలి. పరిసయ్యుల వేషధారణను యేసయ్య తప్పు పట్టాడు. దేవుని తీర్పు సత్యముపై ఆధారపడి

ఉంటుందని పౌలు అంటున్నాడు. మన వేషధారణలోకి తొంగి చూస్తాడాయన, ఆయన నుండి మనమేమి దాచలేము. తీర్పు తీర్చు మనుష్యుడు దేవుని న్యాయ సింహాసనము ముందు నిలబడాలని గుర్తు చేసుకోమంటున్నాడు. దేవుని ఉగ్రతను ఎదుర్కోవలసి వస్తుందని గుర్తుచేస్తున్నాడు. తీర్పు తీర్చువాడు తనకు తానే తీర్పు తీర్చుకుంటున్నాడు. ఎందుకంటే అట్టి కార్యములు తానే చేస్తున్నాడు కాబట్టి దేవుని తీర్పు సత్యము ననుసరించి ఉంటుందని పౌలు చెప్పాడు కదా, ఆ సత్యమేమిటి అని ఆలోచిస్తే దేవుడే సత్యము, సత్యమనేది ఆయన లక్షణము. ఆయన సర్వజ్ఞాని అయినందున అన్నీ తెలుసు కాబట్టి ఆయన తీర్పు మన దోషమును బట్టి ఉంటుంది. దైవానుగ్రహము నీమీద ఉందని తెలుసుకోలేక దానిని తృణికరిస్తున్నావని పౌలు నీతిమంతుని హెచ్చరిస్తున్నాడు. దైవానుగ్రహము పాపిపైన దీర్ఘకాలముండదు, ఉగ్రతను సంపాదించుకొంటున్నావని చెప్తున్నాడు.

**రోమా 2:7-9** లో దేవుని తీర్పు ఎలా ఉంటుందో వివరిస్తున్నాడు – "సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను, ఘనతను, అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును. దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడా శ్రమలు వేదనయు కలుగును". కీర్తన 62:12 లో – "మనుష్యులందరికీ వారివారి క్రియల చొప్పున నీవే ప్రతిఫలమిచ్చు చున్నావు" అని దావీదు అంటున్నాడు. సామెతలు 24:12లో – "నరులకు వారి వారి పనులనుబట్టి ఆయన ప్రతీకారము చేయును గదా" అని వ్రాయబడి ఉన్నది.

దేవునికి పక్షపాతము లేదు. అందరికి తీర్పు ఉంటుంది. ధర్మశాస్త్రము లేనివాడు, లేనివాడుగానే తీర్పు పొందుతాడు. యూదులకు తీర్పు ధర్మశాస్త్ర ప్రకారము ఉంటుంది. ధర్మశాస్త్ర ప్రకారమైన తీర్పు ఎలా ఉంటుందంటే ఊరకే వినువారు నీతిమంతులు కారు, కాని విని చేయువాడే నీతిమంతుడు. అన్యజనుల తీర్పు వారి ప్రవర్తన, అవిధేయత, మనస్సాక్షి, తలంపులను బట్టి ఉంటుంది. దేవుని తీర్పు యేసుక్రీస్తు చేత, ఆయన ద్వారా జరుగుతుంది. రోమా 2:16 లో "దేవుడు నా సువార్త ప్రకారము యేసుక్రీస్తు ద్వారా మనుష్యుల రహస్యములను విమర్శించు దినమందు ఈలాగు జరుగును" అని పౌలు అంటున్నాడు. ఇక్కడ 'నా సువార్త' అంటున్నాడు. తనకు దేవునిచే అప్పగింపబడిన సువార్త అని అర్థము. రోమా 16:25 లో తన సువార్త ప్రకారము సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులవ్వాలి అంటున్నాడు.

2కొరింథీ 4:3 లో "మా సువార్త మరుగుచేయబడిన యెడల నశించుచున్నవారి విషయములోనే మరుగుచేయబడియున్నది" అన్నాడు.

2థెస్సలొనీకయులకు 2:14 లో " మీరీలాగున రక్షింపబడిన మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను " అని అన్యులతో అన్నాడు.

నీతిమంతులుగా పిలువబడినవారు తాము ఎందుకు నాశనమవుతామని చెప్తున్నాడో అర్థమయ్యేలాగున అన్నీ వివరణలు ఇస్తున్నాడు.

రోమా 2:17 నుండి 3:8 వరకు ఇక యూదులు కూడా నశించారు అని చెప్తున్నాడు, యూదులు తమ రక్షణ కొరకు మూడింటిపై ఆధారపడుచున్నారు - ధర్మశాస్త్రము, తమ జాతి (Lineage), సున్నతి. అయితే పౌలు ఈ మూడింటిలో ఏదీ మీకు రక్షణ ఇవ్వలేదు అంటున్నాడు.

## 1. ధర్మశాస్త్రము యూదుని రక్షింపలేదు :

రోమా 2:17-24 వచనాలలో ఈ సంగతి చెప్తున్నాడు. 17-21 వచనాలలో ధర్మశాస్త్రము ద్వారా యూదునికి ఇవ్వబడిన ఆధిక్యతలు చూడగలము. పౌలు యూదుడు కాబట్టి విశదంగా చెప్పగలుగుతున్నాడు. తమ పేరులో ఉన్నది ఆధిక్యత, యూదుడు= స్తుతినొందువాడు. 'యూదా' (స్తుతి) అనే మాట నుండి 'యూదుడు' అను మాట వచ్చింది.

- ధర్మశాస్త్రము వలన దేవుని గురించిన జ్ఞానము కలిగియున్నారు.
- ధర్మశాస్త్రము వలన దేవుని చిత్తము తెలుసుకున్న వారిగా ఉంటారు.
- 10 ఆజ్ఞలు, బలులు, నిబంధనలు, వాగ్దానాలు, దేవోక్తులవంటి శ్రేష్టమైనవన్నీ కలిగియున్నారు.

- యూదుడు చాలా వాటిని బట్టి అతిశయిస్తున్నాడు - గ్రుడ్డివారికి త్రోవ చూపువాడనని; వెలుగుగా ఉన్నానని; బుద్ధిహీనులకు శిక్షకుడనని, బాలురకు ఉపాధ్యాయుడననియు; ధైర్యము గలవాడననియు అతిశయిస్తున్నాడు. కాని వీరు చేసిన తప్పులను పౌలు గుర్తు చేస్తున్నాడు. వీరు ధర్మశాస్త్రము మీరుట వలనను, వారు చేసిన

భయంకరమైన తప్పులను బట్టి శత్రువులకు అప్పగింపబడినపుడు దేవునికి అవమానము తెచ్చారు. అన్యజనులు వారిని బట్టి యెహోవా దేవుని దూషిస్తున్నారు అని పౌలు వారికి చెప్తూ ధర్మశాస్త్రము మిమ్ములను రక్షింపలేదని చెప్పాడు.

## 2. వారు అతిశయిస్తున్న సున్నతి వారిని రక్షించలేదు :

సున్నతి చేసుకోవడము అంటే ధర్మశాస్త్రము పాటిస్తానని దేవునితో చేసుకునే నిబంధన. నిజమైన సున్నతి అంటే ధర్మశాస్త్ర క్రియలను చేసి, దానిని పాటించి, ధర్మశాస్త్రము ద్వారా యేసయ్య దగ్గరికి వెళ్ళవచ్చు కాబట్టి ప్రభువును నమ్మినవారంతా సున్నతి పొందినట్టే. సున్నతి పొంది, ధర్మశాస్త్రము (అక్షరము) కలిగిన నీకు దేవుడు తీర్పు తీర్చును అంటున్నాడు. ఈనాటి విశ్వాసులు బాప్తిస్మము గురించి, సంఘ సభ్యత్వమును గురించి తప్పు ఆలోచన కలిగియున్నారు. కేవలము శారీరక బాప్తిస్మము గాని, గొప్ప సంఘ సభ్యత్వము గాని రక్షించలేవని గుర్తించాలి.

## 3. వంశావళి యూదుని రక్షించలేదు :

యూదునిగా పుట్టినంత మాత్రాన నీకు రక్షణ రాదు అని పౌలు వారితో చెప్తున్నాడు. హృదయానికి సున్నతి కలిగి, అంతరంగ మందు సున్నతి పొందినవాడే నిజమైన యూదుడు. అట్టివానికి దేవుని దగ్గర మెప్పు దొరుకుతుంది అని పౌలు చెప్తున్నాడు.

యూదుడు అంత సులభంగా ఓటమి ఒప్పుకోడు. అందుకే పౌలుతో వాదన మొదలెట్టాడు. ఈ పత్రిక అంతా కూడా న్యాయస్థానములో జరుగుతున్నట్లుగా చిత్రీకరించబడి ఉంది.

రోమా 3:1-8 లో యూదుడు వేసిన ప్రశ్నలు, పౌలు ఇచ్చిన జవాబులు జాగ్రత్తగా పరిశీలిద్దాము:-

**1వ ప్రశ్న :** అసలు నేను యూదునిగా పుట్టినందుకు గొప్పతనమేంటి?

**పౌలు జవాబు :** ప్రతి విషయంలోను అధికమే. యూదుల ఆధిక్యతలు రోమా 9:4,5 లో చెప్పాడు. ఇక్కడ ఒక్కటే చెప్తున్నాడు- దేవోక్తులు (ప్రవచనాలు). మెస్సయ్య మీ కొరకు వస్తాడను సంగతి మీకు ముందే తెలుసు. అదే మీకు ఆధిక్యత అంటున్నాడు. యేసయ్య మీ కొరకు వచ్చాడని తెలిసి మీరు నమ్మలేదు, పైపెచ్చు తృణీకరించారు.

'వైద్యుడు మందు ఇచ్చాడు కాని మీరు వేసుకోలేదు' అన్నట్లుగా ఉన్నది వారి పరిస్థితి.

**2వ ప్రశ్న :** మేము నమ్మకపోతే ఏమైంది? దేవుడు నమ్మదగినవాడు గదా? 'అందుకే దేవుడు మమ్ములను తప్పక రక్షించాలి' అని వారి వాదన. మా విశ్వాసము దేవుని విశ్వాస్యతను వ్యర్థము చేయునా? అని యూదుడంటున్నాడు. ఎంత గర్విస్తున్నాడో చూడండి.

**పౌలు జవాబు :** అట్లనరాదు, దేవుడు క్షమించు గాక. ఆ గర్విష్టి మాటలను బట్టి పౌలుకు కోపమొచ్చినట్లుగా ఉంది. అందుకే పౌలు లేఖనాల నుండి సమాధానమిస్తున్నాడు – కీర్తన 51:4 "దేవుడు నీతిమంతుడు, మానవుడు అబద్ధికుడు"

**3వ ప్రశ్న :** యూదుడు సామాన్య మానవునిలాగా మాట్లాడుతున్నాడు. యూదుడు తెలివైన సమాధానమిస్తున్నాననుకుంటున్నాడు గాని అందులో అతని పాపపు స్వభావము కనబడుతున్నది. దేవుని మాటలు వక్రీకరిస్తున్నాడు. "మా దుర్నీతి దేవునిని నీతిమంతునిగా చేస్తుంది గదా?" అంటున్నాడు. ఎంత గర్వంగా మాట్లాడుతున్నాడో గదా? ఎలా ఉందంటే "దేవుడు నీతిమంతునిగా అగుపడుటకు నేను సహాయము చేస్తున్నాను" అంటున్నాడు. "సాయం చేస్తున్న నన్ను దేవుడు శిక్షిస్తే, ఆయన అన్యాయస్థుడు గదా?" అన్నాడు.

**పౌలు జవాబు :** పౌలు కోపము అణచుకొని "నోరుమూసుకో" అని కఠినంగా అనకుండా సౌమ్యంగా "అట్లనరాదు" అంటున్నాడు. "అట్లయితే దేవుడు లోకానికి తీర్పు ఎలా తీరుస్తాడు" అంటున్నాడు.

**4వ ప్రశ్న (3:7) :** యూదుని మనస్తత్వము బయట పడుతున్నది, తిరిగి అదే మాట. దేవునికి మహిమ రావాలని నేను పాపం చేస్తున్నానంటున్నాడు. పాపం పెరిగే కొద్దీ దేవుని మంచితనం కనబడుతుంది కదా? అన్నాడు యూదుడు.

**పౌలు జవాబు :** రోమా 3:8:– ఇప్పుడు వారు పౌలుకు పట్టుబడ్డారు. పౌలు వాదనలు వారికి ఇంతవరకు అర్థము కాలేదు. పాపము చేస్తే కూడా రక్షణ రావాలి (యూదులము కాబట్టి) అని వారంటుంటే పాపులమైన మనందరిని రక్షిస్తాడని పౌలు అంటున్నాడు. ధర్మశాస్త్ర క్రియలు రక్షణ కొరకు అవసరమని మీరే అంటున్నారు కాని ధర్మశాస్త్రము మీరుతున్నారు, కాబట్టి మీకు శిక్ష రావలసిందే అని పౌలు అంటున్నాడు. "మేము చెప్పు మార్గములోనే రక్షణ ఉంది" అని పౌలు వారితో చెప్తున్నాడు.

# 3వ అధ్యాయము

**అ**న్యులు నశించారు, నీతిమంతులు నశించారు, యూదులు నశించారు అని వేరు వేరుగా చెప్పి, చివరకు 3:9–20 లో సర్వలోకము నశించినదని ముగిస్తున్నాడు.

పౌలు చిత్రీకరించిన విధానము న్యాయస్థానములో ఒక దృశ్యము అనుటకు ఈ భాగము ఉదాహరణగా ఉంది.

1. రోమా 3:9 – దోషారోపణ – అందరూ దోషులే
2. రోమా 3:10–18– నేరస్థాపన –వారు చేసిన పాపముల జాబితా
3. రోమా 3:19 – వాదన – ప్రతి నోరు మూయబడేటట్లుగా వాదన
4. రోమా 3:19–20 – తీర్పు

పౌలు రోమా న్యాయవ్యవస్థ గురించి బాగా తెలుసు కాబట్టి వారి నోళ్లు మూయించేటట్లుగా వాదించాడు. సత్యాన్ని ధృవీకరించుట కొరకు పాతనిబంధన నుండి అనేక వాక్య భాగాలు తీసుకొచ్చాడు. కీర్తన 14:1–3; కీర్తన 53:1–3; 5:9; 140:3; 10:7 మొదలగు వాక్యభాగాలు తెచ్చాడు.

సర్వలోకము దేవుని శిక్షకు పాత్రులే. ధర్మశాస్త్రము వలన ఎవరూ నీతిమంతులుగా తీర్చబడరు. దేవుని ఎదుట అందరూ దోషులే అని చెప్పి పాతనిబంధన పాఠ్యభాగాల ద్వారా రుజువు చేస్తున్నాడు. 'నీతిమంతుడు ఎవడూ లేడు' 'అందరు పాపులే' అని చెప్పుటలో సార్వత్రికత (Universality) తెలుపుతున్నాడు. "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు". ఎందుకంటే మానవుని హృదయమంతా పాపముతో నిండియున్నది. అతని మనసు, హృదయము, చిత్తము అన్నీ పాపానికి బందీగా ఉన్నవి. దేవుని నీతి కొలబద్దగా తీసికుంటే ఏ మానవుడు పాపములేని వాడుగా

ఉండదు. పాపి ఎప్పుడూ దేవుని వెదకడు. అందుకే దేవుడే పాపిని వెదుకుతున్నాడు. లూకా 19:10 లో "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" చెప్పబడి ఉంది. రోమా 3:13-18 వరకు ఉన్న వాక్య భాగములో పాపి తలనుండి పాదాల వరకు ఏవిధంగా చెడిపోయి ఉన్నాడో పౌలు చెప్తున్నాడు. మానవుని గొంతు తెరచిన సమాధి అనియు, పెదవుల క్రింద సర్పవిషమున్నదనియు, నోటినిండా శపించుట, పగ ఉన్నవనియు, వారి పాదములు రక్తము చిందించుటకు పరుగులెత్తుచున్నవనియు, వారి మార్గములో నాశనము, కష్టమున్నాయనియు, వారు శాంతి మార్గము ఎరుగరనియు, వారికి దేవుని భయము లేదనియు చెప్పాడు.

పౌలు చెప్పిన మాటలను బట్టి మనమందరము పాపులమే అను సత్యము తెలుసుకోవచ్చును. మనము నీతిమంతులమని అనుకుంటే మనకు దేవుని కృప వలన దొరికే రక్షణ రాదు. మనము ఎప్పుడైతే దేవుని ఎదుట తలవంచుకొని పాపుల లాగా నిలబడతామో అప్పుడే మనం రక్షింపబడగలము. మానవాళి అందరూ పాపులే అనే సత్యం పౌలు స్థిరపరచాడు (Established).

రోమా 3:21-31 లో విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడగలమని పౌలు చెప్తున్నాడు.

ఇప్పటి వరకు పౌలు మానవుల పాపము గురించి చెప్పి, ఇప్పుడు ఆ పాపమనే చీకటిలో రక్షణ అనే వెలుగు రేఖను చూపిస్తున్నాడు. నల్లటి పేపర్ మీద తెల్లటి రంగుతో రక్షణ దృశ్యం చిత్రీకరిస్తున్నాడు. దేవుని నీతి మన విశ్వాసము యొక్క అవసరత ఈ భాగంలో బయలుపరచబడింది. రక్షణ కేవలము క్రీస్తు ద్వారా మాత్రమే వస్తుంది. రక్షణ అనేది మూడు భాగములుగా పౌలు చూపిస్తున్నాడు.

1. నీతిమంతులుగా తీర్చబడుట - 3:21 నుండి 5:21 వరకు ఉన్నది.
2. శుద్ధీకరణ - 6:1 నుండి 7:25 వరకు
3. భద్రపరచబడుట - 8:1-39

మనము ఇక్కడ చూసే భాగంలో ....

రోమా 3:21-26 వరకు విశ్వాసము ద్వారా ఉచితంగా తీర్చబడుట,

రోమా 3:27-31 వరకు విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట యొక్క శ్రేష్టత ఉన్నాయి.

ఇంతకూ నీతిమంతులుగా తీర్చబడుట అంటే ఏమిటి? అని అర్థము చేసుకోవడానికి ఒక దృష్టాంతము చూసుకుందాము.

100 సంవత్సరాల క్రితం రోల్స్ రాయిస్ (Rolls Royce) కారు చాలా ఖరీదైనది. అన్ని కార్లకంటే ధర ఎక్కువ. ఒక వ్యక్తి ఆ కారులో ప్రయాణిస్తుండగా మధ్య దారిలో కారు ఆగిపోయింది. వెంటనే అతను ఆ కారు కంపెనీకి టెలిగ్రాము ద్వారా తెలుపగానే, వారు మెకానిక్‌ను పంపి దానిని బాగుచేశారు. మెకానిక్ వెళ్లిపోయాడు గాని ఖర్చు ఎంత అయిందో బిల్లు పంపలేదు. ఈ కారు యజమాని బిల్లు కొరకు అడిగినపుడు "మా సమాచారము ప్రకారము ఈ కార్లకు రిపేర్లు రావు" అని సమాధానము వచ్చింది – ఇదే నీతిమంతులుగా తీర్చబడుట. ఎప్పుడైతే మనము రక్షణ పొందుతామో, "వీరు పాపులు కారు" అని దేవుని గ్రంథాలలోకి సమాచారము వెళ్లిపోతుంది. మనము ఆయన బిడ్డలుగా చేయబడుతాము. సిలువ కార్యము ద్వారా ముగింపబడిన కార్యమిది. పాపియైన విశ్వాసికి క్రీస్తు ద్వారా దేవుడు నీతి ఆపాదిస్తున్నాడు. క్రీస్తు సిలువపైన పూర్తి గావించిన కార్యము ద్వారా దేవుడు తనను విశ్వసించు పాపిని క్రీస్తు ద్వారా నీతిమంతునిగా ప్రకటించే కార్యమును పాపశిక్ష నుండి విడుదల (Justification) అంటారు. శుద్ధీకరణ కార్యమును పాపశక్తి నుండి విడుదల (Santification) అంటారు. పాపశిక్ష నుండి విడుదల, పాపశక్తి నుండి విడుదల – ఈ రెండింటిలోని తేడాను గమనించాలి. మొదటిది ఒక కార్యము – దీని ద్వారా ఒక వ్యక్తి దేవుని కుమారుడవుతాడు. రెండవది సదా జరిగే ఒక కార్యక్రమము. దీని ద్వారా దేవుడు రక్షింపబడిన వ్యక్తిని దినదినము తన కుమారుడైన క్రీస్తు సారూప్యము లోనికి మారుస్తాడు. మొదటి కార్యము ఒక్కసారే జరుగుతుంది కాని రెండవది జరుగుతూనే ఉంటుంది.

నీతి అనునది క్రీస్తు లక్షణము అని చూశాం. ఈ నీతి ఆయన మనకు ఉచితంగా ఇచ్చిన వరము. దేవుడు మనలను నీతిమంతులుగా చేయుట లేదు కాని నీతిమంతులుగా తీర్చాడు. జన్మత: పాపియైన మానవుని దేవుడు మార్చాడు. క్రియల ద్వారా ఎవరూ నీతిమంతులు కాలేరు. ధర్మశాస్త్రము ద్వారా నీతి వస్తుందని యూదులు అనుకొనుట పొరపాటు. ఎందుకంటే ధర్మశాస్త్రము ద్వారా నీతి వస్తే అది క్రియలతో వచ్చినట్లే అవుతుంది.

హెబ్రీ 4:15లో క్రీస్తు పాపరాహిత్యము గురించి చెప్పబడి ఉంది – "ఆయన పాపము లేని వాడుగా ఉండెను". ఆయనలో పాపం లేదు, ఆయన పాపం చేయలేదు, ఆయన నీతి ప్రత్యక్ష పరచబడింది. ఈ నీతి మనకు విశ్వాసం ద్వారా వస్తుంది. ఏ భేదము లేదు, అందరూ పాపము చేసి దేవుని మహిమను పొందలేకపోతున్నారు.

1యోహాను 1:8–10లో మనము 'పాపము లేని వారమని చెప్పుకొనిన ఎడల మనలను మనమే మోసపుచ్చుకొందుము' అని యోహాను వ్రాశాడు. 'మనము' అని తనను తాను కలుపుకుంటున్నాడు. పత్మాసు దీవిలో ఉన్నప్పుడు పరలోక దర్శనము పొంది ప్రకటన గ్రంథము వ్రాసిన గొప్ప భక్తుడు కూడా నేను పాపిని అంటున్నాడు. దేవుని నీతి పొందక ముందు అందరమూ పాపులమే. విశ్వాసికి ఇవ్వడానికి దేవుడు నీతిని సిద్ధపరచాడు.

రోమా 3:23లో "దేవుడు అనుగ్రహించు మహిమ" అంటున్నాడు. ఈ మహిమ ఏమిటి అని ఆలోచిస్తే ఈ మహిమ యెషయా 6:1లో యెషయా ప్రవక్త చూసిన మహిమ కాదు; ప్రకటన 1:17లో యోహాను చూసిన మహిమ కాదు కాని ఇది ఆయన పాపరాహిత్యం. పాప ఉనికి లేని పరలోకంలో ఈ మహిమ చూడవచ్చు.

2కొరింథీ 3:18లో పౌలు ఈ మహిమను గురించి ఈ విధంగా వ్రాస్తున్నాడు – "ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింప జేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము". ఈ లోకంలో ఆయన మహిమ అంటే దేవుని సారూప్యములోనికి మార్చబడుటయే. ఆదాము పాపము చేశాక దేవుని సారూప్యము పోగొట్టుకున్నాడు. ఇప్పుడు క్రీస్తు ద్వారా తిరిగి పొందుకుంటున్నాము, నీతిమంతులుగా తీర్చబడుచున్నాము.

నీతిమంతులుగా తీర్చబడుట అనే కార్యము ఏ విధంగా జరుగుతుందో కూడా పౌలు వివరిస్తున్నాడు. 3:24లో ఆయన కృపచేత అంటున్నాడు. ఏ యోగ్యతలేని మనమీద ఆయన చూపించిన ప్రేమను 'కృప' అంటారు. 3:24లోనే "క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" అంటున్నాడు. 'విమోచనము' అనే పదము యూదులకు బాగా అర్థమవుతుంది.

యెషయా 43:3,4లో "యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడనైన నేనే నిన్ను రక్షించువాడను, నీ ప్రాణ రక్షణ క్రయముగా ఐగుప్తును ఇచ్చియున్నాను. నీకు బదులుగా కూషును, సెబాను ఇచ్చియున్నాను. నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి, నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక నీకు ప్రతిగా మనుష్యులను అప్పగించుచున్నాను. నీ ప్రాణమునకు ప్రతిగా జనములను అప్పగించు చున్నాను" అని యెషయా ప్రవక్త ద్వారా ఇశ్రాయేలు ప్రజలకు చెప్పుచున్నాడు. ఇశ్రాయేలు ప్రజల విమోచన ఊరకే రాలేదు. విమోచన క్రయధనము ఐగుప్తు, కూషు దేశస్థులకు వచ్చిన శిక్ష ద్వారా చెల్లించబడింది. యేసుప్రభువు బలియాగము ద్వారా మనకు విమోచనము కలిగింది. బలియాగము అంటే మనకు ప్రత్యామ్నాయంగా యేసుప్రభువు బలికావడము, మనకు రావలసిన శిక్ష ఆయనపై మోపబడడము. విమోచన ఏ కారణము లేకుండ ఉచితంగా ఇవ్వబడింది. మనము అప్పటికి ఆయన పిల్లలము కూడా కాలేదు, రోమా 5:8 లో "మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను". ఏ యోగ్యత ఏ కారణం లేకుండా ఉచితంగా తన నీతిని మనకు అనుగ్రహించాడు, ఆపాదించాడు. ఇది దేవుని చట్టబద్ధమైన క్రియ. ఈ క్రియలో 3 Imputations (ఆపాదించబడడము) జరిగాయి. 'ఆపాదించుట' లేక 'మోపబడుట' అను ఈ పదానికి వాడబడిన పదానికి అర్థము 'ఖాతాలో వేయబడుట'.

**ఎ.** ఆదాము పాపము మనమీద మోపబడింది – మన ఖాతాలో వేయబడింది. ఎలా అంటే అది దేవుని కార్యము అనే జవాబు వస్తుంది.

**బి.** విశ్వాసి యొక్క పాపము యేసుప్రభువు మీద మోపబడింది,

**సి.** యేసుప్రభువు నీతి విశ్వాసి మీద మోపబడింది.

ఇక దేవుని జాబితాలో నేను పాపిగా లేను. దేవుడు న్యాయమూర్తి కాబట్టి శిక్ష పడకుండా క్షమించడు. అందువలన విశ్వసించిన వారి పాపములు క్రీస్తు ద్వారా శిక్షింపబడ్డాయి.

పూర్వము చేయబడిన పాపాలు ఉపేక్షించబడ్డాయి. అంటే బలుల ద్వారా శిక్ష వాయిదా వేయబడింది. ఏదైనా అప్పు తీర్చలేనప్పుడు తాత్కాలికంగా వడ్డీ కట్టి సమయము తీసుకున్నట్లుగా అర్థము చేసుకోవాలి. ఏలీయా, మోషే లాంటి పాత నిబంధన భక్తులు

పరదైసులో ఉన్నారు. యేసు విమోచన కార్యము జరిగిన తర్వాతనే వారి అప్పుతీరి పరలోకానికి వెళ్లారు. అపొ.కా. 17:30 – "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు". అజ్ఞాన కాలంలో ఇంకా యేసుప్రభువు బలియాగము జరుగలేదు, నీతి బయలు పరచబడలేదు కాబట్టి శిక్ష వాయిదా వేయబడింది. క్రయ ధనము చెల్లించుట ద్వారా పాపపు బానిసత్వములో నున్న మానవుని బయటకు తెచ్చి పాపపు దుష్ఫలితాల నుండి విడుదల కలిగించుటే. విమోచన క్రయధనము ఎవరికి ఇచ్చాడు? మన బదులుగా దేవునికి ఇచ్చాడు. న్యాయాధిపతి అయిన దేవుడు మన పాపాలన్నీ క్రీస్తుపై మోపి మరణ శిక్ష విధించాడు. న్యాయమూర్తి అయిన దేవుడు వేసిన క్రయధనమును (Fine) తన రక్తము ద్వారా తీర్చాడు. చాలామంది పాపి అయిన మానవుడు సాతాను ఆధీనంలో ఉండుట వలన ఆ పాపిని రక్షించుటకు క్రయధనము సాతానుకు చెల్లించాడని చెబుతారు. కాని అది తప్పు. యేసయ్య రక్తము స్వీకరించే యోగ్యత అపవాదికి లేదు. పైగా పాపి పాపము చేసినప్పుడు దేవునికి దూరమైనాడు కాబట్టి తిరిగి ఆయనకు దగ్గరవ్వాలంటే ఆయనకే క్రయధనము చెల్లించాలి.

యేసుప్రభువు మరణించినప్పుడు పాపియైన మానవుడు యేసుతో కూడా మరణించాడు. ఒక వ్యక్తి బలి అర్పించినప్పుడు ఆ బలి ఆ వ్యక్తికి చెందిన పశువే గాని ఆ వ్యక్తి చనిపోవుట లేదు కదా, అదే విధంగా మనము క్రీస్తుతో కూడ సిలువ వేయబడడమంటే మనము అందులో పాల్గొంటున్నాము కాని మనము అందులో తీర్చబడలేదు. దేవుని ఉగ్రత క్రీస్తుపై పడి, ఆయన క్రూరంగా చంపబడినప్పుడు దేవుని ఉగ్రత శాంత పరచబడింది.

దేవుడు న్యాయవంతుడు, నీతిమంతుడు అని ఆయన లక్షణాలు ప్రత్యక్షపరచ బడ్డాయి. పాత నిబంధన పాపములు కూడా క్రీస్తులో ప్రాయశ్చిత్తము పొందాయి. విశ్వాసులను నీతిమంతులుగా తీర్చుటకు తాను అనీతిమంతుడిగా కనపడుతూ తన నీతిమత్వము చూపించాడు – "కరుణాధారముగా బయలుపరచెను".

కరుణాధారము, కరుణాపీఠము (ప్రత్యక్ష గుడారంలోనిది) అను రెండు పదములకు ఒకే గ్రీకు పదము 'Hilestarian' అని వాడబడింది. ఈ కరుణాపీఠము పరలోకాన్ని, భూమిని కలుపు స్థలము. లేవి 16:2–15లో కరుణా పీఠము దాచబడినది. అహరోను కూడా చూడకూడదని ఆ కరుణాపీఠము ఇక్కడ ప్రత్యక్ష పరచబడింది.

రోమా 3:27-31 వచనాలలో విశ్వాసము ద్వారా ఉచితంగానే నీతిమంతులుగా తీర్చబడుట యొక్క శ్రేష్టత వివరిస్తున్నాడు.

సిలువ చేసిన 3 కార్యములు చెప్తున్నాడు.

**1.** సిలువ దేవుని కృపను ఘనపరుస్తున్నది.

**2.** సిలువ దేవుని సార్వత్రికతను ప్రదర్శిస్తున్నది.

**3.** సిలువ ధర్మశాస్త్రాన్ని స్థిరపరుస్తున్నది.

ఎవరూ అతిశయించడానికి వీలు లేకుండా కారణాలన్నీ సిలువ కొట్టేసింది. ఏ వ్యక్తి కూడా గర్వించడానికి వీలు లేకుండా కేవలము ఇది దేవుని కృప అని తెలియజేసింది. విశ్వాస న్యాయమును బట్టి కొట్టివేయబడింది.

రోమా 2:27లో క్రియా న్యాయము, విశ్వాస న్యాయము అని రెండు న్యాయాలు కనపడుతున్నాయి. ఇలాటివే ఈ లోకంలో కూడా 2 న్యాయాలున్నాయి.

**ఎ.** మర్కట (కోతి) న్యాయము - ఇది క్రియా న్యాయము. కోతి పిల్ల తల్లిని పట్టుకోవాలి. పట్టు జారితే క్రింద పడుతుంది.

**బి.** మార్జాల (పిల్లి) న్యాయము - ఇది విశ్వాస న్యాయము. పిల్లి తన పిల్లలను నోటితో కరచుకొని వెళ్తుంది. పిల్లలకు దెబ్బ తగులకుండా జాగ్రత్తగా గమ్యం చేరుస్తుంది. ఇది రక్షణ సిద్ధాంతము.

ధర్మశాస్త్రము, సున్నతి వీటన్నిటికి ప్రాధాన్యత లేదు. దేవుని సార్వత్రికతను సిలువ ప్రదర్శిస్తుంది. దేవుడు అన్యజనులకు కూడా దేవుడే. ధర్మశాస్త్రమును కూడా స్థిరపరచాలి. ధర్మశాస్త్రము రక్షణలోకి నడిపించలేదు గాని రక్షకుని యొద్దకు నడిపిస్తుంది.

నీతిమంతులుగా తీర్చుట మరియు పవిత్రపరచుట - ఇవి రెండూ కూడా త్రియేక దేవుని కార్యములే. మనము ఏమీ చేయనవసరము లేదు. దేవుని కృప, క్రీస్తు రక్తము, పరిశుద్ధాత్మ ద్వారా వచ్చిన విశ్వాసము - ఈ మూడింటి ద్వారా రక్షణ వస్తుంది. క్రీస్తు చేసిన విమోచన కార్యము ద్వారా మనకు మూడు మేళ్లు జరిగాయి.

1. మనము క్షమించబడి, నరకానికి పోకుండా రక్షింపబడ్డాము.

2. మనము నీతిమంతులుగా తీర్చబడి, దేవుని ఎదుట నిలబడే యోగ్యత పొందాము.

3. మనము పరిశుద్ధ పరచబడి, పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వెళ్లుటకు మార్గము ఏర్పడింది.

రోమా 3:24లో రక్షణ కృపద్వారానే అను విషయము పౌలు ధృవీకరిస్తున్నాడు. అందరికంటె ఎక్కువ కృప పొందినది, అనుభవించినది పౌలు. ప్రతి పత్రిక మొదలు పెట్టుట, ముగించుట కృపతోనే. బైబిలులో మొదటిగా కృప పొందినది ఆదాము. 'కృప' అను పదము బైబిలులో మొదటిగా ఆదికాండము 6:8 లో "నోవహు యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను". అని కనబడుతుంది. 'కృప' అను పదానికి మనమివ్వగలిగిన ఒక నిర్వచనము "ఏ యోగ్యతా లేని వారికి ప్రేమ అందించుట".

పౌలు ఈ పత్రికలో కృప గురించి విస్తారంగా వ్రాశాడు. యేసు ప్రభువు రక్తము ద్వారా మనకు విమోచన వస్తుందనే విశ్వాసము కేవలము దేవుని కృప ద్వారానే వస్తుంది. ఇది సరిగా అర్థము చేసుకోలేని చాలా మంది తప్పుడు బోధకులు ఈనాటి సంఘములలో యేసుప్రభువు "కృప వెంబండి కృప" అనుగ్రహిస్తున్నాడు, విశ్వాసి పాపాలన్ని భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల నాటివి సిలువలో క్షమించబడ్డాయి ఈ కృప చేత. అందుకే మనమింక ఏ తప్పు చేసినా అది పాపము క్రింద జమ కట్టబడదు. పాపపు ఒప్పుకోలు, పశ్చాత్తాపము లాటివేవీ అవసరం లేదని చెబుతున్నారు. పాశ్చ్యాత్య దేశాలనుండి వచ్చిన ఈ బోధను "సూపర్ గ్రేస్" అని పిలుస్తున్నారు. ఎంత భయంకరంగా దేవుని కృపను దుర్వినియోగము చేస్తున్నారో గమనించండి.

కృప అనుభవించే కొద్దీ విశ్వాసి పాపము జోలికి పోడు. రక్షణ పొందిన ప్రతి మనిషిలో పరిశుద్ధాత్మ దేవుడు ఉండి సరైన మార్గములో నడిపిస్తాడు. అప్పుడప్పుడు పడిపోయినా తిరిగి లేపి పాపపు ఒప్పుకోలు చేయించి ప్రభువు దగ్గరకు తీసుకొని వెళతాడు. 2పేతురు 3:18 లో యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందు అభివృద్ధి పొందుమని పేతురు సలహా ఇస్తున్నాడు.

పౌలు ద్వారా ప్రభావితుడైన మార్టిన్ లూథర్ కూడా ఈ సత్యాలను అర్థము చేసుకుని తన బోధలో మూడు ప్రాముఖ్యమైన సత్యాలను మన ముందుంచాడు. లాటిన్ భాషలో ఆయన వాడిన మూడు మాటలు ఆయన బోధలలో చోటు చేసుకున్నాయి. 1. 'సోలాఫైడ్' = విశ్వాసమూలముగా నీతిమంతులముగా తీర్చబడుట, 2. 'సోలాగ్రేషియా' = కృప వలననే రక్షణ 3. 'సోలా స్క్రిప్చురా' = బైబిలు మాత్రమే విశ్వాసికి సిద్ధాంతము అచరణకు మూలము. యేసు ప్రభువు సిలువ యాగమును అర్థము చేసుకొని, ఆయన రక్తము ద్వారానే విమోచన అని విశ్వసించుటకు దేవుని కృప మనకు కావాలి అను సత్యము అందరూ గ్రహించాలని కోరుకుంటున్నాను. నిజమైన రక్షణ పొందిన వాడు తిరిగి పాపములోకి జారిపోకుండా ఉండగలిగే శక్తి పరిశుద్ధాత్మ దేవుడు ఇస్తాడు. తప్పుడు బోధలేవో, బైబిలు ఆధారిత బోధలేవో తెలుసుకోగలడు.

# 4వ అధ్యాయము

**రో**మా 4:1–25 వచనములలో పాతనిబంధన భక్తులు కూడా విశ్వాసము ద్వారానే నీతిమంతులుగా తీర్చబడ్డారని పౌలు యూదులకు చెప్తున్నాడు.

ఈ భాగంలో యూదులకు తండ్రియైన అబ్రాహామును గురించి చెప్తున్నాడు. యూదులతో మాట్లాడుచుండుటను బట్టి వారి పితరులను గురించి మాట్లాడుచున్నారు. ఈ విధంగా చెప్పుట వలన తాను చెప్పిన బోధలన్నియు తన స్వంతం కాదనియు, లేఖనాలలో నుండే వారి ఆచారాల నుండే చెప్తున్నాడని ఋజువు చేసుకుంటున్నాడు. క్రీస్తునందున్న విశ్వాసము ద్వారానే రక్షణ వస్తుంది. మెస్సయ్యను గురించిన ఆలోచన క్రొత్త నిబంధనది కాదు. పాతనిబంధనలోనే దాని వేర్లున్నాయి.

అబ్రాహాము కూడా విశ్వాసము ద్వారానే నీతిమంతునిగా తీర్చబడ్డాడని ఆదికాండము 15:6 ద్వారా చూపెడుతున్నారు. తన క్రియల ద్వారా అయితే అతను గర్వించేవాడని చెప్తూ పాత నిబంధన భక్తులు కూడా విశ్వాసము ద్వారానే నీతిమంతులుగా తీర్చబడ్డారని చెప్పాడు. అబ్రాహాము దేవుని నమ్మినవారందరికీ తండ్రి అని పిలిచారు.

గలతీ 3:1–18 వరకు ఉన్న వాక్యభాగములో "విశ్వాస సంబంధులందరూ అబ్రాహాము కూమారులని తెలుసుకొనుడి" అంటున్నాడు. అంటే క్రీస్తు నందు విశ్వాసముంచిన వారని పౌలు అభిప్రాయము. అబ్రాహాము యొక్క ఆత్మీయ అనుభవము ఈనాటి విశ్వాసి వంటిదే అని చెప్పడానికి పౌలు అబ్రాహాము యొక్క రక్షణ గురించి 3 సత్యాలు చెప్పారు.

1. 1-8 లో అబ్రాహాము క్రియల వలన కాదు గాని, విశ్వాసము వలననే నీతిమంతునిగా తీర్చబడ్డాడు.

2. 9-17లో ధర్మశాస్త్రము వలన కాదు గానీ కృపవలనే.

3. 18-25లో మానవ ప్రయత్నము వలన కాదు గానీ, పునరుత్థానశక్తి వలననే అని చెప్తున్నాడు.

అబ్రాహాము విశ్వాసమూలముగా ఉచితంగా నీతిమంతునిగా తీర్చబడుట ద్వారా విశ్వాసులందరికీ యూదులకు, అన్యులకు కూడా తండ్రిగా గుర్తించబడినాడని ఈ 4వ అధ్యాయంలో పౌలు చెప్తున్నాడు.

యూదుల దృష్టిలో అబ్రాహాము స్వతహాగా నీతిమంతుడు. ఒకవేళ అబ్రాహాము క్రియల ద్వారా నీతిమంతునిగా తీర్చబడితే అతిశయిస్తాడు. గాని దేవుని యందు నిలబడినప్పుడు చెప్పలేడు. లేఖనాలు కూడా అబ్రాహాము విశ్వాసము వలననే నీతిమంతునిగా తీర్చబడ్డాడు (ఆది 15:6) అని చెప్తున్నాయి. క్రియల వలన అయితే దేవుని యొద్ద నుండి కొన్నట్లుగా ఉంటుంది. అది తప్పు.

రోమా 4:5 లో 'పనిచేయక' (క్రియల ద్వారా కాక) 'భక్తిహీనుని' అను పదాలు అబ్రాహామును గురించి అనడము వారు (యూదులు) జీర్ణించుకోలేకపోతున్నారు. దేవుడు పిలువక ముందు అబ్రాహాము అయినా ఇంకెవరైనా భక్తిహీనులు, పడిపోయిన స్థితిలోనే ఉంటారు. అబ్రాహాము విశ్వాసము వలననే నీతిమంతుడైనాడు. ధర్మశాస్త్రములో బాబెలు గోపురము నాశనము చేయబడిన సమయంలో అబ్రాహామును గురించి వ్రాయబడి వుంది. అటువంటి పరిస్థితుల మధ్య నుండి అబ్రాహామును దేవుడు బయటకు తీసుకొని వచ్చాడు. ఒక కొత్త తరానికి క్రొత్త ఆరంభానికి గుర్తుగా అబ్రాహాము ప్రాధాన్యత వహిస్తున్నాడు. అబ్రాహాము విశ్వాసములో పెరిగాడు. దేవుని మాట నమ్మాడు. వినుట వలన విశ్వాసము వస్తుందని పౌలు చెప్పాడు.

రోమా 4:6లో క్రియలు లేకుండా అంటే ధర్మశాస్త్రానికి విరోధంగా చేసే క్రియలు, పాపపు క్రియలు, బేరీజు వేయకుండా నీతిమంతునిగా దేవుడు తీరిస్తే వాడు ధన్యుడు అని దావీదు కూడా చెబుతున్నాడు అని పౌలు చెప్తున్నాడు. యూదులకు జాతి రీత్యా అబ్రాహాము, ధర్మశాస్త్రము రీత్యా మోషే మరియు రాజ్యము విషయంగా దావీదు-ఈ ముగ్గురినీ చాలా

గొప్పగా భావిస్తారు. అందుకే దావీదు ఉద్దేశములలో ఏది ధన్యమైనదో చెప్తున్నాడు. ఇక్కడ కీర్తన 32:1, 2 వచనాలు జ్ఞాపకము చేస్తున్నాడు. ఎవని పాపములు క్షమించబడుతాయో వాడు ధన్యుడు అని పౌలు యూదులతో అంటున్నాడు. ధర్మశాస్త్ర ప్రకారమైతే పాపమునకు క్షమాపణ లేదు, రెండంతలు శిక్ష అనుభవించాలి (నిర్గమ. 22:7), సామెతలు 17:15 లో "దుష్టులు నిర్దోషులని తీర్పు తీర్చువాడు, నీతిమంతులు దోషులని తీర్పు తీర్చువాడు వీరిద్దరును యెహోవాకు హేయులు".

అబ్రాహాము, దావీదుల కిద్దరికీ ఒకేరకమైన అనుభవాలున్నాయి. నీతి అనేది క్రియలు లేకుండ ఆపాదించబడినది. విశ్వాసము అనునది పాపపు ఒప్పుకోలు కంటే గొప్పది. పాపము మనపైన పై చేయి సాధించింది. దానిని లేకుండా చేసినది విశ్వాసము. 4:9-12వ వచనాలలో అబ్రాహాము సున్నతి ద్వారా నీతిమంతునిగా తీర్చబడలేదు అను సత్యము యూదులకు చెప్తున్నాడు. కీర్తన 32:10,11లో- "యెహోవా యందు నమ్మికయుంచు వానిని కృప ఆవరించుచున్నది. నీతిమంతులారా, యెహోవాను బట్టి సంతోషించుడి అంటున్నాడు" దావీదు. ప్రభువు చేత నిర్దోషి అనిపించుకున్నవాడు ధన్యుడు అని దావీదు మాటలు పౌలు యూదులకూ మనకూ గుర్తుచేస్తున్నాడు. 10వ వచనములో అబ్రాహాము నీతిమంతునిగా ఎంచబడిన 14సంవత్సరాల తర్వాత సున్నతి చేయించుకున్నాడు. అందుకని అబ్రాహాము సున్నతి వలన కాదు, క్రియల వలన కాదు, కేవలము విశ్వాసము వలననే నీతిమంతుడిగా తీర్చబడ్డాడు అంటున్నాడు. సున్నతి అనేది విశ్వాసానికి గుర్తు. యూదులు దానిని వేరుగా అర్థము చేసుకున్నారు. ఇప్పుడు మనము కూడా రక్షణ బాప్తిస్మముల విషయంలో అదే చేస్తున్నాము. రక్షణకు విశ్వాసానికి గుర్తు బాప్తిస్మము.

12వ వచనములో అబ్రాహాము విశ్వాసము ద్వారా అన్యులను కూడా తన సంతానములో కలిగి ఉన్నాడు అని చెప్తున్నాడు. యోహాను 8:39 లో ఈ విధంగా వ్రాయబడి ఉంది. అందుకు వారు ఆయనతో మా తండ్రి అబ్రాహాము అనిరి. యేసు - మీరు అబ్రాహాము పిల్లలైతే అబ్రాహాము చేసిన క్రియలు చేతురు. ఆయన అడుగుజాడలలో నడవడము అంటే విశ్వాసము కలిగియుండుట. పౌలు, అబ్రాహాము సున్నతి గురించి వివరిస్తూ అది ఒక ఆచారం మాత్రమే. ఆచారాలకు ఆత్మసంబంధమైన విలువలుండవని చెప్తున్నాడు. సున్నతి లేని అన్యులకు కూడా తండ్రిగా ఉండుటకై సున్నతి పొందక ముందే

నీతిమంతునిగా తీర్చబడ్డాడు. అబ్రాహాము అడుగుజాడలలో నడిచినవారందరికి అతను తండ్రిగా ఉండుటకు దేవుడు ఏర్పరచాడు. అబ్రాహాము అడుగుజాడలలో నడవమంటే సంపూర్ణంగా దేవుని చిత్తానికి అప్పగించుకొనుట.

13-17వచనాలలో విశ్వాసము ద్వారానే అబ్రాహాము వాగ్దానము పొందాడు. వారసత్వపు దేశము నుండి లోకములోనికి తీసికెళ్లి నీవు సకల లోకానికి తండ్రివగుదువు అని చెప్పిన వాగ్దానము క్రీస్తులో నెరవేర్చాడు. ధర్మశాస్త్ర ప్రకారము అందరూ వారసులైతే వాగ్దానాలు నిరర్థక మగుతాయి. అన్నిటికంటే విశ్వాసము ముఖ్యము. 16వ వచనములో 'కృప' అను మాట ఉపయోగిస్తున్నారు. ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టిస్తుంది. కృపను అర్థము చేసుకోవాలంటే దేవుని ఉగ్రత తెలియాలి. ధర్మశాస్త్రము లేకుంటే నిషిద్ధ గీత లేదు. యేసయ్య ఈ గీత తుడిచేశాడు. ధర్మశాస్త్రము యూదులకు అర్థమౌతుంది. గాని అన్యులకు కృప అర్థమవుతుంది. సృష్టికర్త శక్తి గురించి కూడా పౌలు గుర్తు చేస్తున్నాడు (4:17).

చార్లెస్ స్విన్‌డల్ అనే భక్తుడు దేవుని కృపను గురించి ఇలా అన్నాడు – "నేను నిజంగా రక్షించబడినాను అని ఎలా తెలుస్తుందంటే, నేను పాపము చేసిన తర్వాత కూడా ఇంకా రక్షణలోనే ఉన్నాననుకుంటున్నాను". ఎంత గొప్ప రక్షణ నిశ్చయత!

యేసుప్రభువు + ఇంకేమైనా – క్రీస్తును అవమాన పరచుట

యేసయ్య ఒక్కడే కావాలి. క్రీస్తు + క్రీస్తు + క్రీస్తు.

ఒక ఉదాహరణ : ఒక తండ్రి ఆకలితో అలమటిస్తున్న తన బిడ్డలకు ఆహారము కొనిపెట్టుటకు డబ్బులేక, తన రక్తము అమ్మి, వచ్చిన డబ్బుతో గంజి తెస్తే – "మాకు నచ్చలేదు, పక్కింటికెళ్లి అడుక్కుని తెచ్చుకుంటాము" అని అంటే ఆ తండ్రికి ఎంత బాధగా ఉంటుందో మనము ఊహించుకోగలిగితే కొంతవరకైనా మనము తనను తృణీకరించినపుడు యేసయ్య పడు బాధను అర్థము చేసుకోగలము. రోమా 4:18-25 లో అబ్రాహాము విశ్వాసము విశ్వాసులు అనుకరించుటకు ఒక మాదిరి అని పౌలు చెప్తున్నాడు.

18 నుండి 22 వచనాలలో అబ్రాహాము విశ్వాసము ఎంత బలమైనదో చెప్తున్నాడు. ఈ విశ్వాసము కేవలము దేవుని మాటపైన ఆధారపడి ఉన్నది. అబ్రాహాము విశ్వాసము దినదినాభివృద్ధి చెందింది.

– అబ్రాహాము విశ్వాసము పెరిగిందనుటకు ఆధారము ఆదికాండము 17:15–21 వరకు చూడగలము. 90 ఏండ్ల శారా గర్భము ధరించునని దేవుడు చెప్పినపుడు నమ్మాడు.

– అసాధ్యమైన వాటిని నమ్మే విశ్వాసములోనికి అబ్రాహాము ఎదిగాడు. తాను విశ్వసించిన దేవుడు "మృతులను సజీవులనుగా చేయువాడును, లేనివాటిని ఉన్నట్టుగానే పిలుచువాడు" (4:17) అని నమ్మాడు. "నిరీక్షణకు ఆధారము లేనప్పుడు నిరీక్షణ కలిగి నమ్మెను" (4:18).

– ఈ విధంగా పెరిగిన విశ్వాసాన్ని దేవుడు నీతిగా ఎంచాడు. గలతీ 3:16,29 లో "అబ్రాహాముకును, అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను" "ఆ సంతానము క్రీస్తే" అని వ్రాయబడి ఉంది.

మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు. నీ సంతానము ఇస్సాకు కాదు, యేసయ్య అని చెప్పాడు, దేవుని మాట కాబట్టి నమ్మాడు. అబ్రాహాము విశ్వాసము పెరిగింది, 25 సంవత్సరాలు నమ్ముతూనే ఉన్నాడు. ఎంతమంది అపహసించి ఉంటారో. ఆ వృద్ధాప్యంలో పిల్లలు పుట్టడమేంటని, ఎంతగా ఎగతాళి చేసి ఉంటారో– అవన్నీ ఎదుర్కొని విశ్వాసములో ముందుకు దూసుకుపోయాడు. హెబ్రీ 11:17–22 లో చూస్తే దేవుని వాగ్దానమును మాత్రమే నమ్మాడు అని గమనించవచ్చును. ఇస్సాకును బలి అర్పించమన్నప్పుడు అతని విశ్వాసానికి బలమైన పరీక్ష, "మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై, తన ఏక కుమారుని అర్పించి, ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రీ 11:19).

వయసు ఎక్కువైనా అవిశ్వాసము వలన దేవుని వాగ్దానమును గూర్చి సందేహించలేదు. ఆది 17:17 లో "అప్పుడు అబ్రాహాము సాగిలపడి నవ్వి – నూరేండ్ల వానికి సంతానము కలుగునా? తొంబదియేండ్ల శారా కనునా? అని వ్రాయబడి ఉంది. వాళ్ల వయసును బట్టి మనసులో అనుకున్నాడు కాని, దేవుని మీద అనుమానం లేదు, సందేహించ లేదు (4:20) అని పౌలు ఖచ్చితంగా చెప్తున్నాడు. మనము ఆయనను

నమ్మితే, ఆయనను మహిమ పరచినట్లే. మృతతుల్యమైన శారా గర్భములో జీవమిచ్చాడు. దేవుడు సృష్టికర్త అను విషయాలు పౌలు నిర్ధారిస్తున్నాడు.

యోహాను 5:21లో – "తండ్రి మృతులను ఏలాగు లేపి బ్రతికించునో అలాగే కుమారుడును తన కిష్టము వచ్చిన వారిని బ్రతికించును". 1 కొరింథీ 1:9 లో దేవుడు నమ్మదగినవాడు అని పౌలు చెప్తున్నాడు. 23–25 వచనాలలో సువార్తను నమ్ముట వలన మనకు దీవెన కలుగునని పౌలు చెప్తున్నాడు. మనలను నీతిమంతులుగా తీర్చుటకై ఆయన మరణము నుండి లేచాడు. ప్రభువు నా కొరకు చనిపోయి తిరిగి లేచాడని నమ్మాలి, ఆదే సువార్త, అబ్రాహాము విశ్వాసము అతనికి నీతిని ఆపాదించిన ప్రకారము మన విశ్వాసము కూడా మనలను రక్షణలోకి నడిపిస్తుంది. మన క్రియల వలన కాక, కేవలము ఆయన కృప ద్వారానే మనము రక్షింపబడతామని గుర్తించాలి. యేసుక్రీస్తు రక్తము ద్వారా విమోచన కలుగుతుందను విశ్వాసము కేవలము దేవుని కృప ద్వారానే కలుగుతుందని మీకు ఇంకొక సారి గుర్తు చేస్తున్నాను.

ఒక అన్యుని యేసుప్రభువు మార్గములోకి నడిపించుటకు మనము అనుసరించ వలసిన మూడు మెట్లు :–1. అందరూ పాపులే, ఆ వ్యక్తి కూడా పాపియే అని రుజువు చేయాలి 2. తనంతట తాను రక్షణలోకి రాలేడు. 3. కేవలము యేసుప్రభువు మాత్రమే రక్షించగలడు అని చెప్పి ఒప్పింప చేయాలి.

# 5వ అధ్యాయము

**5**వ అధ్యాయములో పౌలు మొదటి 11 వచనములలో విశ్వాసము ద్వారా నీతిమంతులముగా తీర్చబడుట వలన కలిగే ఆశీర్వాదాలు చెప్పాడు. 12 నుండి 21 వచనములలో నీతికి ఆధారము ఏది అని చూపిస్తున్నాడు. ఆదాములో మరణమున్నది – క్రీస్తులో జీవమున్నది.

ఇంతవరకూ మనము చూసిన భాగంలో లోకంలో అందరూ నశించారు. అన్యులు, నీతిమంతులు, యూదులు నశించారు; కాబట్టి నీతి అవసరత ఉంది అని పౌలు చెప్పి తరువాత అబ్రాహాము విశ్వాసము ద్వారా నీతిమంతునిగా తీర్చబడ్డాడని చూపించాడు.

ఇంతవరకే చదివి ఆపేస్తే చదివేవారికి అర్థమయ్యే విషయాలు ఏమంటే అందరికీ నీతి అవసరత ఉందనియు, క్రీస్తు నందు విశ్వాసము ఉంచితే మనకు దొరుకుతుందని తెలుస్తుంది, కాని ఒక పాపి విశ్వాసము ద్వారా నీతిమంతునిగా తీర్చబడుటను గురించి తెలుసుకొనవలసిన విషయాలు చాలా ఉన్నాయి. మనకు దేవుడిచ్చిన నీతి సదా మనతో ఉంటుందా? క్రీస్తు సిలువలో చనిపోవుట ద్వారా మనలను ఏవిధంగా రక్షించగలడు? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు ఈ అధ్యాయములో దొరుకుతాయి.

1నుండి11 వచనాలలో నీతి ద్వారా మనకు వచ్చు ఆశీర్వాదములు చూద్దాము: ఈ ఆశీర్వాదాల గురించి చెప్పుట ద్వారా పౌలు రెండు ఉద్దేశ్యములు నెరవేర్చాడు. మొదటిగా క్రైస్తవునిగా ఉండుట ఎంత గొప్ప ధన్యతో మనము తెలుసుకోవాలని పౌలు ఉద్దేశ్యము. మనము నీతిమంతులముగా తీర్చబడుట కేవలము పరలోకానికి వెళ్తామను నిశ్చయత కొరకే గాకుండా ఈ లోకంలో ఉన్నప్పుడు కూడా చాలా ఆశీర్వాదకరంగా ఉంటుదని తెలుపుతున్నాడు. రెండవదిగా నీతి శాశ్వతంగా మనతో ఉంటుందని చెప్పుటకు

ప్రయత్నిస్తున్నాడు. ధర్మశాస్త్రము అనుసరించకుంటే కూడా ఈ ఆత్మీయ స్థితి మనకు ఉంటుందా? మరి మన శ్రమలు, కష్టాల మాటేమిటి? తీర్పు సంగతేంటి? మొదలగు ప్రశ్నలు యూదులు అడుగుతారని ముందే ఊహించి వారికి కూడా సమాధానము చెప్తున్నాడు.

దేవుడు ఎప్పుడైతే క్రీస్తులో మనలను నీతిమంతులుగా తీర్చాడో ఆ క్షణంలోనే మనకు ఏడు ఆత్మీయ ఆశీర్వాదాలు ఇచ్చి మనము తప్పిపోము అను నిశ్చయత ఇచ్చి మనలను సంతోషపెట్టాడు.

ఆ ఆశీర్వాదాలు ఏమిటో చూద్దాము.

**1. దేవునితో సమాధానము :**

రోమా 5:1 రక్షింపబడని వ్యక్తి దేవునితో శతృత్వము కలిగి ఉంటాడు. ఎందుకంటే అతను దేవుని ఆజ్ఞలను పాటించలేదు. దేవుని చిత్తము నెరవేర్చలేదు. యెషయా గ్రంథములోని రెండు వచనములు ఈ విషయము మనకు చూపిస్తాయి.

యెషయా 48:22లో “దుష్టులకు నెమ్మది యుండదని యెహోవా సెలవిచ్చు చున్నాడు”. యెషయా 32:17 లో “నీతి సమాధానము కలుగజేయును, నీతి వలన నిత్యమును నిమ్మళము, నిబ్బరము కలుగును. అప్పుడు నా జనుల విశ్రమ స్థలము నందును, ఆశ్రయస్థానముల యందును సుఖకరమైన నివాసముల యందును నివసించెదరు” అని వ్రాయబడి ఉంది.

రక్షింపబడకపోతే మనకు వినాశనము. దేవుడు మనలను పాపులనుగా ముద్రవేస్తాడు. మనకు విరోధంగా యుద్ధము చేస్తాడు. నీతిమంతులుగా తీర్చబడితే మనము నీతిమంతులని దేవుడు ముద్రవేస్తాడు. తండ్రియైన దేవుడు క్రీస్తు సిలువలో చనిపోవడము ద్వారా మనలను తనతో సమాధాన పరచుకున్నాడు (2కొరింథీ 5:18-20).

కీర్తన 85:10 లో – “కృపా సత్యములు కలిసికొనినవి, నీతి సమాధానములు ఒకదానినొకటి ముద్దు పెట్టుకొనినవి” అని సిలువలో జరిగిన కార్యమును దావీదు వివరిస్తున్నాడు.

**2. దేవుని సన్నిధికి ప్రవేశము :**

పాతనిబంధన కాలములో యూదుని ఒక తెర ద్వారా దేవుని సన్నిధి నుండి బయట ఉంచారు. అన్యుడిని ఒక గోడ ద్వారా అవరణలోనే ఉంచి దేవుని సన్నిధికి రాకుండా చేశారు. హద్దులు దాటితే చంపేసేవారు. కాని యేసయ్య సిలువలో మరణించినప్పుడు ఆలయతెర చినిగింది (లూకా 23:45). మధ్య గోడను పడగొట్టి ఇద్దరినీ ఏకం చేశాడు (ఎఫెసీ 2:14). క్రీస్తు ద్వారా యూదులు, అన్యులు కూడా దేవుని సమీపించుటకు వీలయింది (హెబ్రీ 10:19-25).

**3. దేవుని మహిమను గూర్చిన నిరీక్షణ :**

దేవునితో సమాధానపడిన తర్వాత పాత స్థితి గతిస్తుంది. మన పాపములను ఆయన గుర్తించుకోడు. దేవుని సన్నిధికి వెళ్ళే అవకాశము పొందిన మనము ఏ సహాయము కొరకైనా ఆయన దగ్గరికి వెళ్లగలము. ఈ నిరీక్షణ మన భవిష్యత్తులో జరగబోయేది. ఆయన మహిమలో పాలు పొందుకొనుటకు మనకు అవకాశము దొరుకుతుంది. ఈ నిరీక్షణను బట్టి అతిశయపడుచున్నామని పౌలు అంటున్నాడు. దీనిని బట్టి సంతోషిస్తున్నామని కొన్ని వచనములలో వ్రాయబడి ఉంది. మనము పాపులముగా ఉన్నప్పుడు మనకు అతిశయకారణమేమి లేదు. ఎందుకంటే పాపము చేత ఎవరమూ ఆయన మహిమ పొందలేక పోయాము (3:23). కాని క్రీస్తులో ఆయన ఇచ్చే నీతిని బట్టి మహిమను బట్టి అతిశయిస్తాము.

**4. క్రైసవ స్వభావము (రోమా5:3-4) :**

నీతిమంతులుగా తీర్చబడినంత మాత్రాన మనకు శ్రమల నుండి విడుదల రాదు. యోహాను 16:33 లో "లోకములో మీకు శ్రమ కలుగును. అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాననెను" అని వ్రాయబడి ఉంది. విశ్వాసి జీవితంలో శ్రమలు మంచి ఫలితాలనిస్తాయి. ఏ శ్రమలైనా ప్రభువు నుండి మనలను దూరపరచ లేవు. పై పెచ్చు శ్రమలు మనలను ప్రభువుకు దగ్గరగా నడిపించి మనలను క్రీస్తులాగా చేస్తాయి. శ్రమలు క్రైస్తవుని వ్యక్తిత్వమును నిర్మిస్తాయి. ఈ వరుసక్రమము చూడండి. శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేస్తుంది. శ్రమ అనే పదానికి వాడిన ఇంగ్లీషు పదం 'Tribulation'. ఈ పదము ఒక లాటిన్ పదము

'Tribulum' నుండి వచ్చింది. పౌలు దినాలలో Tribulum అంటే ధాన్యాన్ని దుల్లగొట్టేందుకు ఉపయోగించే ఒక బరువైన చెక్క, దానికి ముల్లుంటాయి. ధాన్యముపై ఆ కర్రతో కొట్టినప్పుడు ధాన్యము పొట్టు వేరుచేయబడతాయి. మనము శ్రమల నుండి వెళ్ళినప్పుడు దేవుని కృపపై ఆధారపడి ఉంటే శ్రమలు మనలను శుభ్రం చేసి పొట్టును తొలగిస్తాయి.

**5. మన హృదయాలలో దేవుని ప్రేమ నింపబడుతుంది (రోమా 5:5-8) :**

నిరీక్షణతో ఎదురుచూసినప్పుడు దేవుని ప్రేమ మనలోకి వస్తుంది. సామెత 13:12లో "కోరిక సఫలము కాకుండట చేత హృదయము నొచ్చును" అని వుంది. కాని మన కోరిక సఫలము అయింది కాబట్టి దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడుతుంది. గలతీ 5:22లో పౌలు చెప్పిన ఆత్మఫలములోని మూడు తొనలు మనలో ఎలా నింపబడుతున్నాయో గమనించారా? ప్రేమ, సంతోషము, సమాధానము. మనము రక్షింపబడక ముందే దేవుడు తన కుమారుని పంపుట ద్వారా తన ప్రేమను చూపించాడు. ఇప్పుడు మన మాయన బిడ్డలము కాబట్టి, ఇంకా ఎక్కువగా మనలను ప్రేమిస్తాడు. పరిశుద్ధాత్మ ద్వారా మనకివ్వబడిన ప్రేమను అనుభవిస్తున్నప్పుడే మనము శ్రమల గుండా వెళ్లుటకు మనకు శక్తి వస్తుంది.

శ్రమలలో ఉన్నవారికి మనకివ్వబడిన దేవుని ప్రేమను పంచితే వారు కూడా సమాధానము పొందుకుంటారు. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ కలిపి శ్రమలలో ఓర్పు నిస్తాయి. ఈ ఓర్పు విశ్వాసిలో భక్తిని, వ్యక్తిత్వాన్ని పెంచి క్రైస్తవ్యములో ఎదుగునట్లు చేస్తాయి.

**6. భవిష్యత్ ఉగ్రత నుండి రక్షణ (రోమా 5:9,10) :**

మనము శత్రువులుగా ఉన్నప్పుడే మనలను రక్షించిన దేవుడు ఆయన బిడ్డలమైన మనలను ఇంకా ఎక్కువగా రక్షిస్తాడు. దేవుని ఉగ్రత రాబోతున్నది కాని నిజమైన విశ్వాసి ఈ ఉగ్రత అనుభవములోనికి రాడు (1థెస్స 1:10). రాబోవు ఉగ్రత నుండి మనలను తప్పించాడు యేసయ్య. క్రీస్తు మరణము ద్వారా మనకు ఇన్ని మేలులు చేసినప్పుడు ఇప్పుడాయన తండ్రి కుడి పార్శ్వమున కూర్చుని మన కొరకు విజ్ఞాపన చేస్తున్నాడు. కాబట్టి ఇంకా ఎక్కువ మేలు జరుగుతుంది. యేసుక్రీస్తు మనలను తన

వీలునామాలో చేర్చాడు. ఆ వీలునామా తన రక్తంతో వ్రాశాడు. లూకా 22:20 "ఈ గిన్నె మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తము వలనైన క్రొత్త నిబంధన" అని అన్నారు.

వీలునామా నెరవేరుటకు ఆయన చనిపోయాడు. కాని తిరిగి లేచి పరలోకానికెక్కి ఆ వీలునామాలో ఉన్నవన్ని తానే నెరవేరుస్తున్నారు. తన స్వాస్థ్యమును తానే మనకు పంచుతున్నాడు. ఆయన జీవితం ద్వారా మనము రక్షించబడ్డాము.

## 7. దేవునితో నిత్య సమాధాన స్థితి కలిగియున్నాము (రోమా 5:11):

ఇప్పుడు మనము దేవుని స్నేహితులమయ్యాము. 'సమాధానస్థితి' అంటే ఆదాము హవ్వలు పాపము చేయక ముందు దేవునితో కలిగియున్న సహవాసం తిరిగిపొందుట. దేవునిపై యుద్ధము చేయాలనుకున్న మానవున్ని నిత్యనరకంలోకి త్రోసివేయగల దేవుడు, యుద్ధం ప్రకటించ కుండా తన కుమారుని సమాధానకర్తగా ఈ లోకానికి పంపారు. ఎఫెసీ 2:16-17 లో సిలువ ద్వారా సమాధానము వచ్చిందని పౌలు చెప్తున్నాడు.

ఈ 7 ఆశీర్వాదముల వలన మన భూత, వర్తమాన, భవిష్యత్తులు జాగ్రత్త చేయబడ్డాయి. క్రీస్తు మన కొరకు చనిపోయాడు, మనకొరకు జీవిస్తున్నాడు, మన కొరకు మరల రాబోతున్నాడు. ఇంత గొప్ప రక్షకుడిని మనము కలిగి యున్నందుకు మనము ధన్యులము.

రోమా 5:12-21లో మన నీతికి ఆధారము ఏమిటి? ఏ విధంగా మనకు బదులు యేసయ్య పాపము మోశాడు? ఈ ప్రశ్నలకు జవాబు తెలుసుకుందాము. ఈ భాగములో ఆదాముకు క్రీస్తుకు మధ్యగల తేడాలు విస్తారంగా చర్చించాడు. ఆదాముకు దేవుడు సృష్టిపైన అధికారము ఇచ్చినప్పుడు పాపము చేయుటవలన తాను అపవాదికి దాసుడై తన కివ్వబడిన అధికారము అపవాదికి ధారదత్తము చేశాడు. ఆదాము పాపము వలన యావత్తు మానవాళి మరణం, నాశనము క్రిందకు వచ్చింది. క్రీస్తు నూతన సృష్టికి రాజుగా వచ్చాడు (2కొరింథీ 5:17). సిలువలో ఆయన చూపిన విధేయతను బట్టి నీతిని రక్షణను తీసుకొని వచ్చాడు. ఆదాము పాపము వలన జరిగిన నాశనాన్ని సరిచేయడమే కాకుండా మనలను దేవుని కుమారులనుగా చేశాడు.

కొంత మంది "ఒక్కడి పాపము వలన దేవుడు మానవాళినంతా శపించడము న్యాయమా?" అని అడుగుతారు. దానికి సమాధానము 'అవును ఇది న్యాయమే కాక జ్ఞానము, కృపతో నిండినది'. ఒక్కొక్క వ్యక్తిని వేరు వేరుగా పరీక్షించి ఉంటే అందరిలో అవిధేయత కనపడేది. అదే కాక, ఒకని పాపము వలన శాపము వచ్చింది కాబట్టి ఒక్క మనిషి ద్వారానే రక్షణ వచ్చేట్లుగా దేవుడు ఏర్పాటు చేశాడు. ఆదాము మన కొరకు నియమితమైన సంయుక్త ప్రతినిధి, మనం జాతిపరంగా ఆదాములో కలిసి ఉన్నాము. కాబట్టి అతను చేసిన కార్యము మనలను కూడా ప్రభావితం చేసింది.

బైబిలు నుండి ఒక ఉదాహరణ చూద్దాము – హెబ్రీ 7:9,10వచనాలలో "పదియవ వంతులను పుచ్చుకొను లేవియు అబ్రాహాము ద్వారా దశమాంశములను ఇచ్చెను. ఏలాగనగా మెల్కీసెదెకు అతని పితరుని కలుసుకొన్నప్పుడు లేవి తన పితరుని గర్భములో ఉండెను". మెల్కీసెదెకు క్రీస్తుకు సాదృశ్యము. దీని ద్వారా మనము ఆదాముకు చెందినవారమని తెలుసుకోవచ్చును. పడిపోయిన దూతలు రక్షించబడలేదు. ఎందుకంటే వారు వేరొక జాతికి (దేవదూతలు) సంబంధించిన వారు. వారు ఒక్కొక్కరిగా పాపం చేశారు, వ్యక్తిగతంగా తీర్పు తీర్చబడ్డారు. వారికి ప్రత్యామ్నాయంగా వారి తీర్పును తమపైన వేసుకొని రక్షించే వారెవరూ లేరు. అయితే మన జాతి (మానవ జాతి)పిత అయిన ఆదాము వలన మనము పడిపోయాము. కాబట్టి మానవజాతిలోకి వచ్చి మనకు ప్రత్యామ్నాయంగా బలైన క్రీస్తు ద్వారా రక్షింపబడగలము. నూతన సృష్టికర్త యేసుప్రభువు. దేవుని ప్రణాళిక ఎప్పుడూ కృపగలదై, జ్ఞానయుక్తంగా ఉంటుంది.

మనము జాతి పరంగా ఆదాముకు చెందినవారము ఎందుకైనాము? అనే ప్రశ్నకు సమాధానంగా 12 నుండి 14 వచనాలలో ఈ విధంగా చెప్పబడి ఉంది – మానవులందరూ చనిపోతారని మనకు తెలుసు. ఆదాము పాపముకు ముందు మరణము లేదు. ఆజ్ఞాతిక్రమము వలన పాపము వచ్చింది. మోషే కాలం నాటి వరకు ధర్మశాస్త్రము లేదు. కాని ప్రజలు చనిపోయారు. దీనికి కారణమేమిటి? ఆదాము అవిధేయతే. పాపము చేసాక ఆదాము, అతని వారసులు అందరూ చనిపోయారు (ఆది. 5వ అధ్యాయం).

1కొరింథీ 15:22లో – "ఆదామునందు అందరూ ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు", క్రీస్తులో ఉన్నవారికి మరణం లేదు.

వాక్య ప్రకారము మరణం అంటే ఆత్మీయ మరణం. శారీరక మరణాన్ని 'నిద్ర' అన్నారు బైబిలులో. ఒక్కసారే జన్మించిన వారికి రెండు మరణాలున్నాయి. కాని రెండవసారి జన్మించిన వారికి రెండు మరణాలు లేవు.

ఆదాముకు, క్రీస్తుకు ఉన్న తేడాలు చూద్దాము. దీని మూల వాక్యము 1 కొరింథీ 15:45లో చూడగలము – "ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను".

| **మొదటి ఆదాము** | **కడపటి ఆదాము (క్రీస్తు)** |
|---|---|
| ★ అవిధేయత | ★ సిలువలో విధేయత |
| ★ మరణము | ★ జీవము – పునరుత్థానము |
| ★ పాపము | ★ నీతి |
| ★ ధర్మశాస్త్రము | ★ కృప |
| ★ శిక్ష | ★ నీతిమంతులుగా తీర్చబడుట |
| ★ పాపమునకు మొదలు | ★ పాపమునకు అంతము |
| ★ జీవించు ప్రాణి | ★ జీవింపచేయు ఆత్మ |

ఆదాము పాపము కంటే క్రీస్తు రక్షణ కార్యము ఘనమైనది. అందుకే కృప ఏలును, విశ్వాసులు క్రీస్తుతో కూడా ఏలుదురు అని వ్రాయబడి ఉంది. కృప అపరిమితంగా విస్తరించెను.

మనము ఆదాము జాతికి చెందిన వారము. అది పుట్టుకతోనే వచ్చింది, అది తప్పించుకోలేము. మన చేతిలో ఏమీ లేదు కాని ఆదాముతో ఇక ముందు ఉండకుండా దేవునిలో ఉండడము అనునది మన స్వంత ఎంపిక కాబట్టి ఆ నిర్ణయము మన చేతుల్లోనే ఉంది, నీకొదేముతో (యోహాను 3:3) యేసుప్రభువు "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని" చెప్పాడు. ఈ మాటలు మనకు కూడా అన్ని వేళలా వర్తిస్తాయి. మనము క్రొత్తగా జన్మించితేనే క్రీస్తులో ఉండగలము. రోమా 5:14 నుండి 21 వరకు ఉన్న వాక్యభాగానికి నారుమడి 1 కొరింథీ 15వ అధ్యాయము. యేసుక్రీస్తు శిరస్సు క్రింద విశ్వాసము ద్వారా నీతిమంతులముగా తీర్చబడుట ఒక ఆత్మీయ వాస్తవము.

ఆదాము ద్వారా పాపము మానవాళి కంతటికీ ఎలా సంక్రమించింది? అనే ప్రశ్నకు సమాధానంగా చాలా అభిప్రాయాలు ఉన్నాయి.

**మొదటి అభిప్రాయము :** కొంతమంది ఆదాము పాపం మనకు వచ్చే అవకాశమే లేదన్నాడు. Plagian అనే బ్రిటిష్ సన్యాసి దేవుడు ప్రతి ఆత్మను వేరు వేరుగా సృష్టించాడు కాబట్టి ఆదాము పాపములో పడిపోయినను ఆ ప్రభావము మానవ జాతి మీద లేదు అన్నాడు. ఈయన చెప్పిన ఈ అభిప్రాయాన్ని Plagianism అంటారు. అయితే ఈ అభిప్రాయము పౌలు రోమా పత్రిక 3:23లో చెప్పిన అభిప్రాయముతో ఏకీభవించదు కాబట్టి మనము త్రోసివేయవచ్చును.

**రెండవ అభిప్రాయము :** james Armanius అను ప్రొటెస్టెంటు పాస్టరు ఆదాము నుండి పాప స్వభావము పొందుతున్నాము, కాబట్టి దేవుని ఆజ్ఞలు నెరవేర్చలేక పోతున్నాము. ఆదాము నుండి సంక్రమించిన నేరం, శిక్ష మన దగ్గరకు రాకముందే దేవుని కృప దానిని అడ్డుకుంది. అందువలన మనకు శిక్ష రాదు అంటున్నాడు. ఇది కూడా సత్యమునకు దూరంగా ఉంది. దీనిని Armanianism అంటారు.

**మూడవ అభిప్రాయము :** కాల్విన్ ప్రవేశ పెట్టిన కాల్వినిజమ్ ఈ విధంగా చెప్తుంది – జన్మత: మనము పాపులము, ఆదాము పాపము అందరికీ సంక్రమించింది. ప్రతి ఒక్కరికీ ఆదాము ప్రతినిధిగా ఉన్నాడు. చట్టప్రకారమైన పాపము మనకందరికీ సంక్రమించింది. ఆదాము పాపానికి ముందు మరణము లేదు.

మనము చివరి అభిప్రాయముతోనే ఏకీభవిస్తాము. బైబిలు ప్రకారము ఆదికాండము 3వ అధ్యాయము చివరలో ఆదాము, హవ్వలకు చర్మపు చొక్కాయిలు చేయుటకు గొర్రెపిల్లలను బలిగా ఇచ్చినప్పుడు మొదటి జంతు మరణము, నాల్గవ అధ్యాయములో కయీను హేబెలును చంపుటలో మొదటి మానవ మరణము చూడగలము. 5వ అధ్యాయములో సహజ మరణాలు ఉన్నాయి.

ఈ వాక్య భాగములో 'ఏలుట' అనే మాట నాలుగు చోట్ల కనబడుతుంది. మానవ జీవితాలలో ఏ సమయములలో, ఏ పరిస్థితులలో ఏ దాని చేత ఏలబడుతారో వివరిస్తున్నాడు.

రోమా 5:14లో "ఆదాము చేసిన అతిక్రమమును బోలి పాపము చేయని వారి మీద కూడ, ఆదాము మొదలుకొని మోషే వరకు మరణము ఏలెను" అని పౌలు అంటున్నాడు. జన్మత: మనమందరము పాపులమే కాబట్టి మరణము ఏలుతుంది అని చెప్తున్నాడు.

రోమా 5:21లో "పాపము మరణమును ఆధారము చేసికొని" ఏలింది అన్నాడు.

రోమా 5:21లో "నిత్యజీవము కలుగుటకై, నీతి ద్వారా కృప" యేసుక్రీస్తు మూలంగా ఏలుతుంది అంటున్నాడు.

5:17లో – విశ్వాసులు యేసుక్రీస్తు కృపను బట్టి ఏలుదురు అంటున్నాడు.

ఈ పత్రికలో ఏలుట అను మాట ఎక్కువ సార్లు వాడబడినందుకు దీనిని కొందరు వ్యాఖ్యానకర్తలు "The Epistle of the kings" అంటారు. రాజులకు వాడబడుమాట "ఏలుట", కాబట్టి 'రాజుల పత్రిక' అంటారు.

క్రీస్తు కృపను గురించి కూడా చాలా విస్తారంగా వ్రాసిన పౌలు ఈ అధ్యాయములో పాపము గురించి ఎక్కువగా వ్రాస్తూ, దాని వెంబడి వచ్చే కృప గురించి కూడా విస్తారముగా వ్రాశాడు.

'కృపావరము' అను మాట 15వ వచనములో వ్రాసాడు. అపరాధముల వలన అనేకులు చనిపోతుండుటను బట్టి కృపావరము వచ్చింది. "కృపాబాహుళ్యము" అనే మాట 17వ వచనములో ఉన్నది. "అపరిమితమైన కృప" అను మాట 21వ వచనములో కనపడుతుంది.

ప్రభువైన యేసుక్రీస్తు ఏలాలంటే కృప విస్తరించాలి. ఆయన కృపచేత మనలను పాపవిముక్తులనుగా చేసి ఆయనతో పాటు ఏలువారిగా చేశాడు. "పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను" అను మాటతో ఈ అధ్యాయము ముగిస్తున్నాడు. ఎంత పాపము ఆదాము నుండి వచ్చినదో అంతకు మించిన కృప క్రీస్తునుండి వచ్చింది.

కృప ఎప్పుడు పాపమును ఏలుతుంది? వెలుగు చీకటిని ఏలాగు ఏలుతుందో అదే విధంగా కృప పాపముపై ఏలుతుంది. పాపము మరణమునకు నడిపిస్తుంది కాని యేసుక్రీస్తు ద్వారా కృప నిత్యజీవముకు నడిపిస్తుంది. క్రీస్తు పాపమును, మరణమును సంపూర్ణంగా జయించాడు.

ఈ చివర వచనంలో మన రక్షణలో యేసయ్య ఇచ్చిన మూడు గొప్ప వరాలను చూడగలము – మొదటిది – కృప, రెండవది – కృప ద్వారా వచ్చే నీతి; మూడవది – నీతి ద్వారా కలుగు నిత్యజీవము. ఈ విధంగా క్రీస్తు ప్రభువు వారు ఆదాము ద్వారా వచ్చిన పాపము తీసివేయడమే కాక మనలను తన కుమారులనుగా, కుమార్తెలనుగా చేసుకున్నాడు. పరలోక ఐశ్వర్యములన్నిటికి వారసులనుగా చేశాడు.



**నమ్మినవారు దేవుని కృపద్వారా**
**ఆయన పిల్లలవుతారు**

# 6వ అధ్యాయము

**రో**మా పత్రిక 6 నుండి 8 అధ్యాయాల వరకు 'విశ్వాసము ద్వారా నీతిమంతునిగా తీర్చబడుట' అను సిద్ధాంతాన్ని ధృవపరుస్తున్నాడు. రోమా పత్రిక ఒక న్యాయస్థానములో జరుగుతున్న దృశ్యములాగా వ్రాసాడని ఇంతకు ముందు చెప్పుకున్నాము. ఒక తెలివైన న్యాయవాది, ప్రత్యర్థి నుండి రాబోయే అభ్యంతరాలను, ప్రశ్నలను ముందే ఊహించి, వాటికి సరియైన సమాధానాలను సిద్ధపరచుకుంటాడు. ఇక్కడ పౌలు యూదుల నుండి మూడు అభ్యంతరాలు రావచ్చునని ఊహిస్తున్నాడు. 5వ అధ్యాయము చివరి భాగంలో "పాపమెక్కడ విస్తరించెనో, అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను" అని చెప్పాడు (5:21), వెంటనే పాఠకులు అడగబోయే ప్రశ్న: మనము పాపము చేస్తే కృప విస్తరిస్తుందని చెప్పావు కదా, మరి ఆ కృప అనుభవించడానికై మనము పాపము యందు నిలిచి ఉందామా? అని అంటున్న రోమా క్రైస్తవులకు పౌలు చెప్పిన సమాధానము చూద్దాము – యూదా క్రైస్తవులు ధర్మశాస్త్రాన్ని గాని, దేవుని కృపను గాని అర్థము చేసుకోలేదు. అందుకే రక్షణలోని శుద్ధీకరణ, భద్రపరచబడుట అనేవి కూడా వివరిస్తున్నాడు.

ఈ 6వ అధ్యాయములో పాపముపై విజయము సాధించుటకు 3 విధానాలు చూపిస్తున్నాడు.

**1. సత్యాన్ని తెలుసుకో (రోమా 6:1–10 వరకూ) :**

'ఎరుగండి' అని పదే పదే చెబుతున్న పౌలు మనందరము తెలుసుకోవాలన్న ఉద్దేశము కలిగియున్నాడు. క్రైస్తవ నడక క్రైస్తవ విలువలను, సత్యాలను తెలుసుకోవడముపై ఆధారపడి ఉంటుంది. క్రైస్తవుడు తెలుసుకోకుండా చేయటానికి అపవాది ప్రయత్నించి అతనిని శక్తిహీనుడిగా చేస్తాడు.

పౌలు బోధలో ఉన్న ప్రాధమిక సత్యమేమంటే ఒక విశ్వాసి యేసుప్రభువును నమ్మిన తర్వాత ఆయనతో ఏకీభవించాలి. ఆయనకు సంబంధించిన వారమను సంగతి వారు తెలుసుకోవాలి. ఆయన మరణం, భూస్థాపన, పునరుత్థానముల యందు పాల్గొనాలి.

**"పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవింతుము?** (6:2) అనే ఆలోచన కలిగి యుండాలి. "కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచి యుందుమా? అని వారడిగిన ప్రశ్నకు తీవ్రంగా ప్రతి స్పందించి – అట్లనరాదు" అని అంటున్నాడు. క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? "అంటున్నాడు "ఎరుగరా"? అని అడుగుతూ "ఎరుగండి" అని బోధిస్తున్నాడు, ఎందుకంటే తెలుసుకోలేకపోతే మనము ఆయన నీతి, రక్షణలో పాల్గొనలేము. ఆయనతో ఐక్యపరచుకోవాలి, ( Identification with Jesus) ఆయన మార్గములో నడుస్తూ ఏకీభవించాలి. యేసుక్రీస్తు మన పాపముల కొరకు చనిపోవుటే గాక, పాపమే తీసివేశాడు. మనము ఆయనతో పాటు చనిపోయామని అర్ధము చేసుకోవాలి.

క్రీస్తు మరణంలో ఐక్యపరచుకోవడము మొదటి మెట్టు, భూస్థాపన అంటే మరణం ధృవీకరించుట – ఎలాంటి అనుమానాలు లేకుండా ఆయనతో పాటు మరణించాలి. అప్పుడే మన పాత స్వభావము పోయే అవకాశము ఉంది. ఈ రక్షణానుభవము వ్యక్తిగతమైనది అని తెలుసుకొని మన దృక్పధము మారాలి. 'నీతిమంతునిగా తీర్చబడిన తర్వాత యేసు ప్రభువు నా జీవితంలో భాగమైనాడు. ఈ నీతి వలన సమృద్ధి జీవము వస్తుంది. నేను క్రీస్తులో ఉండి ఆయనతో ఏకీభవిస్తూ ఆయన గుర్తింపు పొందాను. (I am identified with Christ). అతను క్రీస్తుకు చెందిన వాడు అని ఇతరులు అనుకొనేలా జీవిస్తాను. ఆయన చనిపోయినందున నేను చనిపోయాను. ఆయన లేచినప్పుడు నేను లేచాను. నేనిప్పుడు ఆయనతో పరలోకంలో ఉన్నాను' అనుకోవాలి.

ఈ విషయాలు పౌలు వివరంగా ఎఫెసీ 2:1–10 లోను, కొలొస్స 3:1–3లోను వ్రాశాడు. క్రీస్తు మనతో, మనలో నివసిస్తున్నాడు. రోమా 6:2–5లో పాపము విషయమై చనిపోయాము అంటున్నాడు. ఇక్కడ బాప్తిస్మము ఒక ఉదాహరణగా చూపిస్తున్నాడు.

బాప్తిస్మము అను పదానికి వాడిన గ్రీకు పదానికి రెండు అర్థాలున్నాయి – 1. మునగడము, 2. ఏకీభవించడము (To be identified with) లేక విడదీయలేనంతగా గుర్తింపు పొందడము. రెండవ అర్థానికి ఉదాహరణ 1కొరింథీ 10:2 లో చూడగలము. అందరును మోషేను బట్టి మేఘము సముద్రము దాటినప్పుడు మోషేతో ఏకీభవించారని ఇక్కడ అర్థము.

పౌలు ఈ పత్రికలో 3:21 నుండి 5:21 వరకు పాపశిక్ష నుండి విడుదల (Justification) గురించి చెప్పాడు. 6 నుండి 8 అధ్యాయాల వరకు ఏమి చెప్పబోతున్నాడో క్లుప్తంగా చూద్దాము

| **3:21–5:21** | **6–8 అధ్యాయములు** |
|---|---|
| ★ మనకొరకు ఆయన చనిపోయాడు ఇది Substitution (ప్రత్యామ్నాయము) | ★ నేను కూడా ఆయనతో చనిపోయాను. ఇది Identification (గుర్తింపు) |
| ★ పాపము యొక్క క్రయధనం చెల్లించాడు (జరిమానా) | ★ పాపము యొక్క బలాన్ని నిర్వీర్యం చేశాడు |
| ★ పాప శిక్ష నుండి విడుదల Justification గురించిన సిద్ధాంతము బోధింపబడినది | ★ పాపము యొక్క అధికారము, పాపము ద్వారావచ్చు మలినము తొలగించుట (Sanctification) గురించి బోధింపబడింది. |
| ★ నీతి ఆపాదించబడింది | ★ నీతి జీవితంలో ఒక భాగమైంది. |
| ★ యేసయ్య మరణము వలన రక్షణ వచ్చింది | ★ యేసు పునరుత్థానుడైనందున నిత్యజీవము అనుగ్రహింపబడినది. |
| ★ పాప శిక్ష నుండి విడుదల అనునది ఒక క్రియ (Act) | ★ పాప శక్తి నుండి విడుదల అనునది ఒక ప్రక్రియ (Continuous Process) |
| ★ మనిషికీ, దేవునికి గల ఒక చట్టబద్ధమైన సంబంధము ఎర్పడుట | ★ మనిషికీ దేవునికీ మధ్య ఏర్పడిన ఒక జీవము గల బాంధవ్యము |

బాప్తిస్మము అనే ఉదాహరణ ద్వారా రోమీయులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము వివరిస్తున్నాడు. క్రీస్తులోకి బాప్తిస్మము అంటే ఒక్క శరీరములోకి ఒక్క ఆత్మ ద్వారా బాప్తిస్మము పొందుట. నీటి బాప్తిస్మమునకు, ఆత్మ బాప్తిస్మమునకు తేడాలున్నాయి. ఒక పాపి క్రీస్తును విశ్వసించినప్పుడు దేవుని కుటుంబములో చేర్చబడి పరిశుద్ధాత్మ దేవునిని వరంగా పొందుతాడు. ఇది కొర్నేలీ విషయంలో (అ.కా. 10:34–48) చూడగలము.

వారి ఇంటి వారు కొర్నేలితో పాటు క్రీస్తును నమ్మగానే పరిశుద్ధాత్మను పొందుకున్నారు. ఆ తర్వాత వారు నీటిలో బాప్తిస్మము (మునుగుట) పొందారు. ఇక్కడ పౌలు చెపుతున్న బాప్తిస్మము క్రీస్తు మరణము, భూస్థాపన, పునరుత్థానములలో పాలుపొందుటయే. బాప్తిస్మము తీసుకొనుట అంటే అంతరంగ మార్పుకు బహిరంగంగా గుర్తింపు పొందుట.

యేసుప్రభువును నూతనంగా విశ్వసించిన వారికి బాప్తిస్మమును గురించి చాలా అనుమానాలున్నాయి. బాప్తిస్మము అంటే బహిరంగ గుర్తు మాత్రమే అంటున్నారు కదా? మరి మేము బాప్తిస్మము తీసుకోకుంటే నష్టమేమిటి? అని చాలా మంది అడుగుతున్నారు.

మార్కు16:16లో – "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధించబడును" అని యేసు ప్రభువు స్వయంగా ఆదేశించారు కదా? మరి బాప్తిస్మము తీసికోకుంటే ఆజ్ఞాతిక్రమము, తద్వారా పాపము అవుతుంది.

మత్తయి 28:19లో "తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు" ముందుకు సాగుడని శిష్యులతో చెప్పాడు.

మత్తయి 3:13–17లో – మాదిరిగా ఉండుటకై యేసుప్రభువు వారు బాప్తిస్మమిచ్చు యోహాను యొద్ద బాప్తిస్మము తీసుకున్నారు. ఏ పాపమెరుగని ఆయనకు బాప్తిస్మము తీసుకోనవసరము లేదు కాని, యోహాను వారింప ప్రయత్నించినప్పుడు "నీతియావత్తు ఈలాగు నెరవేరుట మనకు తగియున్నది అని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను".

అపొస్తలుల కార్యములలో చాలా సందర్భాలలో విశ్వాసులు బాప్తిస్మము తీసుకున్నట్లు చూస్తున్నాము – అపొ.కా. 2:41లో పేతురు బోధలు విని రక్షణ పొందిన 3000 మంది, 8:38లో ఫిలిప్పు బోధ విని రక్షణ పొందిన నపుంసకుడు, 9:18లో అననీయ ద్వారా పరిశుద్ధాత్మ నింపుదల పొందిన పౌలు, 10:48లో పేతురు ద్వారా యేసు ప్రభువును తెలుసుకొని మార్పు చెందిన కొర్నేలి, బంధువులు మరియు స్నేహితులు మొదలగు సందర్భాలు అనేకములున్నాయి.

దేవుని పట్ల విధేయత చూపుటకును, యేసయ్యను అంగీకరించామని సంఘముకు, సమాజానికి తెలుపుటకును బాప్తిస్మము తీసుకోవాలి. ఈనాడు సమాజంలో రహస్య

క్రైస్తవులు అనేకులు ఉన్నారు. కానీ యేసుప్రభువు స్వయంగా చెప్పిన మాట ఏమంటే ఈ భూమి మీద మనుష్యుల ఎదుట ఆయనను అంగీకరించని వాడిని పరలోకంలో తండ్రి ఎదుట ఆయన అంగీకరించనని (లూకా 12:8,9) అన్నాడు. అటువంటి పరిస్థితిలో ఆయనను రహస్యంగా నమ్ముట వ్యర్థమని తెలుసుకోవాలి. ఎంతటి ప్రతికూల పరిస్థితిలోనైనా ఆయన మనతో ఉంటాడనే ధైర్యంతో ముందుకు సాగితే ప్రభువు మనతో ఉండి పరిస్థితులను అధిగమించు శక్తి నిస్తాడు. "నీతి కొరకు హింసించబడువారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది" అని ప్రభువు చెప్పిన మాటలు ఈ సందర్భముగా గుర్తు చేస్తున్నాను.

నీటిలో మునిగినంత మాత్రాన క్రీస్తు మనలోనికి రాదు. క్రీస్తు నందు విశ్వాసముంచ గానే పరిశుద్ధాత్మ ద్వారా ఆ కార్యము జరిగింది. క్రీస్తును కలిగియున్నప్పుడు విశ్వాసి "పాపమునకు చనిపోయాడు" "క్రీస్తుతో కూడా సిలువవేయబడ్డాడు" అని పౌలు చెప్పినట్లు మనము చెప్పగలగాలి. ఒక త్రాగుబోతు చనిపోయాడనుకుందాము. శవం దగ్గర బ్రాందీ, విస్కీలాంటి వేవైనా తెచ్చిపెట్టినా అతడు వాసన చూడడముగానీ, రుచి చూడడముగానీ చేయలేడు. క్రీస్తులో ఉన్నప్పుడు మనము పాపముకు చనిపోయి క్రీస్తు కొరకు జీవిస్తాము. ఆయన పునరుత్థాన శక్తితో నడుస్తాము. ఈ ఆత్మీయ సత్యము యోహాను 11వ అధ్యాయంలో లాజరు మరణ పునరుత్థానములలో కనబడుతుంది. లాజరును నాల్గవ రోజు యేసు ప్రభువు మరణము నుండి లేపాక యోహాను 12వ అధ్యాయములో లాజరు క్రీస్తుతో కూడా భోజన బల్ల యెదుట కూర్చుని అయనతో సహవాసము చేసినట్లుగా చూడగలము.

చాలామంది క్రైస్తవులు నులివెచ్చని క్రైస్తవ్యములో ఉన్నారు. ఐగుప్తు, కానానుకు మధ్యలో Betweeners (మధ్య నున్న వారు) గా ఉన్నారు. ఐగుప్తు పాపపు బానిసత్వమునకు సాదృశ్యము కాగా, కానాను పరలోకమునకు సాదృశ్యము. రక్షించబడ్డారు గానీ తృప్తిలేని జీవితము జీవిస్తున్నారు. వారు శుభ శుక్రవారం (Good Friday)నకు, ఈస్టర్‌కు మధ్యలో ఉన్నారు. సిలువలో విశ్వాసముంది కానీ, పునరుత్థాన శక్తి మహిమ పొందలేకున్నారు.


కొలొస్స 3:1-3 వచనాలలో "మీరు క్రీస్తుతో కూడా లేపబడిన వారు కాబట్టి పై నున్న వాటిమీదనే మనస్సు పెట్టుకొనుడి" అని పౌలు అంటున్నాడు.

రోమా 6-10 : 'ఇక పాపమునకు దాసులుగా ఉండకూడదు' అని పౌలు చెప్తున్నాడు. పాపము అనే భయంకరమైన యజమానికి మన శరీరాలు మంచి దాసులుగా

లభిస్తాయి. శరీరము మంచిది, చెడ్డదని వేరు వేరుగా ఉండదు. దేవుని కలిగి ఉంటే మంచిది, పాపము కలిగి ఉంటే చెడ్డది. మనకు పవిత్రత లేక రక్షణ కార్యం జరుగుతున్నప్పుడు పాపము నెమ్మదిగా పోయి దేవుని సారూప్యములోనికి వచ్చే అవకాశము ఉంటుంది. ఇక్కడ ఒక అద్భుతమైన సత్యము బోధింపబడియున్నది. ప్రాచీన స్వభావము (The old self, ego) క్రీస్తుతో కూడా సిలువ వేయబడ్డాడు కాబట్టి ఇక పాపము రాజ్యమేలదు. "చనిపోయినవాడు పాప విముక్తుడని తీర్పుపొందియున్నాడు" (6:7). పాపము ఇక నిరర్థకమౌతుంది. తన భర్త జీవించియున్నంత కాలం భార్య ఇంకొక వివాహము చేసుకొనుట న్యాయస్థానము ఒప్పుకోదు. అతను లేకపోతే న్యాయస్థానము ఉంటుంది. కాని న్యాయం మారిపోతుంది. మనము పాపముకు మరణించినప్పుడు ఇక పాపము మనకు లేనట్లే. పాపముకు, మరణముకు క్రీస్తుపై అధికారము లేదు కాబట్టి మన మీద కూడా లేదు.

**2. ఎంచుకో (Reckon) (రోమా 2. 6-11) :**

ఇంతకు ముందు 10వచనాలలో పౌలు 'తెలుసుకో' అన్నాడు. ఇప్పుడు ఎంచుకో అంటున్నాడు. సత్యము తెలుసుకొని నీ స్థానం నీవు గుర్తించాక మార్గం ఎంచుకోవాలి. విక్టోరియా రాణి చిన్నతనంలో చాలా అల్లరి పిల్లగా ఉండేది. ఉపాధ్యాయులు ఆమెను అదుపులో పెట్టలేక నీవు రాణి కాబోతున్నావు అల్లరి చేయకూడదు" అన్నారట. అనాటి నుండి అల్లరి మానివేసి బాధ్యతగల రాణిగా ఉండడము మొదలు పెట్టింది. తన మార్గం ఎంచుకుంది.




దైవశాస్త్రము ద్వారా ఏదైతే తెలుసుకున్నావో దానిని ఎంచుకో. క్రీస్తుతో కూడా చనిపోయావని తెలుసుకొని, దానిని ఎంచుకో. క్రీస్తుతో కూడా చనిపోయావని తెలుసుకున్నావు కాబట్టి నీ మార్గం ఎంచుకో. ఇదే ఆధ్యాత్మిక ఎదుగుదల, రక్షణ పొందాక వెనక్కి జారిపోవడము ఉండకపోవచ్చు గాని ఆత్మీయ ఎదుగుదల ఉండదు. ఆత్మీయంగా ఎంత పరిణతి చెందుతామో అంతగా పాపానికి దూరమౌతాము. ఇది మన చేతుల్లోనే ఉంది. పాపము, సత్యము అను రెండు అధికారాల క్రింద మనము ఉండలేము. మనము ఒకే సమయంలో ఇద్దరు యజమానులకు దాసులుగా ఉండలేమని ప్రభువే స్వయంగా చెప్పారు. మనము నీతిమంతులముగా తీర్చబడిన తర్వాత 'నీతి' అనే వృత్తములోకి ప్రవేశిస్తాము. ఈ పరిధికి బయట పాపం ఉన్నది.

ఆత్మీయంగా ఎదిగేకొద్ది మధ్యలో నున్న సిలువను సమీపిస్తాము. సిలువను సమీపించే కొద్ది పాపముకు దూరమౌతాము. అందుకే ఈ భాగము చివరి వచనము- "మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసు నందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" అని ముగిస్తున్నాడు.

పౌలుకు ఆనాటి సంఘములో సమాజములో చాలా ప్రాముఖ్యతలున్నాయి. కానీ అవన్నీ పెంటగా ఎంచుకున్నాడు (ఫిలిప్పీ 3:5-11). తనకున్న శ్రేష్టతలన్నీ చెప్పి చివరకు "సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను" అన్నాడు. ఆయన స్థిరమైన కోరిక ఒకటే - క్రీస్తుతో గుర్తించబడి క్రీస్తులాగా తయారవ్వాలని. ఆ స్థాయికి రావటానికి ప్రయాసపడి ఒకానొక సందర్భములో "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు కూడా నన్ను పోలి నడుచుకొనుడి"(1కొరింథీ 11:1) అన్నాడు. ఆత్మీయంగా ఎదిగే కొద్ది తనను తాను తగ్గించుకోవటం కూడా మనము చూడగలము. అతనిలోని మార్పును గమనించుటకు కొన్ని వాక్యభాగాలు చూద్దాము.

క్రీ.శ. 56లో "నేను అపొస్తలులందరిలో తక్కువ వాడను" (1కొరింథీ 15:9)
క్రీ.శ. 60లో "పరిశుద్ధులందరిలో అత్యల్పుడను" (ఎఫెసీ 3:11)
క్రీ.శ.64లో "పాపులలో ప్రధానుడను" (1తిమోతి 1:15)

పౌలు చెప్పిన మొదటి మాట "సత్యము తెలుసుకో" అనేది మనసుకు సంబంధించినది. రెండవది "ఎంచుకో" అనునది హృదయానికి సంబంధించినది. మూడవదిగా "అప్పగించుకో" అంటున్నాడు. ఇది మన చిత్తానికి సంబంధించినది.

### 3. అప్పగించుకో Yield (రోమా 6:12-23) :

ఈ మాట పౌలు మూడు సార్లు వాడాడు. ఒక బలిగా మనలను మనము అప్పగించుకోవడము. రోమా 12:1లో ఒక విశ్వాసి తన శరీరమును సజీవయాగముగా అప్పగించుకోవాలని పౌలు చెప్తున్నాడు. పాత నిబంధన బలులన్ని మృతమైన అర్పణలు కానీ దేవుడు మనలను తన కొరకు జీవించమంటున్నాడు.

12-13 వచనాలలో అప్పగించుకోవలసిన విధానము బోధిస్తున్నాడు. క్రీస్తు మన కొరకు చేసిన బలియాగాన్ని అర్థము చేసుకొని జ్ఞానముతో మనలను మనము

అప్పగించుకోవాలి. ఏదో ఒక మంచి బోధకుని మాటలు విని భావోద్రేకాలకు లోనై నిర్ణయించుకోవడము కాదు గానీ సంపూర్ణంగా మనసా, వాచా అప్పగించుకోవడమే.

దేవునికి మన శరీరమెందుకు? అని అడిగేవారు కూడా ఉన్నారు. మొదటిగా మన శరీరం దేవుని ఆలయం కాబట్టి ఆయన మహిమార్థం వాడబడాలి (1కొరింథీ 6:19,20, ఫిలిప్పీ 1:19, 20). మనము దేవుని సొత్తనియు మన శరీరము ద్వారా ప్రభువు ఘనపరచబడాలనియు పౌలు బోధిస్తున్నాడు.

అయితే దేవుడు మన శరీరాలను నీతి సాధనములుగా, ఆయుధములుగా వాడుకొంటాడని చెప్తున్నాడు. తన రాజ్యాన్ని స్థాపించుట కొరకు సాధనములుగా పనిముట్లుగా, తన శత్రువులతో పోరాడుటకు ఆయుధములుగా వాడుతాడు.

దేవుని ప్రణాళికలో తన శరీరాలను వాడటానికి ఇష్టపడిన కొంతమందిని బైబిలులో చూద్దాము.

మోషే చేతిలోని కర్రతో దేవుడు ఐగుప్తును జయించాడు.

దావీదు చేతిలోని వడిసెను ఉపయోగించి ఫిలిష్తీయులను దేవుడే ఓడించాడు. ప్రవక్తల నోర్లు, మాటలను (నాలుకలను) ఉపయోగించి తన ప్రజలను హెచ్చరించాడు. పౌలు కాళ్లను ఉపయోగించి పలు ప్రాంతాలకు సువార్త నిచ్చాడు. యోహాను కళ్ల ద్వారా భవిష్యత్తు చూపించాడు. యోహాను చెవులు దేవుని బోధలు వినడానికి, వినిపించడానికి ఉపయోగించాడు. యోహాను వేళ్లు తాను చూసినదంతా వ్రాయుటకు ఉపయోగించాడు.

మనము ఎందుకు అప్పగించుకోవాలి?

మనము కృప అధికారము క్రింద ఉన్నాము కాబట్టి పాపము మనలను ఏలదు. మనము దేనికి లోబడుతామో, దానికే దాసులముగా ఉంటాము.

17,18 వచనాలలో "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని, యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము"!

రోమా సంఘము వారు అపొస్తలుల బోధలు ఆచరించుట వలన విమోచింపబడి పాప దాస్యము నుండి విడుదల పొంది దేవునికి దాసులైనందున పౌలు దేవునిని స్తుతిస్తున్నాడు. పౌలు పరిచర్యలో అంతటా మనము గమనిస్తే ఆత్మల సంపాదనను బట్టి చాలా సంతోషించాడు. ఆత్మల భారము కలిగి నిరంతరము ఆత్మల సంపాదన నిమిత్తము పోరాడేవాడు.

నూతన పురుషునికి (విమోచింపబడిన ఆత్మకు), పాపమునకు, నిరంతర పోరాటము జరుగుతూ ఉంటుందని పౌలు హెచ్చరిస్తున్నాడు. ఈ నిరంతర పోరాటములో విజయము సాధించాలంటే ఏమి చేయాలో అర్థము చేసుకోవడానికి పాతనిబంధన నుండి ఒక ఉదాహరణ తీసుకుందాము.

**నిర్గమకాండం 17వ అధ్యాయములో లో ఇశ్రాయేలీయులకు, అమాలేకీయులకు జరిగిన యుద్ధము**

| **మోషే చేతులెత్తినప్పుడు గెలుపు** | **యెహోషువ కత్తి ద్వారా గెలుపు** |
|---|---|
| ★ కనిపించని యుద్ధము | ★ కనిపించే యుద్ధము |
| ★ మనకొరకు పరిశుద్ధాత్మ దేవుడు ఎల్లవేళలా విజ్ఞాపన చేస్తూ (యుద్ధము చేస్తున్నాడు). | ★ మనము వాక్యమనే ఖడ్గముచే యుద్ధము చేయాలి. |

అపవాది శక్తితో మనము చేయు నిరంతర పోరాటములో మనము మోషేవలె ప్రార్థన, యెహోషువ వలె వాక్యము (ఖడ్గం) ద్వారా గెలుపొందాలి.

రోమా 6:20లో – "మీరు పాపమునకు దాసులైయున్నప్పుడు నీతి విషయమై నిర్బంధము లేనివారై యుంటిరి" అని వ్రాయబడి ఉంది. ఈ పరిస్థితిలో ఉన్నప్పుడు దాసత్వము ఇంకా, ఇంకా పాపపు ఉచ్చులోకి తీసికెళ్లి, ఇక బయటకు రాలేని స్థితికి తెస్తుంది. ఉదాహరణకు లూకా 15:11–24లో ప్రభువు చెప్పిన తప్పిపోయిన కుమారుని ఉపమానములో తప్పిపోయిన కుమారుడు తిరిగి వచ్చి తండ్రికి అప్పగించుకున్నప్పుడు నిజమైన స్వాతంత్ర్యము వచ్చింది.

రోమా 6:22 లో "ఇప్పుడు పాపము నుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము, దాని అంతము నిత్యజీవము". పవిత్రత అనే ఫలము రావాలి అంటున్నాడు పౌలు.

ఒక యజమాని దగ్గర పనిచేస్తే మనకు జీతం వస్తుందని ఆశిస్తాము. పాపమునకు జీతం మరణము, నరకము.

దేవుడు కూడా మనకు జీతమిస్తాడు – పవిత్రత, నిత్యజీవము. పాత జీవితములో మనమిచ్చిన ఫలాలను చూస్తే మనము సిగ్గుపడే పరిస్థితే ఉంటుంది. క్రీస్తులో మనకున్న క్రొత్త జీవితంలో మన ఫలాలు దేవునికి మహిమ, మన జీవితాలకు ఆనందము కలిగిస్తాయి. విశ్వాస మార్గంలో పోయే వారు కూడా పడిపోతుంటారు. అలాంటి వారికి దేవుడు శిక్ష విధిస్తాడు. ఉదాహరణకు న్యాయాధిపతులు 16వ అధ్యాయంలో సంసోను నాజీరుగా చేయబడి ఫిలిష్తీయుల చెర నుండి ఇశ్రాయేలీయులను విడిపించుటకు ఏర్పరచబడినాడు. అయితే అతడు స్త్రీలోలుడై దేవునికి విరోధంగా ప్రవర్తించి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. **ఒక విశ్వాసి తన శరీరాన్ని దేవుని దాస్యము క్రిందకు తీసుకురాకపోతే, దేవునిచే తప్పక శిక్షింపబడతాడు.**

ఈ 6 అధ్యాయములో మనం ధ్యానించుకున్న 3 విషయాలు ఒకసారి మనం గుర్తు చేసుకుందాము. అనుదిన జీవితంలో మనము చేయాల్సినవి – సత్యము తెలుసుకో, సరైన మార్గము ఎంచుకో, నిన్ను నీవు అప్పగించుకో.

క్రీస్తుతో కూడా నీవు సిలువ వేయబడి యున్నావు.

★ పాపానికి చనిపోయావని **తెలుసుకో**

★ నీ జీవితంలో సత్యమార్గము **ఎంచుకో**

★ ఆయన మహిమార్థము నీ శరీరాన్ని **అప్పగించుకో**

1థెస్సలోనీకయులకు 5:23లో "సమాధాన కర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధ పరచును గాక, మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితము గాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక" – ఇది పౌలు విశ్వాసులమైన మనందరి కొరకు చేసిన ప్రార్థన!

# 7వ అధ్యాయము

**6**వ అధ్యాయములో పరిశుద్ధపరచబడుట (Sanctification) కొరకు సరైన పద్ధతిని గూర్చి పౌలు వివరించాడు. ఈ 7వ అధ్యాయములో పరిశుద్ధత ధర్మశాస్త్రము ద్వారా వస్తుందనునది తప్పు అభిప్రాయమని చెప్తున్నాడు. కృప ద్వారా రక్షింపబడ్డాము. కానీ మనము ధర్మశాస్త్ర ప్రకారము జీవిస్తే దేవుడు సంతోషిస్తాడు అని కొందరి అభిప్రాయము. అటువంటి వారికి పౌలు ఈ అధ్యాయములో సమాధానమిస్తున్నాడు. ఈ అధ్యాయములో ధర్మశాస్త్రము అనే పదము 18 సార్లు ఉన్నది. "ధర్మశాస్త్ర ప్రకారము జీవించుట ద్వారా నీవు నీతిమంతుడిగా తీర్చబడలేదు". కాబట్టి ధర్మశాస్త్ర క్రియల ద్వారా నీవు పవిత్రపరచబడవు అని యూదులకు పౌలు చెప్తున్నాడు.

అసలు ధర్మశాస్త్రం అంటే ఎమిటి? ఈ సంగతులు కొన్ని తెలుసుకుందాము. ధర్మశాస్త్రము అనగా ధర్మవిధులు గల గ్రంథము. ఇది దేవుడు మోషే ద్వారా అనుగ్రహించాడు. నిర్గమకాండము 19 నుండి 24 అధ్యాయాలలో దీనిని గురించి ఉన్నది. రోమా 5:13లో "ధర్మశాస్త్రము వచ్చినది గనుక పాపము లోకములో ఉండెను గాని ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము ఆరోపించబడదు" అని వ్రాయబడియున్నది. ఇది తప్పు అని ధర్మశాస్త్రము చెప్పకుంటే మనకు ఎలా తెలుస్తుంది? యూదా రబ్బీలు పాతనిబంధనలో బైబిలు ఆజ్ఞలన్నీ కలిసి 613 ఉన్నాయి అన్నారు. ఇవన్నీ సీనాయి పర్వతము మీద మోషేకు ఇవ్వబడ్డాయి. ఇవి రెండు రకాలుగా ఉన్నాయి.

1. Mandatory Laws - తప్పని సరిగా పాటించాల్సినవి, ఇవి 248 ఉన్నాయి.
2. Prohibitory Laws - చేయకూడనివి, ఇవి 365 ఉన్నాయి.

ఈ విధులు ఏవంటే –

ఎ. పది ఆజ్ఞలలోని నీతిశాస్త్రము (నైతిక జీవితానికి సంబంధించినవి)

బి. పండుగలు, ఆరాధనలు మొదలైనవి (సాంఘిక జీవితానికి చెందినవి)

సి. ప్రత్యక్ష గుడారములో ఆచరించాల్సినవి (మతపరమైనవి).

పౌలు గలతీ 3,4 అధ్యాయములోను, రోమా 6–8 అధ్యాయములోను ధర్మశాస్త్రము విశ్వాస నియమానికి విరుద్ధంగా ఉంది అని చెప్తున్నాడు. ధర్మశాస్త్ర ప్రకారము జీవిస్తే రక్షణ రాదని చెప్పాడు. మనము ధర్మశాస్త్రము పూర్తిగా ఆచరించలేము, కాబట్టి అది మాత్రమే ఉంటే మనకు రక్షణకు బదులు శాపము వస్తుందని చెప్పాడు. హెబ్రీ 9:11–15లో ధర్మశాస్త్రము అసంపూర్ణంగా ఉంది కాబట్టి అది మనలను రక్షించలేదని చెప్పాడు.

రోమా 7వ అధ్యాయములో ధర్మశాస్త్రములోని నీతి విధులు చాలా కష్టమైనవి కాబట్టి పాపులమైన మనకు వాటిని సంపూర్ణముగా గైకొనుటకు శక్తి చాలదు, కాబట్టి రక్షణ పొందుకోలేమని చెప్పాడు. అయితే మనకు ధర్మశాస్త్రము అవసరము లేదని అనుకోకూడదు.

గలతీ 3:24లో మన పాపములను మనకు చూపించి క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను అంటున్నాడు. మనము దేవుని కృపచే ఆయన పరిశుద్ధాత్మ వలన నూతన పరచబడిన తర్వాత నీతితో కూడిన ఆ ఆజ్ఞలను మనం స్వయంగా లోబడుటకు మనస్సు కలవారమగుదము (ఎఫెసీ 1:8–10). అప్పుడు మనకు అది దాసత్వము అనిపించదు, గాని ఇష్టపూర్వకముగా చేయునదై, మన హృదయముల మీద వ్రాయబడిన ధర్మశాస్త్రము అనబడును (యిర్మీయ 31:33, హెబ్రీ 8:8–10).

సమస్త దేశ జనులలో ఇశ్రాయేలీయులు యెహోవా దేవుని జనులుగా పిలువబడుతారు కాబట్టి ఆయన జనులుగా, యాజకులుగా ఉండుటకు అవసరమైన ఆజ్ఞలు ధర్మశాస్త్రము ద్వారా ఇవ్వబడినాయి. ఇశ్రాయేలు ప్రజలకు దేవుడిచ్చిన వాగ్దానము ప్రకారము వారిని గొప్ప జనాంగముగా చేసిన తర్వాత వాగ్దాన దేశమునకు పంపక ముందు వారు నిబద్ధతతో కూడిన జీవితము జీవించాలని దేవుడు చేసిన ప్రయత్నమిది.

6వ అధ్యాయములో నీ మనసులో సత్యము తెలుసుకో. నీ హృదయములో సరైన మార్గము ఎంచుకో, నీ చిత్తము సంపూర్ణముగా దేవునికి సమర్పించుకో అనే మాటలు

అర్థము చేసుకున్నాక, శారీరక క్రియల మీద విజయము సాధించే ప్రయత్నాలు చేస్తూ ఆత్మీయంగా ఎదుగుతున్నామనుకుంటారు. చాలా ఉన్నతమైన ప్రమాణాలు పెట్టుకొని అవి అందుకోలేక పడిపోతుంటారు. ఈ ప్రమాణాలు ఎక్కడ నుండి వచ్చాయి అని ఆలోచిస్తే అవి అన్నీ ధర్మశాస్త్రము నుండే వచ్చాయి. మనకు తెలియకుండానే ధర్మశాస్త్రమనే గొడుగు క్రిందికి వెళ్లిపోతున్నాము. ధర్మశాస్త్ర ప్రకారము మనము జీవిస్తే పరిశుద్ధులముగా ఉండి దేవుని సంతోషపెడతామనే భావన కలుగుతుంది. మన ఆత్మీయతను ధర్మశాస్త్ర ప్రకారము ఏది చేయాలో, ఏది చేయకూడదో అని బేరీజు వేసుకుంటాము. ధర్మశాస్త్రములో ఉన్న ముఖ్యమైన లోపమేమంటే అది పాపములను చూపిస్తుంది కాని పాపములు పరిష్కరించే మార్గము చూపలేదు, ఈ ధర్మశాస్త్ర ఆధిపత్యము నుండి బయటపడాలంటే ఏమి చేయాలో పౌలు చూపిస్తున్నాడు.

1-6 వచనాలలో ధర్మశాస్త్రము యొక్క ఆధిపత్యము

7-13 వచనాలలో ధర్మశాస్త్రము యొక్క పరిచర్య

14-25 వచనాలలో ధర్మశాస్త్రము యొక్క అసమర్థతను గురించి చెప్తున్నాడు.

రోమా 7:1-6 వచనాలలో మనుష్యుడు బ్రతికినంత కాలమే ధర్మశాస్త్రము అతని మీద ప్రభుత్వం చేస్తుంది అనే సూత్రము చెప్తూ దానికి ఒక ఉదాహరణ ఇస్తున్నాడు. ధర్మశాస్త్రము చనిపోలేదు కాని నీవు క్రీస్తుతో పాటు చనిపోయావు కాబట్టి ధర్మశాస్త్రానికి నీ మీది అధికారము లేదంటున్నాడు. భర్త జీవించియున్నంత కాలము అతనికి తన భార్య మీద అధికారము ఉంటుంది, కాని అతడు చనిపోతే ఏ అధికారము ఉండదు అంటున్నాడు. భర్త చనిపోయిన తర్వాత ఆమె మరో వివాహము చేసుకోవచ్చు. రక్షించబడిన వారు భార్య అయితే, భర్త ధర్మశాస్త్రము. ఈ ఉదాహరణలో భర్త చనిపోయాక, భార్య మరో వివాహము చేసుకోవాలంటే తనను తాను నూతనపరచుకోవాలి. క్రీస్తును నమ్మినప్పుడు ధర్మశాస్త్రముకు చనిపోయి, తిరిగి లేచి క్రీస్తుతో వివాహము, క్రొత్త జీవితము జీవిస్తామని పౌలు అంటున్నాడు. ధర్మశాస్త్రము చనిపోలేదు గాని, మనకు అది చనిపోయినట్లే కాబట్టి దాని అధికారము క్రింద లేము. ధర్మశాస్త్రానికి చనిపోవుట అంటే కట్టుదిట్టాలు, క్రమశిక్షణ లేనివారముగా జీవించవచ్చు అని కాదు గాని ధర్మశాస్త్రము మన హృదయాలలో వ్రాయబడి ఉంది. పరిశుద్ధాత్మ దేవుడు మనలను వాక్య ప్రకారము నడిపిస్తాడు. 2 కొరింథీ 3:2-3లో మన హృదయముపైన ధర్మశాస్త్రము వ్రాయబడి ఉందని పౌలు అంటున్నాడు.

రోమా 7:7-13 వరకు ఉన్న వచన భాగములో ధర్మశాస్త్రము యొక్క పరిచర్యను గురించి వ్రాస్తున్నాడు – 'ధర్మశాస్త్రాన్నే పాపముగా చేస్తున్నావే' అని ప్రశ్నిస్తున్న యూదులకు "అట్లనరాదు" అంటూ ధర్మశాస్త్రము చేయు కార్యములు చెప్తున్నాడు. ధర్మశాస్త్రము పాపము కాదు గాని, పాపమంటే ఏమిటో తెలుపుతుంది. మన అంతర్మనిషిని చూపించి అందులో ఎంత మాలిన్యమున్నదో చూపేటి అద్దము వంటిది ధర్మశాస్త్రము. పౌలు 'దురాశ' అనే మలినము ఒకటే ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఎందుకంటే దురాశ సకల పాపములకు మూలమని చెప్పబడి ఉన్నది. యాకోబు 1:15లో "దురాశ గర్భము ధరించి పాపము కనగా, పాపము పరిపక్వమై మరణము కనును" అని వ్రాయబడి ఉన్నది. ధర్మశాస్త్రము పాపమంటే ఏమిటో తెలియజేస్తుంది. పాపమేదో తెలియకపోతే ఇక జీవమెక్కడుంది?

మార్కు 10:17-27లో యేసుప్రభువు ఒక ధనవంతుడైన యౌవనుని గురించి చెప్పినమాటలను ఆలోచిస్తే అతను ధర్మశాస్త్ర ప్రకారము నడుచుకుంటున్నాడు గాని రక్షణ అనుభవము లేదు. బాహ్యంగా ధర్మశాస్త్రము లోని ఆజ్ఞలన్నీ పాటిస్తున్నాడు కాని తనలోని ఆంతర్య పాపములను ఎప్పుడూ చూసుకోలేదు. ధర్మశాస్త్రము అతనిని రక్షించలేదని ప్రభువుకు తెలిసినా ధర్మశాస్త్రము గురించి ఎందుకు చెప్పాడంటే తన పాపమేంటో ధర్మశాస్త్రము ద్వారా తెలుసుకుంటాడేమోనని ఆశించాడు. దురాశ అనునది 10 ఆజ్ఞల్లో చివరిది. అది అతడు పాటించుట లేదు. ఎప్పుడైతే యేసుప్రభువు అతనితో 'నీ ఆస్తి అమ్మి పేదలకు ఇమ్మన్నాడో' తన తప్పు తెలుసుకున్నాడు, కాని పాపము ఒప్పుకోకుండా క్రీస్తుకు దూరంగా వెళ్లిపోయాడు.

పరిసయ్యుడిగా, ధర్మశాస్త్రము బాగా పాటించేవాడిగా ఉన్న సౌలు, పౌలుగా మారిన తర్వాత తన స్థితిని అర్థము చేసుకున్నాడు.

1కొరింథీ 15:56 లో "పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే" అంటున్నాడు. మనము స్వతహాగా పాపులము కాబట్టి ధర్మశాస్త్రము ద్వారా పాపములన్నీ గుర్తు చేసుకొని, అయస్కాంతము ఇనుమును ఆకర్షించినట్లుగా, ఆ పాపములవైపు ఆకర్షితులమవుచున్నాము. ఏదైతే ధర్మశాస్త్రము వద్దంటుందో అదే చేయాలను మనస్తత్వము మానవునిది (చిన్న పిల్లల్లాగా). "ఇక్కడ ఉమ్మివేయరాదు" అని బోర్డు పెడితే అక్కడే ఉమ్మివేస్తారు ఈనాటి మానవులు.

10,11 వచనములలో ధర్మశాస్త్రము జీవము నివ్వలేదు గాని చంపుతుంది అని పౌలు అంటున్నాడు. పాపికి "నీవు పాపము చేశావు, నాశనమౌతావు" అని మాత్రమే చెప్తుంది. అందుకు ధర్మశాస్త్ర ఆచారాలు ఎక్కువగా పాటిస్తున్న సంఘాలు ఆత్మీయ ఫలాలు ఫలించుటలేదు. వారు ధర్మశాస్త్ర ప్రకారము జీవిస్తున్నందున ధర్మశాస్త్రము వారిని చంపుతుంది నిత్య జీవానికి పోనియ్యదు. యేసుప్రభువు పరిసయ్యులను గురించి చెప్తూ వారు పరలోకమునకు పోరు, ఇతరులను పోనివ్వరు అన్నాడు. అందుకే ఆచారాలు ఎక్కువగా ఆచరించే సంఘాలలో నామకార్థ క్రైస్తవులు ఎక్కువగా ఉంటారు కాని వారిలో జీవముండదు, ఐక్యత ఉండదు, దేవునికి మహిమ రాదు.

క్రొత్తగా యేసుప్రభువు మార్గములోకి వచ్చిన క్రైస్తవుడు ఎదిగేకొద్దీ, క్రైస్తవ జీవితంలోని ఎన్నో సత్యాలు తెలుసుకుంటాడు. బైబిలుకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదువుతూ, సభలకు వెళుతూ చాలా విషయాలు నేర్చుకోవాలని ఆశపడుతాడు. అతనికి పరిశుద్ధాత్మ నడిపింపు లేకుంటే ఒక నాయకుని బోధలే వినడము, అతని బోధలే సరైనవి అనుకోవడము, బైబిలు మానేసి, ఇతరులు వ్రాసిన వ్యాఖ్యానాలు మాత్రమే చదవడము జరుగుతుంది. ఇది కూడా ఒక విధంగా ధర్మశాస్త్రము క్రింద ఉన్నటువంటి అనుభవము, దీని వలన ఆత్మీయ ఎదుగుదల లేకుండా పోతుంది. క్రీస్తు ఒక్కడే సద్బోధకుడు, ఏ మానవ బోధకుడైనా ఆయన స్థానము తీసుకోలేడు. మానవులు మనకు సమాచారం మాత్రమే ఇవ్వగలరు కాని పరిశుద్ధాత్మ దేవుడు మన ఆత్మీయ కన్నులు తెరచి మనలను వెలిగిస్తాడు, ఆత్మీయ సత్యాలు గ్రహించుటకు సహాయపడతాడు. పరిశుద్ధాత్మ దేవుడు మనలను జ్ఞానవంతులుగా చేసి ప్రయోజనకరంగా వాడుకుంటాడు.

7: 12,13 వచనాలలో ధర్మశాస్త్రము పాపము యొక్క తీవ్రత తెలియజేస్తుందని పౌలు చెప్తున్నాడు. రక్షణ పొందని ప్రజలకు పాపముందని తెలుసు, కాని పాపము ఎంత హాని చేయగలదో తెలియదు. పాపము యొక్క స్వభావము చాలామంది క్రైస్తవులకు కూడా తెలియదు. పాపము ఎంత చెడ్డదో తెలియకపోతే మనము దాని నుండి బయటపడాలని, విజయవంతమైన జీవితం గడపాలనే ఆశ మనలో ఉండదు. పౌలు ఈ విధంగా అంటున్నాడు – ధర్మశాస్త్రములో పాపము లేదు, అది పవిత్రమైనది, న్యాయమైనది, మంచిది. పాపమంటే ఏమిటో చూపిస్తుంది. న్యాయవంతమైన, మంచిదైన ధర్మశాస్త్రాన్ని వాడుకొని పాపము మనలను నాశనము చేస్తుంది. సమస్య ధర్మశాస్త్రము కాదు కాని మనలోని పాప స్వభావము.

7:14-25 - ధర్మశాస్త్రము యొక్క అసమర్థత : పాపము చేయకుండా ఉండుటలో ధర్మశాస్త్రము ఏ విధంగానూ తోడ్పడదు. అది ఏమేమి చేయలేదో పౌలు వివరిస్తున్నాడు. ధర్మశాస్త్రము మనలను మార్చలేదు; మనకు మంచిని చేసే శక్తినివ్వలేదు; మనకు విడుదల ఇవ్వలేదు అని పౌలు ధర్మశాస్త్రము యొక్క అసమర్థత గురించి చెప్తున్నాడు. ధర్మశాస్త్ర లక్షణాలు పౌలు నాలుగు మాటలలో చెప్తున్నాడు. పవిత్రుడు, న్యాయవంతుడైన దేవుడిచ్చిన ధర్మశాస్త్రము కాబట్టి పవిత్రత, న్యాయము, మంచితనము, ఆత్మీయత కలిగియున్నది. ఆత్మీయత ఉందని ఎలా చెప్పగలము? ధర్మశాస్త్రము మానవుని అంతర్మనిషిపై కేంద్రీకరిస్తుంది. నిర్గమకాండములో మొదటిసారిగా పది ఆజ్ఞలను గురించి మోషే బోధించినపుడు ప్రజల క్రియల గురించి ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి కాని ద్వితీయోపదేశ కాండములో రెండవసారి మోషే ధర్మశాస్త్రము గురించి వివరించినప్పుడు దానిలోని అర్థాన్ని వివరించాడు - ద్వితీ. 10:12,13లో నీ పూర్ణ ఆత్మతోను, మనసుతోను దేవుని సేవించి నీ మేలు కొరకు నేడు నీకాజ్ఞాపించు కట్టడలననుసరించు అని మోషే ఇశ్రాయేలు ప్రజలకు చెప్పాడు. ధర్మశాస్త్రము లోతుగా ధ్యానిస్తే అది మన అంతర్మనిషిని గురించే ఉంది.

15 నుండి 21 వరకు ఉన్న వాక్య భాగములో ధర్మశాస్త్రము నీకు మంచిని చేసే శక్తిని ఇవ్వలేదు అని పౌలు చెప్తున్నాడు.

ఈ భాగములో 'నేను', 'నన్ను', 'నా యొక్క', 'నాది' అను పురుష వాచక సర్వనామాలు (Personal Pronouns) 47 ఉన్నాయి. 'నేను' అనేదే ఇక్కడ అపరాది. శరీర సంబంధి అయిన క్రైస్తవుడు ఎప్పుడూ ఈ మాటలే వాడుతాడు. ఇతనిలో 'నేను' అనే సర్వనామము బ్రతికే ఉంటుంది. మనలో 'నేను' కాకుండా 'క్రీస్తు' ఉండాలి. ఇంగ్లీషులో 'I' ని వంచితే 'G' అవుతుంది. 'నేను' పోయి 'God' వస్తుంది. ప్రతి ఒక్క క్రైస్తవుని జీవితంలో పాపము అనేది నిజము. దానిని ధైర్యంగా ఎదుర్కోవాలి, అప్పుడది పారిపోతుంది. పాపము చేయకుండా ఉండుటకు ధర్మశాస్త్రము నాకు సహాయం చేయటం లేదు అంటున్నాడు.



పౌలు ఈ భాగంలో 3 సార్లు చెప్పిన విషయమే మరల, మరల చెప్తున్నాడు. ఒక శరీర సంబంధి అయిన క్రైస్తవుడు (Carnal Christian) పాపము చుట్టూ తిరుగుతూనే ఉంటాడు

| | 1st Cycle మొదటి పునరావృతము | 2nd Cycle | 3rd Cycle |
|---|---|---|---|
| వాస్తవము (Fact) | 14: నేను పాపమునకు అమ్మబడ్డాను | 18: నా శరీరమందు మంచి ఏదియు నివసింపదు | 21: నాలో కీడు చేసే నియమమున్నది |
| రుజువు (Proof) | 15,16 : నేను యిచ్ఛయించినది చేయక ద్వేషించినదే చేయుచున్నాను | 19 : నేను చేయగోరు మేలు చేయక, కీడునే చేస్తున్నాను | 21 : పాప నియమానికి లోబడుచున్నాను. |
| ముగింపు (Conclusion) | 17: నా యందు పాపము నివసించుచున్నది | 20 :నా యందు పాపము నివసించుచున్నది | 22 : నా శరీరము మరణమునకు లోనగుచున్నది |

ఈ వాక్య భాగములో చెప్పిన మాటలు ఒక పట్టికలాగా తయారు చేసి అర్థము చేసుకుందాము (7:14-25).

24 లో పౌలు చెప్పిందే 3 సార్లు చెప్పాడు. నన్ను విమోచించువాడెవడు అని పౌలు ఆర్తనాదం చేస్తున్నప్పుడు క్రీస్తే నా విమోచకుడు అని తెలుసుకున్నాడు. క్రీస్తుతో ఏకీభవించినపుడే విమోచన. పాపము మనలో ఉంది అను సత్యము అర్థము చేసుకోవాలి. పౌలులో ఉన్న అంతర్యుద్ధము విశదపరుస్తున్నాడు. ధర్మశాస్త్రము క్రిందకు వెళ్లినప్పుడంతా తన పాపములు తనకు తెలియపరచబడుతాయి.

“అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును?”.

ఈ ఆర్తనాదము చేస్తున్నపుడు పౌలు రోమీయుల శిక్షా విధానము ఒకటి గుర్తు చేసుకుంటున్నాడు. తన స్థితి ఆ శిక్షతో పోల్చుకుంటున్నాడు. ఈ శిక్ష ప్రకారము హత్య చేసిన శరీరమునకు, చంపబడిన వాని శరీరమునకు గొలుసులతో గట్టిగా కట్టి అతనిని వదిలేస్తారు. అతడు చచ్చేంత వరకు ఆ శవము అతనికి కట్టబడి ఉండాల్సిందే. అతడు ఎక్కడైనా సంచరించవచ్చు కాని ఎవరూ అతనికి సహాయపడుట గాని, ఓదార్చుట గాని

చేయరాదు. ఎవరైనా ఆ విధంగా చేస్తే, చేసినవాడికి కూడా ఈ శిక్ష విధించబడుతుంది. రోమీయులు ఆ కాలంలో భయంకరమైన శిక్షలు ఊహించి అమలు జరిపేవారు. వాటిల్లో ఈ శిక్ష అతి భయంకరమైన జుగుప్స కలిగించే శిక్ష అయిఉండవచ్చు. తూర్పు దేశాలలో ఉన్న వేడి వాతావరణ పరిస్థితులను బట్టి మరణించిన శరీరము వేగముగా చెడిపోవుట మొదలు పెట్టి, దుర్వాసన, కుళ్ళిపోతున్న శరీరములో నుండి వచ్చు అంటు వ్యాధుల వలన శిక్షింపబడిన వాడు మహాభయంకరమైన శ్రమ, వేదన అనుభవిస్తాడు. పౌలు పాపముతో కుళ్లిపోతున్న మన శరీరమును ఆ శిక్ష అనుభవించేవాడితో పోల్చి కేవలము క్రీస్తు మాత్రమే మనలను ఆ శిక్షనుండి రక్షించగలడని చెప్తున్నాడు.

"అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను" అను ఈ ఆక్రందన అందరిలో ఉండాలి. నన్నెవడు విడిపిస్తాడు? క్రీస్తే మనందరినీ విడిపించువాడు. పౌలు చేసిన ఈ ఆక్రందన ఒక క్రైస్తవుడిగానో, అపొస్తలుడు గానో చేసాడా? లేక ఆయన మారుమనసు పొందక ముందున్న పరిస్థితిని తలంచుకొని చేసాడా? అని చాలా వాదనలున్నాయి. అయితే Robert Haldane అను Scottish వాఖ్యాన కర్త ఏమన్నాడంటే ఒక విశ్వాసి ఆత్మీయంగా ఎదిగేకొద్దీ దేవుని వెలుగులోకి వచ్చి తనలోని దౌర్భాగ్యస్థితిని బట్టి అలాంటి ఆక్రందన చేయుట మనము తరచూ చూస్తుంటాము అన్నాడు. ఉదాహరణకు ఆయన దావీదు కీర్తన 38 లో చెప్పిన మాటలు జ్ఞాపకము చేశాడు – "నా పాపమును బట్టి నా యెముకలలో స్వస్థత లేదు… నా మనోవేదనను బట్టి కేకలు వేయుచున్నాను"

పరిశుద్ధాత్మ దేవునికి మనలను మనము అప్పగించుకుంటే, ఆయన చిత్తము జరిగించుటకు మనకు శక్తి వస్తుంది. శరీరము ఎప్పుడూ దేవునితో పోట్లాడుతూనే ఉంటుంది కాని మనలోని పరిశుద్ధాత్మ దేవుడు దేవుని ఆజ్ఞలకు విధేయుడై ఉంటాడు. మనం మంచి చేయాలంటే పరిశుద్ధాత్మ దేవునికి అప్పగించుకోవాలి. మన జీవితంలో ఆత్మఫలము కనపడాలంటే మనము క్రీస్తుతో ఐక్యము కావాలి. పౌలు సమస్యకు జవాబు పరిశుద్ధాత్మ శక్తి. అది Dynamite లాగా దగ్గర ఉంటే అద్భుతాలు చేయవచ్చు.

# 8వ అధ్యాయము

## క్రీస్తులోని భద్రత

**పౌ**లు ఇంతవరకు పాపశిక్ష నుండి విడుదల (Justification), పాప శక్తి నుండి విడుదల (Sanctification) గురించి చెప్పాడు. ఇప్పుడు రక్షణలోని మూడవ భాగమైన భద్రత (Preservation) గురించి చెప్తున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా వచ్చు భద్రత గురించి పౌలు చెప్తున్నాడు.

బైబిలు అనే ఆభరణములో రోమా పత్రిక ఒక వజ్రమైతే, ఆ వజ్రములోని మెరుపు 8వ అధ్యాయము (Spark in the diamond). ఇంతవరకు మనము పాపమును, చీకటి దృశ్యాలను చూశాము. ఇప్పుడు ఆ చీకటిలో వెలుగును దేవుడు మన కిచ్చిన భద్రత, స్వాతంత్ర్యము. దీనివలన మనకు అన్ని రకములైన బంధకాల నుండి విడుదల వస్తుంది. పౌలు యేసుక్రీస్తుతో ఐక్యమైన మనకు లభించే నాలుగు ఆధ్యాత్మిక విడుదల గురించి చెప్పాడు. కాబట్టి ఈ అధ్యాయాన్ని "క్రైస్తవ విడుదల ప్రకటన" అని పిలువ వచ్చును. ఇందులో అన్నీ పరిశుద్ధాత్మ ద్వారా జరిగేవే. పరిశుద్ధాత్మ అను మాట 19 సార్లు ఉన్నది. 2కొరింథీ 3:17 ప్రకారము "ప్రభువు యొక్క ఆత్మ ఎక్కడ ఉండునో అక్కడ స్వాతంత్ర్యము నుండును" అని వ్రాయబడింది.

పౌలు ప్రకటించిన ఈ ఆత్మీయ విడుదలలు ఎందునుండో చూద్దాము.

### 1. తీర్పు నుండి విడుదల:-

"క్రీస్తు యేసు నందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" (8:1). రోమా 3:20 లో శిక్షావిధి ఎందుకు వచ్చిందో చూశాము. అయితే 8:1లో శిక్షావిధి ఎందుకు లేదో చెప్తున్నాడు. "క్రీస్తునందున్నారు కాబట్టి" ఏ శిక్షావిధియు లేదు. ఇది గొప్ప సత్యము.

ఈ ఆశీర్వాదము కొరకు ఏ షరతులూ లేవు. ఆదాము శిరస్సు క్రింద ఉన్నప్పుడు శిక్ష ఉన్నది కాని క్రీస్తు శిరస్సు క్రిందికి వచ్చాక ఏ శిక్షావిధియు లేదు.

ఈ వచనములో 'ఏ తప్పులూ' 'ఏ అపజయాలు' 'ఏ పాపములూ' అనే మాటలేవీ లేవు. క్రైస్తవులు కూడా అపజయాలు పాలవుతుంటారు, పాపము చేస్తుంటారు. అబ్రాహాము తన భార్య విషయము అబద్ధ మాడాడు. ("అబద్ధములాడు పెదవులు యెహోవాకు హేయములు"), దావీదు వ్యభిచారం చేశాడు ("వ్యభిచరించకు" అనునది పది ఆజ్ఞలలో ఒకటి), పేతురు తన కత్తితో మల్లును చంపబోయాడు (శత్రువులను ప్రేమించమని ప్రభువు చేసిన బోధలకు వ్యతిరేకము). తమ పాపపు పనుల ఫలితము అనుభవించారు గానీ శిక్షావిధిలోకి వెళ్లలేదు. ధర్మశాస్త్రము శిక్షిస్తుంది గాని ఇప్పుడు మనము ధర్మశాస్త్ర ఏలుబడిలో లేము. విశ్వాసికి, ధర్మశాస్త్రమునకు ఉన్న క్రొత్త సంబంధము గురించి మూడు విషయాలు చెప్తున్నాడు.

### ఎ. ధర్మశాస్త్రమునకు మన మీద అధికారము లేదు (8:2):

పరిశుద్ధాత్మ మనలను పాప మరణముల నియమము నుండి విడిపించినందున ఇక ధర్మశాస్త్రము మనమీద అధికారము చెలాయించలేదు. క్రీస్తు నందున్న జీవములోనికి నడిపించబడ్డాము. ఇంతకు ముందున్న నియమము నుండి ఇప్పుడు జీవము గల దేవుని ఆత్మ నియమము క్రిందికి వచ్చాము. ధర్మశాస్త్రమునకు మనం చనిపోయాము. అందుకే ధర్మశాస్త్ర అధికారము నుండి విడుదల వచ్చి పరిశుద్ధాత్మ భద్రతలో ఉన్నాము.

### బి. ధర్మశాస్త్రము మనకు శిక్ష వేయలేదు (రోమా 8:3) :

ఎందుకు? యేసు ప్రభువు సిలువలో మనకు బదులు శిక్ష అనుభవించాడు. ధర్మశాస్త్రము రక్షించలేదు, కేవలము శిక్షించగలదు. అయితే దేవుడు తన స్వంత కుమారుని పంపి ధర్మశాస్త్రము చేయలేని కార్యమును చేయించాడు. యేసయ్య ఒక దేవదూతలాగా రాలేదు, మనిషిగా వచ్చాడు. పాప శరీరముతో రాలేదు. ఆవిధంగా వచ్చి ఉంటే ఆయన కూడా పాపి అయి ఉండేవాడు. కేవలము మానవుడి పోలికలో వచ్చాడు, మన పాపములు సిలువలో ఆయన శరీరముపై మోపబడినాయి. ఇహలోక న్యాయము ప్రకారము ఒకే అపరాధము కొరకు ఎవరూ రెండు సార్లు శిక్ష అనుభవించరు. యేసుక్రీస్తు మన కొరకు శిక్ష అనుభవించి తన రక్తముతో క్రయధనము చెల్లించాడు, మనము ఆయనలో ఉన్నాము కాబట్టి మనకు శిక్ష లేదు.

**సి. ధర్మశాస్త్రము మనపై పెత్తనము చెలాయించలేదు (రోమా8:4) :**

విశ్వాసి క్రీస్తు ఇచ్చిన నీతితో నీతిగల జీవితం జీవిస్తాడు. ధర్మశాస్త్ర శక్తితో కాదు గాని, పరిశుద్ధాత్మ శక్తితో జీవిస్తాడు. ధర్మశాస్త్రము మనలను పవిత్రులునుగా చేయలేదు అది మన పాపములను ఎత్తి చూపి, పాపమును శిక్షించగలదు. కానీ మనలో ఉన్న పరిశుద్ధాత్ముడు దేవుని చిత్తప్రకారము విధేయతతో జీవించుటకు సహాయము చేస్తాడు. దేవుడు మన నుంచి కోరే నీతి పరిశుద్ధాత్మ శక్తి ద్వారా నెరవేరింది. అందుకే పరిశుద్ధాత్మ ద్వారా మనకు జీవము, స్వాతంత్ర్యము, ఆనందము లభిస్తాయి.

ఫిలిప్పీ 2:13 "మీరు ఇచ్ఛయించుటకును, కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయా సంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే" అని పౌలు అంటున్నాడు.

**2. అపజయము నుండి విడుదల :**

8:5-17. ఇక బాకీ లేదు (No Obligation)

8:12-"కాబట్టి సహోదరులారా, శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము" అని అంటున్నాడు.

ఈ వాక్యభాగములో రెండు రకాల మనుష్యులను గురించి ప్రస్తావిస్తున్నాడు. "ఆత్మ స్వభావము గలవారు", "శరీర స్వభావము గలవారు" - రక్షణ పొందినవారు. పొందనివారు. వీరికి 4 తేడాలున్నాయి.

**ఎ.** 8:5 కొందరు శరీరానుసారులుగా ఉంటారు, కొందరు ఆత్మానుసారముగా ఉంటారు. శరీరానుసారులు ఆత్మను కలిగి ఉండరు, వారు శరీరము కొరకే జీవిస్తారు. శరీరమును తృప్తి పరచుటకే పని చేస్తారు. ఆత్మానుసారులు ఆత్మను కలిగియుండి క్రొత్త జీవితం జీవిస్తారు, ఆత్మ సంబంధమైన విషయాలపైననే కేంద్రీకరిస్తారు. శరీరానుసారులు మంచి పనులేవీ చేయరని కాదు గాని వీరిరువురి జీవితాలు వేరుగా ఉంటాయి.

**బి.** 8:6 మరణము, జీవము. శరీరానుసారుడు శారీరకంగా జీవించి ఉన్నాడు కాని ఆత్మానుసారంగా మరణించి ఉన్నాడు.

**సి.** 8:7 దేవునితో యుద్ధము, దేవునితో సమాధానము – 7వ అధ్యాయములో దీనిని గురించి చూశాము. యెషయా 48:22 లో "చెడ్డవారికి సమాధానముండదు" అని ప్రవక్త ప్రవచిస్తున్నాడు.

**డి.** 8:8 తనను తాను సంతోషపరచుకొనుట, దేవుని సంతోషపెట్టుట – పాపమునకు మూలము స్వార్థము. 'నేను' 'నా కొరకు' అంటుంటారు కానీ 'దేవుని కొరకు' 'దేవుని చిత్తము' అనరు. ఎప్పుడూ స్వప్రయోజనము విచారించుకుంటారు. ఇది మానవుని నీచ స్థితి అయితే ఆత్మానుసారులు ఎప్పుడూ దేవుని చిత్తప్రకారము జీవిస్తూ ఆయనను సంతోషపెడతారు.

8:9–11 మారుమనసుకు గుర్తు అయిన పరిశుద్ధాత్మ నీలో ఉంది అని పౌలు చెప్తూ "ఎవడైనను క్రీస్తు ఆత్మ లేనివాడైతే వాడాయన వాడు కాదు. క్రీస్తు మీలో నున్న యెడల మీ శరీరము పాపవిషయమై మృతమైనది గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగియున్నది" అంటున్నాడు. మృతులలో నుండి క్రీస్తును పరిశుద్ధాత్ముడు మనలో కూడా ఉండుట వలన మనలను కూడా లేపుతాడు. పరిశుద్ధాత్మ దేవునికి ఇంత గొప్ప పరిచర్య ఉన్నది. విశ్వాసుల జీవితాలలో పరిశుద్ధాత్మ పని ఎక్కువగా ఉంది.

మనము మరొకసారి 8:1కి వెళదాము. పౌలు చెప్పిన మాట "ఏ శిక్షావిధియులేదు". మనము రక్షణ పొంది దేవుని బిడ్డలముగా చేయబడి, ఎప్పుడైతే మనమీద నీతి ఆపాదించబడుతుందో అనాటి నుండి మనలో పరిశుద్ధాత్మ దేవుడు నివసిస్తాడు. మనము నిత్యత్వములోకి పోయేంత వరకు ఆయన మనలోనే ఉంటాడు. ఈ "రక్షణ శాశ్వతము" అనే అంశము పై చాలా వాదనలు జరుగుతూ ఉంటాయి. కానీ బైబిల్‌లోని చాలా వచనాలు ఈ సత్యాన్ని ఋజువుచేస్తాయి. రక్షణ మన ప్రయత్నము చేత, మన కృషి చేత సంపాదించుకొంటే, పోవడానికి అవకాశముంది. రక్షణ కృప చేత ఉచితంగా ఇవ్వబడింది కాబట్టి అది శాశ్వతము అని మనం నమ్మాలి. దానికి ఆధారమైన కొన్ని వచనాలు చూద్దాము.

యోహాను 6:63 – "తండ్రి చేత వానికి కృప అనుగ్రహింపబడకుంటే ఎవడును నా యొద్దకు రాలేడు" అని యేసయ్య అంటున్నాడు.

యోహాను 8:51 - "ఒకడు నా మాటలు గైకొనిన యెడల వాడెన్నడును మరణము పొందడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని ప్రభువు చెప్పుచున్నాడు.

ఇలాంటి వాక్యములు చాలా ఉన్నందున మనము రక్షణ శాశ్వతమని తెలుసుకోవచ్చును. రక్షణ పొందిన వారు కూడా పాపము చేస్తారు కదా, మరి వారుకూడా పరలోకమునకు పోతారా? అని కొందరు అడుగుతుంటారు. వారు పరలోకానికి వెళతారు కానీ చేసిన తప్పుకు ఇహలోకంలోనే శిక్ష అనుభవిస్తారు. ఉదాహరణకు దావీదు దేవుని హృదయానుసారుడు కాని అతడు చేసిన పాపము వలన ముగ్గురు కుమారులను పోగొట్టుకున్నాడు. జీవితములో సమాధానము లేకుండా జీవించాడు కాని నిత్య జీవానికి వెళ్లాడు కదా! యాకోబు తన తండ్రిని అన్నను మోసగించినందున తాను కూడా తన మామతో మోసగించబడ్డాడు. ఈ విధముగా అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఈ వాదన ఎందుకు వచ్చిందంటే దీని మూలము హెబ్రీ పత్రికలో కనబడుతుంది. హెబ్రీ పత్రికా రచయిత హెబ్రీయులతో మాట్లాడిన మాట "గొప్ప రక్షణను నిర్లక్ష్యం చేయవద్దు" అని. నిర్లక్ష్యం చేయవద్దు అని దేవుడే చెప్పాడు కాబట్టి జాగ్రత్తగా కాపాడు కోకుంటే పోతుందనే అభిప్రాయము కొందరిలో ఏర్పడినది.

మనము తిరిగి రోమా 8:12కు వద్దాము. ఇక్కడ పౌలు "శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము". మనము విమోచించబడిన వారము కాబట్టి ఇకపై మనము బానిసల సంతలో ఉంచబడిన బానిసలము కాదు. యేసుప్రభువు క్రయధనము చెల్లించి మనలను కొన్నారు. దేవుడు మనలను కొని, బయటికి తెచ్చి స్వాతంత్ర్యమిచ్చాడు. పరిశుద్ధాత్మ దేవునికి మనలను మనము అప్పగించు కొనినప్పుడు ఆయన మనలను రూపాంతర పరుస్తున్నాడు. నూతన సృష్టి గావించబడు తున్నాము. దేవుని సారూప్యము లోనికి మారుటలో పరిశుద్ధాత్మ మనకు సహాయపడు తున్నాడు.

14 వచనంలో "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులైయుందురు". ఇక్కడ "పిల్లలు" అనకుండా 'కుమారులు' అంటున్నాడు. 'కుమారుడు' అంటే యౌవన ప్రాయములో ఉన్నవాడు. చిన్న పిల్లలకు లేని హక్కులు కుమారుల కివ్వబడుతాయి. దేవుడు మనకు 'కుమారత్వము' అను స్థానమిచ్చాడు. మనము విశ్వసించి పొందుకోవాలి. మనమింక భయపడే పనిలేదు. ఎందుకంటే "మనము

దాస్యపు ఆత్మను పొందలేదు గానీ దత్తపుత్రాత్మను పొందితిరి” అని పౌలు చెప్తున్నాడు. “ఆ ఆత్మ కలిగిన వారై మనము ‘అబ్బా తండ్రీ’ అని మొరపెట్టుచున్నాము” అని పౌలు అంటున్నాడు (8:15). ఆ కాలంనాటి గ్రీకులు, రోమీయులలో ఎవరికైనా కుమారుడు కలుగక పోతే, బంధువులు కాకపోయినా ఎవరినైనా దత్తు తీసికోవచ్చు అను శాసనముంది. తన కిష్టమైతే తన బానిసలలో ఒకరినైనా దత్తత చేసుకోవచ్చునని. దత్తు చేయబడిన కుమారుడు తన తండ్రి పేరు పొంది అన్ని విధములుగా స్వంత కుమారునిగా పొందవలసియున్నవన్ని పొందుకుంటాడు. రోమీయులలో ఈ చట్ట ప్రకారమైన దత్తత కార్యక్రమము రెండు భాగములుగా ఉంటుంది. మొదటి భాగము వారిరువురి మధ్య జరిగే ప్రత్యేక కార్యక్రమము. రెండవది బహిరంగంగా అందరి ఎదుట ఈ సత్యాన్ని వెల్లడించుట, ఈ వచనములో మొదటి భాగమును గురించిన ప్రస్తావన ఉన్నది. రెండవ భాగము 23వ వచనములో ఉందని కొందరు వ్యాఖ్యాన కర్తలు చెప్తున్నారు. ఆ వచనములో “మనము కూడా దత్త పుత్రత్వము కొరకు అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము” అని వ్రాయబడి ఉన్నది. సేవకుడు ఇంతకు ముందే ఇంటిలోపల దత్తత చేయబడినాడు కాని బహిరంగ ప్రకటన చేయబడు సమయము కొరకు ఎదురుచూస్తున్నాడు. దత్తత తర్వాత ఆ కుమారుడు ఇక బానిస కాక, తన యజమానిని అబ్బా, తండ్రీ అని పిలిచే యోగ్యత సంపాదించు కుంటాడు.

గలతీయులకు వ్రాసిన పత్రిక 4:4-7 వరకు ఉన్న వాక్యభాగములో పౌలు ఈ విషయము స్పష్టపరుస్తున్నాడు. మనలను దత్తపుత్రులనుగా చేసికొను నిమిత్తము దేవుడు తన ఏకైక కుమారుని పంపాడని చెప్పబడి ఉంది.

8:16లో “మనము దేవుని పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతోకూడా సాక్షమిచ్చుచున్నాడు”. మనలో పరిశుద్ధాత్మ దేవుడు ఉన్నప్పుడు మన శరీరము దేవుని ఆలయమవుతుంది (1కొరింథీ 6:19, 20). పాపపు శరీరము చనిపోవాల్సి యుండగా మనలో ఉన్న పరిశుద్ధాత్మ, మనము దేవుని సేవచేయుటకై జీవము నిస్తుంది. ఎఫెసీ 1:13,14లో చెప్పబడిన ప్రకారము మనలో పరిశుద్ధాత్మ దేవుడు ఉన్నాడు కాబట్టి మనము చనిపోతే పునరుత్థానులవుతాము; పరిశుద్ధాత్మ మనలో ఉంటే మన ఆలోచనా దృక్పధము మారుతుంది. సంతోషం నిండిపోతుంది.

డి.యల్.మూడీ గారు తన మారుమనసు అనుభవము ఈ విధముగా చెప్పాడు – నేనొక క్రొత్త ప్రపంచములో ఉన్నాను. తర్వాతి దినమున ఉషోదయ సూర్యుడు ఇంకా తేజస్సుతో వెలిగాడు, పక్షుల కిలకిలరావము రోజూకంటే ఇంకా తియ్యగా ఉన్నది....పాత వృక్షాల ఆకులు, కొమ్మలు ఆనందంతో ఊగాయి. ఇంకా సృష్టి యావత్తు శాంతి సమాధానాలతో నిండియున్నట్లుగా ఉంది" క్రీస్తులో జీవము సమృద్ధి జీవము.

రోమా 8:12–17 లో ఇప్పటి వరకు మనకు బోధించిన మాటలు మనము ధ్యానించుకున్నాము. మనము ఆత్మచేత నడిపించ బడుతున్నాము అను మంచి స్థితిని గురించి మనకు చెప్పాడు. మనలో దేవుడు తన ఎనలేని ప్రేమను బట్టి పరిశుద్ధాత్మ దేవుని ఉంచాడు. కాని మనము ఆయనను కలిగి ఉండాలి. మనము అంగీకరిస్తేనే ఆయన మనలో కార్యం చేసి మనకు రావలసిన ఆశీర్వాదాలన్ని వచ్చేట్లుగా చేయగలడు. "మనము శరీరమునకు ఋణస్థులము కాము" అని పౌలు చెప్తున్నాడు. శరీరానుసారులముగా ఉన్నంతవరకు మనకు కష్టాలే వచ్చాయి. మనమిప్పుడు పరిశుద్ధాత్మ దేవునికి ఋణపడి ఉన్నాము. ఎందుకంటే ఆయన మనలను ఒప్పింపచేసి క్రీస్తును ప్రత్యక్షపరచి, ఆయన ద్వారా మనకు సమృద్ధి జీవము వచ్చేటట్లు చేశాడు.

పరిశుద్ధాత్మ మన జీవానికి ఆత్మ కాబట్టి క్రీస్తుకు విధేయత చూపుటలో క్రీస్తు సారూప్యములోకి మారుటకు శక్తి నిస్తాడు. పరిశుద్ధాత్మ దేవునికి శారీరక క్రియలను చంపుశక్తి కూడా ఉన్నది. మనలో ఉన్న చెడును చంపి, ఆత్మాను సారులుగా చేస్తాడు. 14,17 వచనాలలో ఆయన దత్తత చేసే ఆత్మ అయి ఉన్నాడు. దత్తపుత్రాత్మను ఇచ్చే శక్తి గలవాడు. నూతన నిబంధనలో దేవుని కుమారులుగా చేయబడుట అంటే "వయసొచ్చిన కుమారుని"గా ఉంచడము అని ఇంతకు ముందు చూశాము. దేవుని కుటుంబములోనికి మారుమనసు ద్వారా వచ్చిన మనలను దేవుడే సర్వహక్కులతో ఎదిగిన కుమారునిగా అంగీకరిస్తాడు. ఒక పసిబాలుడు నడవలేడు, మాట్లాడలేడు, నిర్ణయాలు తీసికోలేడు. కుటుంబ సంపదను అనుభవించలేడు. కాని దత్తపుత్రులైన విశ్వాసులు అన్నీ వెంటనే చేయవచ్చు. మనలను మనము పరిశుద్ధాత్మ దేవునికి సమర్పించుకుంటే అన్నీ జరుగుతాయి. అబ్బా, తండ్రీ, అని దేవుని సమీపించవచ్చును. పసిపిల్లవాడు బ్యాంకు చెక్కులపై సంతకాలు పెట్టలేడు కాని దేవుని దత్తపుత్రులమైన

మనము ఆత్మీయ సంపదను అనుభవించవచ్చు. "క్రీస్తు తోడి వారసులము" (8:17)గా తండ్రి చేసుకున్నాడు. ఇవన్నీ నిజమా? ఇంత గొప్ప భాగ్యము కలుగజేసిన ఆ ప్రేమగల తండ్రిని మనము పూర్ణ మనసుతో పూర్ణఆత్మతో సేవించాలని పాఠకులకు అనిపించుట లేదా? ఇంత గొప్ప దేవుని మనము కలిగి ఉన్నందుకు మనము ధన్యులము.

**3. నిరుత్సాహము నుండి విడుదల (8:18-30) :**

ఆశాభంగము లేదు. ఈ భాగములో పౌలు శ్రమలు, బాధలను గురించి చెప్తున్నాడు. 17వ వచనములో శ్రమలు లేకపోతే మనము క్రీస్తుతోడి వారసులము కాము, 18వ వచనములో "మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను" అంటున్నాడు.

అందరూ దేవుని మహిమ ప్రత్యక్షపరచబడుటకు మూలుగులతో ఎదురు చూస్తున్నారు. మూడు రకాల మూలుగులను గురించి పౌలు చూపెడుచున్నాడు.

**A. సృష్టి మూలుగు (8:18-22) :**

దేవుడు సృష్టిని చేసినప్పుడు అది మంచిదిగా ఉంది కాని ఇప్పుడు మూలుగుతుంది. ఆదాము పాపము వలన వచ్చిన శాపముతో ఈనాడు సృష్టిలో శ్రమలు, మరణము, నొప్పి ఉన్నాయి. ఈ శ్రమలను ఒక తల్లి పడే పురిటి నొప్పులతో పోలుస్తున్నాడు. ఈ తల్లికి పురుడు రాగానే నొప్పులు పోతాయి. అదే విధంగా క్రొత్త సృష్టి వచ్చినప్పుడు ఈ సృష్టి మూలుగులు ఆగిపోతాయి. ఆ క్రొత్త సృష్టి మహిమ గలది, అందుకే విశ్వాసితో రాబోవు మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నదగినవి కావు అంటున్నాడు. ఈనాటి మూలుగులు పోయి మహిమ వస్తుంది.

**B. విశ్వాసుల మూలుగులు (8: 23-25) :**

ఆత్మయొక్క ప్రథమ ఫలములు అనుభవించిన మనము రాబోవు మహిమను పొందుకొనుటకు ఎదురుచూస్తూ మూలుగుచున్నాము. కానానులోని ప్రథమ ఫలములు రుచి చూచిన ఇశ్రాయేలీయులు అందులోకి వెళ్ళుటకు ఎదురుచూసినట్లు పరిశుద్ధాత్మ పరిచర్య ద్వారా పరలోక ఆశీర్వాదాలు పొందుకున్నాము. కాబట్టి ప్రభువును చూడాలని మహిమ శరీరం ధరించుకోవాలని, ఆయనతో ఉంటూ సదా ఆయన సేవ చేసుకోవాలని ఎదురు చూస్తుంటాము. దత్తత తీసుకొనబడుటకు ఆశపడుతుంటాము. మన నిరీక్షణను బట్టి, ప్రపంచములో జరిగే శ్రమలను బట్టి విశ్వాసి ఆశాభంగము పొందదు.

## C. పరిశుద్ధాత్ముని మూలుగులు (8:25-30) :

తన ప్రజల శ్రమలను చూసి దేవుడు బాధపడుతున్నాడు. యేసయ్య కూడా ఏడ్చాడు (యోహాను 11:33,35, లూకా 19:41). మన బలహీనతలను చూసి పరిశుద్ధాత్మ మూలుగుచున్నాడు. అయితే ఆయన తన మూలుగులతో మన కొరకు ప్రార్థిస్తున్నాడు. దేవుని చిత్తము మనకు చాలా సార్లు తెలియదు. అన్నీ తెలిసిన ఆయన మన పక్షాన దేవుని చిత్తానుసారంగా ప్రార్థిస్తాడు. మన భారము పంచుకొంటాడు.

8:28- "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము", ఇది చాలా మందికి ఇష్టమైన వాక్య భాగము. అయితే ఇందులో ఒక షరతు కూడా చూడాలి. దేవుని ప్రేమించువారికి, ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి " మాత్రమే దేవుడు సమస్తము సమకూడి జరిపిస్తాడు. దేవుడు సమస్తము చూచుకుంటాడు కాబట్టి శ్రమలలో విశ్వాసి నిరాశ పడకూడదు. మన శ్రమలలో దేవుడు మనలను మహిమ పరచుచున్నాడు. చివరకు దేవుని సారూప్యములోకి మారుతాము.

8:28-30 వరకు ఉన్న వాక్య భాగాన్ని చాలా మంది అపార్థము చేసుకుంటున్నారు. అందువలన దీనిని ప్రశాంతంగా ధ్యానించుకుందాము. 28వ వచనము చదువుకున్నాము. ఇప్పుడు 29,30వచనములు కూడా చదువుకుందాము. "ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో వారు తన కుమారునితో సారూప్యము గలవారువుటకు వారిని ముందుగా నిర్ణయించెను. మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను, ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను, ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమ పరచెను". దీనిని సరిగా అర్థము చేసుకోవాలంటే పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలోని 1:4-6వరకు ఉన్న వాక్య భాగమును కలిపి చదువుకోవాలి - "ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు

కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను".

ఈ వాక్య భాగము చదివిన వెంటనే మనకు కాలజ్ఞానం చెప్పే శిలాస్ఫటికము (Mythical crystal ball which shows the future) గోచరిస్తుంది. ఆ శిలాస్ఫటికములోకి ఏకాగ్రతతో చూస్తే భవిష్యత్ కనబడుతుందని చెప్పే మాంత్రికుల మాయ మాటలుగా అనిపిస్తాయి. కాని ఇది జాగ్రత్తగా ధ్యానిస్తే గొప్ప సత్యాలు తెలుస్తాయి. ముందుగా నిర్ణయించడము అనునది ఇక్కడ విశ్వాసుల కొరకే అన్వయించుకోవాలి. నిత్య నరకానికి పోవుటకు దేవుడు ముందే నిర్ణయిస్తాడని ఎక్కడా వ్రాయబడిలేదు. క్రీస్తు నందు నమ్మికయుంచకపోతే మాత్రమే తీర్పులోనికి వెళతారని యోహాను 3:18-21లో విశదీకరించబడియున్నది. దేవుడు అందరినీ పిలిచాడు. ఎందుకంటే "యేసుక్రీస్తు అందరికీ ప్రభువు" (అపో.కా 10:36). ఎవరైతే ఆయన పిలుపునందుకొని ఆయన దగ్గరికి వస్తారో వారంతా రక్షించబడతారు. ఒక ఊరిలో ఒక పాస్టరు గారు తన మందిరపు గుమ్మము ముందుర "రక్షణ పొందగోరువారు దయచేసి లోపలికి రండి" అని వ్రాయించి ఉంచారు. లోపలికి వెళ్లిన వారు వెనుదిరిగి చూస్తే గుమ్మము లోపటి వైపు "విశ్వాసముతో నీవు లోపలికి వచ్చావు కాబట్టి నీవు రక్షించబడ్డావు" అని వ్రాయబడి ఉన్న వాక్యము కనబడుతుంది. రక్షణ కావలసిన వారంతా నాయొద్దకు రండి అని యేసుప్రభువు ప్రతి ఒక్కరికి ఆహ్వానము ఇస్తున్నాడు. ఎవరూ నశించిపోవుట ఆయన కిష్టము లేదు (2పేతురు 3:9). తాను సృష్టించిన తన బిడ్డలంతా తనతోపాటు పరలోకంలో నివసించాలని ఆయన కోరిక. ఆయన నరకమును కేవలము అపవాది, వాడి శిష్యుల కొరకు ఏర్పాటు చేశాడన్న విషయము లేఖనాలలో చెప్పబడి ఉంది. "అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచిబడిన నిత్యాగ్ని" (మత్తయి 25:41) అని ప్రభువే చెప్పారు.

రోమా 8:29,30 వచనాలలో ఒక బంగారు గొలుసు లాగా ఒకదానికొకటి కూర్చినట్లు కనబడుతాయి. దేవుడు ఎవరిని ముందుగా ఎరిగెనో, వారిని ఏర్పరచుకున్నాడు, ముందుగా నిర్ణయించుకొనిన వారిని పిలిచాడు, వారిని నీతిమంతులుగా తీర్చి మహిమ

పరచెను. దేవుడు కొద్దిమందిని పరలోకానికి, కొద్దిమందిని నరకానికి ఏర్పరచాడని కాల్విన్ చెప్పాడు కాని అది తప్పు సిద్ధాంతము. అయితే ఇదెలా అర్థము చేసుకోవాలి? జగత్తు పునాది వేయబడకముందే దేవుని సార్వభౌమత్వమును బట్టి ఎవరు ఆయనను విశ్వసించరో ఆయనకు తెలుసు. దేవుడు తాను సృజించిన తన బిడ్డలు బానిసలుగా కాకుండా స్వతంత్రులనుగా ఉంచాలని వారికి తమ చిత్తప్రకారము జీవించే హక్కు ఇచ్చాడు. ఇందులో దేవుని యందు విశ్వాసముంచి ఆయన యొద్దకు చేరుకోవాలని తలంచువారు తమ చిత్తాన్ని దేవుని చిత్తానికి అప్పగించుట చేత పరలోక ప్రవేశము పొందగలుగుతున్నారు. దేవుడు తన దయాసంకల్పము చొప్పున ఎన్నుకొన్న వారిని పిలిచాడు.

ఒకటి మాత్రము మనము అర్థము చేసుకోవాలి. దేవుడు అందరినీ పిలుస్తున్నాడు. పిలుపును అంగీకరించిన వాడిని నీతిమంతునిగా తీర్చి, మహిమ పరుస్తాడు. విశ్వాసి రక్షింపబడగానే క్రీస్తులో మహిమ పరచబడినాడు కాని ఆ మహిమ రెండవ రాకడ సమయములో ప్రత్యక్షపరచబడుతుంది. క్రీస్తు మహిమలో పాలివారమైన మనము ఎప్పుడూ నిరాశపడకూడదు.

దేవుడు తన కుమారుని సారూప్యములోనికి మార్చాలనుకున్నవారిని పూర్తిగా తెలుసుకుంటాడు. ఒక భార్యా భర్తల మధ్యనున్న సాన్నిహిత్యము లాంటిది. మత్తయి 1:25లో యోసేపును గురించి వ్రాస్తూ "ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను" అని మత్తయి సువార్తీకుడు అన్నాడు. ఇక్కడ వాడబడిన 'ఎరుగుట' అనే పదం పౌలు వాడాడు. యోసేపుకు భార్యతో సన్నిహిత సంబంధము లేకుండెను అని చెప్పబడి ఉంది. దేవుడు మనలను (ఆహ్వానం అందుకున్న వారిని) సంపూర్ణంగా ఎరిగిన తర్వాతనే మనలను 'ఎన్నుకుంటాడు'. ఈ 'ఎన్నుకొనుట' అనేది మనం సరిగా అర్థం చేసుకోవాలి. దేవుని కృప ద్వారానే మనం రక్షింపబడుచున్నాము అను విశ్వాసము ఉన్నవారిని ఎన్నుకుంటాడు. తన కుమారునితో సమానులుగా ఉంటూ తన స్వాస్థ్యమును అనుభవించాలంటే సామాన్య విషయము కాదు. ఈ ఎన్నుకొనుట అనేది కూడా ఒక ఉద్దేశముతోనే జరిగిందని తెలుసుకోవాలి. ఆయన ఎన్నుకున్న వారు దత్తపుత్రత్వము పొంది, క్రీస్తు సారూప్యములోనికి వెళ్లి దేవుని స్వాస్థ్యమును పొందబోవుచున్నారు.

## ముందుగా నిర్ణయించుకోవడము (Pre-destination)

ఈ అంశము ఆనాటి ఆది సంఘ క్రైస్తవులు కూడా అర్థము చేసుకోలేక పోయారు. ముందుగానే నిర్ణయము జరిగిపోయింది, కాబట్టి మన ప్రవర్తన మార్చుకున్నా, మార్చుకోలేకపోయినా ఏమీ లాభముండదు అను అభిప్రాయమునకు వచ్చి నిరీక్షణ లేని ప్రజలుగా జీవించారు. 18వ శతాబ్దపు స్తబ్ధతకు కూడా కారణమైంది.

ఈనాటి బోధకులు కూడా కొంతమంది ఈ అంశమును బట్టి అబద్ధబోధలు చేస్తున్నారు. మనము దేవుని గొప్పతనము, ఆయన ప్రేమ, ఆయన కృప అర్థము చేసుకున్నప్పుడు ఇటువంటి నిరుత్సాహము మనలోనికి రాదు. ఆయన ప్రేమ ఎత్తు, లోతు మనము తెలుసుకోగలిగితే ఏ యోగ్యత లేకపోయినా మన కొరకు ప్రాణము పెట్టిన ఆ కరుణామయుడు, మనము విరిగి నలిగిన హృదయముతో ఆయన సన్నిధికి వెళితే ఆయన మనలను త్రోసివేయడను సత్యము మనకు గోచరిస్తుంది.

## 4. భయము నుండి విడుదల :

31-39 వచనాలలో పౌలు ఒక నూతన నిర్ధారణ ఇస్తున్నాడు. ఎవరూ మనలను దేవుని నుండి విడదీయలేరు. ఈ భాగములో దేవుడు మనకిచ్చిన భద్రతను బట్టి స్తుతించుట చూడగలము. 31వ వచనములో ఇక చెప్పడానికేమీ లేదు, "దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు?" అని అంటూ 1-8 అధ్యాయాలలో పౌలు మనకు చెప్పిన సిద్ధాంతాలన్నిటినీ క్లుప్తపరచి ముగిస్తున్నాడు. ఇక్కడ నాలుగు ప్రశ్నలున్నాయి.

ఎ) సకల లోకానికి తీర్పు తీర్చే అత్యున్నత న్యాయమూర్తి మన పక్షమున ఉంటే మనకు భయమేంటి? అంటున్నాడు. యెషయా ప్రవక్త ఇదే మాట యెషయా 50:9లో అంటున్నాడు. "ప్రభువగు యెహోవా నాకు సహాయము చేయును. నా మీద నేరస్థాపన చేయువాడెవడు?" ఈ మాట విశ్వాసిలో ధైర్యము నింపుతుంది.

బి) నాతో వాజ్యెమాడువాడెవడు? ఈ మాట కూడా యెషయా 50:8లో మనకు కనబడుతుంది. "నన్ను నీతిమంతునిగా ఎంచువాడు ఆసన్నుడై యున్నాడు, నాతో వ్యాజ్యెమాడువాడెవడు?"

సి) నాకు శిక్ష విధించువాడెవడు? యెషయా 50:7 లో "ప్రభువగు యెహోవా నాకు సహాయము చేయువాడు" అని చూడగలము. పరమ దేవుడే మనకు సహాయకర్తగా ఉన్నప్పుడు ఇక మనకు శిక్ష విధించుటకు ధైర్యము ఎవరికి ఉంటుంది?

డి) క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపు వాడెవడు?

పౌలు యెషయా గ్రంథము 50, 53 అధ్యాయాలు నుండి చాలా వచన భాగాలు తీసుకున్నాడు. వీటిని సేవక గీతాలు (Servant songs / Messianic అని కూడా) అంటారు.

రోమా 8:32వ వచనములోని మాటలు మనకు చాలా ఆదరణ ఇస్తాడు : "తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుక తీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?" యేసుప్రభువుతో పోలిస్తే రక్షణ లెక్కలోనిది కాదు. కాశ్మీరులో ఒక మంత్రిగారి కుమార్తెను విడిపించుట కొరకై ఒక భయంకరమైన ఉగ్రవాదిని వదిలేశారు. ఇహలోకంలో మనచుట్టూ ఉన్న ప్రపంచంలో ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను కాపాడుకొనుటకు ఎంతైనా చేస్తారు కాని ఏ యోగ్యత లేని మన కొరకు దేవుడు తన ఏకైక కుమారుని బలిగా ఇచ్చాడు. అన్నింటికంటే విలువైన కుమారుని ప్రాణమును ఇవ్వగలిగిన దేవుడు మనకింకేమైన ఇవ్వగలడు అను నిశ్చయత మనకు ఉంటే ఇక దేనికీ భయపడనవసరము లేదు. 34 వచనములో మన కొరకు శిక్ష అనుభవించి మనలను నీతిమంతులనుగా తీర్చిన దేవుడు మృతులలో నుండి లేచి తండ్రి కుడి పార్శ్వమున కూర్చుని మన కొరకు విజ్ఞాపనలు చేస్తున్నాడు. ఇటువంటి క్రీస్తు మన పక్షాన ఉన్నప్పుడు ఆయన ప్రేమ నుండి మనలను ఎవరూ దూరం చేయలేరని చెప్పడానికి ఏడు సంగతులు చెప్తున్నాడు. ఏడు అనునది సంపూర్ణ సంఖ్య కాబట్టి ఏదీ మనలను వేరుచేయలేదని ఖచ్చితంగా చెప్తున్నాడు.

35వ వచనములో 7 విషయాలు ప్రస్తావిస్తున్నాడు. అవేవనగా 1. శ్రమ, 2. బాధ, 3. హింస, 4. కరువు, 5. వస్త్రహీనత, 6. ఉపద్రవము, 7. ఖడ్గము.

ఇవేమీ మనలను దేవుని దగ్గరనుండి దూరపరచలేవని పౌలు అంటున్నాడు.

పౌలు తాను క్రీస్తు కొరకు పడిన బాధలు జ్ఞాపకము చేసుకొని ఉండవచ్చు.

2కొరింథీ 11:23-27లో పౌలు పడిన అన్ని రకాలైన శ్రమలు చెప్పబడి ఉన్నవి. ఇన్ని శ్రమలు పడినను యేసుప్రేమ పౌలును కట్టిపడేసింది. రక్షణ మనము సంపాదించుకోలేదు కాబట్టి పోగొట్టుకోలేము.

అపవాది నేరారోపణ చేయుటకు సిద్దంగా ఉన్నాడు కాని మనము క్రీస్తులో నీతిమంతులముగా నిలబడ్డాము. మనము దేవునిచే ఎన్నుకొనబడిన వారము. ఆయనే మనలను నీతిమంతులనుగా చేశాడు కాబట్టి ఇక తప్పులు పట్టడు, క్రీస్తు మనలను ప్రేమిస్తున్నాడు. మనము ఎప్పుడైనా ఆయనను వదిలినా, ఆయన మనలను వదలడు, మనలను విజయులనుగా చేసి శక్తినిస్తాడు.

ఇక చివరిగా 38. 39లో భద్రతను గురించి దేవుని స్తుతిస్తూ ఈ లోకంలో ఏది మనలను క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి ఎడబాప నేరవని మరొకసారి రూఢిగా చెప్తున్నాడు.

యేసుక్రీస్తు ప్రభువు పట్ల పౌలు తనకున్న స్థిరమైన ప్రేమను వ్యక్తపరుస్తున్నాడు. మరణమైనను, జీవమైనను – జీవితంలోని ఆది – అంతము (Extremities of life), దేవదూతలైనను, ప్రధానులైనను–సైన్యములో అతిశక్తిమంతులు, తక్కువవారు (Extremities of armies) ఉన్నవియైనను, రాబోవునవియైనను – కాలములోని ఆది, అంతములు (Extremities of time), అధికారులు – అధికారము లేనివారు. (Extremities of power) ఎత్తైనను, లోతైనను – స్థలము యొక్క కోణములు (Extremities of Space) సృష్టించబడిన మరి ఏదైనను – సృష్టియొక్క సమస్తప్రాణులు (Extremities of whole Creation) – ఇవేమి మనలను దేవుని నుండి వేరు చేయలేవని పౌలు చెప్పడములో ఆయన ఎంతగా ఆనందిస్తున్నాడో తెలుస్తుంది, మనమంతా రక్షణ గురించి పండుగ చేసుకోవాలి

ఈ అధ్యాయము ధ్యానిస్తుంటే క్రైస్తవుడు సంపూర్ణంగా విజయుడని తెలుస్తుంది. క్రీస్తు మనకొరకు చనిపోయి మనకు నీతిని ఇచ్చాడు కాబట్టి మనకు తీర్పు నుండి విడుదల లభించింది. ఆయన మనకొరకు తిరిగి వస్తున్నాడు కాబట్టి అసంతృప్తి నుండి విడుదల లభించింది. ఆయన నుండి మనలను ఎవరూ వేరు చేయలేరు, ఆయన మనకొరకు విజ్ఞాపన చేస్తున్నాడు కాబట్టి భయమునుండి విడుదల. ఇంత గొప్ప భద్రత నిచ్చిన ఆ దేవదేవుని స్తుతిస్తూ ఆరాధిస్తూ ఉందాము. ఆమేన్!

# 9వ అధ్యాయము

**9,** 10,11వ అధ్యాయములు ఇశ్రాయేలీయుల కొరకు వ్రాసిన మాటలు. ముఖ్యాంశముల నుండి ప్రక్కకు తొలిగినట్లున్న మాటలు. వీటిని Parenthetic (*brackets* లోని మాటలు) అని అంటారు. 8వ అధ్యాయములో రక్షణలోని చివరి అంశమైన భద్రత గురించి చెప్పిన తర్వాత ఈ మాటల యొక్క అవసరమే ముంది అను ఆలోచన రావచ్చు గాని "విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట" అను సిద్ధాంతము వివరించుటో ఇది కూడా ఒక భాగమే. పౌలు 2-11 నుండి 3:8 వరకు ఉన్న వాక్య భాగంలో యూదుడు కూడా నశించాడు అని చెప్పాడు. ఈ విధంగా చెప్పుట వలన యూదులు అతనిని దేశద్రోహిగా పరిగణిస్తున్నారు. పౌలు యూదుడై ఉండి అన్యుల మధ్య బోధిస్తూ ధర్మశాస్త్రము నుండి విడుదల పొందుడని ప్రకటించుట వాళ్లకు నచ్చలేదు. పలుచోట్ల ఈ విధముగా బోధించుట చేత చాలా సమస్యలు ఎదుర్కొన్నాడని రోమాలో ఉన్న యూదు క్రైస్తవులు విని యున్నారు. అటువంటి వారికి తాను తన తోటి ఇశ్రాయేలు ప్రజలను ప్రేమిస్తున్నానియు, వారి క్షేమము కోరుకుంటున్నాననియు తెలియచేయుటకు ఈ 3 అధ్యాయాలలో వారి పరిస్థితిని వివరిస్తున్నాడు.

ఇంకొక ఉద్దేశమేమంటే ఎన్నుకొనబడిన మా పరిస్థితి ఏమిటి అని అడుగుతున్న ఇశ్రాయేలీయులకు సమాధానము చెప్పుట : ఇక్కడ 'యూదులు' అనకుండా 'ఇశ్రాయేలు' అనుటలో పౌలు ఇశ్రాయేలు దేశాన్ని మొత్తంగా చేసి ఆ జనాంగమంతటితో మాట్లాడు తున్నాడు. రోమా 8వ అధ్యాయములో పౌలు విశ్వాసికి క్రీస్తులో భద్రత ఉంది అని చెప్పాడు. అయితే ఇక్కడ ఇశ్రాయేలీయులను ప్రక్కన పెట్టి సంఘాన్ని దేవుడు లేపుతున్నాడు అని చెప్పినప్పుడు అయితే మా పరిస్థితి ఏమిటి? దేవుడు అబ్రాహాముకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడా? అని అడిగేవారికి ఈ అధ్యాయములో సమాధానము చెప్తున్నాడు.

ప్రపంచములోని దేశాలన్నిటిలో ఇశ్రాయేలు దేశానికి మాత్రమే సంపూర్ణ చరిత్ర ఉన్నది. ఆ దేశము యొక్క భూత, వర్తమాన, భవిష్యత్తు చరిత్రలు బైబిలులో వ్రాయబడి ఉన్నవి.

9వ అధ్యాయములో దేవుని సార్వభౌమత్వము కనబడుతుంది. ఇందులో ఇశ్రాయేలీయుల గతం చెప్తున్నాడు. వారి ఎన్నిక (Election) గురించి ఉన్నది.

10వ అధ్యాయములో మానవుని బాధ్యత (Responsibility) గురించి చెప్పాడు. ఇశ్రాయేలీయులు తమ బాధ్యతను గుర్తించి ఉంటే దేవుని తృణీకరించి ఉండేవారు కాదు. ఏవిధంగా తృణీకరించారో ఇక్కడ చెప్పబడి ఉన్నది.

వర్తమానము – దేవుడు వారిని తృణీకరించుట – Rejection

11వ అధ్యాయములో దేవుని కృపా సంకల్పము – దేవుడు ఇశ్రాయేలీయులను మరల చేర్చుకొనుట (Restoration) ఇది వారి భవిష్యత్తు.

**9వ అధ్యాయము :–** ఇశ్రాయేలీయులు దేవునిని తప్పు పట్టకుండా ఉండుటకు పౌలు దేవుని గుణలక్షణాలు చూపిస్తున్నాడు. ఇశ్రాయేలు గత చరిత్రలో దేవుని గొప్పతనము బాగా కనిపిస్తుంది. ఆయన నమ్మకత్వము, నీతి, న్యాయము, కృప, అడుగడుగునా కనపడుతుందని వారికి గుర్తు చేస్తున్నాడు.

1 నుండి 6వచనాలలో ఇశ్రాయేలు జనాంగమంతా నశించిపోతున్నారను బాధ పౌలు వ్యక్తీకరిస్తున్నాడు. 1–3 వచనాలలో తాను పడుతున్న వేదన నుండి, వారి ఆత్మల కొరకు తన కున్న భారము తెలియచేస్తున్నాడు "నాకు బహు దు:ఖమును, నా హృదయములో మానని వేదనయు కలవు. క్రీస్తునందు నిజమే చెప్పుచున్నాను. అబద్ధమాడుట లేదు. పరిశుద్ధాత్మ యందు నా మనస్సాక్షి నాతో కూడా సాక్ష్యమిచ్చు చున్నది. సాధ్యమైన యెడల దేహసంబంధులైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తు నుండి వేరై శాపగ్రసుడనై యుండ గోరుదును". తన తోటి ఇశ్రాయేలీయుల ఆత్మల రక్షణ కొరకు తాను నాశనమైపోయినా ఫర్వాలేదు అను ఆలోచన పౌలు తెలుపుచున్నాడు. రక్షణలోకి తేబడిన ప్రతి విశ్వాసికి ఈ విధమైన భారము కలిగి ఉంటే ఎంతో మందిని రక్షణలోకి నడిపించ వచ్చును.

9:4లో ఇశ్రాయేలీయుల ఆధిక్యత పౌలు చూపిస్తున్నాడు. దేవుడు వారిని ఏర్పరచుకొన్నందున వారిని అధికంగా ఆశీర్వదించి అందరిలో గొప్ప చేశాడు. దత్తపుత్రత్వము, మహిమ, నిబంధనలు, ధర్మశాస్త్రము, అర్చన ఆచారాలు, వాగ్దానములు, పితరులు అన్నింటిలో వీరికే అధిక్యత. అన్నింటి కంటే ముఖ్యంగా యేసుప్రభువు శరీరధారిగా ఈ లోకములోనికి వచ్చినప్పుడు వీరి వంశములో పుట్టాడు.

మలాకీ 4:4లో మలాకీ ప్రవక్త ద్వారా దేవుడు చెప్పిన మాటలు – "హోరేబు కొండ మీద ఇశ్రాయేలీయులందరి కొరకై నేను నా సేవకుడైన మోషేకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమును, దాని కట్టడలను, విధులను జ్ఞాపకము చేసికొనుడి". ఇశ్రాయేలీయులు దేవుని దత్తపుత్రులు. స్వంత కుమారుల కంటే దత్తత చేసుకొన్న వారిని చాలా ప్రేమగా చూసుకుంటారు. దేవుని దృష్టిలో వారికొక ప్రత్యేక స్థానముంది. దేవుని వాక్యము నిరర్థకము కాదు అని చెప్తూ ఆయన సార్వభౌమత్వము గురించి చెబుతూ దేవుని పక్షంగా వాదిస్తున్నాడు. పౌలు యొక్క వాదనలకు మూలము 90 శాతము పాతనిబంధనలోని వాక్య భాగములే.

9:6 నుండి 29 వచనములలో కొన్ని ఉదాహరణలు, వాటిని గురించిన వాదనలు ఉన్నాయి.

**మొదటి ఉదాహరణ 6–9 :** అబ్రాహాము పిల్లలలో వాగ్దాన సంబంధుడు మాత్రమే నిజమైన కుమారుడు. అబ్రాహాముకు హాగరు ద్వారా పుట్టిన ఇష్మాయేలేగాక కెతూరా ద్వారా కూడా పిల్లలు పుట్టారు (ఆది 25:1–2). వారెవరూ ఆయన వాగ్దాన సంతానము కాదు. గలతీ పత్రిక 4:21–31 వచనములలో శారా స్వతంత్రురాలు, హాగరు దాసి అను విషయమును స్పష్టంగా పౌలు వివరిస్తున్నాడు.

ఇస్సాకు సంతానానికి, ఇష్మాయేలు సంతానానికి తేడా చూపిస్తున్నాడు. దేవుడు ఏర్పరచుకొన్నవాడే ఆయన కుమారుడు – "ఇస్సాకు వల్లనైనది నీ సంతానమనబడును" అని అబ్రాహాముకు చెప్పాడు. వాగ్దాన సంబంధులే దేవుని పిల్లలని పౌలు అంటున్నాడు.

**రెండవ ఉదాహరణ** : రోమా 9:10 నుండి 13 వచనములలో యాకోబును ఏర్పరచుకున్నాడు.

12వచనములో దాసుడగుట అనునది దేవుని ఏర్పాటు. దానిని గురించి మాట్లాడుచున్నాడు.

13 వచనములో "యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని" అని దేవుడు చెప్పిన మాటలు వింటే అది అన్యాయము కదా అని యూదునికి అనిపిస్తుంది. ఆ ప్రశ్నకు సమాధానము వెయ్యేండ్ల తర్వాత మలాకీ ప్రవక్త ద్వారా దేవుడు చెప్తున్నాడు. ఆమోసు 1:11,12 లోను, ఓబద్యా 1:10 లోను సమాధానము దొరుకుతుంది. వెయ్యేండ్లు ఓర్పుతో ఉన్న దేవుడు యాకోబు సంతతివారు నమ్మకంగా ఉన్నారు, ఏశావు సంతతివారు (ఏదోమీయులు) తనకు విరుద్ధంగా ప్రవర్తించారు కాబట్టి వారిని ద్వేషించాను అని చెప్పాడు. 1000 సంవత్సరాలు తర్వాత దేవుడు చెప్పిన మాటలను ఇక్కడ చెప్తున్నాడు. దేవుడు ఆస్తులను గురించి గాని, పితరుల నుండి సంక్రమించు వారసత్వము గురించి గాని వ్రాయలేదు, గాని మెస్సయ్యను గురించిన వారసత్వ వాగ్దానమును గుర్తు చేస్తున్నాడు. ఇక్కడ మనకు కనపడు మొదటి వాదన (9:14)–"దేవునియందు అన్యాయము ఉందా? "అట్లనరాదు" అని పౌలు వారిని హెచ్చరిస్తున్నాడు.

**మూడవ ఉదాహరణ :** 9:15లో చూడగలము – ధర్మశాస్త్రములోని వాక్యము తీసి చూపిస్తున్నాడు – "ఎవనిని కరుణింతునో వానిని కరుణింతును, ఎవని యెడల జాలి చూపుదునో వానియెడల జాలి చూపుదును" అని దేవుడు మోషేతో అన్నాడు. వారు చేసిన తప్పులు నిర్గమకాండము 32:30–34 వచనములలో చూడగలము. వారు "బంగారు దేవతను తమ కొరకు చేసికొని" గొప్ప పాపము చేశారు. అయితే దేవుడు అందరినీ చంపలేదు. దేవత బొమ్మ చేసిన అహరోనును చంపలేదు. అరణ్యములో అందరూ పాపము చేశారు. ఆయన కనికరము చూపకుంటే కనానుకు ఎవరూ వెళ్ళగలిగేవారు కారు. దేవుడు సార్వభౌముడు, అన్నీ ఆయన ప్రణాళిక ప్రకారము, ఆయన చిత్త ప్రకారమే జరుగుతాయని చెప్పడమే పౌలు ఉద్దేశము. దేవుడే రాజులను ఏర్పాటు చేస్తాడు, ఫరో హృదయాన్ని కఠినపరిచింది కూడా దేవుడే అని చెప్తున్నాడు.

9:19 రెండవ అభ్యంతరము:– "అయితే దేవుడు నా మీద నేరము మోపనేల" అని యూదుడు అడుగుతాడని ఊహించిన పౌలు దేవునికి ఎదురుచెప్పుటకు నీ వెవడవు? అని తిరిగి ప్రశ్నించుచున్నాడు. సృష్టికర్తను ఎదురు ప్రశ్నవేసే సాహసం చేయవద్దని పౌలు వారితో అంటున్నాడు.

రోమా పత్రిక అంతా పౌలు ఒక న్యాయస్థానములో చిత్రీకరించినట్లుగా వ్రాశాడు. దేవుని తరపున న్యాయవాదియై, ఎదుటివాడు ఎటువంటి ప్రశ్నలడుగుతాడో ముందే ఊహించి వాటికి సమాధానము చెప్తున్నాడు.

**4 మరియు 5వ ఉదాహరణ :** కుమ్మరి, అతడు చేసిన కుండ గురించి చెప్తున్నాడు.

మంటి మీద కుమ్మరికున్న అధికారము గురించి మానవుడు మాట్లాడుతాడు. కాని దేవుని అధికారము మానవుని మీద ఉందని అర్థము చేసుకోలేక పోతున్నాడు. దేవుని శక్తి, ఆయన సార్వభౌమత్వము అర్థము చేసుకోవాలని కోరుతున్నాడు. దేవునిని కుమ్మరితోను మనిషిని మట్టితోను పోలుస్తూ చేయబడిన కుండ నన్నెందుకు ఇలా చేశావని చేసిన వానితో అనగలదా? అని ప్రశ్నిస్తున్నాడు. ఒకే మంటిలో నుండి చేయబడిన ఒక కుండ ఘనమైన పనికి, ఇంకొకటి ఘనహీనమైన పనికి వినియోగించుటకు తయారు చేస్తే అది కుమ్మరి ఇష్టము అనుకుంటాము కదా. అదే విధంగా దేవుడు అన్యులను ఎన్నుకున్నప్పుడు అడుగుటకు మనకు హక్కులేదని పౌలు యూదులకు వివరిస్తున్నాడు. మనము కేవలము యెషయా 64:8లో చెప్పబడినట్లు – “యెహోవా, నీవే మాకు తండ్రివి, మేము జిగట మన్ను, నీవు మాకు కుమ్మరి వాడవు, మేమందరము నీ చేతి పనియైయున్నాము” అని చెప్తూ ఆయనకు విధేయులుముగా ఉండాలని పౌలు భావన.

దేవుడే స్వయంగా ఇశ్రాయేలు ప్రజలతో ఈ మాటలు చెప్తున్నాడు. యిర్మీయా 18:3–16 లో వున్నట్లు – “ఇశ్రాయేలీయులు వారలారా, ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా? యిదే యెహోవా వాక్కు. జిగట మన్ను కుమ్మరి చేతిలో ఉన్నట్లుగా ఇశ్రాయేలు వారలారా, మీరు నా చేతిలో ఉన్నారు” అని దేవుడు చెబుతున్నాడు. మనిషి నరకానికి పోవుటకు దేవుడు అవసరము లేదు, ఎందుకంటే అది సామాన్యంగా జరుగుతుంది. దేవుడెన్నుకోకపోతే అందరూ నరకానికి పోతారు. దేవుని సార్వభౌమత్వము రక్షణలో ఎక్కువగా కనపడుతుంది.

దేవుడు ఇశ్రాయేలీయులను ఎన్నుకున్నాడు, కాబట్టి వారు ఆయనకు విరోధముగా ఎన్ని పనులు చేసినా, దేవుడి ఉగ్రత వారిపైకి వచ్చి వారిని నాశనము చేసినను, శేషము రక్షింపబడుతున్నది. యెషయా ప్రవక్త ఈ విషయము ప్రస్తావిస్తూ దేవుడు కరుణ చూపించి శేషము వదలకపోయి ఉంటే మనమంతా సొదొమ, గొమొఱ్ఱా పట్టణాల వలె

లేకుండా పోయి ఉందుము కదా అని ప్రజలతో చెప్తున్నాడు. ఇంతకూ దేవుడు యూదుల నుండి అన్యుల నుండి కొందరిని ఎన్నుకొని వారి ద్వారా సంఘము స్థాపించాలను ఉద్ధేశము కలిగియున్నాడు. ఈనాటి విశ్వాసులు దేవుని కృపతో ఏర్పడిన "కరుణాపాత్ర ఘటములు" ఆయన మహిమార్థమై ఏర్పడినవారుగా ఉన్నారు.

ఇప్పటి వరకు పౌలు చెప్పిన విషయాలన్నీ ప్రవచనాత్మకంగా చెప్పబడి ఉన్నాయి. హోషేయ 2:23లో దేవుడు తన జనము కాని వారిని ఎన్నుకొనిచెప్పాడు. హోషేయ 1:10 లో అన్యజనులతో "మీరు జీవము గల దేవుని కుమారులు" అని చెప్తాడని ప్రవచనాత్మకంగా చెప్పబడి ఉంది. తరువాత పౌలు యెషయా 10:22 వచనములలోని కొన్ని మాటలు గుర్తు చేస్తున్నారు. "ఇశ్రాయేలీయులు సముద్రపు ఇసుక వలె విస్తారముగా ఉండినను శేషమే మిగులును, మిగిలిన వారంతా తీర్పులోకి తేబడుదురు" అని వ్రాయబడి ఉన్నది. చివరిగా యెషయా 1:9లోని మాటలతో దేవుని కృపను గుర్తు చేస్తున్నాడు. ఈ పాత నిబంధన వాక్యభాగములు చెప్పుట ద్వారా దేవుడు కొంత మందిని రక్షించి, కొంత మందిని తీర్పులోనికి తీసుకొని రావడము అనునది అన్యాయము కాదు అని రుజువు చేస్తున్నాడు. పాతనిబంధనలో ఇవ్వబడిన ప్రవచనాలు నెరవేరుతున్నాయి. అదేకాక దేవుని ఎన్నిక ద్వారా అన్యులకు రక్షణ సాధ్యమైంది అని చెప్తున్నాడు. ఇది దేవుని కృప. నిర్గమ సమయములో దేవుడు యూదుల ద్వారా సకల లోకమును రక్షణలోనికి తీసికొని రావలెనను ఉద్దేశముతో అన్యులను తృణీకరించి యూదులను ఎన్నుకున్నాడు. అయితే ఇశ్రాయేలు జనాంగము ఆయన చిత్తము నెరవేర్చక పోవుట చేత ఆయన అన్యులను ఎన్నుకున్నాడు. ఆయన ఎన్నుకున్న అన్యులతో పాటు శేషించిన యూదులు కలిసి సంఘముగా ఏర్పడి దేవుని ప్రణాళికను నెరవేరుస్తున్నారు.

ఇంత వరకు పౌలు దేవుని నమ్మకత్వము, నీతి, న్యాయములను గురించి చెప్తూ ఆయన గొప్పతనము వివరించాడు. ఇశ్రాయేలీయులు ఆయనను తృణీకరించినంత మాత్రాన ఆయన ప్రణాళికలో మార్పు ఉండదని చెప్తున్నాడు. 9:30 నుండి 33 వచనములలో దేవుని కృప కనపడుతుంది. దేవుని సార్వభౌమత్వము నుండి పౌలు మానవుని బాధ్యత గురించి చెప్పుట మొదలుపెట్టాడు. ఇక్కడ రెండు విరుద్ధమైన సంగతుల గురించి చెప్పబడి ఉంది. యూదులు నీతిని వెదికారు కాని వారికి దొరకలేదు; అన్యులు నీతి కొరకు వెదకలేదు గాని వారికి దొరికింది. కారణమేంటి? ఇశ్రాయేలీయులు విశ్వాసము

ద్వారా కాక క్రియల ద్వారా నీతిని వెదికారు, ధర్మశాస్త్రము ద్వారా వెదికారు కాబట్టి దొరకలేదు. కాని అన్యులు విశ్వాసము ద్వారా నీతిమంతులైనారు. వారు కృపపై ఆధారపడినారు. అన్యులు తమ స్థాయికి ఎదిగితే రక్షణ పొందుకుంటారని యూదులు తలచారు కాని వారు అన్యుల స్థాయికి దిగితేనే రక్షింపబడుతారని తెలుసుకోలేకపోయారు.

దేవుని కృప ఎంత గొప్పదో ఇక్కడ గమనించవచ్చు. ఇశ్రాయేలును తృణీకరించడమంటే అన్యులకు రక్షణ వచ్చినట్లే. ఇక్కడ పౌలు వాడిన పాత నిబంధన వాక్య భాగము యెషయా 28:16లో నుండి తీయబడినది. ఇక్కడ క్రీస్తును మూలకు తలరాయిగా పేర్కొన్నాడు. కీర్తన 118:22 ను కూడా గుర్తు చేసుకోవచ్చు. – "ఇల్లు కట్టువారు నిషేధించినవారు రాయి, మూలకు తలరాయి ఆయెను". ఇశ్రాయేలు జనాంగము తృణీకరించిన మెస్సయ్య, అన్యుజనులకు రక్షకుడైనాడు. దేవుడు ఆయనను మూలరాయిగా ఏర్పాటుచేస్తే, వారు తృణీకరించినందున వారికి అడ్డురాయి అయ్యారు. ఆ రాయిపైన ఎదిగే బదులు, వారు తొట్రిల్లి పడిపోయారు. కాని వారు పడి పోవుట ద్వారా అన్యజనులకు రక్షణ సాధ్యమైంది. ఇది కేవలము దేవుని కృప.

ఈ సంగతులు ధ్యానించిన మనము "ఏ నీతి మీద ఆధారపడి ఉన్నాము?" అని మనలను మనము పరీక్షించుకోవాలి. మన మంచితనము, సత్‌క్రియలపైన ఆధారపడి ఉన్నామా లేక కేవలము క్రీస్తు పైననే ఆధారపడి ఉన్నామా? దేవుడు మన ప్రవర్తన, జన్మను బట్టి గాక కేవలము "విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నాము" (ఎఫెస్సీ 2:8) అను మాటను ఎల్లప్పుడు జ్ఞాపక ముంచుకోవాలి.

ఈ అధ్యాయమంతటిలో పౌలు ఇశ్రాయేలీయులు ఎన్నుకొనబడిన వారు అని చెప్పుటకు ప్రయత్నము చేశాడు.

# 10వ అధ్యాయము

**ఈ** అధ్యాయములో ఇశ్రాయేలీయుల ప్రస్తుత పరిస్థితి వివరిస్తున్నాడు. వారి స్వనీతి వలన దేవుడు వారిని విసర్జించి ఉన్నాడు.

శతాబ్దాలుగా వారి ప్రవక్తలు ప్రవచించుట వలన ఇశ్రాయేలీయులు వారి విమోచకుడు, మెస్సయ్య అయిన యేసు ప్రభువు కొరకు ఎదురుచూస్తున్నారు. దేవుడు బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా ఆయన ఆగమనమును ప్రకటించాడు గాని వారు విశ్వసించలేదు. యోహాను 1:11లో "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను గానీ వారాయనను అంగీకరించలేదు" అయితే కొందరు విశ్వాసులైన శేషము – సుమెయోను ప్రవక్త, అన్న అను ప్రవక్త్రి లాంటివారు ఎదురు చూస్తున్నారు. కాని ఎక్కువమంది తృణీకరించారు. పౌలు కొన్ని కారణాలు చెప్తున్నాడు.

**1.** వారికి రక్షణ అవసరం లేదనుకున్నారు. వారు అబ్రాహాము సంతానము కాబట్టి తప్పని సరిగా పరలోకానికి పోతామనే భావన కలిగియున్నారు. పరిసయ్యుడైన పౌలు కూడా ఒకప్పుడు అదే పరిస్థితిలో ఉన్నాడు కాబట్టి వారిని అర్థము చేసుకోగలిగాడు. అయితే ఇప్పుడు వారందరూ రక్షణ పొందాలని ఆశిస్తున్నాడు.

**2.** వారందరూ దేవునియందు ఆసక్తి కలిగి ఉన్నారు. బబులోను చెరలో ఉన్నప్పుడు విగ్రహారాధన పూర్తిగా మానేసి, ఆచారాలు, ధర్మశాస్త్ర ప్రకారము జీవించుట మందిరానికి తరచుగా వెళ్లుట, సబ్బాతు పాటించుట లాంటివి ఆసక్తిగా చేసేవారు. వారి ఆసక్తి దేవుని జ్ఞానముపై ఆధారపడలేదు.

**3.** దేవుని నీతిని తెలుసుకోలేక స్వనీతి, గర్వము, కలిగి ఉన్నారు.

**4.** ధర్మశాస్త్రాన్ని వారు సరిగా అర్థము చేసుకోలేదు.

యూదా మతములోని ప్రతి అంశము క్రీస్తువైపు చూపెడుతున్నాయి. వారి బలులు, యాజకత్వము, మందిరాచారాలు, మత పండుగలు, నిబంధనలు మొదలగునవన్నీ క్రీస్తులో కనబడుతున్నాయని తెలుసుకోలేక పోయారు. అందరూ పాపులే కాబట్టి రక్షకుని అవశ్యకత ఉందని అర్థము చేసుకోలేదు.

క్రీస్తు మరణ పునరుత్థానముల వలన ధర్మశాస్త్రమును పూర్తి చేశాడు. వారు ఇక ధర్మశాస్త్రము క్రింద లేరు కాని కృప క్రింద ఉన్నారని పౌలు చెప్పాడు. పౌలు ఎన్ని ఉదాహరణలతో చెప్పినా వారికి అర్థము కాలేదు. ఏ బేధము లేక అందరికీ రక్షణ అవసరత ఉందని చెప్పాడు. ధర్మశాస్త్రము ద్వారా వచ్చు నీతి, విశ్వాసం ద్వారా వచ్చు నీతికి బేధాలు చెప్పాడు.

| **ధర్మశాస్త్రము ద్వారా వచ్చు నీతి** | **విశ్వాసం ద్వారా వచ్చు నీతి** |
|---|---|
| ★ యూదులకు మాత్రమే వర్తిస్తుంది. | ★ నమ్మిన వారిందరికి వర్తిస్తుంది. |
| ★ ఈ నీతి క్రియలను ఆధారము చేసుకొని వస్తుందని నమ్ముతారు. | ★ విశ్వాసము ద్వారా మాత్రమే వస్తుంది. |
| ★ స్వనీతి. | ★ దేవుని నీతి. |
| ★ ఈ నీతి ద్వారా రక్షణ రాదు. | ★ ఈ నీతి రక్షణ ఇస్తుంది. |
| ★ విధేయత చూపించు అంటుంది. | ★ ప్రభువు మీద ఆధారపడు అంటుంది. |
| ★ గర్వము వస్తుంది. | ★ తగ్గింపు స్వభావముతో దేవునికి మహిమ. |

పౌలు పై విధముగా వివరించినను వారు దేవుని తృణీకరించారు, తృణీకరించబడ్డారని చెప్పి పరిష్కార మార్గం చూపెడుతున్నాడు. ఇప్పటికైనా మేము ప్రకటించు విశ్వాస వాక్యము నమ్మండి అని బోధిస్తున్నాడు. “యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల నీవు రక్షింపబడుదువు” అని ప్రతి యూదునితో చెప్తున్నాడు. ఈ వాక్యము మనమందరము కంఠత పెట్టుకొని ప్రతి అన్యుడికి ప్రకటించవలసిన వాక్యము. విశ్వసించుట, నోటితో ఒప్పుకొనుట, ఇవి రెండూ జరిగితే రక్షణ వస్తుందను శుభవార్త సమస్త మానవాళికి చెప్పాలి.

12,13 వచనాలు కూడా మనము ఇతరులకు ప్రకటించవలసినవిగా ఉన్నాయి. “యూదుడని, గ్రీసు దేశస్థుడని బేధము లేదు, ఒక్క ప్రభువే అందరికీ ప్రభువైయుండి తనకు ప్రార్థన చేయు వారందరియెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడైయున్నాడు. ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వాడెవడో వాడు రక్షింపబడును”. ఈ వాక్యము మనము ధ్యానిస్తే సువార్త సకలలోకమునకు సంబంధించినదను సత్యము తెలుస్తుంది. “యేసుక్రీస్తు అందరికి ప్రభువు” (అపో.కా. 10:36) అను సత్యము మరొకసారి పౌలు చెప్తున్నాడు. అందరికీ రక్షణ ఇవ్వాలని ఆశిస్తున్నాడు. ప్రభువు నామమును బట్టి ప్రార్థన అను మాటలో ఎందుకు ‘ప్రభువు నామము’ అని వాడారు? అనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రభువు నామము అన్ని నామముల కన్న పై నామము ఎందుకైందో పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2:6–11లో ఉన్న వాక్యభాగములో వివరించాడు. “ఆయన (యేసుప్రభువు) దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసుకొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా. అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను. అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతి వాని మోకాలును యేసు నామమును వంగునట్లును ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను”.

అంత గొప్ప నామములో విశ్వాసముంచి ప్రార్థిస్తే రక్షణ వస్తుంది. 10:14–17లో సంఘాలలో సువార్తీకరణను ప్రోత్సహించుటకు ఈ వాక్యభాగము వాడుతారు. కానీ ఇక్కడ పౌలు ఇశ్రాయేలీయుల కొరకు వాడాడు. నమ్మని యూదులు రక్షణ పొందాలంటే ముందు నమ్మాలి. తర్వాత ప్రభువువైపు తిరగాలి అంటే యేసయ్య తమ కొరకు వచ్చిన విమోచకుడని నమ్మాలి. ఆయన మరణపునరుత్థానములను నమ్మాలి. నమ్మాలంటే సువార్త వినాలి. వినుట ద్వారా విశ్వాసము వస్తుంది. వినుట యేసుక్రీస్తును గురించిన సువార్త. చెప్పడానికి ఎవరినైనా పంపాలి. పౌలు తన పిలుపు గుర్తు చేసుకొని ప్రభువే పంపుతాడని చెప్తున్నాడు. నీనెవే పట్టణానికి యోనా ప్రవక్తను పంపినట్లు దేవుడే పంపుతాడు.

**సువార్తీకరణ పద్ధతి :**

స్థానిక సంఘము సువార్తీకులను పంపుట ←

↓

సువార్తీకులు వెళ్లుట

↓

సువార్త ప్రకటించుట

↓

సువార్త వినుట

↓

దేవునికి ప్రార్థించుట

↓

రక్షణ పొందుట

↓

స్థానిక సంఘములో చేర్చబడుట

↓

స్థానిక సంఘము శిష్యులను తయారు చేయుట →

రోమా 10:15లో సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరము అని యెషయా గ్రంథము 52:7 లోనిది పౌలు ఇక్కడ చెప్తున్నాడు. బబులోను చెర నుండి వచ్చిన తరువాత వారు పండుగ చేసుకున్నారు. పునరాగమనాన్ని అపేక్షించి, ప్రకటించు వారిని ఆహ్వానించాలి.

రోమా 10:16-21లోని మొదటి భాగమును యెషయా 53వ అధ్యాయము నుండి పౌలు తీసుకున్నాడు. తాము చెప్పిన మాటలు ఎవరూ నమ్ముట లేదని యెషయా ప్రవక్త బాధపడుతున్నాడు. యేసు ప్రభువును గురించిన సువార్త వింటేనే గదా విశ్వాసము వస్తుంది. విశ్వాసము వస్తేనే గదా రక్షింపబడుతారు అని పౌలు ఆలోచిస్తున్నాడు.

ఇవాన్ రాబర్ట్స్ అనే సువార్తీకుడు ఐరోపా దేశంలో సువార్త ప్రకటించినప్పుడు పోలీసులకు పని చాలా ఎక్కువైంది. అందరూ తమ పాపాలను ఒప్పుకోవడము మొదలు పెట్టారు. పోలీస్ స్టేషనులోకి ఒక విలేఖరి వెళ్లి ఎందుకిలా జరిగిందని అడిగినప్పుడు ఆ పోలీస్ ఆయన హృదయాన్ని చూపి, అక్కడ మార్పు వచ్చిందని చెప్పాడట.

రోమా 19వ వచనము ద్వితీయోపదేశకాండము 32:21 నుండి తీయబడినది. దేవుడు ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రము ఇచ్చినప్పుడే అన్యజనులు తనను అంగీకరించుట చూసి, వారు రోషముతో తన దగ్గరకు వస్తారని ప్రవచించాడు. 'జనము కాని జనము' అంటే అన్యజనులని భావం.

రోమా 10:21వ వచనము యెషయా 65:1లో నుండి తీసుకున్నాడు. ఇశ్రాయేలు వారికి కాకుండా అన్యులకు దొరికితినని దేవుడు అంటున్నాడు. ఇశ్రాయేలు ప్రజలు తనను విసర్జించినను, ఇంకా వారి కొరకు చేతులు చాచి ఉంచాను అని దేవుడు అంటున్నాడు. నా యొద్దకు రండి అని పిలుస్తున్నాడు. మానవుల బాధ్యత ఎక్కువ కనపడుతున్నది.

ఇశ్రాయేలీయుల ప్రస్తుత పరిస్థితి తొట్రు పడేవారిగా ఉన్నారు. వారు పడిపోలేదు గాని తొట్రిల్లారు. దీనినే పాక్షిక అంధకారము అంటారు. మెస్సీయ్యను తృణీకరించినందున దేవుడు అన్యులకు సువార్త పంపారు. అప్పుడైనా రోషంతో తన జనులు తన దగ్గరికి వస్తారేమోనని ఆశిస్తున్నాడు. ఆయన మహాకృప ద్వారా అన్యులకు కూడా సువార్త దొరికింది.

పౌలు తన చివరి నిమిషము వరకూ సువార్త ప్రకటిస్తూనే ఉన్నాడు. రోములో చివరి దశలో కూడా ఉదయం నుండి సాయంత్రము వరకు బోధిస్తున్నాడు. మనలను కూడా అన్యుల మధ్య యూదుల మధ్య సువార్త బోధించుటకు వాడుకోవాలను కుంటున్నాడు.

# 11వ అధ్యాయము

**రో**మా పత్రిక 9,10,11 అధ్యాయాలలో ఉన్న విషయాలు మనకు గాని, మన సంఘాలకు గానీ అన్వయించుకోరాదు. ఇవి కేవలము ఇశ్రాయేలీయులకు సంబంధించినవి. ఈ అధ్యాయములోని విషయాన్ని సంఘము ఎత్తబడ్డాక జరిగేవి అని తెలుసుకోవాలి.

11వ అధ్యాయమంతా పౌలు దేవుడు తన ప్రజలను విసర్జించలేదని ఋజువు చేయడానికి కేటాయించాడు. దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలు దేశానికి భవిష్యత్తు ఉన్నదని చెప్పడానికి అయిదుగురు సాక్షులను పిలుస్తున్నాడు.

**1. పౌలు తనంతట తానే సాక్షి (11:1) :**

దేవుడు తన ప్రజలను విసర్జించెనా? అట్లనరాదు "నేను కూడా ఇశ్రాయేలీయుడను" అంటున్నాడు. తన ప్రజలను విసర్జిస్తే మరి పౌలు మారుటలో అర్థమేంటి? పౌలు మార్పును అపొస్తలుల కార్యములలో లూకా మూడు సార్లు (9,22,26 అధ్యాయాలలో) గ్రంథస్తము చేశాడు. భవిష్యత్తులో ఇశ్రాయేలీయులందరు ఈ విధంగా మారబోతున్నారని తెలుపుటకు పరిశుద్ధాత్మ దేవుడు వ్రాయించాడు. బైబిలులో అపొస్తలుల కార్యము 8వ అధ్యాయము వరకు రక్షింపబడినవారందరూ యూదులే. తాను రక్షణ పొందిన యూదులందరికీ ప్రతినిధిని అని చెప్తున్నాడు. పౌలు పొందిన రక్షణ ఒక మాదిరి అని 1తిమోతి 1:16 లో వ్రాస్తున్నాడు. "నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధాన పాపినైన నా యందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని". పౌలుకు జరిగినటువంటి అనుభవము ఎవరి జీవితంలోనూ జరుగలేదు. మరి ఇది మాదిరి అని పౌలు

ఎందుకంటున్నాడంటే ఇది రెండవ రాకడలో, యేసయ్య భూలోకంలో తన రాజ్యము స్థిరపరచుటకు వచ్చినప్పుడు ఇశ్రాయేలీయులంతా ఒక దేశముగా మార్పు చెందబోవుచున్న విషయము గురించిన చిత్రమిది.

ఇశ్రాయేలు పునరుద్ధరణ, రక్షణ గురించిన ప్రవచనాలు జెకర్యాగ్రంథము 12:10 నుండి 13:1 వరకు వ్రాయబడి ఉన్నాయి. ఆయన రాక అందరూ చూస్తారని జెకర్యా 14:4, అపొ.కా. 1:11, ప్రకటన 1:7లో వ్రాయబడిఉన్నది. ఆయన ద్వితీయ ఆగమనములో ఆయనను మెస్సయ్యగా గుర్తిస్తారు. పశ్చాత్తాపపడి ఆయనను స్వీకరిస్తారు. దమస్కు మార్గంలో పౌలు అనుభవం లాగా ఉంటుంది. అందుకే ఇక్కడ పౌలు మొదటి సాక్షి.

## 2. ఏలీయా ప్రవక్త రెండవ సాక్షి (11:2–10) :

ఇశ్రాయేలు దేవుడెన్నుకొనిన దేశము. వారిని ఎన్నుకున్నాడు కాని వారు అయనను విసర్జించారు. అయినా దేవుడు వారిని విసర్జించలేదు. 1రాజులు 19లో ఇశ్రాయేలీయులంతా దేవుని యొద్ద నుండి తొలగిపోయారని అనుకున్నాడు. కాని ఏడు వేల మంది విశ్వాసులు శేషముగా ఉన్నారని దేవుడు చెప్పాడు. ఈ శేషము గురించి పౌలు రోమా 9:27 లో యెషయా 10:22, 23 లోనిది తీసికొని వ్రాశాడు. అందరూ ఎప్పుడూ పూర్తిగా అబ్రాహామువలె విశ్వాస్యత చూపించలేదు. దేవుడు అబ్రాహాము యొక్క శరీర సంబంధమైన సంతానము, వాగ్దాన సంబంధమైన పిల్లలు అని తేడాలు చూపిస్తాడు. నిబంధనలో అందరూ పాలు పంచుకోలేకపోయారు. మిగిలిపోయిన ఈ శేషము (11:5, 6) దేవుని కృపతో మాత్రమే మిగిలిపోయారు కాని వారి క్రియల వలన కాదు. క్రియలు, కృప కలిసి ఉండలేవు. క్రీస్తు నీతిని వారు అంగీకరించలేదు. శేషము మిగిలింది. అంటే మరి మిగిలిన వారంతా ఏమయ్యారు? వారి హృదయ కాఠిన్యము చేత వారు దాస్యములోకి వెళ్లారు. కొందరు నశించారు.

11:9, 10 వచనములు – కీర్తన 69:22, 23 నుండి తీయబడినవి. మెస్సయ్య కీర్తనలలో ఇది ప్రాముఖ్యమైనది. “వారి భోజనము వారికి ఉరిగా నుండును గాక” – అంటే వారి ఆశీర్వాదములే వారికి భారముగాను, తీర్పు తీర్చేవిగాను అవుతాయని అర్థము. ఇశ్రాయేలీయుల పట్ల ఇది నిజమైంది.

## 3. అన్యులే సాక్షులు (11:11-15) :

రోమా 2:1-3లో పౌలు యూదులు కూడా నశించారు అని చెప్పుటకు అన్యులను వాడుకున్నాడు. ఇశ్రాయేలీయుల పునరుద్ధరణ గురించి చెప్పుటకు ఇక్కడ అన్యులను వాడుకుంటున్నాడు. యూదులు సువార్త తృణీకరించినపుడు దేవుడు అన్యులకు పంపితే వారు నమ్మి రక్షణ పొందారు. ఇశ్రాయేలీయులు పడిపోయి, నశించి త్రోసివేయబడ్డారు. ఈ మాటలు చివరి తీర్పు గురించి చెప్పబడిన మాటలు కావు. వీరు తొట్రిల్లుటవలన అన్యజనులకు రక్షణ కలిగింది. యూదులకు, అన్యులకు కూడా దేవుని సార్వభౌమ కృప కుమ్మరించబడింది. వారు తొట్రుపడితేనే అన్యులకు అంత మేలు కలిగితే వారు బాగుంటే ఇంకెంత మేలు కలిగేదో కదా అని పౌలు అంటున్నాడు. "వారికి రోషము పుట్టించుటకై వారి తొట్రుపాటు వలన అన్యజనులకు రక్షణ కలిగెను. వారి తొట్రుపాటు లోకమునకు ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు ఐశ్వర్యమును అయిన యెడల వారి పరిపూర్ణత యెంత ఎక్కువగా ఐశ్వర్యకరమగును!" అంటున్నాడు (11:12).

11:14 వచనములో పౌలు అన్యజనుల యొద్దకు వెళ్లాడనే నింద అతని మీద మోపబడింది. దానికి వివరణ ఇస్తూ మోషే చెప్పినది, యెషయా ప్రవచించినట్లు నేను చేస్తున్నానంటున్నాడు. నేను అన్యజనులను కొందరినైనా రక్షిస్తే నా సహోదరులకు రోషము పుట్టించగలనేమో అని ఈ పరిచర్య చేస్తున్నానంటున్నాడు. అన్యులను చేర్చుకుంటే చచ్చిపోయిన స్థితిలో ఉన్న అన్యుడు బ్రతికిన వాడితో సమానుడగును గదా? అంటున్నాడు (11:15). యేసు ప్రభువు లేని జీవితము మృతము.

## 4. పితరుల సాక్ష్యము (11:16-24) :

భవిష్యత్తు చూడడము ముగించి, పితరులను చూస్తున్నాడు. మొదటి నుండి ఇశ్రాయేలు జనాంగము ప్రత్యేకించబడినవారు. దేవుడు ఏర్పాటు చేసుకున్న తన ప్రజలను విడనాడాడు అని చెప్పుటకు రెండు ఉదాహరణలు వాడుతున్నాడు.

16వచనములో పిండిముద్ద:- దీనిని గురించి సంఖ్యాకాండము 15:17-21 లో చూడగలము. "మీరు మీ మొదటి పిండిముద్ద రొట్టెను ప్రతిష్ఠార్పణముగా అర్పింపవలెను; కళ్లపు అర్పణమువలె దాని అర్పింపవలెను. మీ తరతరములకు మీ మొదటి పిండి

ముద్దలో నుండి ప్రతిష్ఠార్పణమును యెహోవాకు అర్పించవలెను”. మొదటి ముద్ద దేవునికి సమర్పిస్తే మిగిలిన ముద్దంతా దేవునికి చెందినట్లే. ప్రథమ ఫలాల పండుగలో ఈ పద్ధతి వాడేవారు. దేవుడు ఒక భాగము అంగీకరిస్తే మిగిలినదంతా పరిశుద్ధపరచ బడుతుందని అర్థము. ఈ సిద్ధాంతము ఇశ్రాయేలు చరిత్రకు అన్వయించుకుంటే పౌలు వాదనలు అర్థమవుతాయి. దేవుడు ఇశ్రాయేలు పితరుడైన అబ్రాహామును స్వీకరించుట చేత ఆయన సంతానాన్నంతటినీ ప్రత్యేకించాడు. ఆయన సంతానమైన ఇస్సాకు యాకోబులను అంగీకరించాడు. అంటే మిగిలిన పిండిని (ఇశ్రాయేలీయులందరిని) కూడా అంగీకరించాలి. 16–24 వచనముల వరకు ఒలీవ చెట్టు యొక్క ఉదాహరణ ఇస్తున్నాడు – ఒలీవ చెట్టు ఇశ్రాయేలు దేశ చిహ్నాము అని యిర్మీయా 11:16, 17 లోను, హోషేయ 14:4–6 వరకు ఉన్న వాక్య భాగములో చూడవచ్చు.

మంచి ఒలీవ వృక్షము – ఇశ్రాయేలు జాతి

అడవి ఒలీవ వృక్షము – అన్యజనులు

వేరు – అన్యజనులు

విరిచివేయబడుట – ఇశ్రాయేలు తొట్రుపాటు (పాక్షిక అంధత్వము)

మరల అంటు కట్టబడుట – భవిష్యత్తు సమకూర్పు

పౌలు చెప్పిన ఉపమానములో పైన చెప్పబడిన పోలికలు కనబడతాయి. పితరులతో చేసిన నిబంధనను ‘వేరు’ అంటున్నాడు. ఈ వేరు వలననే తిరిగి చేర్చబడుతున్నారు. నిబంధనను నెరవేర్చు దేవుడు తాను పితరులతో చేసిన నిబంధనను ఎప్పుడూ మరచిపోలేదు.

పౌలు చేసే ఈ వాదన చాలామంది నమ్మలేదు. పౌలు ఇశ్రాయేలీయులను విరిచివేయబడిన కొమ్మలుగా వర్ణించాడు, అది వారికి నచ్చలేదు, అర్థము కాలేదు. కొమ్మలు విరిచివేయబడిన ఆ చెట్టులోని జీవము పంచుకోవడానికి అడవి కొమ్మలు దానికి అంటుకట్టబడ్డాయి. ఎంత విచిత్రంగా ఉంది కదూ! ఈ అడవి కొమ్మలు అన్యజనులు.

24వ వచనములో ఈ క్రియను 'స్వభావ విరుద్ధము' అంటున్నాడు. "నీవు స్వాభావికమైన అడవి ఒలీవ చెట్టు నుండి కోయబడి స్వభావ విరుద్ధముగా మంచి ఒలీవ చెట్టున అంటుకట్టబడిన యెడల, స్వాభావికమైన కొమ్మలగు వారు మరి నిశ్చయముగా తమ సొంత ఒలీవచెట్టును అంటు కట్టబడరా?" మామూలుగా జరిగే విధానమేమంటే స్వాభావికమైన (మంచి) కొమ్మలు అడవి చెట్టుకు అంటుకట్టబడతాయి. ఆ చెట్టు జీవం తీసుకొని దానిలో నుండి వచ్చు కారు ఫలాలు తీసుకోకుండా ఉండుటకు ఈ ఏర్పాటు చేస్తారు. ఇక్కడైతే ఆ పద్ధతికి విరుద్ధంగా జరుగుతుంది. యోహాను 4:22.లో "రక్షణ యూదులలో నుండియే కలుగుచున్నది" అని యేసు ప్రభువు చెబుతున్నాడు.

ఒలీవ చెట్టు సంఘానికి గుర్తు అని చెప్తే అది తప్పవుతుంది. ఎందుకంటే సంఘములో తేడాలు లేవు క్రీస్తులో అందరూ సమానము (గలతీ 3:28). ఒలీవ చెట్టు ద్వారా యూదులకు అన్యులకు క్రీస్తుతో ఉన్న సంబంధము, దేవుని ప్రణాళికలో వారెక్కడున్నారో చెప్పడానికి వాడుకున్నాడు.

అంజూరపు చెట్టు, ఒలీవ చెట్టు, ద్రాక్షావల్లి ఈ మూడు ఇశ్రాయేలీయులకు గుర్తుగా ఉన్నాయి. అబ్రాహాముకు చేసిన నిబంధన వలన ఇశ్రాయేలు దేశం ఏర్పడింది. "నీకు స్థలము చేయుటకు కొన్ని కొమ్మలు విరిచేశాడు, అందుకే నీవు అతిశయించవద్దు" అని పౌలు అన్యులకు చెప్తున్నాడు. దేవుని అనుగ్రహము మాత్రమే చూడమని అన్యులకు చెప్తున్నాడు. "అట్లు నిలువని యెడల నీవును నరికి వేయబడుదువు" అని హెచ్చరిస్తున్నాడు.

జెకర్యా 12:8 నుండి 14లో ఇశ్రాయేలు పశ్చాత్తాప పడితే ఆయన కృపకు పాత్రులవుతారు అని చెప్పబడి ఉంది. జెకర్యా 13:1లో "యెరూషలేము నివాసుల కొరకును ఊట యొకటి తీయబడును" అని చెప్పబడి ఉంది. "ఊట" దేవుని కృపా సమృద్ధిని సూచిస్తుంది. భవిష్యత్తులో ఇశ్రాయేలు జాతినంతటినీ దేవుడు శుద్ధి చేయబోతున్నాడు. ఇది జాతీయ రక్షణ.

24 వచనములో ఇశ్రాయేలు జనాంగమునకు ఒక ఆదరణ మాట వినిపిస్తున్నాడు. అడవి చెట్టుకే అంటుకడితే, మంచి కొమ్మలు మరి నిశ్చయముగా అంటుకట్టబడుతాయి అంటున్నాడు.

18 నుండి 21 వచనాలలో మీరు ఇశ్రాయేలీయులకు ఋణపడి ఉన్నారని అన్యజనులతో అంటున్నాడు. వారి స్థానాన్ని బట్టి వారి ఆత్మీయ స్థితిని బట్టి అతిశయపడవద్దని హెచ్చరిస్తున్నాడు. విశ్వాసము ద్వారా అన్యులు దేవుని ప్రణాళికలోకి ప్రవేశించారు అంతేకాని వారు చేసిన ఏ మంచి పనిని బట్టి కాదు. ఇశ్రాయేలీయుల గురించి గాని, అన్యజనులను గురించి గాని మాట్లాడునప్పుడు కలిసికట్టుగా మాట్లాడుతున్నాడు గాని వ్యక్తిగతంగా ఏ ఒక్క వ్యక్తిని బట్టి కాదు. తప్పుడు బోధలు చెప్పే సంఘాలు నాశనమవుతాయి అని ప్రవచనాత్మంగా పౌలు వేరే పత్రికలలో వ్రాశారు (1తిమోతి 4, 2తిమోతి 3, 2థెస్సలో 2), గాని చెడిపోయిన ఇశ్రాయేలీయులకు మాత్రమే భవిష్యత్తు ఉంది. ఎందుకంటే పితరులతో దేవుడు చేసిన వాగ్దానాలు ఎన్నటికీ దేవుడు మరచిపోడు. ఇశ్రాయేలు ప్రజలు దేవుని విడిచి ఎంత దూరం వెళ్లినా, వారి వేరు మాత్రం బాగుంటుంది. “అబ్రాహాము దేవుడు, ఇస్సాకు దేవుడు, యాకోబు దేవుడు” అని పిలువబడుచున్న దేవుడు నమ్మదగినవాడు. దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధన షరతులు లేనిది. అందుకే అబ్రాహాము సంతానము దేవునికి విరోధంగా ఎన్ని అకృత్యాలు చేసినను ఆయన క్షమించి వారిని తిరిగి తన దగ్గరికి చేర్చుకుంటున్నాడు.

## 5. చివరి సాక్షి దేవుడే (11:25-36) :

చివరకు ముఖ్యమైన సాక్షిని ఉంచాడు. ఇశ్రాయేలు భవిష్యత్తులో దేవుని లక్షణము, ఆయన పని ఇమిడి ఉంది. వారు ఆయన ప్రజలు అని అందరూ గుర్తించాలి. 25-32 వచనాలలో ఇశ్రాయేలు యొక్క భవిష్యత్ రక్షణ మర్మము ఉంది.

25 వచనంలో చూస్తే దేవుని సమయము - ఇశ్రాయేలు ప్రజల జీవితంలో ప్రతి ఒక్కటీ ఆయన ప్రణాళిక ప్రకారమే జరుగుతుంది. ఇశ్రాయేలీయుల ‘పాక్షిక అంధత్వము’ ఎంతవరకు ఉంటుంది. అన్న దానికి సమాధానంగా ‘అన్యజనుల ప్రవేశము పూర్తయ్యేవరకు’ అంటున్నాడు. ప్రస్తుతము దేవుడు తన సంఘాన్ని కదుతున్నాడు. అక్కడక్కడ యూదులు మారుతున్నారు కాని ప్రాముఖ్యంగా అన్యులే మారుతున్నారు. ప్రతి ఒక్క విశ్వాసి జీవితంలో ప్రతి యూదుని జీవితంలో ప్రతి విషయము దేవుని సమయమందే జరుగుతాయి.

బైబిల్ గ్రంథంలో 'Until verses' అన్ని కొన్ని ముఖ్య భాగాలున్నాయి. Until అంటే 'అంతవరకు' అని అర్థం. ఇటువంటి ముఖ్యవచనాలలో 25 వచనము ఒకటి, ఇందులో "సంపూర్ణమగువరకు" అనే మాట కనబడుతుంది.

ఇటువంటి ఇంకా కొన్ని వచనాలు :- కీర్తన 110:1 లో "చేయువరకు", మత్తయి 23:39లో "చెప్పువరకు", లూకా 21:24లో "సంపూర్ణమగువరకు"... ఇంకా అనేక వచనములు కలవు.

26లో దేవుని వాగ్దానము కనబడుతుంది. ఇక్కడ యెషయా 59:20,21, 60వ అధ్యాయములోని కొన్ని విషయాలు చూపెడుతున్నాడు. దేవుడు తన ప్రజలను రక్షిస్తానని వాగ్దానము చేశాడు, తప్పక నెరవేరుస్తాడు.

27, 28 వచనాలలో దేవుని నిబంధన - ఇది కూడా యెషయా 59:20, 21 నుండే తీసుకున్నాడు. "ఇశ్రాయేలు జనులందరు" అంటే 100% కాదు, ఎన్నుకోబడిన వారు మాత్రమే - రెండవ రాకడ సమయానికి శేషించిన వారు - కృపచేత ఎన్నుకోబడినవారు.

28 వచనంలో సువార్తను బట్టి చూస్తే అన్యులమైన మన కొరకు వారు దేవునికి శత్రువులైనారు, కాని పితరులకు చేసిన నిబంధనను బట్టి వారు ఆయనకు ప్రియులు.

29 వచనంలో దేవుని స్వభావము:- మలాకీ 3:6 ప్రకారము మారని దేవుడు, సంఖ్యా 23:19లో "దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాదు" అని వ్రాయబడి ఉన్నది. దేవుడు ఇశ్రాయేలీయుల కిచ్చిన వరాలు, వారి పిలుపు ఇవేమి మారవు. మారితే దేవుడు అబద్ధికుడువుతాడు కదా!

30-32 వచనాలలో దేవుని కృపను గురించి పౌలు చెప్తున్నాడు. యూదుల అవిధేయతను బట్టి అన్యులకు రక్షణ దొరికింది అని పౌలు అంటున్నాడు. "ఇప్పుడు మీ రక్షణ వలన వారు దేవుని తెలుసుకుంటారేమో" అంటూ యూదుల వల్లనే అన్యులకు రక్షణ వచ్చిందన్న సంగతి వారికి గుర్తు చేస్తున్నాడు. ఇశ్రాయేలీయుల కఠినత్వము పాక్షికమే కాబట్టి ఒక్కొక్కరుగా తిరిగి దేవుని దగ్గరకు రావచ్చునంటున్నాడు. ఏ భేధము లేదు, ఆయన అందరినీ రక్షిస్తాడు. ఇప్పుడు కరుణ చూపించే దేవుడు భవిష్యత్తులో కూడా చూపిస్తాడు.

29 వ వచనం : ఇక్కడ చెప్పబడిన కృపావరములు పాతనిబంధనలోని వాగ్దానములు. ఆయన ఇచ్చిన వాగ్దానాలు నెరవేరక మానవు, ఆయన మాట తప్పని వాడు (యిర్మీయా 31:36, 33:24, 26).

32 వచనం : “అందరి యెడల కరుణచూపవలెనని, దేవుడు అందరినీ అవిధేయతా స్థితిలో మూసివేసి బంధించియున్నాడు”. అన్యజనులను రక్షించాలనే ఉద్దేశంతో ఇశ్రాయేలు జనాంగాన్ని అవిధేయులుగానే ఉంచాడు. ఈ “అందరిలో” పౌలు లాంటివారు మినహాయించబడ్డారు.

33–36 వచనాలలో దేవుని అపారమైన జ్ఞానమును బట్టి స్తుతిస్తున్నాడు. దేవుని ఆలోచనా ప్రణాళికలు అద్భుతము అని తెలుసుకున్న పౌలు అయనను స్తుతిస్తున్నాడు. ఇశ్రాయేలీయుల తొట్రుపాటును అన్యజనులకు రక్షణగా మార్చిన దేవుని జ్ఞానము గొప్పది. దేవునిని అర్థము చేసుకోవటానికి మనకున్న జ్ఞానము సరిపోదు కాబట్టి మనము కేవలము స్తుతిస్తూ ఉండిపోవాలి. “దేవునికి ఆలోచన చెప్పగలవాడెవడు?” పాత నిబంధన ప్రవక్తలకే అర్థము కాలేదు. వారికే మొదటి, రెండవ ఆగమనములు (రాకడలు) అర్థము కాలేదు.

35 వచనం : ఆయనకు ముందుగా ఇచ్చి ప్రతి ఫలము పొందలేము. ఆయనమనకు ఇచ్చిన దానికి ప్రతి ఫలముగా ఆయనకు కృతజ్ఞతతో మనమివ్వాలి.

36 వచనంలో ...

He is the origin of every blessing - అన్ని ఆశీర్వాదములకు మూలము

He is the medium of every blessing - ఆయన ద్వారానే సకల ఆశీర్వాదాలు

He is the goal of every blessing - ఆయన నిమిత్తమే అన్ని ఆశీర్వాదాలు

అయన నిమిత్తమే సమస్తము కలిగియున్నది.

పౌలు చూపిన అయిదుగురు సాక్షులు ఇశ్రాయేలీయులు తిరిగి చేర్చబడుతారని చెప్పారు. రెండవ రాకడలో క్రీస్తు వచ్చి దావీదు సింహాసనముపై కూర్చున్నప్పుడు ఇశ్రాయేలీయులందరూ తిరిగి చేర్చబడుతారు. అది పునరుత్థానము లాగా ఉంటుంది.

# 12వ అధ్యాయము

**వి**శ్వాసి అనుదిన జీవితంలో దేవుని నీతి ఏ విధంగా కనపరచాలో పౌలు 12,13 అధ్యాయములలో చెప్తున్నాడు. సరైన సంబంధాలు కలిగి ఉంటే సరైన నడవడిక ఉంటుందని పౌలు అంటున్నాడు. పౌలు తన పత్రికలన్నిటిలో మొదటి భాగంలో సిద్ధాంతాలు *(doctrines)*, చివరి భాగంలో ఆ సిద్ధాంతాలను విశ్వాసి జీవితంలో అన్వయించుకొంటూ ఎలా జీవించాలి అనే విషయాలు వ్రాసాడు. క్రైస్తవ జీవితంలో సిద్ధాంతాములు, క్రియలు కలిసి నడుస్తాయి. మనము నమ్మేదానిని బట్టి మన నడవడిక ఉంటుంది. పౌలు యొక్క సిద్ధాంత వివరణలు అర్థము చేసుకున్నంత మాత్రాన సరిపోదు. మనం నేర్చుకున్నది మన జీవితాలలో అన్వయించుకుని మన అనుదిన జీవితాలలో చూపించినపుడే మనము వాక్యముపై విశ్వాసమున్న వారిగా పరిగణించబడుతాము.

ఇక్కడ ఒక ప్రశ్న పాఠకులలో తలెత్తుతుంది. ధర్మశాస్త్రముతో సంబంధము లేకుండా ఒక వ్యక్తి ఉచితముగా నీతిమంతునిగా తీర్చబడితే ధర్మశాస్త్రము లేకుండా తన జీవితాన్ని ఎలా కొనసాగించగలడు?

**పౌలు ఇస్తున్న జవాబు :** 'రూపాంతర పరచబడుట ద్వారా'. ఇది ప్రతి విశ్వాసి జీవితంలో ప్రాముఖ్యమైన మార్పు. దీనిని అర్థము చేసుకొనుటకు మనము ఒక సాధారణమైన ఉదాహరణ చూడవచ్చు. గొంగళిపురుగు చూడటానికి జుగుప్సాకరంగా ఉంది, ఏ చెట్టు మీద ఉంటే, ఆ చెట్టు ఆకులనంతా తినివేసి నాశనము చేస్తుంది. తరువాత అది ఒక గూడు కట్టుకొని, కొన్నాళ్ల తరువాత అందులో నుండి అందమైన సీతకోకచిలుక బయటకు వస్తుంది. ఒక పాపి రక్షింపబడినపుడు ఇదే జరుగుతుంది. "సీతాకోక చిలుకా, ఈ పని చేయి" అని దానికి చెప్పనక్కరలేదు. పదునాలుగు రోజులు మాత్రమే జీవించే సీతాకోకచిలుక,

బ్రతికినన్నాళ్ళు అందరినీ ఆహ్లాద పరుస్తూ కన్నులకింపుగా ఉంటూ అందరికీ మేలు చేస్తుంది. మారుమనస్సు పొంది నూతన సృష్టి గావించబడిన వ్యక్తి ఈ విధంగా ఉండాలి.

ఈ అధ్యాయంలో పౌలు ప్రాధాన్యంగా సంబంధాలను గురించి చెప్పాడు. మనము దేవునితో సరైన సంబంధము కలిగి ఉంటే మన జీవితాలలో భాగమైన ఇతర మనుషులతోను సరైన సంబంధాలు కలిగి ఉంటాము. 1యోహాను 4:20 లో " ఎవడైన– నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును" అని యోహాను భక్తుడు వ్రాసాడు. ఇక్కడ పౌలు మొదటి రెండు వచనాలలో విశ్వాసి ఎలా జీవించాలో చెప్తున్నాడు – "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి". ఈ భాగములో దేవునితో మనకుండాల్సిన సంబంధము గురించి చెప్తున్నాడు. "కాబట్టి" అను మాట ఈ పత్రికలో చాలాసార్లు వాడుతున్నాడు.

నిజమైన సమర్పణ మూడు దశలుగా పౌలు చెప్తున్నాడు –

## 1. నీ శరీరాన్ని దేవుని కివ్వు :

రక్షణకు ముందు మన శరీరాన్ని పాపపు పనులకు ఉపయోగించాము, కాని ఇప్పుడు దేవుని మహిమార్థము వాడాలి, 1 కొరింథీ 6:19–20 లో పౌలు క్రైస్తవుని శరీరము దేవుని ఆలయము, దేవుని ఆత్మ అందులో నివసిస్తుంది అని బోధిస్తున్నాడు కాబట్టి, మన శరీరం ద్వారా క్రీస్తును మహిమ పరుస్తూ, ప్రత్యక్షపరదము మనకు దేవుడిచ్చిన గొప్ప ధన్యత. పౌలు తన్నుతాను సంపూర్ణముగా దేవునికి సమర్పించుకున్నందున ఫిలిప్పీ పత్రిక 1:21,22 లో "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము. అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు" అంటున్నాడు.

యేసయ్య తండ్రి చిత్తము నెరవేర్చుట కొరకు మానవరూపం దాల్చినట్లు ఆయన పని మన ద్వారా జరిగించుట కొరకు మన శరీరాలను దేవునికి అప్పగించాలి. పాతనిబంధనలోని బలులు నిర్జీవమైనవి కాని మనము సజీవమైన బలులుగా ఉండాలి. బైబిల్‌లో రెండు సజీవ బలులున్నాయి – ఇస్సాకు, యేసుప్రభువు. యేసయ్యకు సాదృశ్యంగా ఉన్న ఇస్సాకు తండ్రికి విధేయత చూపుతూ బలిపీఠమెక్కాడు. అతను చనిపోలేదు గాని దేవుని దృష్టిలో బలిగా అర్పించబడ్డాడు. ఇక యేసుక్రీస్తు సజీవయాగముగా మన పాపముల కొరకు బలిగా అర్పించబడ్డాడు. ఆయన పునరుత్థానుడై "సజీవయాగము"గా పరలోకంలో ఉన్నాడు. యోహాను భక్తుడు పరలోక దర్శనము పొందిన తర్వాత వ్రాసిన ప్రకటన గ్రంథములో ఈ విషయము ధృవీకరించాడు. ప్రకటన 5:6 లో "వధింపబడినట్లుండిన గొఱ్ఱెపిల్ల నిలిచియుండుట చూచితిని "అని వ్రాశాడు.

ఇక్కడ పౌలు "మిమ్ములను మీరు సమర్పించుకొనుడి" అని విశ్వాసులందరికి ఒక ఆజ్ఞలాగా చెప్తున్నాడు. ఇది యుక్తమైనదే అని కారణము చెప్తున్నాడు. ఆయన మనకొరకు చేసిన త్యాగమును బట్టి ఆ విధంగా చేయమని బ్రతిమాలు కొనుచున్నాడు.

**2. నీ మనస్సును సమర్పించుట (రోమా 12:2) :**

ఈ లోకము నీ మనసును స్వాధీన పరచుకోవాలనుకుంటుంది గాని దేవుడు నీ మనసును మార్చాలనుకుంటున్నాడు. దీనిని Metamorphosis (రూపాంతరపరచబడుట) అంటారు. పరిశుద్ధాత్మ దేవుడు మనలను వాక్యంతో నింపి నూతన పరుస్తాడు, మనలో మార్పు తెస్తాడు. వాక్యము ధ్యానిస్తూ, వాక్యముతో మనసును నింపుకుంటే, దేవుడు మనలను నెమ్మదిగా తన కుమారుని సారూప్యములోనికి మారుస్తాడు.

**3. నీ చిత్తమును దేవునికి అప్పగించుట :**

నీ మనస్సు నీ శరీరాన్ని ఆధీనంలో ఉంచుకుంటే, నీ మనస్సును నీ చిత్తము ఆధీనంలో ఉంచుకుంటుంది. మన చిత్తాన్ని దేవునికి అప్పగిస్తే, మన చిత్తము ఆయన చిత్తము యొక్క ఆధీనంలో ఉంటుంది. క్రమశిక్షణతో ప్రార్థించినపుడు ఈ కార్యము జరుగుతుంది. 'నీ చిత్త ప్రకారము జరిపించండి' అని ప్రార్థిస్తే ఆ విధంగా జరుగుతుంది. దేవునితో సరైన సంబధము కలిగి ఉండాలంటే ప్రతిదినము మన శరీరము, మనసు, చిత్తము దేవునికి అప్పగించాలి, అప్పుడు దేవుడిచ్చిన ఆజ్ఞ ప్రకారము "నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణమనస్సుతోను, పూర్ణ శక్తితోను, నీపూర్ణ వివేకముతోను ప్రేమించగలము (లూకా 10:27).

## ఇతర విశ్వాసులతో ఉండవలసిన సంబంధము (రోమా 12:3-16) :

పౌలు రోమా సంఘములోని క్రైస్తవులతో మాట్లాడుతున్న సంగతులను. మనతో కూడా మాట్లాడుతున్నాడని గుర్తించుకోవాలి. సంఘములో విశ్వాసులందరు ఒకరితో ఒకరు సహోదర సంబంధము కలిగి ఐక్యతతో ఉండాలి. ఈ సంబంధాన్ని ఒక శరీరములోని అవయవాల మధ్య ఉండాల్సిన సంబంధముతో పోలుస్తున్నాడు. "ఒక్క శరీరములో మనకు అనేక అవయవములుండినను ఈ అవయములన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకరి కొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము". వారి వారి పనులు బాగా చేసుకుంటే సంఘము బాగుంటుంది. సంఘాభివృద్ధి జరగాలంటే కావాల్సిన అంశాలు కూడా చెప్పాడు.

### ఎ. మనము ఎదుటివాడిని నిజాయితీగా వెలకట్టాలి (Honest evaluation) :

తన్ను తాను ఎంచుకొన తగిన దానికంటె ఎక్కువగా ఎంచుకొనకూడదు. అందరికీ దేవుడు తలాంతులు ఇచ్చారు. ఇవన్నీ దేవుని కృపవల్లనే ఇవ్వబడినవనే సత్యము అర్థము చేసుకున్న పౌలు 1కొరింథీ 15:10లో ఈ విధంగా వ్రాశాడు – "అయినను నేనేమైయున్నానో అది దేవుని కృప వలననే అయియున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు కానీ, వారందరి కంటె నేనెక్కువగా ప్రయాసపడితిని, ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే". తన కివ్వబడిన సమస్త తలాంతులు కేవలము దేవుని కృప ద్వారానే అని చెప్పారు.

### బి. విశ్వాసముతో ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలి (రోమా 12:4-8):

అందరికీ దేవుడిచ్చిన ఆత్మవరాలను దేవుని మహిమార్థము వాడాలి. ప్రోత్సహించుట కూడా బోధించుట, నేర్పించుట లాటిదే. దాతృత్వము, కనికరము చూపుట కూడా చాలా అవసరము. "బోధించువాడైతే బోధించుటలోను, హెచ్చరించువాడైతే హెచ్చరించుటలోను పని కలిగి యుందుము. పంచిపెట్టువాడు శుద్ధమనస్సుతోను, పై విచారణ చేయువాడు జాగ్రత్తతోను, కరుణించువాడు సంతోషముతోను పని జరిగించవలెను" అని పౌలు అంటున్నాడు. మనలో ఏ తలాంతు ఉందో గుర్తించి సంఘక్షేమము కొరకు వాడాలి. మనకున్న తలాంతులను గురించి పొగుడుకుంటూ ఇతరుల తలాంతులను తక్కువ చేయడము తప్పు. అది దేవుని ఉద్దేశాన్ని తప్పుపట్టడమే అవుతుంది. ప్రతి ఆత్మ వరము ఇతరులకు మంచి చేయుటకే దేవుడు మనకిచ్చాడు.

## సి. ప్రేమతో పాల్గొనాలి (12:9-16) :-

విశ్వాసులు ఆత్మీయ వరాలను ఎలా వాడాలో పౌలు చెప్తున్నాడు. ఆత్మవరాలు ఎప్పుడూ ప్రేమతో కలిపి వాడాలి.

“మీ ప్రేమ నిష్కపటమైనదై యుండవలెను. చెడ్డదాని నసహ్యించుకొని మంచి దానిని హత్తుకొని యుండుడి. సహోదర ప్రేమ విషయంలో ఒకనియందొకడు అనురాగము గలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి” (9,10) అని పౌలు చెప్తున్నాడు. ఇంకా ఇతరుల కొరకు పని చేసేటప్పుడు ఆసక్తితో పనిచేసి, నిరీక్షణతో సంతోషించమని కోరుతున్నాడు. శ్రమయందు ఓర్పు కలిగియుండి పట్టుదలతో ప్రార్థించాలి అని చెప్తున్నాడు. పరిశుద్ధులు (సంఘములోని వారు) శ్రమలలో ఉంటే తప్పక సహాయము చేయమని, ఆతిథ్యము ఇవ్వడము తప్పనిసరి అని చెప్తున్నాడు. యేసుప్రభువు చెప్పినట్లు శత్రువులను ప్రేమించుడి, దీవించుడి అని పౌలు గుర్తుచేస్తున్నాడు.

“ఏడ్చు వారితో ఏడువుడి, ఒకనితో నొకడు మనస్సు కలిసియుండుడి. హెచ్చు వాటి యందు మనస్సుంచక తగ్గువాటి యందు ఆసక్తులై యుండుడి” (12:16). కొన్నిచోట్ల సంఘాలలో పేదవారిని అస్సలు పట్టించుకోరు. మా సంఘములో పేదవారు ఉండకూడదు అని భావించేవారు ఉన్నారు. పేదరికము తొలగించుటకు ప్రయత్నము చేయాలి కాని పేదలను ప్రేమించాలి. అవసరాలలో ఉన్న వారిని ఆదుకొని పేదరికంలో ఉన్నవారికి సహాయము చేయుట ద్వారా పేదరికాన్ని నిర్మూలము చేయవచ్చు. ఆదిమ సంఘములో విశ్వాసులు తమ ఆస్తులను అమ్మి ధనము తెచ్చి అపొస్తలుల పాదాల దగ్గర పోశారు. అందరూ సమాన స్థాయిలో జీవించాలను ఆశ కలిగి ఉన్నారు. “వారు తమ చర స్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కర కొలది పంచి పెట్టిరి” (అపొ.కా. 2:45).

## శత్రువులతో ఉండాల్సిన సంబంధము (12:17-21) :

దేవునికి విధేయత చూపాలనుకున్న వారికి శత్రువులుంటారు. యేసయ్య పరిచర్యలో కూడా ఉన్నారు. పౌలు, ఇతర అపొస్తలులు ఎక్కడ పనిచేశారో, అక్కడంతా వారికి శత్రువులున్నారు. అయితే ప్రభువు “మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి” (మత్తయి 6:44) అని చెప్పిన ప్రభువు సిలువలో ఆచరించి

చూపించారు. ప్రభువు మార్గములో నడుస్తున్న పౌలు, "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" (1 కొరింథీ 11:1) అని చెప్పిన పౌలు ఇక్కడ "కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు" అని చెప్తున్నాడు. యేసుప్రభువు మార్గంలో ఉన్న వారికి ఇంటివారే శత్రువులవ్వచ్చు అని ప్రభువే స్వయంగా చెప్పాడు – "ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువులగుదురు" (మత్తయి 10:36).

క్రైస్తవుడు ఎవరినీ తీర్పు తీర్చకూడదు, పగతీర్చుకొనకూడదు. ఇవి దేవునికి ఆజ్ఞలు. నీ పక్షాన యుద్ధము చేసే దేవుడున్నాడు కాబట్టి, "పగతీర్చుకొనుట నా పని" అని చెప్పిన దేవునికి వదిలివేయాలి. ఈ విధంగా ఉండాలంటే ప్రేమ ఉండాలి. సామెతలు 25:21,22 లో సొలొమోను మహారాజు ఒక మంచి ఉపాయము చెప్తున్నాడు – "నీ పగవాడు ఆకలి గొనినయెడల వానికి భోజనము పెట్టుము; దప్పిగొనిన యెడల వానికి దాహమిమ్ము. అట్లు చేయుట చేత వాని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు, యెహోవా అందుకు నీకు ప్రతిఫలమిచ్చును".

ఇరుగుపొరుగు వారితో మీకున్న సంబంధము, నీ నీతియుక్తమైన జీవితము పైన ఆధారపడి ఉన్నది. శత్రువులకు మంచి చేయాలి; సంతోషించు వారితో సంతోషించాలి; ఏడ్చేవారితో ఏడవాలి; బాధలలో ఉన్నవారిని ఓదార్చాలి; ఇరుగుపొరుగు వారు పిలిచినప్పుడు వెళ్లాలి. అందరితో సమాధానంగా ఉండాలి. "కీడు వలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము" (12:21) అంటూ ఈ అధ్యాయము ముగిస్తున్నాడు.

మనం దేవునిలో ఎదిగే కొద్దీ మన వైఖరి మారాలి. అప్పుడే మన చుట్టూ ఉన్న అన్యులు మనలో ఉన్న పరిశుద్ధాత్మని గుర్తించి, దేవుని మహిమ పరుస్తారు. మనకు ఎవరి మీదైనా కోపము వచ్చి, వారు చేసిన కీడుకు ప్రతి కీడు చేయాలనే తలంపు వచ్చినప్పుడు ఒకమాట గుర్తుంచుకోండి – నీయంతట నీవు పగ తీర్చుకొనినప్పుడు నీ పక్షముగా పగతీర్చు కొనుటకు దేవునికి అవకాశము ఇవ్వడము లేదు. అందుకే ఆయన చేతుల్లో పెట్టెయ్యి. "పగతీర్చుట నా పని" అని చెప్పిన దేవుని చేతుల్లో పెట్టేసెయ్యి.

దేవుని బిడ్డలుగా మనం సమాజంలో పై స్థానంలో ఉండి, అందరికీ మాదిరిగా ఉంటూ దేవుని మహిమ పరచాలి. ఆమేన్!

# 13వ అధ్యాయము

**ఈ** అధ్యాయంలో పౌలు ప్రభుత్వంతో సరైన సంబంధాలు కలిగి యుండాలని చెప్తున్నాడు. "ప్రతి వాడును పై అధికారులకు లోబడియుండవలెను. ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు. ప్రస్తుతమున్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి" ఇది దేవుడిచ్చిన ఆజ్ఞ.

దేవుడు మూడు సంస్థలు (Institutions) ఏర్పాటు చేశాడు. 1. గృహము (ఆది. 2:18-25), 2. ప్రభుత్వము (ఆది. 9:1-17), 3. సంఘము (అపో.కా. 2వ అధ్యాయము). దేవుడు ఏర్పాటు చేసిన ఈ నియమాలను అందరూ తప్పక పాటించాలి. "ఎదిరించువారు తమమీదికి తామే శిక్ష తెచ్చుకొందురు". దీనికి ఉదాహరణ అపవాది. అపవాదిని దేవుడు ఒక దేవదూతగా సృష్టించి తన దగ్గర ఆరాధించే ప్రధాన దూతగా ఏర్పాటు చేసుకుంటే, గర్వించి నాశనమైనాడు. దేవుని అధికారము క్రింద ఉండుటకు నిరాకరించడముతో తన మీదికి తానే శిక్ష తెచ్చుకున్నాడు. ఇతని నాశనము గురించి యెషయా 14:12-17 వరకు, యెహెజ్కేలు 28:12-19 వరకు ఉన్న వాక్యభాగములో చూడగలము.

పౌలు రోమా పత్రిక వ్రాసే సమయానికి రోమా సామ్రాజ్యంలో ఉన్న విశ్వాసులకు ఇంకా శ్రమలు మొదలవలేదు. ఇంకా ప్రారంభములోనే ఉన్నాయి. క్రైస్తవులు యూదులలో ఒక భాగము అనే భావముతో రోమా ప్రభుత్వము వారిని సహిస్తూ, అంగీకరిస్తున్న సమయమది. అయితే తొందరలో వారికి శ్రమలు రాబోతున్నాయి. అప్పుడు వారు రోమా చక్రవర్తికి విధేయత చూపించలేకపోవచ్చు. కైసరుకు ధూపము వేసి పూజ చేయలేకపోవచ్చు. ఇవన్నీ తెలిసిన పరిశుద్ధాత్మ దేవుడు పౌలుతో ఈ సంగతులు హెచ్చరికగా వ్రాయిస్తున్నాడు. అధికారులు ఎలాటివారైనా వారికి లోబడి ఉండాలని చెప్తూ 4 కారణాలు చూపిస్తున్నాడు.

**అధికారులకు కోపము రాకుండు నిమిత్తము (1-4) :**

అధికారులు దేవుని వల్లనే ఏర్పరచబడిన వారు కాబట్టి విధేయత చూపించాలి. వారు చెడ్డవారైతే వారి మీద దేవుడే తీర్పు తీరుస్తాడు. ఉదా॥ నెబుకద్నెజరు. దానియేలు 4:17,25,32 వచనాలలో నెబుకద్నెజరును దేవుడు ఏ విధంగా శిక్షించాడో వ్రాయబడి ఉంది – "మానవులలో నుండి అతనిని తరిమిరి, అతడు పశువు వలె గడ్డిమేసెను. ఆకాశపు మంచు అతని దేహమును తడపగా అతని తలవెంట్రుకలు పక్షిరాజు రెక్కల ఈకెల వంటివియు, అతని గోళ్లు పక్షుల గోళ్లవంటివియు నాయెను". ప్రజలను క్రమశిక్షణలో పెట్టుటకు దేవుడు రాజులకు ఖడ్గాన్ని ఇచ్చాడు. అందుకే అధికారిని గౌరవించకపోయినా అధికారాన్ని గౌరవించాలి. లేకపోతే వారి ఖడ్గానికి బలైపోవాల్సి వస్తుంది. పౌలు తన పరిచర్యలో కొన్నిసార్లు రోమా పౌరునిగా తనకివ్వబడిన అధికారము వాడుకున్నాడు.

**మనస్సాక్షి బట్టి (5 నుండి 7) :**

ప్రజలంతా తమ తప్పులకు శిక్ష ఉంటుదనే భయంతో ప్రభుత్వానికి విధేయత చూపిస్తారు. కాని క్రైస్తవులు తమ మనస్సాక్షిని బట్టి విధేయత చూపాలి. అయితే ప్రభుత్వము దేవునికి విరోధముగా చేయమని చెబితే, అప్పుడు ఎదిరించవచ్చును. అపో.కా. 5:29లో ప్రధానయాజకుడు అపొస్తలులను సువార్త బోధించవద్దని ఆజ్ఞాపించినప్పుడు వారు "మనుష్యులకు కాదు, దేవునికే మేము లోబడవలెను గదా" అన్నారు. మనస్సాక్షికి విరుద్ధంగా ఏమి చేయకూడదు. ఎందుకంటే రక్షణ పొందిన ప్రతి విశ్వాసి మనస్సాక్షి పరిశుద్ధాత్మ ఆధీనంలో ఉంటుంది. ప్రభుత్వానికి విరోధముగా ఏదీ చేయకూడదు. "యెవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి. ఎవని యెడల భయముండవలెనో వాని యెడల భయమును, ఎవనియెడల సన్మానముండవలెనో వాని యెడల సన్మానమును కలిగియుండి, అందరికిని వారి వారి ఋణములను తీర్చుడి" (13:7).

అమెరికా దేశములో ఒకసారి Conscience fund (మనస్సాక్షి ఫండ్) అని ఒకటి ఏర్పాటు చేసి ఎవరెవరికి పన్నుల బకాయిలున్నాయో వారంతా మనస్సాక్షి ప్రకారం ప్రోత్సహింపబడి ఇవ్వాలని ప్రకటించినప్పుడు చాలామంది ఇచ్చారట. ప్రజల ధనాన్ని ప్రభుత్వము దుర్వినియోగము చేస్తుందని తెలిసినా, మనము కట్టాలి. కట్టకపోతే మనస్సాక్షి ఊరుకోదు.

**ప్రేమ కొరకు (8 నుండి10) :**

"ఒకనినొకడు ప్రేమించుట విషయంలో తప్ప మరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు. పొరుగువారిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు" (13:8). ప్రభుత్వ అధికారులే గాక మిగిలిన వారితో కూడా ప్రేమగా ఉండాలి. దేవుడిచ్చిన ఆజ్ఞ ఇది – "నేను మిమ్ములను ప్రేమించినట్లే మీరును ఒకరు నొకరు ప్రేమించవలెను" (యోహాను 13:34), ఈ ఆజ్ఞ పాటిస్తే అన్ని ఆజ్ఞలు పాటించినట్లే. మనము ఇతరులను ప్రేమించినపుడు వారిపట్ల ఏ తప్పు చేయకుండ ఉండగలము. ధర్మశాస్త్రములో ఇవ్వబడిన పది ఆజ్ఞలు యేసు ప్రభువు చెప్పిన రెండు ఆజ్ఞలలో ఇమిడివున్నాయి. మనలో ఉన్న దేవుని ప్రేమను బట్టి మనము దేవునికి విధేయత చూపిస్తూ ఇతరులకు సహాయము చేస్తుంటాము.

"ఎవనికిని అచ్చియుండవద్దు" అంటే అప్పుతీసుకోకూడదని కొందరు బోధిస్తారు. కాని బైబిలులో ఎక్కడా అప్పుతీసుకోవడము తప్పని వ్రాయబడి లేదు. ఎక్కువ వడ్డీ తీసుకొనవద్దని మాత్రము చెప్పబడి ఉంది. ఈ మాట న్యాయపరమైన విషయాలను గురించి అనుకోవాలి. ఇక్కడ పౌలు మనుష్యుల మనసులను గురించి మాట్లాడుతున్నాడు. హృదయము అన్నింటి కన్న ఘోరమైన పాపముతో నిండి ఉన్నది. కాబట్టి దేవుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఆజ్ఞలు మనస్సును మార్చలేవు.

మానవుని మనస్సు స్వార్థముతో నిండి ఉంది. కేవలము దేవుని కృప ద్వారానే మారుతుంది.

**యేసు ప్రభువు కొరకు (11–14) :** అధికారులకు ఎందుకు విధేయత చూపించాలను ప్రశ్నకు చివరి కారణము ప్రభువు కొరకు అని పౌలు చెప్తున్నాడు. క్రీస్తు త్వరలో రానై యున్నాడు. ఆయన వచ్చినప్పుడు మనము ఆయన సేవకులుగా విశ్వాస్యత చూపాలి. మన రక్షణ దగ్గరలో ఉంది. వెలుగు రాబోతున్నది కాబట్టి తయారుగా ఉండడని పౌలు అంటున్నాడు. "అల్లరితో కూడిన ఆటపాటలైనను, మత్తయినను లేకయు, కామ విలాసములైను, పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను, మత్సరమైనను లేకయు, పగటి యందు నడచుకొన్నట్లు మర్యాదగా నడుచుకొందుము" (13:13) అని పౌలు హెచ్చరిస్తున్నాడు.

ఆ కాలంలో Pub culture (క్లబ్బుల్లో గడపడము) విపరీతముగా ఉండేది. తినడము, త్రాగడము, కక్కడము, రాత్రంతా కామవిలాసాలలో గడపడము ఉండేవి. అందుకే పౌలు ఈ హెచ్చరికలు ఇస్తున్నాడు. రెండవ రాకడ దొంగవలె అకస్మాత్తుగా వస్తుంది. నిద్ర మేల్కొనండి అని 1థెస్స॥లకు 5:1-11లో చెప్పాడు. మత్తయి 25:1-13లో యేసయ్య కూడా హెచ్చరించాడు.

యేసయ్య వచ్చినప్పుడు అపరిశుభ్రమైన దుస్తులు త్యజించి శుభ్రంగా ఉండండి అని చెప్తున్నాడు. "మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనినవారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీరము విషయమై ఆలోచన చేసికొనకుడి" (13:14) అంటున్నాడు. క్రీస్తును ధరించుకోవడమంటే ఆయన సారూప్యములోనికి మారుట.

1యోహాను 2:28 నుండి 3:3 వరకు ఉన్న వాక్యభాగములో యోహాను ఈ విషయము బాగా వివరిస్తున్నాడు. మనము దేవుని పిల్లలము కాబట్టి దేవుని స్వరూపములోకి ఎదగండి అంటున్నాడు. క్రైస్తవుడు వెలుగు కవచము ధరిస్తాడు కాని చీకటి క్రియలు కాదు. లోకంలోని కార్యక్రమములలో పాల్గొనాలనే ఆశ ఉండదు. అందుకే పౌలు వారితో ఎదగండి (Grow up) అని చెప్తున్నాడు. మనము తినే ఆహారాన్ని బట్టి మనము పెరుగుతాము కాబట్టి శారీరక ఆశలు లేకుండా చూసుకోండి అంటున్నాడు. శరీరాన్ని పోషిస్తే మనకు అపజయము, అంతర్మనిషిని పోషిస్తే మనకు విజయము.

**క్రైస్తవపౌరుడు అందరికంటే మంచి పౌరునిగా ఉండాలి.** ప్రభుత్వంలో జరిగే పనులు, అధికారులు నాయకులు చేసే పనులు నచ్చక పోయినా మనము దేవుని చిత్తానుసారముగా వారందరికీ విధేయత చూపాలి. పౌలు ఈ ఆధ్యాయములో 'విధేయత' అనే మాట కాకుండా "లోబడియుండవలెను" అనే మాట వాడుతున్నాడు. బలవంతంగా కాక స్వతహాగా విధేయులుగా ఉండాలి అని ఆయన భావన.

# 14వ అధ్యాయము

**వి**శ్వాసములో బలహీనుడిగా ఉన్న సహోదరులతో ఏ విధమైన సంబంధము కలిగి ఉండాలో పౌలు ఈ అధ్యాయములో వివరిస్తున్నాడు.

దేవుని బిడ్డలలో (విశ్వాసులలో) సమాధానము లేకుండుట అనే సమస్య ఈనాటిది కాదు. పాపముతో పాటు వచ్చిన మొదటి సమస్య ఇది. “సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము !” (కీర్తన 133:1) అని లేఖనాలు చెప్పినా విశ్వాసులు ఆలకించుట లేదు. యేసుప్రభువు సమాధానకర్త, ఆయన సమాధాన పరచడం కొరకే ఈ లోకమునకు వచ్చాడను సత్యము తెలిసినా పెడచెవిని పెడ్తున్నారు. పాతనిబంధన కాలంలో చాలా ప్రాంతాల్లో కుటుంబాలలో కలహాలు, యుద్ధాలు చూసాము. నూతన నిబంధనలోని చాలా సంఘాలలో ఇదే సమస్య. కొరింథీ సంఘములో నాయకులను బట్టి కలహాలు; వివాదాలతో న్యాయస్థానముకు వెళ్లడము; గలతీ సంఘములో ఒకరినొకరు కరచుకొని భక్షించుకొనుట (గలతీ 5:15) లాంటివి చూడగలము. పౌలు సంఘాలలో ఐక్యత గురించి ప్రతి పత్రికలో వ్రాశాడు. ఫిలిప్పీ సంఘములో ఇద్దరు స్త్రీల వలన సమాధానము లేకుండా పోయిందని పౌలు చెప్పాడు. ఈ సమస్యలన్నీ వారి జీవిత నేపథ్యము వలన తలెత్తాయి. యూదులు చాలా క్రమశిక్షణ నుండి బయటకు వచ్చారు. అన్యులు ఎలాంటి క్రమశిక్షణ, ఆచార వ్యవహారాలు లేకుండా ఏది తినాలో–ఏది తినకూడదో, ఏది మంచి రోజో – ఏది చెడ్డ రోజో అను పట్టింపు లేకుండా విచ్చలవిడి తనం నుండి బయటకు వచ్చారు. అందుకే అపొ.కార్యములు 15వ అధ్యాయములో యెరూషలేములో సంఘ పెద్దలందరూ కలిసి వివాదాలు వాటి, పరిష్కారముల గురించి ప్రత్యేకంగా సమావేశమై వారి వారి అభిప్రాయాలు సేకరించారు.

రోమా సంఘము వారు ప్రత్యేక ఆహార నియమాలు, ప్రత్యేక దినాలు ఆచరించుటను గురించిన వివాదాలలో చిక్కుబడి యున్నారు. మాంసాహారము తినుట తప్పని భావించిన కొందరు శాఖాహారాన్నే తిన్నారు. ఈ విధంగా ప్రతి చిన్న విషయానికి అభిప్రాయ భేదాలు, ఒకరినొకరు తప్పుపట్టడము మొదలుపెట్టారు. ఒక గుంపువారు ఇంకొక గుంపువారిని అత్మీయంగా లేరని చెప్పడము మొదలుపెట్టారు. పౌలు ఈ అధ్యాయములో సున్నితమైన విశ్వాసిని కనికరముతో అంగీకరించాలి అని చెప్తూ బలమైన విశ్వాసి తనకివ్వబడిన స్వాతంత్ర్యమును (ధర్మశాస్త్రపాలన నుండి విడుదల) ప్రేమతో అనుభవించాలి అని చెప్పాడు. పౌలు అన్ని రకాల సంబంధాలను గురించి చెప్తున్నాడు. బైబిలులో చాలా రకాలైన సంబంధాలను గురించి చెప్పబడి ఉంది. మనిషికి – దేవునికి; మనిషికి – పాపానికి; మనిషిని – మనిషికి మొదలైనవి. రూపాంతరము పొందిన విశ్వాసికి ఈ సంబంధాలన్ని దేవుని చిత్తానుసారంగా ఉంటాయి. ఆత్మీయ సంబంధాలలో సమర్పణ, వినయము, ప్రేమ కనపడుతాయి. చివరకు క్రీస్తు మనకు మాదిరి కాబట్టి క్రీస్తును ధరించుకొనుడి అని పౌలు సలహా ఇస్తున్నాడు. ధర్మశాస్త్రానికి చనిపోయి, క్రీస్తు చేసిన పనుల మీద ఆధారపడాలి. “ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని” (ఫిలిప్పీ 3:7)లో పౌలు అన్నాడు, చేసి చూపించాడు. మన జీవితము క్రీస్తుతో ప్రారంభమై క్రీస్తుతో అంతము కావాలి. ధర్మశాస్త్రము యొక్క నీతి నాకులేదు. క్రీస్తే నాకు ధర్మశాస్త్రము అనుకోవాలి. గలతీ 5:16–24 లో పౌలు “ఆత్మానుసారముగా నడుచుకొనుడి” అంటున్నాడు. ఆత్మానుసారము అంటే మనలో ఉన్న పరిశుద్ధాత్మ చెప్పినట్లు నడుచుకోవడము. పరిశుద్ధాత్మ శరీరమునకు విరోధము. ధర్మశాస్త్రము మనకు స్వనీతి ఇస్తుంది. మన నీతి దేవుని ఎదుట మురికి గుడ్డలాంటిది. కాబట్టి స్వనీతి కలిగియుంటే పరిశుద్ధాత్మను దు:ఖపరచిన వారమవుతాము.

**14:1** లో చెప్పబడిన “బలహీనుడు” దేవుడిచ్చిన స్వాతంత్రమును వాడుకొనుటకు సందేహించువాడు. దేవుడిచ్చిన స్వాతంత్ర్యమును వాడుకొనువాడు బలవంతుడు. ఈ అధ్యాయము చదువుచున్నప్పుడు ఈ సత్యమును మనసునందుంచు కోవాలి.

కొలొస్స 2:15 లో “దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను, మనకు విరోధముగా నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసి, మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడా మిమ్మును జీవింప చేసెను”. దేవుడు తానే వ్రాశాడు, తానే తుడిచేశాడు.




ఆచారాలన్నీ శరీరేచ్ఛలను నిగ్రహింపచేయుటకు పనికిరావు. దేవుడు వీటన్నిటి నుండి స్వతంత్రులను చేశాడు కాబట్టి ఈ స్వాతంత్ర్యమును సంతోషంగా అనుభవించండి అని పౌలు చెప్తున్నాడు. సంశయాలు కలిగినవాడు బలహీనుడు కాబట్టి వాడితో వాదనలు పెట్టుకోక వాక్యములో ఎదుగుటకు ప్రయత్నించాలి. బలహీనమైన విశ్వాసిని చేర్చుకొని ఆదరించు, కాని వాడు వాదిస్తుంటే వాడితో వాదనలు పెట్టుకోవద్దని చెప్తున్నాడు.

**14:2.** –ధర్మశాస్త్ర ప్రకారము కొన్నింటిని తినకూడదని ఆంక్షలున్నాయి. ఆ కాలంలో యూదా క్రైస్తవులు శాఖాహారమే తినుటకు కారణము రోమా సంస్కృతితో పశువులను గొంతు నులిమి చంపుతారు. ఇది ధర్మశాస్త్ర ప్రకారము నిషిద్ధము. ఇంకొక కారణము బజారులో అమ్మే మాంసము దేవుళ్లకు బలి ఇచ్చిన బలిపశువులని, ధర్మశాస్త్ర ప్రకారము దేవుళ్లకు బలిగా ఇచ్చిన మాంసము తినుట నిషేదించబడినది. అపొ.కా. 10వ అధ్యాయములో పేతురు మతనిష్టగల, యూదుడుగా ఉండి ఇలాంటి ఆలోచనలు కలిగియున్నప్పుడు ప్రభువే స్వయంగా దర్శనాల ద్వారా “దేవుడు పవిత్రము చేసిన వాటిని నీవు నిషిద్ధమైన వాటిగా ఎంచవద్దని” చెప్పారు.

తినువాడు– స్వాతంత్ర్యము అనుభవిస్తున్నాడు. కాబట్టి వాడిని తృణీకరించకూడదు.

తిననివాడు– అనుమానంతో స్వాతంత్ర్యము అనుభవించడములేదు కాబట్టి వాడిని తీర్పు తీర్చకూడదని పౌలు వివరిస్తున్నాడు. 1కొరింథీ 10:25 లో – “మనసాక్షి నిమిత్తము ఏ విచారణయు చేయక కటిక వాని అంగడిలో అమ్మున దేదో దానిని తినవచ్చును” అని పౌలు చెప్తున్నాడు. విడిపించబడిన వారికి ఏ అభ్యంతరాలు ఉండవు. విగ్రహముల దగ్గర బలులు ఇచ్చినది ఎలాగ అన్నప్పుడు – విగ్రహము అన్యునికి దేవుడు కాని నాకు కాదు. అక్కడ అర్పించిన దానికి, అంగట్లో దొరికే దానికి ఏ బేధము లేదు, కాని ప్రసాదము అని కళ్లకద్దుకొని తినే వారి ఎదుట అదే విధంగా మనము తింటే అది తప్పు. ఎవరికైనా అభ్యంతరకరముగా ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉంటూ, దేవునికి మహిమకరంగా ఉండే పనులే చేయాలి. ఈ సమస్యలన్నీ వివరించిన పౌలు విశ్వాసులు

ఏవి నమ్మాలో ఏవి నమ్మకూడదో చెప్తూ సంఘములో ఏకత్వము, సమాధానము ఉండాలంటే పాటించాల్సిన సూచనలు ఇచ్చారు. WADA - We agree to disagree agreeably. మనకు ఎన్ని విభిన్న అభిప్రాయాలు ఉన్నను భిన్నత్వములో ఏకత్వముండాలని విశ్వసించాలి.

**14:1-12** లో ఒకరిని ఒకరు చేర్చుకొనుడి అంటున్నాడు :

"బలమైన విశ్వాసి"తో మాట్లాడుతూ హెచ్చరికతో మొదలు పెడుతున్నాడు. వీరు తమ ఆత్మీయ స్వాతంత్ర్యమును (క్రీస్తు ద్వారా) అర్థము చేసుకొని ఆచారాల బానిసత్వము నుండి విడుదల పొందినవారు. "బలహీనులైన విశ్వాసులు" ఆత్మీయ ఎదుగుదల లేనివారు. బాగా ఆచారాలు పాటించేవారు, ఆత్మీయంగా బాగా ఉన్నత స్థానంలో ఉన్నామను తప్పుడు అభిప్రాయము కలిగి ఉన్నారు. రోమా సంఘాలలో బలహీన విశ్వాసులు బయటకు వచ్చినా ధర్మశాస్త్రము నుండి పూర్తి స్వేచ్ఛ లేక ఇంకా ఆచారాలను పట్టుకొని యున్నారు. అందుకే వారు స్వాతంత్ర్యమును అనుభవించ లేకున్నారు. బలహీనులను బలవంతులు తప్పు పడుతున్నారు. బలవంతులు బలహీనులను హీనంగా చూస్తున్నారు. అందుకే "ఒకరిని ఒకరు చేర్చుకొనుడి" అను హెచ్చరికతో మొదలు పెట్టాడు. ఎందుకు చేర్చుకోవాలో కొన్ని కారణాలు కూడా చెప్తున్నాడు.

**14:1-3** దేవుడు మనలను స్వీకరించాడు. సంఘములో, సహవాసంలో ఏవేవి ఉండాలో నిశ్చయించాల్సింది ప్రభువే కాబట్టి మనము కూడా ఇతరులను స్వీకరించాలి. మనము పెట్టుకున్న ఆచారాలను బట్టి ఇతరులను అసహ్యించుకోవడము, తీర్పుతీర్చడము దేవుని వాక్యానికి విరుద్ధము. దేవుడు మనలను అంగీకరించి స్వీకరించాడు కాబట్టి మనము ఒకరినొకరు చేర్చుకోవాలి. St. Augustine ఇలా అన్నాడు - In essentials, unity; in non-essentials liberty; in all things charity. అవసరమైన వాటిలో ఐక్యత, అనవసరమైన వాటిలో స్వాతంత్ర్యము, అన్నింటిలో దాతృత్వము ఉండాలని పరిశు ద్ధుడైన అగస్టీన్ అన్నాడు.

అన్యులకు సువార్త తీసికెళ్లడానికి పేతురును దేవుడు పంపినప్పుడు సంఘము అన్యులతో భోజనం చేశాడని తప్పుపట్టింది (అపొ.కా. 11:1-3). అయితే అప్పటికే దేవుడు అన్యులకు పరిశుద్ధాత్మను అనుగ్రహించుట ద్వారా వారిని తాను స్వీకరించానని

పేతురు చెప్పాడు. అప్పటికి ఒప్పుకున్న పేతురు మళ్లీ ఒకసారి అంతియొకయలో అన్యులతో కూర్చుని తినడానికి ఇష్టపడలేదు (గలతీ 2:11-13). క్రైస్తవ సహవాసము తిండి ఆచారాల మీద ఆధారపడలేదని పేతురుకు, పౌలుకు ఇద్దరికీ చూపించాడు.

ప్రతి సంఘములోను బలమైన, బలహీన క్రైస్తవులు ఉన్నారు. బలమైన వారు ఆత్మీయ సత్యాలను గ్రహించి ఆచరణలో పెడ్తారు, కాని బలహీనులు ఆ స్థాయికి ఎదగలేదు. బలహీనులు బలవంతులను ఆత్మీయంగా లేరు అనకూడదు. బలవంతులు బలహీనులను ఎగతాళి చేయకూడదు. దేవుడు అందరినీ అంగీకరించాడు కాబట్టి మనము ఒకరిని ఒకరు స్వీకరించాలి.

**14:4-** ప్రభువు తన బిడ్డలను నిలువబెట్టుటకు శక్తిగలవాడు: దేవుడు ప్రభువు, క్రైస్తవుడు సేవకుడు అను ఈ సంబంధాన్ని ఎవరూ కాదనలేరు. క్రైస్తవ జీవితంలో మన విజయము ఇతర క్రైస్తవుల అభిప్రాయాలపై ఆధారపడి ఉండదనే సత్యము మనలను స్థిరపరుస్తుంది. ఇక్కడ 'సేవకుడు' అనే మాట మనము దేవుని కొరకు పనిచేయాలని గుర్తు చేస్తుంది. ఆ విధంగా పనిచేస్తుంటే ఇతరులను తప్పుపట్టడానికి, తీర్పు తీర్చడానికి సమయముండదు. క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించాలనే ఆశతో పనిచేయువారికి మిగిలిన సంఘ సభ్యుల జీవితాలను గురించి ఆలోచించే సమయముండదు. అంతకంటే ముఖ్యమైన విషయాలున్నాయి.

## యేసుక్రీస్తే ప్రభువు (రోమా 14:5-9) :

ఈ వచనాలలో "ప్రభువు" అనే మాట 7 సార్లు వ్రాయబడి ఉన్నది. ఏ క్రైస్తవుడు దేవునిలాగా ప్రవర్తించుటకు వీలులేదు. మనము ఇతరుల కొరకు ప్రార్థించవచ్చు, హెచ్చరించవచ్చు, సలహాలివ్వవచ్చు కాని దేవుని స్థానం తీసుకోలేము. ఏదైనా "పరిశుద్ధము" అంటున్నామంటే అది దేవునికి సంబంధించినది అని అర్థము. అందుకే అన్నీ మంచివే. మన సంఘాలలో కూడా పాటించే కొన్ని ఆచారాలు బైబిలు ప్రకారమైనవి కావు. క్రైస్తవులు క్రీస్తును ప్రభువుగా అంగీకరించడము లేదు. దీనికి మంచి ఉదాహరణ యోహాను 21:15-25 వరకు ఉన్న వాక్యభాగములో చూడగలము. యేసయ్య పేతురుతో తనను వెంబడించమని అడిగినప్పుడు తాను వెంబడించుట గురించి ఆలోచించకుండా యోహాను సంగతి ఏమిటి?అని అడుగుతున్నాడు. యేసు ప్రభువు - నీ కెందుకు? అంటున్నాడు. మన మొదటి భాద్యత యేసుక్రీస్తు.

**యేసుక్రీస్తు న్యాయమూర్తి (రోమా 14:10-12) :**

మీరు ఒకరికి ఒకరు ఎందుకు తీర్పు తీర్చుకుంటున్నారు? అని పౌలు రోమా సంఘస్తులను అడుగుతున్నాడు. అందరూ క్రీస్తు న్యాయపీఠము ముందర నిలవాల్సి ఉంది. మీరు ఒకరికి ఒకరు తీర్పు తీర్చుటకు కాదు గాని ప్రభువు మిమ్ములనందరినీ తీర్పు తీరుస్తాడని చెప్తున్నాడు. క్రీస్తు న్యాయపీఠము మన క్రియలను బట్టి మనకు బహుమానాలు ఇచ్చే స్థలము. ఈ తీర్పు కొరకు మనము ఏ విధంగా సిద్ధపడాలి? ఇతరులను తీర్పు తీర్చుట మానేసి మనలను మనము సిద్ధపరచుకొనుటయే సరియైనది. ఉదాహరణకు లోతును గూర్చి ఆలోచిస్తే అబ్రాహాము లాగా దేవునితో నడవలేదు. తీర్పు వచ్చినప్పుడు తాను మాత్రము రక్షింపబడ్డాడు గాని తాను సంపాదించుకొన్నది ఏదీ మిగుల లేదు.

మన గురించి మనము లెక్క అప్పజెప్పుకోవాలి. అందుకే మన లెక్క సరిగా ఉండేట్లు చూసుకోవాలి. యేసయ్యను ప్రభువుగా మన జీవితాలలో ఉంచుకుంటే మనము బాగుంటాము. 24గంటలు మనము చేసే ప్రతి పనిలో దేవునికి మహిమ రావాలి. మన సంఘాలలో చాలా మంది విశ్వాసుల జీవితాలు మందిరములో ఒకలాగా ఇంటిలో ఇంకొకలాగా, సమాజములో ఒకలాగా ఉంటాయి. మనము లెక్క అప్పజెప్పాల్సింది ఇహలోకవాసులకు కాదు గాని హృదయ అంతరంగాలు చూసే ప్రభువుకు, ప్రతి మాటలో, ప్రతి అడుగులో మనలను మనము పరీక్షించుకుంటూ ఉండాలి. మందిరాలలో ఆరాధనలో పాల్గొంటూ సేవలో పాల్గొనే వారు ఇళ్లల్లోవారి భార్యలపట్ల రాక్షసుల్లాగా ప్రవర్తిస్తుంటారు. దానినే 'వేషధారణ' అంటారు. దేవుడు వేశ్యలనైనా క్షమిస్తాడు గాని వేషధారణ ఆయనకు హేయమైనది.

14:13 నుండి 23 వచనాలలో పరస్పరము క్షేమాభివృద్ధి కలుగజేసికొండని పౌలు సలహా ఇస్తున్నాడు. మొదటి మాటలు వింటే ఒకరి జోలికి ఒకరు వెళ్లొద్దని అన్నట్లుగా ఉంది కాని ఇక్కడ ఒకరికి ఒకరు సహాయపడండని చెప్తున్నాడు. విశ్వాసములో ఒకరిని ఒకరు కట్టండి అని చెప్తూ కొన్ని సత్యాలు చెప్తున్నాడు.

13 నుండి 15వచనముల ప్రకారం క్రైస్తవులు ఒకరి నొకరు ప్రభావితము చేయగలరు. మన మాటలు క్రియలచేత మన తోటి వారిని క్రుంగ జేయగలము లేదా పైకి తీసుకొని రాగలము. ఒక చిన్న బిడ్డ చీకటిలో దయ్యాలున్నాయని భయపడుతు

న్నాడనుకోండి – తల్లి ఎంత చెప్పినా భయం పోదు కాని తల్లి బిడ్డ చెంత కూర్చుని బుజ్జగిస్తే నిద్రపోతాడు. అలాగే బలహీనులకు బలవంతులు ఆదరణ ఇస్తూ నిశ్చయత కలిగించాలి.

16 నుండి 18 వచనముల ప్రకారం క్రైస్తవులు ప్రాధాన్యతలు కలిగి యుండాలి. ఇహలోక విషయాలు కాక, నిత్యమైన నీతి, సమాధానము. ఆనందము. మన జీవితాలలో ఉండాలి. "దేవుని రాజ్యము భోజనమును, పానమును కాదు గాని, నీతియు సమాధానము పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" అంటున్నాడు. మనలో ఉన్న పరిశుద్ధాత్మ దేవునికి అవకాశం ఇచ్చినప్పుడు క్రీస్తుకు దాసులుగా ఉంటూ దేవునికి ఇష్టుడుగాను, మనుష్యుల దృష్టికి యోగ్యుడుగాను ఉంటాడు. సంఘములో ఆత్మీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడు ఐక్యత ఉంటుంది.

19 నుండి 21 వచనాలలో ఆత్మీయ ఎదుగుదలలో ఒకరిని ఒకరు ప్రోత్సహించు కోవాలి. బలహీనులు బలవంతుల దగ్గర నేర్చుకోవాలి. బలవంతులు బలహీనులను ప్రేమించినప్పుడు సంఘాలలో సమాధానం నెలకొంటుంది.

22 నుండి 23 వచనాలలో క్రైస్తవులు తమ స్వంత అభిప్రాయాలు ఇతరుల మీద రుద్దుటకు ప్రయత్నించ కూడదు. ఉదాహరణకు ఒక బలవంతుడు బలహీనుని విగ్రహములకు పెట్టిన ప్రసాదము తినమని బలవంతము చేసి, అతను తింటే అతని మనస్సాక్షి ఒప్పుకోక, అతడు ఇంకా బలహీనుడవుతాడు. జ్ఞానము ద్వారా మనస్సాక్షి బలపడుతుంది. కాని ఆ జ్ఞానము ప్రేమతో అందించాలి. ప్రేమ సమస్త దోషములను కప్పివేస్తుంది. కాబట్టి బలహీనునిలోని బలహీనతలను గమనించి ప్రేమతో ఆ బలహీనతలనుండి వెలుపలికి తీసుకొని వచ్చుటకు బలవంతుడు ప్రయత్నించాలి.

"విశ్వాసమూలము కానిది ఏదో అది పాపము" కాబట్టి విశ్వాస మూలమైనది మాత్రము బలహీనుని చేయనివ్వాని. ఇది లేఖనానుసార జీవితం! దైవాశీస్సులు.

# 15వ అధ్యాయము

**14**వ అధ్యాయములోని సలహాలు ఈ అధ్యాయంలో మొదటి 7 వచనాలలో పౌలు కొనసాగిస్తున్నాడు. "కాగా బలవంతులమైన మనము, మనలను మనమే సంతోషపరచుకొనక, బలహీనుల దౌర్బల్యములను భరించుటకు బద్ధులమై యున్నాము".

15:1-7 వచనాలలో 'ఒకరినొకరు సంతోషపరచుకొనుడి' అని చెప్తున్నాడు. తనను తాను బలవంతులైన క్రైస్తవులతో పోల్చుకొని వారందరిలో ఉన్న స్వార్థము గురించి వివరిస్తున్నాడు. నిజమైన క్రైస్తవ ప్రేమ నిస్వార్థంగా తమకు కలిగినది ఇతరులతో పంచుతూ అందరినీ సంతోషపెడుతుంది. క్రొత్తగా క్రైస్తవులైన వారికి వారి ఆత్మీయ ప్రయాణంలో సహాయపడుతుంది. మనము వారిని భరిస్తున్నాము అను భావన మనలో నుండి తీసివేసికొని వారిని ప్రోత్సహించాలి.

అన్నింటికంటే గొప్ప మాదిరి యేసుప్రభువు. మనలను రక్షించుటకు ఆయన గొప్ప వెల చెల్లించాడు. క్రీస్తు తన్ను తాను సంతోషపరచుకోడానికి ఈ లోకానికి రాలేదు కాని "నిన్ను నిందించువారి నిందలు నా మీద పడెను" అను ప్రవచన నెరవేర్పు కొరకు వచ్చాడు. కీర్తన 69:9 నుండి ఈ మాటలు పౌలు తెస్తున్నాడు - కొద్దిగా ఇతరులకు ఇచ్చినంత మాత్రాన త్యాగం చేశామనుకుంటున్న విశ్వాసీ, క్రీస్తు త్యాగం ముందు మన త్యాగం ఎంచతగునా?

ఒక వ్యక్తి ఆత్మీయ ఎదుగుదల తనకున్న వివేచనను బట్టి తెలుస్తుంది. ఇతరులకు సహాయకరంగా ఉంటుందనుకుంటే తనకు కావల్సినదేదైనా ఇచ్చేస్తాడు. ఇది ఒక భారంగా కాకుండా ఒక ఆశీర్వాదము, ధన్యత అన్నట్లుగా చేస్తాడు. 'ఇచ్చుట' అనునది ఆత్మీయ ఎదుగుదలకు ఒక కొలబద్ద అని భావించవచ్చు. ప్రేమించే తల్లిదండ్రులు తమ పిల్లల

కొరకు ఎన్నో సౌకర్యాలు వదులుకొంటారు. అదే విధంగా ఆత్మీయ ఎదుగుదలలో ఇతరులకు తోడ్పడాలి.

మనము ఇతరులను సంతోష పెట్టుటకు అవసరమైన ఆత్మీయ శక్తి వేటి నుండి వస్తుందో పౌలు చెప్తున్నాడు. 15:4 లో లేఖనాల ద్వారాను, 15:5,6 లో ప్రార్థన ద్వారాను వస్తుందని చెబుతున్నాడు.

తల్లిదండ్రులకు పిల్లలమీద కోపము, అసహనము వచ్చినట్లు కొన్నిసార్లు బలహీనులైన క్రైస్తవులను బట్టి వస్తుంటుంది. అయితే దేవుని వాక్యము మనకు కావలసిన ఓర్పు, ప్రోత్సాహము ఇస్తుంది. దేవుడిచ్చే ఆత్మీయ ఐక్యత వారికి కూడా ఇవ్వాలని ప్రార్థిస్తూ ఈ సలహాల విభాగము ముగిస్తున్నాడు.

ఈ 7 వచనాలు ద్వారా మనము నేర్చుకొన్న పాఠమేమంటే వాక్యము, ప్రార్థన మన సంఘాలలో ఎక్కువగా ఉండాలి. అపొస్తలులు చాలా పని ఒత్తిడి ఉన్నందు వలన వాక్యము ప్రార్థనకు ఎక్కువ సమయము కేటాయించ లేక పోయినందున సంఘాలలో గొడవలు ప్రారంభమైనాయి. మన మధ్యలో సమాధానము లేకుంటే దేవునికి మహిమ కలుగదు. అబ్రాహాము లోతుకు చెప్పిన మాటలు మనకు కూడా వర్తిస్తాయి ఆది. 13:8 – "మనము బంధువులము గనుక నాకు నీకును నా పశువుల కాపరులకు, నీ పశువుల కాపరులకును కలహముండకూడదు". ఇరుగు పొరుగు వారు వీరిని గమనిస్తున్నారు. కాబట్టి అబ్రాహాము లోతు వారిలాంటి వారు కాదు. యెహోవా దేవుని బిడ్డలు అని చూపించుటకు ప్రయత్నము చేశాడు. యేసు ప్రభువు అని చూపించుటకు ప్రయత్నము చేశాడు.

యేసుప్రభువు చేసిన ప్రధాన యాజకుని ప్రార్థన (యోహాను 17)లో సంఘ ఐక్యత వలన దేవుడు మహిమ పరచబడాలని ప్రార్థించాడు. ఒకరినొకరు అంగీకరించుట వలనను, ప్రోత్సహించు కొనుట వలనను, సంతోషపెట్టుకొనుట వలనను దేవుడు మహిమ పరచబడుతాడు.

పౌలు రోమా పత్రిక చివరలో "పరచర్య" గురించి ఎక్కువగా మాట్లాడాడు. ఈ పదానికి మూడు వేరు వేరు గ్రీకు పదాలు వాడాడు. అన్నింటీకి అర్థము సేవ, పరిచర్య, పరిచారకుడు.

15:9లో పరిచారకుడు, 25లో పరిచర్య, 32లో పరిచర్యలో, 16:1 లో పరిచారకురాలు. ఈ అధ్యాయములో 16వ అధ్యాయములో 4 రకాల పరిచర్యలను గురించి పౌలు మాట్లాడాడు.

## 1. యేసుక్రీస్తు అన్యులకు చేసిన పరిచర్య (15:8-13) :

పరిచర్యలో యేసుప్రభువుకు మించిన మాదిరి మనకు దొరకదు. లూకా 22:27లో "నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను" అని ప్రభువు చెప్తున్నాడు. మొదటిగా ఆయన యూదులకు పరిచర్య చేయాలనే ప్రణాళిక కలిగియున్నాడు. "ముందుగా యూదులకు" అనేది యేసయ్య పరిచర్యలోనూ, సంఘ పరిచర్య మొదటి భాగంలోనూ ఉండేది. "నేను ఇశ్రాయేలు ప్రజల కొరకే వచ్చానని" యేసు ప్రభువు తన పరిచర్య కాలంలో చెప్పాడు. శిష్యులకు ఆరోహణమవ్వక ముందు చెప్పిన మాటలలో కూడా "మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను, భూదింతముల వరకును, నాకు సాక్ష్యులై ఉందురు" అన్నాడు.

బాప్తిస్మమిచ్చు యోహాను తమ మెస్సయ్య కొరకు ఇశ్రాయేలీయులను సిద్ధపరచుటకు వచ్చాడు. యేసయ్య పరిచర్య మొదలు పెట్టినప్పుడు కేవలము యూదుల కొరకే వచ్చాడు.  అపొస్తలులను సువార్త ప్రకటించుటకు బయటకు పంపినప్పుడు అన్యుల దగ్గరకు, సమరయుల దగ్గరకు వెళ్లద్దు గాని ఇశ్రాయేలీయులలో తప్పిపోయిన గొర్రెల యొద్దకు వెళ్లమని చెప్పాడు. ఆయన పునరుత్థానుడైన తర్వాత అపొస్తలులను కొన్నాళ్లపాటు యెరూషలేములోనే ఉండమని చెప్పాడు. అందుకే అపొ.కా. 1నుండి7 అధ్యాయముల వరకు యూదుల మధ్య జరిగిన పరిచర్య కనబడుతుంది. అపొ.కా. 8 నుండి సమరయకు, అపొ.కా. 10 నుండి అన్యులకు సువార్త వెళ్లింది. తర్వాత పౌలు ద్వారా రోమా సామ్రాజ్యంలో విస్తరించింది. దేవుడు ఎంత సేపు యూదులు అనుటలో ఏమైనా స్వార్థముందా అనే ప్రశ్నకు జవాబు "లేదు" అని చెప్పవచ్చును.

ఆయన యూదుల ద్వారా రక్షణ సువార్త అన్యులకు పంపాలని ఆశించాడు. ఇదంతా ఒకదాని తర్వాత ఒకటిగా ఎలా జరిగిందో పౌలు వివరిస్తున్నాడు.

రోమా 15:9 - అన్యజనుల మధ్య యూదులు దేవుని మహిమపరుస్తున్నారు. ఈ వాక్యభాగము కీర్తన 18:49లో ప్రవచింపబడి ఉన్నది.

రోమా 15:10 – అన్య జనులు యూదులతో పాటు సంతోషిస్తారు. ఈ వాక్య భాగమును ద్వితీ. 32:43 నుండి పౌలు తీసుకున్నాడు. సకల ప్రజలు (యూదులు, అన్యులు) కలిసి దేవుని కొనియాడెదరు.

రోమా 15:11 – ఈ వాక్యము కీర్తన 117:2లో ప్రవచింపబడి ఉన్నది. యూదులు, అన్యజనులపై క్రీస్తు అధికారము చేయును (ఏలును).

రోమా 15:12 – ఇది యెషయా 11:10లో చూడగలము.

రోమా 15:8 – అపొ.కా. 1నుండి 7 అధ్యాయాలలో చెప్పబడిన కాలము – పితరులకు చేయబడిన వాగ్దానము

15:9 – అన్యుల మధ్య పౌలు చేసిన పరిచర్య వలన "అన్యజనులు ఆయన కనికరమును గూర్చి దేవుని మహిమపరిచారు".

రోమా 15:10 – అపొ.కా. 15వ అధ్యాయములో చెప్పబడిన యెరూషలేము సమావేశము తరువాత అన్యులకు, యూదులతో సమానస్థాయి, హోదా ఇవ్వబడింది.

రోమా 15:12 లో అన్యజనుల నిరీక్షణ గురించి యెషయా ప్రవక్త ప్రవచించి యున్నాడు. ఇంతకు మునుపు వారికి నిరీక్షణ లేదు గాని ఇప్పుడు ఉంది. యేసుప్రభువు నందు విశ్వాసముంచిన వారికి నిరీక్షణే కాకుండ ఆనందము, సమాధానము, శక్తి ఉన్నాయి. పరిశుద్ధాత్మ దేవునికి మనలను మనము సమర్పించుకుంటే ఇవన్నీ వస్తాయి. యూదా క్రైస్తవులు సువార్తను అన్యుల దగ్గరికి తీసుకెళ్లారు కాబట్టి ప్రపంచానికి క్రీస్తు రక్షకునిగా పరిచయం చేయబడ్డాడు.

## 2. అన్యజనుల మధ్య పౌలు పరిచర్య (రోమా 15:14-24) :

పౌలు పరిచర్య ప్రత్యేకించబడినదని తెలుసుకోకపోతే, దేవుని కృపను గురించిన సువార్త అర్థము కాదు. తన పరిచర్య లక్షణాలు పౌలు వివరిస్తున్నాడు.

రోమా 15:14,15 – దేవుని కృపవలన పౌలుకు ఈ పరిచర్య ఇవ్వబడింది. యూదుల రబ్బీగా ఉండిన తూర్పువాడైన సౌలుకు దేవుని కృప గురించి ఏమీ తెలియదు. సంఘాన్ని శ్రమపెడుతూ, నాశనము చేయాలని కంకణము కట్టుకున్నాడు. అపొస్తలుల

కార్యములు 9వ అధ్యాయములో దమస్కు మార్గంలో యేసుక్రీస్తును దర్శించినప్పుడు, దేవుని కృపను అనుభవించాడు. దేవుని కృప వలననే తాను రక్షింపబడ్డానని, దేవుని కృపవలననే పిలువబడ్డానని, అపొస్తలుడిగా చేయబడ్డానని గ్రహించాడు. “అన్యజనుల యెదుటను, రాజుల యెదుటను, ఇశ్రాయేలీయుల యెదుటను నా నామము భరించుటకు ఇతడు నేను ఏర్పరచుకొనిన సాధనమై యున్నాడు” అని ప్రభువే స్వయంగా పౌలును గురించి అననీయకు చెప్పాడు (అపో.కా. 9:15).

1 కొరింథీ 15:8-11 వరకు ఉన్న వాక్యభాగములో తన పిలుపు గురించి పౌలు వ్రాశాడు. ఎఫెసీ పత్రిక 3వ అధ్యాయములో అన్యుల మధ్య తన పరిచర్యను గురించి విపులంగా వ్రాశాడు.

రోమా 15:16 - ఇక్కడ తన పరిచర్య సువార్త ప్రకటించుటయే అని చెబుతున్నాడు. “నేను సువార్త విషయమై యాజక ధర్మము జరిగించుచు, దేవుని చేత నాకు అనుగ్రహింపబడిన కృపను బట్టి, అన్యజనుల నిమిత్తము యేసుక్రీస్తు పరిచారకుడనైతిని” అని చెబుతున్నాడు. యాజక ధర్మము నిర్వర్తించుటకు తాను నియమింపబడ్డానని పౌలు తెలుసుకున్నాడు. క్రీస్తు కొరకు తాను గెలుచుకున్న ఆత్మలను దేవునికి బలిపీఠము యొద్ద అర్పిస్తున్న యాజకుని స్థానంలో తన్నుతాను చూసుకున్నాడు. వారు దేవుని మహిమార్థము తాను సమర్పించిన “ఆత్మ సంబంధమైన బలులు” (1పేతురు 2:5) అనుకుంటున్నాడు. తాను సువార్త ప్రకటించడము కూడా “యాజకధర్మము” అని అంటున్నాడు. ఇది అర్థము చేసుకుంటే సువార్త ప్రకటించుట ఎంత గౌరవప్రదమైనదో మనకు మంచి అవగాహన కలుగుతుంది. యాజకులు దేవునికి శ్రేష్టమైనది మాత్రమే అర్పించాలి (మలాకీ 1:6-14).

సువార్త ప్రకటించుటలో త్రిత్వ దేవుడు కలుగజేసుకొని సహాయపడతాడు. పౌలు యేసుక్రీస్తు యొక్క పరిచారకుడు అతను దేవుని సువార్త ప్రకటించాడు తన పరిచర్యను శుద్ధీకరించిన పరిశుద్ధాత్మ శక్తితో పరిచర్య చేశాడు. త్రిత్వదేవుని కొలచుట అనే గొప్ప ఆధిక్యత, భాధ్యత ఇవ్వబడింది. తన జీవితంలో జరిగినదంతయూ దేవుని మహిమార్థము జరిగిందని గుర్తించాడు.

రోమా 15:17 – "క్రీస్తుయేసును బట్టి దేవుని విషయమైన సంగతులలో నాకు అతిశయ కారణము కలదు" అంటున్నాడు. "అతిశయము" అనే మాటకు వాడబడిన గ్రీకు పదానికి అర్థము "మహిమ" అని కూడా ఉంది. ఇక్కడ మనము గమనించాల్సిన విషయమేమంటే పౌలు తన పరిచర్యను గురించి గొప్పలు చెప్పుకోవడము లేదు గాని తన పట్ల దేవుడు చేసిన కార్యమును బట్టి గొప్పలు చెప్పుకుంటున్నాడు. ఈనాటి బోధకులు ఎంతసేపూ తమను గురించి, తమ పరిచర్యను గురించి గొప్పలు చెప్పుకోవడము చూస్తున్నాము. తనకు గొప్పపేరు సంపాదించుకొనుటకై పౌలు పరిచర్య చేసి శ్రమపడలేదు గాని తన మనసులో చాలా గొప్ప ప్రణాళిక ఉన్నది. అదేమంటే యేసుక్రీస్తుకు మహిమ రావాలి. "ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగునిమిత్తము" (కొలొస్స 1:18) పౌలు ప్రయత్నించాడు, అహర్నిశలూ పోరాడాడు.

రోమా 15:18, 19 వచనాలలో దేవుని శక్తిచేతనే చేయగలిగానని చెప్తున్నాడు. పౌలు అద్భుత పరిచర్య చేయుటకు పరిశుద్ధాత్మ దేవుడు శక్తినిచ్చాడు "కాబట్టి యెరూషలేము మొదలుకొని చుట్టుపట్ల నున్న ప్రదేశములందు ఇల్లూరికు ప్రాంతము వరకు క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించి యున్నాను" అని చెప్తున్నాడు.

పౌలు ద్వారా దేవుడు చేసిన అద్భుత కార్యాలు ఇతరులను దేవుని దగ్గరకు నడిపించుటకు, ఆయనను ప్రత్యేకపరచుటకు చేయబడ్డాయి. ప్రజలు ఆశ్చర్యపడేటట్లుగా జరిగాయి. ఈ అద్భుతాలన్నీ సువార్త ప్రకటించుటకు ద్వారము తెరచుటకు మాత్రమే వాడబడ్డాయి. సువార్తను స్థిరపరచుటకు అద్భుతాలు జరిగాయి అని హెబ్రీ 2:1–4లో ఉన్న వాక్య భాగములో ఉంది. **అద్భుతములు ఒక మనిషిని రక్షించలేవు.** అపొ.కా. 14లో పౌలు లుస్త్రలో కుంటివాడిని బాగుచేయగానే అక్కడి జనులు వారిని పూజించాలనుకున్నారు. బర్నబాను, పౌలును వారు దేవుళ్ల పేర్లతో పిలిచారు. పౌలు సువార్త ప్రకటించినప్పుడు వారు శ్రద్ధగా వినలేదు, చివరకు కొట్టి పడేశారు.

అన్యులు విధేయత చూపుట కొరకై పరిశుద్ధాత్మ పౌలును శక్తివంతునిగా చేశాడు. వాక్యము ద్వారా, క్రియల ద్వారా పౌలు సువార్తను ప్రకటించాడు. మనము కూడా మన మాటల ద్వారా, క్రియల ద్వారా క్రీస్తు ప్రేమను మన చుట్టూ ఉన్నవారితో పంచుకోవచ్చును.

15:20-24 దేవుని ప్రణాళిక ప్రకారం జరిగింది. పౌలు యెడల దేవునికి ఒక ప్రత్యేక ప్రణాళిక ఉంది. ఇతర అపొస్తలులు పరిచర్య చేసిన చోట్ల కాకుండా సువార్త ప్రకటించుటకు వేరే చోట్లకు పంపబడ్డాడు. మనము 19వ వచనము చూశాము. ఆయన సువార్త ప్రకటించిన స్థలాల విస్తీర్ణము 1400 మైళ్లు. ప్రయాణపు ఆలస్యాలు, ఆటంకాలు, ప్రమాదాలు, అభ్యంతరాలు ఇవన్నీ గమనించాలి (2కొరింథీ. 11:26-27). పౌలు చేసిన గొప్ప కార్యాలను మనం మెచ్చుకోకుండా ఉండలేము. ఇక్కడ యెషయా 52:15లోని వచనాలు చూపెడుతున్నాడు - "క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటించవలెనని మిక్కిలి ఆశగలవాడనై యున్నాను" అంటూ, మరియొకని పునాది మీద కట్టును అంటూ రోమా సంఘమును ఇతర అపొస్తలులు కట్టలేదను సత్యము తెలుపుచున్నాడు. ఇప్పుడైతే చాలామంది సేవకులు ఇతరులు వేసిన పునాదుల మీద కట్టుటలో ప్రావీణ్యత సంపాదించుకుంటున్నారు. పౌలు పరిచర్య నుండి నేర్చుకోవలసిన పాఠాలు చాలా ఉన్నాయి.

పౌలు రోమా సంఘము దర్శించాలని ఆశ ఉన్నప్పటికి అనేక అవకాశాలు వస్తుండటముతో రోమా పట్టణము వెళ్లుట ఆలస్యమైంది. ఏదో సాతాను శక్తులో, శారీరక రుగ్మతలో తనను ఆటంకపరచలేదు గాని తానున్న స్థలములో, తాను ముగించాల్సిన పనులు ముగించే వరకూ ముందుకు సాగకూడదనే ఉద్దేశంతో అక్కడే ఉండిపోయాడు. తనకు అప్పగించడిన పని పూర్తిగా నిర్వర్తించానని చెప్పుటకు, ఏ పని చేసినా విశ్వాసముతో చేశాడు. మొదలు పెట్టిన ప్రతి పనినీ తృప్తిగా ముగించాడు.

ప్రతి ఒక్క మనిషి దగ్గర తానే సువార్త తీసికొనిపోలేదు కాని వెళ్లిన ప్రతిచోటా సంఘాలు నెలకొల్పి, ప్రకటించే వారిని తయారు చేశాడు. పౌలు ఒక పని పూర్తి చేసిగాని ఇంకో పని చేపట్టడు. ఈ కాలంలో సువార్తికులకు ఇదే మాదిరిగా ఉండాలి.

రోము సందర్శించి, ఆ తర్వాత స్పెయిన్ కెళ్లాలని పౌలు యొక్క చిరకాల వాంఛ, కాని స్పెయిన్ కెళ్లినట్లు ఎక్కడా వ్రాయబడలేదు. కొన్ని సంఘ చరిత్ర గ్రంథాలలో ఆయన వెళ్లినట్లు వ్రాయబడి ఉన్నది (రోమా చెరనుండి విడుదలైన తర్వాత) కాని అవి నమ్మదగినవి కావు.

**3. యూదులకు అన్యుల పరిచర్య (రోమా15:25-33) :**

యెరూషలేములోని పరిశుద్ధుల సహాయార్థము అన్యులైన క్రైస్తవులు (మాసిదోనియ వారు) చందాలు పోగు చేసి పౌలుకు ఇచ్చినట్లు 2కొరింథీ 8, 9 అధ్యాయాలలో గ్రంథస్తము చేశాడు.

ఈ చందాలు ఇవ్వడము వెనుక ఉన్న ఉద్దేశాలు :

- యూదా సోదరులకు తమ ప్రేమ చూపుటకు అన్యజనులు ఎన్నుకున్న మార్గము.

- పేద యూదులకు ఆర్థిక అవసరతలు ఎక్కువగా ఉన్న సమయంలో క్రియా పూర్వక సాయం.

- సంఘములో యూదులు, అన్యులు ఐక్యత కలిగియుండుటకు ఒక మార్గము ఏర్పడింది, ఇరువురినీ ఏకం చేసింది.

పౌలు ఈ క్రియను అప్పు చెల్లించే విధానంగా భావించాడు. అన్యులు యూదుల నుండి ఆత్మీయ సంపద తీసికొని, బదులుగా ఇహలోక సంపద ఇచ్చి ఋణం తీర్చుకుంటున్నారు. పూర్వకాలంలో ధనము కనిపెట్టక ముందు Barter system (వస్తుమార్పిడి) అనేది ఉండేది. ఒక వస్తువు ఇచ్చి బదులుగా వారికి అవసరమైన ఇంకొక వస్తువు తీసుకొనుట. పౌలు తనకు తాను సర్వప్రపంచానికి ఋణస్తుడను అనుకుంటున్నాడు (రోమా 1:14).

సువార్త ప్రకటించుట ద్వారా ఋణవిముక్తి పొందవచ్చును.

రోమా 15:28 - ఈ చందాలు వసూలు చేయుట ప్రస్తుత దోపిడీ వ్యవస్థలాగా కాక వారు “ఇష్టపడి దానిని చేసిరి” (26) ఇక్కడ తాను పోగుచేసిన చందాను “వారి ఫలము” పొందుతున్నానంటున్నాడు.

“నేను మీ యొద్దకు వచ్చి, మీతో కలిసి విశ్రాంతి పొందునట్లు నా కొరకు ప్రార్థించండి” అని చెప్తూ ఈ అధ్యాయము ముగిస్తున్నాడు.

# 16వ అధ్యాయము

**ఈ** అధ్యాయమును "వందనముల అధ్యాయము" అని అంటారు. ఈ అధ్యాయములో పౌలుకు విశ్వాసులు చేసిన పరిచర్యను గురించి పౌలు చెప్తున్నాడు. అది మనము ధ్యానిస్తున్న పరిచర్యలలో నాల్గవది.

**4. విశ్వాసులు పౌలుకు చేసిన పరిచర్య :**

ఇందులో విశ్వాసులు తనకు చేసిన పరిచర్యను గురించి పౌలు వ్రాశాడు. ఇదొక అద్భుతమైన అధ్యాయము. పౌలు ఇందులో దాదాపు 26 మందికి పేర్లతో చెప్పి ధన్యవాదాలు చెప్పాడు ఇరువురిని పరిశుద్ధులు అని పిలుస్తూ ధన్యవాదాలు చెప్పాడు. రోమా పట్టణములో చాలా గృహాలలో కూడుకుంటున్న సంఘములకు శుభములు చెప్పాడు. చివరలో తనతో కూడా ఉన్న 9 మంది విశ్వాసుల పేర్లు వ్రాసి, వారు తనతోపాటు కొరింథు నుండి రోమా సంఘము వారికి శుభములు పంపిస్తున్నారని వ్రాశాడు.

వ్యక్తిగతముగా ప్రతి ఒక్కరినీ పేరు పేరునా గుర్తు చేసుకొని తన పరిచర్యలో సహకరించినందుకు ధన్యవాదాలు చెప్పుటలో పౌలు ఉద్దేశమేంటి? దీని ప్రాముఖ్యత ఏమిటి? పౌలు ఆత్మలను సంపాదించడమే గాక స్నేహితులను కూడా సమకూర్చుకునే వాడని అర్థము చేసుకోవాలి. పౌలు ఒంటరి జీవితం జీవించలేదు. ప్రభువులో మిత్రులున్నారు, వారిని మెచ్చుకొంటున్నాడు. వారంతా అతనికి వ్యక్తిగతంగానే గాక పరిచర్యలోనూ సహాయపడ్డారు. సులభంగా స్నేహితులను చేసుకొనేవారు పరిచర్యలో దూసుకుపోగలరు. వారి స్నేహము ద్వారా అనేకులను దేవుని దగ్గరకు తీసుకొస్తారు. కొంతమంది దేవునితో ఒంటరిగా గడపాలనుకొంటారు గాని, అటువంటి వారు వేరే వారిని దేవుని కొరకు సంపాదించలేరు.

రోమా 1నుండి 16 వచనాలలో కొంతమంది స్నేహితులకు శుభములు చెబుతున్నాడు. ఫీబేతో మొదలు పెడుతున్నాడు. ఈమె కెంక్రీయ సంఘ పరిచారకురాలు. ఈమె ద్వారానే పౌలు రోమా సంఘానికి పత్రిక పంపాడు. సందేశాలు మోసుకుపోయే వారిలో ఎవరూ ఇంత ప్రాముఖ్యమైన సందేశాన్ని మోసి ఉండరేమో. కొరింథు పట్టణము యొక్క నౌకా కేంద్రము కెంక్రీయ పట్టణము. కొరింథులో పౌలు 18 నెలలు ఉన్నప్పుడు ఆయన బోధలు విని యేసుప్రభువును నమ్ముకొని ఉండి ఉండవచ్చు. “పరిచారకురాలు” అను మాటకు వాడబడిన గ్రీకు పదము Diakonos = Deacon ‘సంఘ పెద్ద’ లేక ‘పరిచారకురాలు’. సంఘములో చాలా ప్రధాన పాత్ర వహించింది కాని ఆమెను గురించి ఎక్కువగా వ్రాయబడలేదు. నాల్గవ శతాబ్దపు తర్వాత అనువాదకులు ఆది సంఘములో స్త్రీ పాత్ర గురించి సరైన అవగాహన లేక “పరిచారకురాలు” అని వ్రాశారు. ఆమె సంఘపెద్దగా ఉంటూ రోగులను దర్శించడము, యౌవన స్త్రీలకు సాయంగా ఉంటూ, అనేకులకు సహాయకారిగా ఉండేది. ఆమెను గురించి “పరిశుద్ధురాలు” అని పౌలు కితాబిచ్చాడు. ఆమె అనేకులకు, పౌలుకు కూడా పలుమార్లు సహాయము చేసింది కాబట్టి ఆమె అవసరాలు చూడమని రోమా సంఘమునకు పౌలు వ్రాస్తున్నాడు. ఆమె వ్యాపారస్థురాలై యుండి, వ్యాపార నిమిత్తము రోముకు వెళ్తున్నప్పుడు, సంగతి తెలిసిన పౌలు ఆ నమ్మకస్థురాలి ద్వారా పత్రికను పంపాడు. ఆ కాలములో క్రైస్తవ సందేశాలు, పత్రికలు లాటివేవైనా తీసుకొని వెళ్తున్నారని తెలిస్తే వారికి మరణమే. అటువంటి ప్రతికూల పరిస్థితులలో ప్రాణానికి తెగించి పత్రిక రోమా సంఘానికి చేరవేసింది. ఫీబే సాహసించకపోయి ఉంటే ప్రపంచానికి ఇంత గొప్ప పత్రిక అందేది కాదు. మొదటిగా ఆమె పేరు ప్రస్తావించడంలో పౌలు ఆమె చేసిన పనిని అభినందిస్తున్నాడు.

మిగతా పేర్ల వెనుక ఉన్న సంగతులు తెలిసి ఉంటే బాగుండేది కాని వారి గురించి ఏమీ తెలియదు.

అకుల, ప్రిస్కిల్ల గురించి అపో.కా. 18:1–3, 18–19, 26, 1కొరింథీ 16:19, 2తిమోతి 4:19లో చూడగలము. పౌలు ప్రాణముల కొరకు తమ ప్రాణము నిచ్చుటకు వెనుకతీయలేదు అని పౌలు చెబుతున్నాడు. ఏ సందర్భమో మనకు తెలియదు.

ఈ పత్రిక వ్రాసే సమయానికి వారు రోమాలో ఉన్నారు. వారి ఇంట్లో ఒక సంఘము ఏర్పడింది. వారు కొరింథులో ఉన్నప్పుడు కూడా వారి ఇంట్లో ఒక సంఘము ఉండేది. ఆ కాలంలో మందిరాలు, భవనాలు ఉండేవికావు, ఏ ఇంట్లో కొందరు విశ్వాసులు చేరి ప్రార్థించేవారో అక్కడే ఒక సంఘము వెలసేది.

రోమా 16:10-11, 14-15లో ఇలాంటి సంఘాలకు శుభములు చెప్పాడు పౌలు. ఈ అధ్యాయములో నలుగురిని ప్రియులు అని సంబోధించాడు : ఎపైనెటు (5వ వచనము), అంప్లీయతు (8వ వచనము), స్టాకు (9వ వచనము), పెర్సిసు (12వ వచనము).

ఎపైనెటు ఆసియా ఖండములో మొదటి క్రైస్తవుడు (మారినవాడు), అందుకే పౌలుకు బాగా గుర్తుందేమో! ఇతను స్తెఫను కుటుంబానికి చెందినవాడై ఉంటాడని తలుస్తారు. 1కొరింథీ 16:15 లో అకయ యొక్క ప్రథమ ఫలములై యున్నారని వ్రాయబడి ఉన్నది.

రోమా 16:7- అంద్రొనీకు, యూనీయ - వీరిని “నా బంధువులు” అంటున్నాడు. వీరు పౌలు యొక్క రక్త సంబంధికులై ఉండవచ్చు లేక వారు బెన్యామీను గోత్రపు యూదులై ఉండవచ్చు. ఒకప్పుడు పౌలుతో పాటు ఖైదులో ఉన్నవారు ‘అపొస్తలులు’ అని వారిని గురించి అంటున్నాడు. ఇక్కడ ‘అపొస్తలులు’ అంటే పౌలు లాంటి వారు కాదు గాని వారు ప్రభువు ‘సువార్తికులు’.

‘అపొస్తలుడు’ అను పదానికి చాలా అర్థాలున్నాయి.

రోమా 16:3లోని రూఫు - మార్కు 15:22 లో చెప్పబడిన వాడై ఉండవచ్చు. అయితే సరైన రుజువులు లేవు. అతనే అయితే కల్వరి దగ్గర సీమోను అనుభవము వలన అతను, అతని ఇంటివారు మారుమనసు పొంది ఉండవచ్చు.

పౌలు, రూఫు బంధువులు కారు, అతని తల్లి “నాకును తల్లి” అంటే తల్లిలాగా చూసుకొందని అర్థము (మార్కు 10:30).

ఈ జాబితాలో జనులందరూ పౌలు సేవలో, సంఘ పరిచర్యలో చాలా ప్రాముఖ్య పాత్ర పోషించినవారు.

ఫీబే చాలా మందికి సహాయకురాలు; అకుల, ప్రిస్కిల్ల పౌలు సహపనివారు, పౌలు కొరకు ప్రాణాలిచ్చేవారు; ఎపైనెటు మార్పు ద్వారా చాలా మంది ఆసియా ఖండంలో రక్షణ మార్గంలోకి వచ్చారు; మరియ చాలా సాయం చేసింది; అంద్రొనీకు, యూనీయ అతనితో పాటు జైలు కెళ్లారు. ఈ పరిశుద్ధులందరి సేవను బట్టి వారికి ధన్యవాదాలు చెప్పడము కంటే ఇంకేమీ చేయలేము.

**రోమా 16:16 –** “పవిత్రమైన ముద్దుపెట్టుకొని యొకని నొకడు వందనములు చేయుడి” అని పౌలు అంటున్నాడు. పెద్దలను గౌరవించుటకు, స్నేహానికి నిదర్శనముగా మాత్రమే గాక, ఈ పవిత్ర ముద్దు ఒకరి పట్ల ఒకరికి ఉన్నప్రేమ, సమానత్వము తెలుపుటకు దైవారాధనలో వాడే ఒక ఆచారముగా ఉండేది. అందుకే ఆ ఆచారము సమాజమందిరములో (Synagogues) వాడేవారు. తర్వాత అది సంఘాలలో కూడా అలవాటుగా మారింది. ఆది సంఘములలో ముద్దు పెట్టుకొనుట శుభములు చెప్పుకొనే విధానము, ఎదుటి వారిని మన మధ్యలోకి అంగీకరించామని చెప్పుటకు ఒక గుర్తు, ఆశీర్వాదాలిచ్చుట, క్రైస్తవ సహవాసము యొక్క ఐక్యతను ప్రకటించుటకు ఉపయోగించేవారు. ఆదికాండములో కూడా ఈ అలవాటు ఉండేది. ఆది 29:13లో లాబాను తన సహోదరి కుమారుడైన యాకోబు వచ్చాడని వినినప్పుడు అతనిని ఎదుర్కొని, కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నట్లుగా చూస్తున్నాము. ఈనాడైతే ఇద్దరు మగవాళ్లు ముద్దు పెట్టుకుంటే స్వలింగసంపర్కులేమోనని ఆలోచనలు వస్తున్నాయి. రెండవ రాకడ సమీపిస్తుంటే ప్రేమలు తగ్గిపోతాయని వాక్యము చెబుతున్నట్లుగా నిజమైన ప్రేమకు గుర్తింపు కూడా లేకుండా పోతున్నది. పౌలు కాలంలో ఐరోపా, తూర్పు దేశాలలో పలుచోట్ల ఈ ఆచారముండేది. పాత నింబంధనలో ఇంకా కొన్ని ఉదాహరణలు చూడవచ్చును. యాకోబు తన తండ్రిని ముద్దుపెట్టుకొనుట (ఆది 27:27), ఏశావు యాకోబును ముద్దుపెట్టుకొనుట (ఆది 33:4), యోసేపు తన సహోదరులను ముద్దుపెట్టుకొనుట (ఆది 45:15), మోషే తన మామను ముద్దుపెట్టుకొనుట

(నిర్గమ 18:7), దావీదు యోనాతానును ముద్దుపెట్టుకొనుట (1సమూ. 20:41), నూతన నిబంధనలో అపొ.కా. 20:38లో మిలేతులోని సంఘ పెద్దలు పౌలును ముద్దు పెట్టుకొని ఏడ్చినట్లుగా చూస్తున్నాము.

రోమా 16:17-20 - ఈ శుభవచనములు చెప్తున్న సందర్భములో కూడా పౌలు అబద్ధ బోధకులను గురించి హెచ్చరించుట మరచిపోలేదు. కొంతమందిని దూరంగా ఉంచండి అని హెచ్చరిస్తున్నాడు. సంఘములోని విశ్వాసులందరూ పౌలుకు సహకరించడము లేదు. కొందరు సంఘాలను నాశనం చేయడానికి అబద్ధబోధలు చేస్తున్నారు, అట్టివారిని గుర్తించి దూరంగా ఉంచండి అని బోధిస్తున్నాడు. స్నేహితులను చేసుకోవడము ముఖ్యం కాదు గాని దేవునికి సాక్షులుగా నిలచి ఉండడము ముఖ్యము.

"మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా బేధములను, ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి" అని చెబుతున్నాడు, ఆత్మల భారంతో బ్రతిమాలుకొనుచున్నాడు. "సమాధాన కర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ల క్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును" అని ధైర్యపరుస్తున్నాడు.

రోమా 16:21 నుండి 27 - కొంతమంది వారి నమ్మకత్వమైన పరిచర్యను బట్టి గౌరవింపబడాలి - తిమోతిని "నా విశ్వాస పుత్రుడు" అని పిలిచాడు. లూకియ, యాసోను, సోసిపత్రు అనువారు సహాయీదులు, తెర్తియు అనువాడు పౌలు చెప్తుంటే వ్రాసే సహాయకుడు. గాయి అనే వాడి ఇంట్లో నుండి ఈ పత్రిక రాస్తున్నాడు.

ఎరస్తు ఆ పట్టణపు ఖజానాదారుడు (ప్రభుత్వ ఉద్యోగి), క్వర్తుకూడా ఆ పట్టణానికి చెందినవాడే. సమాజములో శ్రేష్టమైన స్థానాలలో ఉండేవారు కూడా పౌలుతో పరిచర్యలో పాల్గొన్నారు. 24వ వచనము పౌలు తన స్వహస్తాలతో వ్రాసి ఉండవచ్చు.

రోమా 16:25-27 వరకు ఉన్న ఆశీర్వచనము అన్ని పత్రికలలో ఉన్నదాని కంటే పెద్దది. ఈ అధ్యాయములో పౌలు అన్యజనుల మధ్య చేస్తున్న ప్రత్యేక పరిచర్య అర్థము చేసుకోవచ్చును.

“ఈ మర్మమును అనుసరించియున్న నా సువార్త” అను వాక్యానికి అర్థము దేవుని ప్రణాళికలో అన్యులను, యూదులను ఒకటిగా చేయుట అను మర్మము నేను ప్రకటించు సువార్తలో ఉందని చెప్తున్నాడు. ఇది పౌలుకివ్వబడిన సువార్త. దీనివల్లనే యూదులు పౌలు మీద కక్ష పెంచుకున్నారు. యూదులు ప్రత్యేకించబడినవారని ప్రపంచము తెలుసుకోవాలని వారి కోరిక. రోమా సంఘములో యూదులు, అన్యులు దేవుని ప్రణాళిక తెలుసుకోవాలి.

క్రైస్తవులు సత్యములో స్థిరపడాలి, అందుకే పౌలు ఈ పత్రిక వ్రాశాడు. అన్యులు ఈ సత్యము తెలుసుకోవాలి, దేవుని రక్షణ ప్రణాళిక అర్థము చేసుకొని నశించిపోవు వారికి చెప్పాలని పౌలు ఆశపడుతున్నాడు.

ఈ పుస్తకము చదివిన వారంతా విశ్వాసంలో స్థిరంగా ఉంటూ, క్రీస్తును ఇతరులతో పంచుకొని దేవునికి మహిమ తీసుకొని రావాలని బ్రతిమాలుకుంటూ ముగిస్తున్నాను,

**దైవాశీస్సులు, ఆమేన్!**

# బి. రోమీయులకు వ్రాసిన పత్రిక విభజన

**ఉపోద్ఘాతము : రోమా 1:1-17**

**ఎ. శుభములు - రోమా 1:1-7**

1. దేవుని దాసుడు　　2. దేవుని సువార్త

3. దేవుని కుమారుడు　　4. దేవుని సంఘము

**బి. వ్యక్తిగత విషయములు　　రోమా 1:8-15**

1. పౌలు యొక్క కృతజ్ఞత (1:8)
2. పౌలు యొక్క ప్రార్థన (1:9, 10)
3. పౌలు యొక్క ఆపేక్ష (1:11, 12)
4. పౌలు యొక్క ఉద్దేశ్యము (1:13)
5. పౌలు యొక్క ఋణము (1:14)
6. పౌలు యొక్క సిద్ధపాటు (1:15)

**సి. పత్రిక యొక్క ముఖ్యఉద్దేశ్యము - సువార్త (వ 16, 17)**

1.దేవుని శక్తి (16); 2.నమ్మువారందరికి (16); 3.ప్రత్యక్షపరచబడిన దేవునినీతి (17)

**I. వినాశనము - దేవుని ఉగ్రత బయలుపరచబడినది. (1:18-3:20) - నీతి యొక్క అవసరత**

ప్రశ్న : లోకము నశించినదా?

**జవాబు : అవును, అందరును పాపమునకు లోనైవున్నారు (3:19).**

## 1. అన్యుడు నశించాడు (1:18-32)

ఎ. దేవుని ఉగ్రత బయలుపరచబడినది (1: 18)

బి. దేవుని శక్తిని, దైవత్వమును ఎదిరించారు – దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపలేదు (1:19, 20)

సి. దేవుని మహిమను ఎదిరించారు – దేవుని ఆరాధించలేదు (1:21-23)

డి. దేవుని నియమమును ఎదిరించారు. అవాచ్యమైనది చేశారు (1:24-27).

ఇ. దేవుని న్యాయాన్ని ఎదిరించారు–పొరుగువారిపట్ల పాపము చేశారు (1:28-32).

## 2. నీతిమంతుడు నశించాడు (2:1-16)

**(దేవుని తీర్పు కొరకైన మూల సూత్రములు)**

ఎ. జ్ఞానము - 2:1

బి. సత్యము - 2: 2,3

సి. దోషము 2: 4-5

డి. క్రియలు - 2:6-16

ఇ. పక్షపాతం లేకుండ - 2:11-15

ఎఫ్. ఉద్దేశ్యము - 2:16

## 3. యూదుడు నశించాడు (2:17-3:8)

ఎ) ధర్మశాస్త్రము యూదుని రక్షించలేదు 2:17-24

బి) సున్నతి యూదుని రక్షించలేదు 2:25-27

సి) యూదునిగా అతని పుట్టుక అతనిని రక్షించలేదు 2:28-29

డి) “వాదన” అతనిని రక్షించలేదు 3:19-20

## 4. సర్వలోకము నశించినది (3:9-20)

ఎ. నేరము మోపబడుట. 3:9

బి. నేరము రుజువు చేయబడుట 3:10-18

సి. దేవుని తీర్పు 3:19-20

## II. రక్షణ - దేవుని నీతి బయలుపరచబడినది (3:21-8:39) - (దేవుని నీతి యొక్క ప్రదర్శన)

ప్రశ్న : దేవుడు పాపులను ఎలాగు రక్షించును?

జవాబు : క్రీస్తు యేసునందు (8:1)

**1) నీతిమంతునిగా తీర్చుబడుట - క్రీస్తులో నీతిమంతులుగా నిర్ణయించబడ్డాము. 3:21 - 5:21.**

ఎ. విశ్వాసము ద్వారా నీతిమంతునిగా తీర్చుట దేవుని పద్ధతి 3:21 - 31

✦ నీతి సిద్ధపరచబడినది 3:21,22 ✦ అవసరమైన నీతి 3:23

✦ నీతి అనుగ్రహించబడెను 3:24 ✦ నీతి ప్రకటించబడినది. 3:25,26

✦ విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం వలన కలిగే లాభములు 3:27-31

బి. పాత నిబంధన ఉదాహరణ 4:1-25

✦ విశ్వాసం ద్వారానే అబ్రాహాము నీతిమంతునిగా తీర్పునొందాడు 4:1-12

✦ విశ్వాసం ద్వారానే అబ్రాహాము స్వాస్థ్యం పొందాడు 4:13-16

✦ విశ్వాసం ద్వారానే అబ్రాహాము సంతానాన్ని పొందాడు 4:17-25

సి. విశ్వాస మూలముగా నీతిమంతులుగా తీర్చబడుటలో గుప్తమైయున్నది దీవెనలు 5:1-11

✦ సమాధానము 5:1 ✦ దేవుని కృపలో స్థానం 5:2

✦ సంతోషము 5:3 ✦ నిరీక్షణ 5:4

✦ ప్రేమ 5:5-8 ✦ భద్రత 5:9-11

డి. గొప్ప బేధము - యేసుక్రీస్తు యొక్క శిరస్సు క్రింద విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట ఒక ఆత్మీయ వాస్తవము 5:12-21

✦ ఆదాము, పాపము, మరణము 5:12-14

✦ బేధము 5:15-17 ✦ పోలిక 5:18-20

✦ క్రీస్తు నీతి, జీవము 5:21

| ఆదాము శిరస్సు క్రింద | క్రీస్తు శిరస్సు క్రింద |
|---|---|
| 1. ఆదాము | 1. రానైయున్నావాడు |
| 2. అతిక్రమము | 2. వరము |
| 3. అందరు మరణించిరి | 3. అందరికి కృపావరము విస్తరించెను |
| 4. తీర్పు | 4. కృపచేతనైన దానము |
| 5. మరణము | 5. నీతిమంతులుగా తీర్చబడుట |
| 6. మరణము ఏలెను | 6. విశ్వాసులు జీవముగలవారై యేలుట |
| 7. ఒకని అతిక్రమము | 7. ఒకని పుణ్యకార్యము |
| 8. అందరికి తీర్పు | 8. అందరికీ నీతివలనైన జీవము |
| 9. ఒకని అవిధేయత | 9. ఒకని విధేయత |
| 10. అందరూ పాపులుగా తీర్చబడుట | 10. అందరూ నీతిమంతులుగా తీర్చబడట |
| 11. ఎక్కడ పాపము విస్తరించినదో | 11. అక్కడ కృప అపరిమితముగా విస్తరించును |
| 12. మరణము ద్వారా పాపము యేలుట | 12. నిత్యజీవము ద్వారా కృప యేలుట |

**2. శుద్ధీకరించబడుట క్రీస్తులో పరిశుద్ధ పరచబడుట 6:1-7:25**

ఎ. పరిశుద్ధత కొరకైన సరియైన విధానము క్రీస్తులో ఐక్యత 6:1-10

✦ తెలుసుకో నీవు క్రీస్తుతో కూడా ఐక్యపరచబడినావని తెలుసుకో 6:1-23

✦ ఎంచుకో నీవు క్రీస్తుతో కూడా ఏక శరీరమైయున్నావని నిన్ను నీవే ఎంచుకో 6:11,12

✦ అప్పగించుకో – నీతికి దాసునిగా అప్పగించుకో 6:13-15

✦ లోపరచుకో – నిన్ను నీవు దేవుని వాక్యానికి లోపరచుకో 6:16-23

బి. పరిశుద్ధ కొరకై తప్పు విధానము–ధర్మశాస్త్ర సంబంధమైన నీతి క్రియలు ద్వారా 7: 1-25.

✦ ధర్మశాస్త్రము మరియు విశ్వాసి 7:1-6 (నీతిమంతునిగా తీర్చబడినవాడు ధర్మశాస్త్రము వలన మోసగించబడుచున్నాడు)

✦ ధర్మశాస్త్రము మరియు పాపము 7:7-13 (ధర్మశాస్త్రము పాపాన్ని అధికం చేసింది కనుక ధర్మశాస్త్రము పాపమా?)

సి. ధర్మశాస్త్రము మరియు శరీర సంబంధమైన విశ్వాసి 7:14–25

(ఏ విశ్వాసి కూడా ధర్మశాస్త్రము వలన శరీర కార్యముల నుండి విముక్తుడు కాలేదు)

**మూడు భ్రమణములు**

| | భ్రమణము - 1 | భ్రమణము - 2 | భ్రమణము - 3 |
|---|---|---|---|
| **వాస్తవము** | **వ - 14** | **వ - 18** | **వ - 21** |
| **ఋజువు** | **వ.15, 16** | **వ - 19** | **వ - 23** |
| **ముగింపు** | **వ - 17** | **వ - 20** | **వ - 25** |

**3. భద్రత - క్రీస్తునందు మన రక్షణ శాశ్వతము 8:1–39**

ఎ. ఆత్మలోని జీవము ద్వారా విశ్వాసికి భద్రత దొరుకుతుంది 8:1–17

✦ మన క్రొత్త స్థానము - 8:1–4

✦ మన క్రొత్త జీవము - 8:5–13

✦ మన క్రొత్త సంబంధము 8:14–17

బి. మన మహిమగల భవిష్యత్ మన భద్రతను వాస్తవం చేస్తుంది. 8:18–25 (మన క్రొత్త నిరీక్షణ)

సి. పరిశుద్ధాత్మ దేవుని విజ్ఞాపనలో విశ్వాసి భద్రత ఇమిడియున్నది. 8:25, 26 (మన క్రొత్త సహాయము)

డి. దేవుని యొక్క కృపాసంకల్పములో విశ్వాసి యొక్క భద్రతను కనుగొనగలము 8:28–30 (మన క్రొత్త జ్ఞానము)

ఇ. క్రీస్తు నందలి విశ్వాసి భద్రత కొరకైన స్తుతి 8:31–39 (మన క్రొత్త నిశ్చయత)

**III. దేవుని కృపాసంకల్పము - దేవుని జ్ఞానము బయలుపరచబడినది (9:1-11:36 - దేవుని నీతికి యూదులకును గల సంబంధము, దేవుని నీతికి అన్యులకు గల సంబంధము)**

ప్రశ్న : దేవుడు ఇశ్రాయేలు జాతిని ఎందుకు ప్రక్కకు పెట్టాడు?

**జవాబు : అందరినీ కనికరించుటకు (11:32)**

**1. దేవుని సార్వభౌమత్వము దేవుని ఎన్నిక (9:1-30) (ఇశ్రాయేలీయుల గతము)**

ఎ. సమస్య - 9:1-6.

- ఇశ్రాయేలు కొరకైన పౌలు చింత 9:1-3
- ఇశ్రాయేలు యొక్క ఆధిక్యతలు 9:4,5
- ఇశ్రాయేలు యొక్క దత్త పుత్రత్వము
- ఇశ్రాయేలు యొక్క మహిమ
- ఇశ్రాయేలు యొక్క నిబంధనలు
- ఇశ్రాయేలు యొక్క ధర్మశాస్త్రము
- ఇశ్రాయేలు యొక్క యాజకత్వము
- ఇశ్రాయేలు యొక్క వాగ్దానములు
- ఇశ్రాయేలు యొక్క పితరులు
- ఇశ్రాయేలు యొక్క మెస్సీయ
- దేవుని వాక్యము నిర్ధకము కాలేదు 9:6

బి. ఆరు ఉదాహరణలు (9:6-29)

- మొదటి ఉదాహరణ 9:6-29
- రెండవ ఉదాహరణ 9:6-9
- మొదటి అభ్యంతరము 9:14
- మూడవ ఉదాహరణ 9:15-18
- రెండవ అభ్యంతరము 9:19
- నాల్గవ ఉదాహరణ 9:20-23
- ఐదవ ఉదాహరణ 9:24-26
- ఆరవ ఉదాహరణ 9:30-33

సి. రెండంతల ముగింపు 9:27-29

**2. మానవుని బాధ్యత - ఇశ్రాయేలీయులు దేవుని నీతిని తృణీకరించుట 10:1-21 (ఇశ్రాయేలు యొక్క వర్తమానము)**

ఎ. దేవుని నీతిని తృణీకరించుట 10:1-3

బి. దేవుని నీతి యొక్క ఆధారము 10:4,5

సి. దేవుని నీతి యొక్క లభ్యత 10:6-8

డి. దేవుని నీతి యొక్క పద్ధతి 10:9-10

ఇ. దేవుని నీతి యొక్క పరిధి 10:11-13

ఎఫ్. దేవుని నీతియొక్క ప్రకటన 10:14,15

జి. దేవుని నీతి తృణీకరించబడుట 10:16-21

**3. దేవుని కృపాసంకల్పము - ఇశ్రాయేలీయులు తిరిగి చేర్చుకొనబడుట - 11:1-36 (ఇశ్రాయేలు యొక్క భవిష్యత్)**

ఎ. ప్రస్తుతము కూడా ఎన్నికయున్నది 11:1-10.

బి. భవిష్యత్ సమకూర్పుకలదు 11:11-24

- ఒలీవ చెట్టు వేరు : అబ్రాహాముతో దేవుడు చేసిన నిబంధన
- వేరులోని సారము : అబ్రాహాము నిబంధనా ఫలాలు : దావీదు దేవుడు చేసిన పాలస్తీన నిబంధనకు, యిర్మీయాతో దేవుడు చేసిన క్రొత్త నిబంధనకు అబ్రాహాము నిబంధనే ఆధారము
- మంచి ఒలీవ చెట్టు : సున్నతి వాగ్దాన నిబంధనలు గల ఇశ్రాయేలు జనాంగము
- కొమ్మలు విరువబడుట : మెస్సయాను విశ్వసించినందునే అబ్రాహాము నిబంధనా ఫలాలను అనుభవింపకుండ తీసివేయబడిన ఇశ్రాయేలీయులు
- అంటుకట్టబడుట : మెస్సయ్య చేసిన బలియాగాన్ని విశ్వసించుట ద్వారా అబ్రాహాము నిబంధనా ఫలాలను అనుభవింపనైయున్న అన్యజనాంగము.
- మరల అంటు కట్టబడుట : మెస్సయ్య యొక్క రెండవ రాకడలో మెస్సయాను విశ్వసించి తద్వారా అబ్రాహాము నిబంధన ఫలాలను అనుభవించబోయే ఇశ్రాయేలు జాతి.

✦ నిలువకపోవుట: ధర్మశాస్త్ర సంబంధ క్రియలుపై కాక యేసయ్య బలియాగముపై ఆధారపడుట.

సి. భవిష్యత్ రక్షణ కలదు 11:25-32

డి. దేవుని జ్ఞానము కొరకైన స్తుతి 11:33-36

**IV. హెచ్చరికలు - దేవుని చిత్తము బయలుపరచబడినది - 12:1-15:33**

(విశ్వాసి యొక్క అనుదిన జీవితములో దేవుని నీతి కనపరచబడుట)

ప్రశ్న : **ధర్మశాస్త్రముతో సంబంధమే లేకపోతే ఉచితముగా నీతిమంతుడని తీర్పుపొందిన విశ్వాసి ఎలా నడుచుకోవలెను?**

**జవాబు: రూపాంతరము పొందుట ద్వారా 12:2 (12-16 అధ్యాయాల విభజన)**

| | | | |
|---|---|---|---|
| **1.** | **ఆత్మసంబంధమైన వరములు** | **-** | **12:1-8** |
| i. | శరీరమును దేవునికి సమర్పించుట | - | 12:1 a |
| ii. | సజీవ యాగముగా సమర్పించుట | - | 12:1 b |
| iii. | మనసును దేవునికి సమర్పించుట | - | 12:2 a |
| iv. | దేవుని చిత్తానికి సమర్పించుకొనుట | - | 12:2 b |
| v. | అత్మ వరములు యొక్క పరిచర్య -1 | - | 12:3-5 |
| | ఎ. విధేయత పట్ల ఒక మంచి అవగాహన | - | 12:3 |
| | బి. యేసుక్రీస్తులో ఒక్క శరీరమై వుండుట | - | 12:4-5 |
| vi. | ఆత్మ వరముల యొక్క పరిచర్య -2 | - | 12:6-8 |
| | ఎ. ప్రవచనం | - | 12:6 |
| | బి. పరిచర్య | - | 12:7 |
| | సి. బోధించుట | - | 12:7 b |
| | డి. హెచ్చరించుట | - | 12:8 a |
| | ఇ. పంచిపెట్టుట | - | 12:8 b |
| | ఎఫ్. పై విచారణ | - | 12:8 c |
| | జి. కరుణ | - | 12:8 d |

| | | | |
|---|---|---|---|
| **2.** | **దేవునికి ఇష్టులుగా జీవించుట** | **-** | **12:9-13** |
| i. | వ్యక్తిగత పనులు | - | 12:9 |
| | ఎ. ప్రేమ నిష్కపటమైనదిగా వుండాలి | - | 12:9 a |
| | బి. చెడును అసహ్యించుకొనుట | - | 12:9 b |
| | సి. మంచిని చేయుట | - | 12:9 b |
| ii. | దేవుని కుటుంబం పట్ల బాధ్యత | - | 12:10-13 |
| | ఎ. ప్రేమ విషయంలో అనురాగం | - | 12:10 a |
| | బి. ఒకరి కంటె ఒకరు ఘనులుగా | - | 12:10 b |
| | సి. ఆసక్తి విషయంలో | - | 12:11 a |
| | డి. ఆత్మయందు తీవ్రత | - | 12:11 b |
| | ఇ. ప్రభుని సేవించుట | - | 12:11 c |
| | ఎఫ్. నిరీక్షణలో ఆనందం | - | 12:12 a |
| | జి. శ్రమయందు ఓర్పు | - | 12:12 c |
| | హెచ్. ప్రార్థనల యందు పట్టుదల | - | 12:12 a |
| | ఐ. పరిశుద్ధుల అవసరాలలో పాలుపొందుట | - | 12:13 |
| | జి. శ్రమయందు ఓర్పు | - | 12:12 |
| **3.** | **ఇతరుల పట్ల భాద్యతలు** | **-** | **12:14-16** |
| i. | హింసించు వారిని దీవించుడి | - | 12:14 a |
| ii. | వారిని శపించవద్దు | - | 12:14 b |
| iii. | సంతోషించు వారితో సంతోషించుట | - | 12:15 a |
| iv. | ఏడ్చువారితో ఏడ్చుట | - | 12:15 b |
| v. | పక్షపాతము వద్దు | - | 12:16 a |
| vi. | హెచ్చువాటి యందు మనసు నిలుపక | - | 12:16 c |
| vii. | నీవే నీతిమంతుడవని అనుకోవద్దు | - | 12:16 c |

| | | | |
|---|---|---|---|
| **4.** | **శత్రువుల పట్ల మన భాద్యతలు** | **-** | **12:17-21** |
| i. | కీడుకు ప్రతి కీడు చేయవద్దు | - | 12:17 a |
| ii. | యోగ్యమైన వాటి మీద మనసు | - | 12:17 b |
| iii. | అందరితో సమాధానం | - | 12:18 |
| iv. | పగ తీర్చుకొనుట మన పని కాదు | - | 12:19 |
| v. | మేలు చేత కీడును జయించుట | - | 12:20,21 |
| **5.** | **ప్రభుత్వం పట్ల మన భాద్యతలు** | **-** | **13:1-7** |
| i. | పై అధికారులకు లోబడి యుండుడి | - | 13:1 a |
| ii. | అధికారం దేవుని వలన కలిగినది | - | 13:1 b |
| iii. | అధికారాన్ని విమర్శించుట దేవుని విమర్శించుట (అధికారాన్ని ఎదురించుట దేవుని ఎదురించుట) | - | 13:2 a |
| iv. | అధికారాన్ని ఎదురించు వారికి శిక్ష వుంది | - | 13:2 b |
| v. | చెడ్డవాటిని ప్రభుత్వం ఆపును | - | 13:3 a |
| vi. | ప్రభుత్వం మేలు చేయును | - | 13:3 b-4 a |
| vii. | అవిధేయులను శిక్షించుటకు దేవుడు ప్రభుత్వాలను నియమించాడు | - | 13:4 b |
| viii. | ప్రభుత్వం మనస్సాక్షి ప్రకారం నడవాలి | - | 13:5 |
| ix. | ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి | - | 13:6-7 |
| | ఎ. అది కట్టడి | - | 13:6 |
| | బి. అది దేవుని ఉద్దేశ్యం | - | 13:6 a |
| | సి. అది దేవుని ఇష్టం | - | 13:7 |
| **6.** | **ప్రేమ ఆజ్ఞను నెరవేర్చును** | **-** | **13:8-10** |
| i. | ప్రేమ - అచ్చియుండుట | - | 13:8 |
| ii. | ప్రేమ కలిగి యుండుట ధర్మశాస్త్రం నెరవేర్చుట | - | 13:9-10 |

| | | | |
|---|---|---|---|
| **7.** | **యేసుక్రీస్తును ధరించుకొనుట** | **-** | **13:11-14** |
| i. | మెలకువగా వుండుట | - | 13:11-12 a |
| ii. | శరీర క్రియలను విడుచుట | - | 13:12ఎ-13 |
| iii. | క్రీస్తును ధరించుకో | - | 13:14 |
| **II.** | **బలహీన మరియు బలమైన విశ్వాసులు ఐక్యత** | **-** | **14:1-23** |
| **1.** | **ఒకరి నొకరు అర్థం చేసుకొనుట** | **-** | **14:1-12** |
| i. | దేవుడు వారిని చేర్చుకుంటాడు | - | 14:1-3 |
| ii. | ప్రభువు వారిని నిలువబెట్టును | - | 14:14 |
| iii. | ప్రతి విశ్వాసి పై దేవునికి అధికారం ఉన్నది | - | 14:5-9 |
| iv. | ప్రతి విశ్వాసికి దేవుడు తీర్పు తీర్చును | - | 14:10-12 |
| **2.** | **ఒకరి నొకరు ప్రోత్సహించు కొనుట** | **-** | **14:13-23** |
| i. | ఒకరి కొకరు తీర్పు తీర్చుకోవద్దు | - | 14:13 |
| ii. | నీ సహోదరునికి దు:ఖం కలిగించవద్దు | - | 14:14,15 |
| iii. | నీ సాక్ష్యం కాపాడుకో | - | 14:16-19 |
| iv. | దేవునిని పాడు చేయవద్దు | - | 14:20,21 |
| v. | నీ స్వేచ్ఛను వాడుకో | - | 14:22,23 |
| **3.** | **ఒకరినొకరు క్రీస్తు వలె ఇతరులను సంతోషపరచాలి** | **-** | **15:1-6** |
| i. | ఇతరులను ఘనపరచు | - | 15:1 a |
| ii. | నిన్ను నీవు ఘనుడుగా ఎంచుకోకు | - | 15:1b-2 |
| iii. | క్రీస్తు వలె | - | 15:3 |
| iv. | లేఖనాలకు సమర్పించుకో | - | 15:4 |
| v. | దేవుని శక్తి మీద ఆధారపడు | - | 15:5 |
| vi. | దేవునికి మహిమ కలగాలి | - | 15:6 |

| | | | |
|---|---|---|---|
| **4.** | **దేవుని విమోచనా ప్రణాళికలో విశ్వాసి ఆనందించాలి** | **-** | **15:7-13** |
| i. | ఒకరి నొకరు చేర్చుకొనుడి | - | 15:7 |
| ii. | బైబిల్లో వివరణ | - | 15:8-12 |
| iii. | ఆశీర్వాద ప్రార్థన | - | 15:13 |
| **5.** | **విశ్వాసి తెగింపు - కాపాడు కొనుట** | **-** | **15:14-21** |
| i. | పౌలు - విశ్వాసంలో పాలి భాగస్థుడు | - | 15:14,15 |
| ii. | పౌలు - యాజకుడు | - | 15:16 |
| iii. | పౌలు - బోధకుడు | - | 15:17-19 |
| iv. | పౌలు - పండితుడు | - | 15:20,21 |
| **6.** | **దేవుని చిత్త ప్రకారం పరిచర్య చేయుట** | **-** | **15:22,23** |
| i. | రావడానికి అడ్డంకులు | - | 15:22 |
| ii. | ప్రణాళిక | - | 15:22-24 |
| iii. | ప్రాముఖ్యత | - | 15:25-28 |
| iv. | అభివృద్ధి | - | 15:29 |
| v. | ఉద్దేశ్యం | - | 15:30 a |
| vi. | ప్రార్థన | - | 15:30 b-32 |
| vii. | సంతృప్తి | - | 15:33 |
| **7.** | **పరిశుద్ధులపై ప్రేమ** | **-** | **16:1-24** |
| i. | పౌలు - సిఫారసు | - | 16:1,2 |
| ii. | పౌలు - గౌరవము | - | 16:3-16 |
| iii. | పౌలు - జాగ్రత్త | - | 16:17-20 |
| iv. | పౌలు - జతపనివారు | - | 16:21-24 |
| **8.** | **దేవుని రహస్యం** | **-** | **16:25-27** |
| i. | యేసుక్రీస్తును గూర్చిన ప్రకటన | - | 16:25 b |
| ii. | నిత్య దేవుని మర్మము | - | 16:25 c-27 |

# BIBLIOGRAPHY

1. Ps. M. Joshi Leelan Reddy’s teaching

2. ‘Believer’s Bible Commentary’ by William Macdonald

3. John Mac Arthur’s New Testament Commentary

4. “The Bible Exposition Commentary” by Warren Wierbe

5. ‘The New Manners and Customs of the Bible’
   by James M. Free man

6. Romans - Journey with David Cook

7. N.I.V. Study Bible

8. The Expositor's Bible Commentary by Frank E.Gaebelein

9. The Pulpit Commentary



బైబిల్ గ్రంథములో పాత నిబంధన కాలములో దైవజనుడైన మోషే, క్రొత్త నిబంధన కాలములో అపొస్తలుడైన పౌలు దేవుని అద్వితీయమైన పరిచర్యలో సజీవయాగంగా, పానార్పణంగా పోయబడ్డారు. పాతనిబంధనలో దేవుడు మోషే భక్తుని ద్వారా తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ జీవిత విధానాలను, విధినిషేధాలను నిర్దేశించారు. ఆ రీతిగానే క్రొత్త నిబంధన కాలములో పౌలు ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు వ్రాయించిన ప్రతి పత్రిక దేవుడు సీనాయి పర్వతముపై మోషేకు ఇచ్చిన ఆజ్ఞలతో సమానంగా గౌరవించాలని 1కొరింథీ 14:37లో వ్రాయబడింది.

పౌలు భక్తుడు రచించిన పత్రికలన్నీ సార్వత్రిక క్రైస్తవ సంఘాలకు సంఘ ప్రభువైన యేసునాథుని ఆదేశాలుగా వ్రాయబడ్డాయి. పౌలు భక్తుని రచనలన్నింటిలోను రోమా పత్రిక మకుటాయమానమైనది, మహోత్కృష్టమైనది. పౌలు పాత నిబంధన లేఖనాలలో నుండి 'క్రీస్తునందలి విశ్వాసము' ద్వారానే పాప విముక్తి అనే అపురూప సత్యాన్ని ప్రత్యక్షపరుస్తున్నాడు. క్రైస్తవ విశ్వాసానికి సంబంధించిన ముఖ్య సిద్ధాంతములన్నింటిని ఈ పత్రికలో విశదపరచాడు. సార్వత్రిక క్రైస్తవ సంఘ చరిత్రలో మహామహుల ఆలోచనా విధానాన్ని మార్చివేసిన పత్రిక ఇది. ఈ పత్రికలో ఇశ్రాయేలీయుల పట్ల, అన్యజనులపట్ల దేవునికి గల గొప్ప ప్రణాళిక మన కన్నుల ముందు ఆవిష్కరిస్తున్నాడు.

అత్యద్భుతమైన మహిమాన్వితమైన రోమా పత్రిక సార్వత్రిక క్రైస్తవ భక్త జనాంగానికి లిఖితపూర్వక రాజ్యాంగం! ఇది సర్వోన్నతుని **"సంపూర్ణ దైవప్రణాళిక"**.

భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక కుటుంబంలో జన్మించి, కేవలం దేవుని రాజ్య విస్తరణ కొరకై అహర్నిశలు శ్రమిస్తున్న మాతృ సమానులు, సన్మాన పాత్రులైన శ్రీమతి విమలారెడ్డి గారి పరిచర్య ఎంతో ఆదర్శప్రాయమైనది.

వీరు ప్రభువు యొక్క మహా కృపను బట్టి ప్రభువు చేత పిలువబడి, ప్రత్యేకించబడి అనతికాలంలోనే B.D., M.Th. (O.T), M.Th. (N.T), M.A. (Christian Studies), మొదలగు థియోలజికల్ కోర్సులు విజయవంతంగా పూర్తిచేసారు. పలు జాతీయ, అంతర్జాతీయ సెమినరీలలో పాల్గొని, వాక్య కేంద్రిత క్రీస్తును, క్రీస్తు కేంద్రిత భక్తిని బోధిస్తూ అహర్నిశలు దేవుని సేవలో కొనసాగుతున్నారు.

"మరియ" వలె ప్రభువు పాదాల చెంత ఉత్తమమైనవి నేర్చుకొనుచు, "సమరయ స్త్రీ" వలె పట్టణాలలో, పల్లెల్లో ప్రభువును గూర్చి సాక్ష్యమిస్తూ, "దోర్కా" వలె సత్క్రియలచేత అలంకరించు కుంటూ, "ఘనురాలైన షునేమీయిరాలు" వలె దైవజనులకు ఆతిథ్యమిస్తూ, "దెబోరా" వలె మంచి నాయకురాలుగా కొనసాగుతూ, "అన్న" వలె దేవుని సేవిస్తూ, "ఎలిజబెత్" వలె భయభక్తులు కలిగి జీవిస్తూ విశ్వాసంతో ముందుకు కొనసాగుతున్న ఈ భక్తురాలి కలమునుండి సంఘ క్షేమాభివృద్ధికై మరిన్ని రచనలు, విలువైన సందేశములు వెలువడును గాక! ప్రార్థనా పూర్వకంగా ఈ పుస్తక పఠన ప్రారంభించండి!

**రెవ. టి. శివరామప్రసాదరెడ్డి**
**ఫిలదెల్ఫియ బైబిల్ ఇన్‌స్టిట్యూట్**

**For Details & Copies : Bro. K. Vijaya Kumar**
**Cell : 92473 65330, 98668 45060 | Email : bvrhome@gmail.com**